సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 248
మంగళవారం 23-5-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'



కెమెరాకు చిక్కిన సూపర్‌నోవా
నక్షత్రం పేలి.. అంతమయ్యే దశను కెమెరాలో బంధించిన ఆంద్రూ - 6లో



నీరజ్.. వరల్డ్ నంబర్ వన్
ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో టాప్ ప్లేస్‌కు వెళ్లిన తొలి భారతీయ అథ్లెట్ - 12లో



కశ్మీర్లో జీ-20 సన్నాహకం షురూ
కశ్మీర్‌లో జీ-20 సన్నాహక సదస్సు పటిష్ట భద్రత మధ్య మొదలైంది. చైనా మినహా అన్ని సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.
వివరాలు 6లో ▸



త్వరలో విపక్షాల కీలక భేటీ!
కాంగ్రెస్ నేతలు ఖర్గే, రాహుల్‌తో బిహార్ సీఎం నితీశ్‌కుమార్ భేటీ అయ్యారు. విపక్షాల ఉమ్మడి భేటీపై చర్చించినట్లు సమాచారం.
వివరాలు 6లో ▸



వాట్సాప్‌లో ఎడిట్ ఫీచర్
వాట్సాప్‌లో ఎడిట్ ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. మెసేజ్ పంపిన తర్వాత 15 నిమిషాల వరకు ఎడిట్ చేసుకునే అవకాశముంది.
వివరాలు 6లో ▸



బీబీసీపై పరువు నష్టం కేసు
మోదీపై డాక్యుమెంటరీ రూపొందించిన బీబీసీపై ఓ సంస్థ ఢిల్లీ హైకోర్టులో రూ.10 వేల కోట్లకు పరువు నష్టం దావా వేసింది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

కూలిన తెలుగు కథా సాహితీ శిఖరం



సుప్రసిద్ధ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి(84) గుండెపోటుతో కన్నుమూశారు. వైఎస్సార్ జిల్లా రంగసాయిపురంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఆయన మృతిపట్ల సీఎం జగన్ సంతాపం తెలిపారు.
వివరాలు 5లో ▸

విలక్షణ నటుడు శరత్‌బాబు ఇకలేరు



కథానాయకుడు, ప్రతినాయకుడు.. ఇలా ఏ పాత్ర చేసినా అందులో ఒదిగిపోయిన నటుడు శరత్‌బాబు ఇకలేరు. కొంతకాలంగా ఊపిరితిత్తులు, కాలేయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు.
వివరాలు 12లో ▸

'ఫైనల్'కు ముందెవరు?
ఐపీఎల్‌లో నేడు గుజరాత్, చెన్నై మధ్య క్వాలిఫయర్-1 మ్యాచ్
- వివరాలు 12లో

దేవతల్లా యజ్ఞం చేస్తున్నాం రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు

బందరు పోర్టుకు శంకుస్థాపన సభలో సీఎం జగన్ ధ్వజం

పేదలు ఎప్పటికీ బాగు పడకూడదన్నదే చంద్రబాబు లక్ష్యం.. దుర్బుద్ధి కలిగిన రాక్షసులతో మనం యుద్ధం చేస్తున్నాం

అధికారంలో ఉండగా సెంటు ఇంటి స్థలం ఇచ్చిన పాపానపోలేదు.. ఆయన ఇవ్వకపోగా.. మేం ఇస్తుంటే అడుగడుగునా అడ్డుకున్నారు

ఇళ్ల నుంచి పేదలకు ఇంగ్లిష్ మీడియం చదువుల దాకా ఆటంకాలు సృష్టించారు.. సొంతిల్లు లేక పేదలు పడుతున్న కష్టాలు ఆ పెద్ద మనిషికి తెలుసా?

కుటుంబంలో ఓ మనిషి మరణిస్తే ఆస్పత్రి నుంచి ఎక్కడకు తీసుకెళ్లాలో దిక్కుతోచని దుస్థితి

26న అమరావతిలో 50 వేల మందికిపైగా పేదలకు ఇళ్ల పట్టాలిస్తున్నాం.. నాలుగు పోర్టులతో మన యువతకు లక్ష ఉద్యోగాలు దక్కుతాయి

మంగినపూడి వద్ద సముద్రుడికి పట్టు వస్త్రాలు సమర్పించి బందరు పోర్టు పనులను ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- వివరాలు 2లో



"చంద్రబాబు కోరుకున్న అమరావతి ఎలాంటిదంటే... అందులో పేదవర్గాలు కేవలం పాచి పనులు మాత్రమే చేయాలి. రోజువారీ పనులు చేసే కార్మికులుగానే ఉండాలి. వాళ్లెవరికీ అక్కడ ఇళ్లు ఉండకూడదు! వాళ్లు అమరావతిలో పొద్దున్నే ఎంటరై పనులు చేసి తిరిగి వెనక్కి పోవాలి!! రాజధాని పేరుతో పేదలకు ఏమాత్రం ప్రవేశం లేని ఓ గేటెడ్ కమ్యూనిటీని చంద్రబాబు ప్రభుత్వ ధనంతో కట్టుకోవాలనుకున్నారు. ఇంతకన్నా సామాజిక అన్యాయం ఎక్కడైనా జరుగుతుందా?."
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కృష్ణా జిల్లా మంగినపూడి సమీపంలోని తపసిపూడి వద్ద బందరు పోర్టుకు శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఎల్లో మీడియా ఓవరాక్షన్

- ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయబోతున్నారంటూ తప్పుడు కథనాలు.. తల్లి అనారోగ్యం దృష్ట్యా సోమవారం విచారణకు రాలేనన్న అవినాశ్
- ఈ నెల 27 తర్వాత వస్తానని సీబీఐకి లేఖ
- కానీ సీబీఐ అధికారులు వచ్చేశారని.. అరెస్టు చేయబోతున్నారని ఉదయం నుంచే ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం
- కనీస మానవత్వాన్ని మరిచి విపరీత ధోరణి ప్రదర్శన
- గంట గంటకు ఎల్లో మీడియా పిచ్చి పీక్స్‌కు
- పోలీసుల సహకారం సీబీఐ కోరిందంటూ ఓసారి.. పోలీసులు సహకరించడం లేదంటూ మరోసారి
- కేంద్ర బలగాలు వస్తున్నాయంటూ మరో ప్రచారం
- అవి రాగానే అవినాశ్‌ను అరెస్టు చేస్తారంటూ అదేపనిగా చర్చలు
- తప్పుడు ప్రచారాన్ని నిరసించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు.. భారీ ఎత్తున ఆస్పత్రి వద్ద బైఠాయింపు
- శ్రీలక్ష్మి ఆరోగ్యం ఆందోళనకరంగానే ఉందన్న వైద్యులు

14లో

పాలిటెక్నిక్ విద్యలో నవోదయం

బ్రాండ్ ఏపీ

- డిప్లొమాతోనే ఉన్నత కొలువులు
- 2022–23 లో 6,000 క్యాంపస్ ప్లేస్‌మెంట్లు.. 4,000కు పైగా అవకాశాలను సొంతం చేసుకున్న ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు
- స్కిల్ హబ్స్‌తో ప్రతిభకు మెరుగు
- 18 ఏళ్లకే రూ.6.25 లక్షల వేతనం.. సగటున రూ.2.80 లక్షల జీతం
- ఉద్యోగంతో పాటు ఉన్నత విద్యకూ అవకాశం.. ఇంకా కొనసాగుతున్న క్యాంపస్ ప్లేస్‌మెంట్లు
- డిప్లొమా కోర్సుల నిర్వహణలో సమూల మార్పులు.. విద్యార్థులకు స్టయిఫండ్‌తో కూడిన ఇండస్ట్రియల్ ట్రైనింగ్..
- ప్రతి కళాశాలలోను ప్లేస్‌మెంట్ సెల్
- పరిశ్రమలను స్వయంగా పరిశీలించి ఒప్పందం చేసుకుంటున్న సాంకేతిక విద్యాశాఖ

14లో

టీచర్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్



రాష్ట్రంలో ప్రభుత్వ టీచర్ల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 31 నాటికి ఉన్న ఖాళీలను పరిగణనలోకి తీసుకుని బదిలీలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2025 మే 31 లేదా అంతకుముందే రిటైరయ్యేవారికి.. వారి అభ్యర్థన మేరకు బదిలీలు చేపట్టనుంది. వీరు కాకుండా 2022-23విద్యా సంవత్సరం నాటికి ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన గ్రేడ్-2 హెచ్‌ఎంలు, ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న ఇతర టీచర్లు తప్పనిసరిగా బదిలీ కానున్నారు. ప్రస్తుతం టీచర్లు ఏ మేనేజ్‌మెంట్ సర్వీస్‌లో కొనసాగుతున్నారో.. ఆ విభాగంలోనే బదిలీ అవుతారు.
10లో

ఇక వందే భారత్ స్లీపర్ రైళ్లు



సాక్షి, హైదరాబాద్: విదేశాల్లోని ఆధునిక రైళ్లతో పోటీ పడే రీతిలో రూపుదిద్దుకుని సూపర్ సక్సెస్ అయిన వందేభారత్ రైళ్ల తదుపరి వర్షన్ తయారీకి రైల్వే సిద్ధమైంది. ప్రస్తుతం కేవలం చైర్ కార్ కోచ్‌లతో నడుస్తున్న ఈ రైళ్లలో స్లీపర్ కోచ్‌లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి డిజైన్లు రూపొందించేందుకు రైల్వే యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. వచ్చే ఏడాది మార్చి నాటికల్లా డిజైన్లు ఖరారు చేసి రైల్ కోచ్‌ల తయారీ ప్రారంభించాలని నిర్ణయించింది.

ప్రస్తుత రైలుకు భిన్నంగా..
ప్రస్తుతం దేశవ్యాప్తంగా 200-300 కి.మీ.దూరం ఉన్న ప్రధాన నగరాల మధ్య వందేభారత్ రైళ్లను ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే. దక్షిణ మధ్య రైల్వేకు సంబంధించి సంక్రాంతి రోజున సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడిచే తొలి వందేభారత్ రైలును, ఏప్రిల్‌లో రెండో వందేభారత్ సర్వీసుగా సికింద్రాబాద్-తిరుపతి మధ్య నడిచే రైలును ప్రారంభించిన విషయం తెలిసిందే. పగటి వేళ నడిచే రైళ్లు అయినప్పటికీ ఈ రెండు సర్వీసులు విజయవంతమయ్యాయి. వాటిల్లో ఆక్యుపెన్సీ రేషియో 110 శాతం నుంచి 140 శాతంగా నమోదవుతోంది. ఇలా దేశవ్యాప్తంగా చాలా వందేభారత్ రైళ్లు విజయవంతంగా నడుస్తున్నాయి. అయితే, వీటిల్లో బెర్తులు లేకపోవటంతో కూర్చునే ప్రయాణికులు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఎనిమిది గంటల్లో గమ్యం చేరేలా సమయాలను సెట్ చేశారు. దూర ప్రాంతా నగరాల మధ్య నడపాలంటే, సమయం ఎక్కువ పడుతుంది, అంతసేపు కూర్చోవటం సాధ్యం కానందున కేవలం దగ్గరి నగరాల మధ్యనే తిప్పుతున్నారు. అయితే వీటిల్లో బెర్తులు ప్రవేశపెట్టి దూర ప్రాంత నగరాల మధ్య రాత్రింబవళ్లు తిప్పాలని రైల్వే నిర్ణయించింది.

మరింత వేగంగా....
గతంలో పగటి వేళ చైర్ కార్‌తో తిరిగేలా డబుల్ డెక్కర్ రైళ్లను ప్రవేశపెట్టారు. అన్ని వసతులు మెరుగ్గానే ఉన్నప్పటికీ వీటి వేగం సాధారణ రైళ్లలాగే ఉండేది. దీంతో గంటల తరబడి పగటి వేళ కూర్చుని ప్రయాణించేందుకు ప్రయాణికులు విముఖత చూపటంతో ఆ కేటగిరీ విజయం సాధించలేదు. వందేభారత్ రైళ్లు మాత్రం శతాబ్ది లాంటి ప్రీమియం రైళ్ల కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించే వీలుండటంతో వీటి ప్రయాణ సమయం బాగా తక్కువగా ఉంది. ఈ కేటగిరీ సక్సెస్‌కు ఇదే ప్రధాన కారణం. దీంతో తదుపరి స్లీపర్ కేటగిరీ రైళ్లు మరింత వేగంగా ప్రయాణించేలా ప్లాన్ చేస్తున్నారు. వాటి గరిష్ట వేగం దాదాపు 200 కి.మీ. మించి ఉంటుందని తాజాగా రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించటం ఆసక్తిని రేపుతోంది. అంత వేగంతో దూసుకుపోయేలా దీని డిజైన్‌ను రూపొందించనున్నారని, ఇది ప్రస్తుత వందేభారత్ రైళ్లకు భిన్నంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఇప్పటికే దేశంలోని అన్ని కోచ్ ఫ్యాక్టరీల్లో వందేభారత్ రైళ్లను రూపొందిస్తున్న విషయం తెలిసిందే. వాటిల్లో కొత్త రైలు నమూనాలను రూపొందించే పని ప్రారంభించినట్టు సమాచారం. మార్చి నాటికి నమూనా రైలును కూడా సిద్ధం చేసి కొన్ని నెలల పాటు ప్రయోగాత్మకంగా తిప్పాలని భావిస్తున్నారు. వందేభారత్ రైలు 2018లో రూపొందినా.. దాదాపు ఏడాదిన్నర పాటు దాన్ని పరిశీలించి పలు మార్పులు చేస్తూ వచ్చారు. కొత్త రైలుకు కూడా అలా పరిశీలించి మార్పులు చేసి, లోపాలు లేకుండా ప్రారంభించాలని భావిస్తున్నారు.

సాధారణ రైళ్లను రీప్లేస్ చేసేలా..
ప్రస్తుతం దేశవ్యాప్తంగా సంప్రదాయ నమూనా రైళ్లే నడుస్తున్నాయి. ప్రీమియం కేటగిరీ రైళ్లుగా పిలుచుకునే శతాబ్ది, తేజస్, రాజధాని, దురంతో లాంటివి కూడా సంప్రదాయ రూపులోనే ఉంటున్నాయి. ఇటీవల కోచ్‌లను మాత్రం ఐసీఎఫ్ బదులు ఎల్‌హెచ్‌బీవి జత చేస్తున్నారు. కొత్త వందేభారత్ రైలు పట్టాలెక్కటం ప్రారంభించాక ఇక ప్రీమియం కేటగిరీ రైళ్లను కొత్త వందేభారత్‌తో రీప్లేస్ చేయాలని భావిస్తున్నారు. ఆ తర్వాత సాధారణ రైళ్లను కూడా కొత్త రూపు రైళ్లతో మార్చే యోచనలో రైల్వే ఉంది.


ఫిజీ అత్యున్నత గౌరవంతో మోదీని సత్కరిస్తున్న ఆ దేశ ప్రధాని రుబుకా

భారత్ విశ్వసనీయ భాగస్వామి
ఎఫ్ఐపీఐసీ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ - 6లో

అమూల్.. 7వ సారి



- పాల సేకరణ ధరల పెంపు
- గతంలో ప్రైవేటు డెయిరీలు రెండేళ్లకోసారి పెంచేవి
- ప్రతి 3 నెలలకు సేకరణ ధరలు సవరిస్తున్న అమూల్
- 30 నెలల్లో లీటర్‌కు గేదె పాలపై రూ.16.53, ఆవు పాలపై రూ. 9.49 పెంపు
- తాజాగా లీటర్‌పై గరిష్టంగా గేదెపాలకు రూ.2.20, ఆవుపాలకు రూ.1.13 పెంచిన అమూల్
- దీంతో లీటరు గేదెపాలు రూ.88, ఆవుపాలు రూ.43.69కి చేరిన సేకరణ ధర
- సోమవారం నుంచే పెంపు వర్తింపు.. పాడి రైతుకు మరింత లబ్ధి

13లో

ఎకానమీపై ప్రభావం.. స్వల్పమే
ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్



ఆర్థిక వ్యవస్థపై రూ.2,000 నోట్ల ఉపసంహరణ ప్రభావం చాలా స్వల్పంగానే ఉంటుందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ అన్నారు. చలామణీలో ఉన్న కరెన్సీలో వీటి వాటా 10.8 శాతమేనని చెప్పారు. ప్రస్తుతానికి రూ.2,000 నోట్ల చెల్లుబాటు కొనసాగుతుందన్నారు. సెప్టెంబర్ 30లోగా చాలా నోట్లు తిరిగి వస్తాయని భావిస్తున్నామన్నారు.
13లో


బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దేవతల్లా యజ్ఞం చేస్తున్నాం రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు

బందరు పోర్టుకు శంకుస్థాపన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ధ్వజం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్రంలో నాలుగేళ్లుగా పేదలకు మంచి జరగకూడదన్న లక్ష్యంతో చంద్రబాబు బృందం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. పేదలు ఎప్పటికీ పేదలుగానే మిగిలిపోయి పాచి పనులు చేసుకుంటూ బతకాలనే దుర్బుద్ధి కలిగిన రాక్షసులతో మనం యుద్ధం చేస్తున్నామన్నారు. అమరావతిలో కేవలం చంద్రబాబు, ఆయన బినామీలే ఉండాలని, పేదలకు అక్కడ స్థానమే లేకుండా చేయాలని కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. దేవుడి ఆశీస్సులు, ప్రజలందరి చల్లటి దీవెనలతో ఆ అడ్డంకులను అధిగమించి అడుగులు ముందుకు వేస్తున్నట్లు చెప్పారు. ఈనెల 26వతేదీన అమరావతిలో 50 వేల మందికి పైగా పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.5,156 కోట్ల వ్యయంతో చేపట్టిన బందరు పోర్టు నిర్మాణానికి సోమవారం కృష్ణా జిల్లా మంగినపూడి సమీపంలోని తపసిపూడి వద్ద సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. అనంతరం జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ మైదానంలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. ఆ వివరాలివీ..


బందరు పోర్టు నమూనాను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్

సముద్ర వాణిజ్యంతో శతాబ్దాల చరిత్ర

బందరుకు సముద్ర వాణిజ్యంతో శతాబ్దాల చరిత్ర ఉంది. చిరకాల స్వప్నం బందరు పోర్టును సాకారం చేస్తూ మనందరి ప్రభుత్వం అన్ని కోర్టు కేసులను అధిగమించి భూసేకరణ కూడా పూర్తి చేసింది. అన్ని అనుమతులు సాధించి ఫైనాన్షియల్ క్లోజర్‌ను పూర్తి చేసి టెండర్ల ప్రక్రియను ముగించి పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించాం. దాదాపు 35 మిలియన్ టన్నుల సామర్థ్యంతో పోర్టు ప్రారంభమవుతుంది. నాలుగు బెర్తులు ఇక్కడ రానున్నాయి. ట్రాఫిక్ పెరిగే కొద్దీ బెర్తుల సంఖ్యను పెంచుకుంటూ 116 మిలియన్ టన్నుల కెపాసిటీ వరకు విస్తరించుకోవచ్చు.

పోర్టుతో రోడ్డు, రైల్వే లైన్ అనుసంధానం

బందరు పోర్టు నిర్మాణంతో పాటు అనుబంధంగా మౌలిక వసతుల పనులు కూడా చేపడుతున్నాం. కేవలం 6.5 కి.మీ. దూరంలో ఉన్న 216వ నెంబర్ జాతీయ రహదారిని పోర్టు వరకు అనుసంధానించేలా చర్యలు చేపట్టాం. దీంతోపాటు 7.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుడివాడ, మచిలీపట్నం రైల్వే లైనును కూడా పోర్టు వరకు తీసుకొచ్చి అనుసంధానిస్తున్నాం. బందరు కాలువ నుంచి 0.5 ఎం.ఎల్.డీ నీటిని 11 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ద్వారా తరలించి పోర్టుతో అనుసంధానం చేస్తున్నాం. దీని వల్ల సరుకుల ఎగుమతి, దిగుమతికి అత్యంత మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పడుతుంది. మన పోర్టు రాబోయే రోజుల్లో కృష్ణా జిల్లా చరిత్రను మార్చబోయే అస్త్రంగా అందుబాటులోకి వస్తుంది.

పోర్టును అడ్డుకున్న బాబు..

బందరు పోర్టు రాకూడదని చంద్రబాబు అడుగులు వేశారు. 22 గ్రామాలు, 33 వేల ఎకరాలను తీసుకునేందుకు భూములన్నీ నోట్‌పై పెట్టి రైతులెవరూ వాటిని అమ్ముకునే పరిస్థితి లేకుండా అందరినీ ఇబ్బందులకు గురి చేశారు. మచిలీపట్నంలో పోర్టు రాకపోతే అమరావతిలో తన బినామీల భూముల రేట్లు విపరీతంగా పెంచుకోవచ్చనే దుర్బుద్ధితో మచిలీపట్నానికి తీరని ద్రోహం చేశాడు.

సంతోషంగా ఇచ్చిన భూములతో..

ఈరోజు పోర్టు నిర్మాణానికి 1,700 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాం. రైలు, రోడ్డు మార్గానికి కేవలం మరో 240 ఎకరాలు మాత్రమే భూసేకరణ జరిగింది. రైతులందరూ మనస్ఫూర్తిగా ఇచ్చిన 240 ఎకరాలు తీసుకుని పోర్టు నిర్మాణంలోకి వస్తుంది. ఇక్కడ ప్రభుత్వ భూములు చాలా ఉన్నాయి. వాటిలో 4 వేల ఎకరాలను పోర్టుతో అనుసంధానించి పరిశ్రమలు వచ్చేలా చేయడం ద్వారా లక్షలాది ఉద్యోగాలకు ఊతం పడినట్లు అవుతుంది.

> **రాక్షసులు.. వికృత ఆలోచనలు!**
>
> అమరావతి ప్రాంతంలో 50 వేల మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇచ్చే కార్యక్రమాన్ని రెండేళ్ల క్రితమే ప్రారంభించాం. కానీ దేవతల యజ్ఞాన్ని రాక్షసులు అడ్డుకున్నట్లుగా టీడీపీ, గజదొంగల ముఠా అడ్డుపడుతోంది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 వీరికి ఒక దత్తపుత్రుడు కలిశాడు. వీళ్ల పని దోచుకోవడం పంచుకోవడం.. తినుకోవడమే. రాజధాని పేరుతో పేదవాళ్లకు ఏమాత్రం ప్రవేశం లేని ఓ గేటెడ్ కమ్యూనిటీని ప్రభుత్వ ధనంతో కట్టుకోవాలనుకున్నారు. అమరావతిలో 50 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లు కట్టించే కార్యక్రమానికి ఈనెల 26న శ్రీకారం చుడుతున్నాం.

మారిన బందరు రూపురేఖలు

మరో 24 నెలల వ్యవధిలో ఈ ప్రాంతం రూపురేఖలు మారబోతున్నాయి. మచిలీపట్నంలో పెద్ద పెద్ద ఓడలు కనిపిస్తాయి. మచిలీపట్నం రూపురేఖలు మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎలా మారుతున్నాయో చూడండి. జిల్లా యంత్రాంగం మొత్తం ఇక్కడే ఉండేలా మచిలీపట్నం జిల్లా కేంద్రం ఏర్పాటైంది. బందరులో దాదాపు రూ.550 కోట్లతో చేపట్టిన కొత్త మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి కావస్తోంది. ఈ సంవత్సరమే ఆగస్టు, సెప్టెంబరులో అడ్మిషన్లు జరగనున్నాయి. దీనివల్ల అవనిగడ్డ, పెడన, పామర్రు, గుడివాడ, కైకలూరు నియోజకవర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి.


సభలో ప్రసంగిస్తున్న సీఎం జగన్

మరో నాలుగు నెలల్లో ఫిషింగ్ హార్బర్

మత్స్యకారులు ఆరాధించే నాగుల్‌మీరా సాహెబ్ ఆశీస్సులతో ఏ సమయంలోనైనా మత్స్య సంపదను ఒడ్డుకు తెచ్చుకునేందుకు వీలుగా ఇక్కడే మరో రూ.420 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో నాలుగు నెలల్లో ఈ ఫిషింగ్ హార్బర్ అందుబాటులోకి వస్తుంది. ఇక్కడే ఇమిటేషన్ జ్యూయలరీ తయారీకి మద్దతుగా కరెంటు ఛార్జీలను తగ్గిస్తామని నా పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రూ.7.65 నుంచి మనం అధికారంలోకి రాగానే రూ.3.75లకు తగ్గించాం.

ఫిషింగ్ హార్బర్లు.. ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టాం. ఇప్పటికే ఐదింటిలో పనులు వేగంగా జరుగుతున్నాయి. మరో 4-5 నెలల్లో పనులు పూర్తవుతాయి. మిగిలినవి త్వరితగతిన పూర్తయ్యేలా అడుగులు వేస్తున్నాం. ఆరు ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల పనులూ వేగంగా జరుగుతున్నాయి. 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల కోసం రూ.3,700 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

> **4 పోర్టులు.. లక్ష ఉద్యోగాలు**
>
> ఇప్పటివరకు రాష్ట్ర పోర్టుల వార్షిక సామర్థ్యం 320 మిలియన్ టన్నులు కాగా 2025-26 నాటికి అదనంగా మరో 110 మిలియన్ టన్నులు పెంచేలా అడుగులు వేస్తున్నాం. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా రాష్ట్రంలో నాలుగు రోట్ల 6 పోర్టులు మాత్రమే ఉండగా మీ బిడ్డ ప్రభుత్వం వచ్చాక నాలుగేళ్లలోనే రూ.16 వేల కోట్లతో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేటలో గ్రీన్ ఫీల్డ్ పోర్టుల పనులు వేగంగా జరిగేలా అడుగులు వేశాం. కాకినాడ వద్ద గేట్‌వే పోర్టు నిర్మాణం జరుగుతోంది. ఒక్కో పోర్టు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా కనీసం 25 వేల ఉద్యోగాలు వస్తాయి. నాలుగు పోర్టులు అందుబాటులోకి రాగానే లక్ష ఉద్యోగాలు దక్కుతాయి.

పేద కుటుంబాల్లో వెలుగులు

పేదరికాన్ని సమూలంగా తొలగించి నా అక్కచెల్లెమ్మల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు రూ.2.10 లక్షల కోట్లు నేరుగా బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేశాం. ఇక నాన్ డీబీటీ కూడా కలిపితే, అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన 30 లక్షలకుపైగా ఇంటి స్థలాలను కూడా కలిపితే.. ఒక్కో ఇంటి స్థలం విలువ కనీసం రూ.2.50 లక్షలు వేసుకున్నా వాటి విలువ రూ.75 వేల కోట్లు ఉంటుంది. నాన్ డీబీటీ కూడా కలిపితే రూ.3 లక్షల కోట్ల మేర లబ్ధి చేకూర్చాం. మరోవైపు 21 లక్షల ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇళ్లు పూర్తయితే ఒక్కో ఇంటి విలువ కనీసం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు వేసుకున్నా ఇళ్ల పట్టాలు, ఇళ్లతో అక్కచెల్లెమ్మలకు రూ.1.5 లక్షల కోట్ల నుంచి రూ.2 లక్షల కోట్ల ఆస్తి వారి చేతిలో పెట్టినట్లవుతుంది.

ఆర్వోబీ.. కమ్యూనిటీ హాళ్లకు ఓకే

ఎమ్మెల్యే పేర్ని నాని నియోజకవర్గ అభివృద్ధి పనుల గురించి అడిగారు. మెడికల్ కాలేజీ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి కోసం రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నాం. 6 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేస్తున్నాం. అంబేడ్కర్ భవన్ మరమ్మతులకు రూ.5 కోట్లు కేటాయిస్తున్నాం. మరో 12 గ్రామాలకు సంబంధించి ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తైన 12,615 ఎకరాలకు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించాలని కలెక్టర్‌కు ఇక్కడి నుంచే ఆదేశాలు ఇస్తున్నాం. త్వరలో ఇవ్వబోయే అసైన్డ్ భూములు, లంక భూములకు సంబంధించిన పట్టాలతో పాటు వీరికి కూడా పట్టాలిస్తాం.

> **మచిలీపట్నం పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపనతో కల సాకారం: సీఎం జగన్**
>
> రాష్ట్ర ప్రజలకు కలగా మిగిలిన మచిలీపట్నం పోర్ట్ నిర్మాణానికి మన ప్రభుత్వంలో సోమవారం శంకుస్థాపన చేశాం.. అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'నాలుగు బెర్తులతో దాదాపు 35 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఈ పోర్టును నిర్మిస్తున్నాం. అలాగే కనెక్టివిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటులో భాగంగా ఈ పోర్టును జాతీయ రహదారి-216ఎ, గుడివాడ-మచిలీపట్నం రైల్వేలైన్‌కు అనుసంధానం చేస్తున్నాం' అంటూ సోమవారం ఆయన ట్వీట్ చేశారు.

సముద్ర తీరంలో సీఎం పూజలు

సముద్రుడికి పట్టువస్త్రాలు సమర్పించి హారతి



సాక్షి ప్రతినిధి, విజయవాడ: బందరు పోర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సముద్ర తీరంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. హెలీప్యాడ్ నుంచి పోర్టు నిర్మాణ పనులు జరిగే తపసిపూడి గ్రామ తీరానికి ఉదయం చేరుకున్నారు. ముందుగా దుర్గమ్మ చిత్రపటం వద్ద పూజలు చేసి వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ సాగరుడికి హారతి ఇచ్చారు. అనంతరం సముద్రుడికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం జెండా ఊపి కొండరాళ్లను సముద్రంలో వేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం జరుగుతున్న సమయంలో మత్స్యకారులు సముద్రంలో బోట్లపై పార్టీ జెండాలను రెపరెపలాడిస్తూ శుభాభినందనలు తెలిపారు. అనంతరం పోర్టు పనుల పైలాన్‌ను సీఎం జగన్ ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ప్రారంభించారు.


మా నమ్మకం నువ్వే జగనన్నా.. అంటూ ప్లకార్డులు చేబూనిన జనం

పేదల ఇళ్ల కష్టాలు తెలుసా పెద్దమనిషి?

అమరావతి పరిధిలో మీ బిడ్డ ప్రతి పేదవాడికి 1.1 సెంటు భూమిని ఉచితంగా ఇచ్చి ఇల్లు కూడా ఉచితంగా కట్టిస్తూ 50 వేల మంది కలలను నిజం చేస్తుంటే ఆ పవిత్ర స్థలాన్ని చంద్రబాబు శ్మశానంతో పోలుస్తాడు. పేదలకు ఆయన ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వలేదు. ఇప్పుడు మనం ఇస్తుంటే శ్మశానంతో పోలుస్తాడు. ఇలాంటి మనిషికి మానవత్వం ఉందా ? ఆ పెద్దమనిషికి పేదల కష్టాల గురించి అవగాహన ఉందా? సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో నివసించే పేదలు ఎలా జీవిస్తున్నారో కనీసం అవగాహన ఉందా? ఆ కుటుంబాలలో ఎవరైనా ఒక మనిషి చనిపోతే శవాన్ని ఆసుపత్రి నుంచి ఎక్కడికి తీసుకెళ్లాలో దిక్కు తోచని దుస్థితిలో అద్దె ఇళ్లలో ఎలా బతుకీడుస్తున్నారో కనీస స్పృహ ఉందా? కడసారి కూడా చూసుకునే భాగ్యం లేని పరిస్థితుల్లో, గుండెల నిండా బాధ ఉన్నా ఎక్కడకు వెళ్లి ఏడవాలో తెలియక శ్మశానాల వద్ద తల్లడిల్లుతున్న పరిస్థితుల్లో ఎలా ఉంటున్నారో ఆలోచన చేయమని అడుగుతున్నాం. చివరకు ఒక పక్షి సైతం ఒక గూడు కట్టుకోవాలని అనుకుంటుంది. తన పిల్లలతో పాటు ఉంటుంది. స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా సొంత ఇళ్లు కట్టుకోలేని పరిస్థితుల్లో లక్షల మంది పేదలున్నారు. ఇది మానవత్వం లేని మనుషుల్లో కూడా పరివర్తన తెచ్చే విషయం. కానీ చంద్రబాబుకు మానవత్వం లేదు. పేదలకు మేలు చేసే కార్యక్రమాలను దారుణంగా అడ్డుకుంటున్న ద్రోహి చంద్రబాబు. ఆలోచన చేయండి. మంచి చేసిన చరిత్ర చంద్రబాబుకు ఎప్పుడూ లేదు. పేదల దగ్గరకు వచ్చి మేం ఫలానా మంచి చేశామని చెప్పుకోలేని పరిస్థితి వాళ్లది. వారి ఆలోచనలన్నీ కుళ్లు, కుతంత్రాలే. దత్తపుత్రుడ్ని, మీడియాను నమ్ముకుంటారట! వీళ్లంతా ఏకమైతే ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు చూపించగలుగుతారా? వారంతా ఏకమైతే మంచి చేసిన చరిత్ర ఉన్న మీ బిడ్డ ఎన్నికల్లో గెలవడమే కష్టమట! మీ గుండెలపై చేతులు వేసుకుని ఒక్కసారి ఆలోచన చేయండి. మీ బిడ్డ పాలనలో మీకు జరిగి ఉంటే మీ బిడ్డకు తోడుగా మీరే సైనికులుగా నిలవండి.

బందరుకు భారీ వరాలు

- నా కళ్ల ముందే కలలా మెడికల్ కాలేజీ రెడీ: ఎమ్మెల్యే పేర్ని నాని
- నియోజకవర్గంలో 25,090 మందికి ఇళ్ల పట్టాలిచ్చిన సీఎం జగన్
- అభివృద్ధి పథంలో నిలిపిన వైఎస్ కుటుంబానికి రుణపడి ఉంటాం



చిలకలపూడి (మచిలీపట్నం): బందరుకు యాంకరేజ్ పోర్టు కావాలని 2007లో తాను దివంగత వైఎస్సార్‌ను కోరగా ఆ మరుసటి ఏడాదే డీప్‌వాటర్ పోర్టుకు శంకుస్థాపన చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) గుర్తు చేసుకున్నారు. ఆయన హఠాన్మరణం అనంతరం నిలిచిపోయిన పనులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరుగుతుండటం శుభపరిణామమన్నారు. సోమవారం బందరు పోర్టు పనులకు శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన సభలో పేర్ని నాని ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. పాదయాత్రలో చెప్పినట్లుగానే పోర్టు పనులను ప్రారంభించేందుకు సీఎం జగన్ వచ్చారన్నారు. యజ్ఞయాగాదులకు రాక్షసులు అడ్డంకులు సృష్టించినట్లుగా చంద్రబాబు, ఆయన తాబేదార్లు బందరు పోర్టుకు అడుగడుగునా అడ్డుపడ్డారన్నారు. పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వని చంద్రబాబు నేడు సీఎం జగన్ ఇస్తున్న ఇళ్ల స్థలాలపై విమర్శలు చేయడంపై మండిపడ్డారు. బందరు నియోజకవర్గంలో 450 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 25,090 మందికి జగన్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. కరగ్రహారం అనే గ్రామంలో 326 ఎకరాల సింగిల్ లేఅవుట్‌లో 15,751 ఇళ్ల నిర్మాణమవుతున్నాయన్నారు. మత్స్యకార గ్రామమైన గిలకలదిండిలో సీఎం జగన్ 1,050 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. బందరుకు అడగకుండానే మెడికల్ కాలేజీని మంజూరు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మెడికల్ కళాశాల వస్తుందని తాను ఊహించలేదని, ఇదంతా కలగా ఉందన్నారు. తన పదవీ కాలంలోనే కళాశాల పూర్తై తరగతులు ప్రారంభం కానుండటాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. పాదయాత్ర హామీ మేరకు 40 వేల మందికి ఉపాధి కల్పించే రోల్డ్‌గోల్డ్ పరిశ్రమకు విద్యుత్ చార్జీలను రూ.9 నుంచి రూ. 3.75లకు తగ్గించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. జిల్లాల పునర్విభజనతో కృష్ణా జిల్లా కలెక్టరేట్, ఇతర కార్యాలయాలు కళకళలాడుతున్నాయన్నారు. నగరానికి మరో తహసీల్దార్ కార్యాలయం కూడా మంజూరు చేశారన్నారు. బందరును అభివృద్ధి పథంలో నడిపించిన వైఎస్ కుటుంబానికి రుణపడి ఉంటామన్నారు.

శతాబ్దాల చరిత్రకు సరికొత్త శోభ: బాలశౌరి, మచిలీపట్నం ఎంపీ

డచ్, పోర్చుగీస్ వారు జెట్టీల ద్వారా సరుకులు రవాణా చేసిన చరిత్ర బందరుదని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. ఘన చరిత్ర కలిగిన బందరుకు పోర్టును తెచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నాలుగు రోజులు ఆలస్యమైనా అన్ని అనుమతులు సాధించి చిత్తశుద్ధితో పనులు ప్రారంభించారని కృతజ్ఞతలు తెలియజేశారు. గత ప్రభుత్వం శిలాఫలకాలతో సరిపుచ్చిందన్నారు. డబ్బులు, పర్యావరణ అనుమతులు లేక పనులు జరగలేదన్నారు. కృష్ణా డెల్టా రైతాంగం కోసం 45 టీఎంసీల సామర్థ్యంతో పులిచింతలను పూర్తి చేసిన దివంగత వైఎస్సార్ మహనీయుడన్నారు. ఇప్పుడు సీఎం జగన్ నాలుగు పోర్టుల నిర్మాణంతో దాదాపు లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. విశాఖ, ముంబై, చెన్నై ప్రాంతాలు పోర్టుల ద్వారానే అభివృద్ధి చెందాయన్నారు. ఆ తరహాలోనే మచిలీపట్నం ఉత్తమ పోర్టుగా అభివృద్ధి చెందుతుందన్నారు. దివిసీమ ప్రజానీకం చిరకాల కోరిక మచిలీపట్నం–రేపల్లె రైల్వే లైన్‌ను పీఎం గతిశక్తి ద్వారా చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి మంజూరు చేయించాలని ఎంపీ బాలశౌరి ఈ సందర్భంగా కోరారు.

అర్జీలు స్వీకరిస్తూ.. తక్షణమే పరిష్కరిస్తూ

బందరు పర్యటనలో పలువురిని కలుసుకున్న సీఎం జగన్

మచిలీపట్నం టౌన్: బందరు పర్యటన సందర్భంగా తిరుగు ప్రయాణంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోమవారం పలువురి నుంచి అర్జీలను స్వీకరించి సావధానంగా సమస్యలు తెలుసుకున్నారు. అర్జీదారులకు తక్షణం పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని తన వ్యక్తిగత ప్రత్యేక కార్యదర్శి ధనుంజయరెడ్డి, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబులను ఆదేశించారు.

- రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు దెబ్బ తినడంతో నడిచేందుకు వీలు లేని తనను ఆదుకోవాలని బీమడోలు మండలం కోలసానిపల్లి గ్రామానికి చెందిన కె.సత్యనారాయణ వినతిపత్రం అందించగా రూ.5 వేలు పింఛన్ మంజూరు చేయాలని సీఎం జగన్ ఆదేశించారు.
- బ్యాంకు రుణంతో పాటు ఆర్థిక సాయం అందించాలని తెనాలి సమీపంలోని చిన రావూరు గ్రామానికి చెందిన కొర్రా కల్పనాబాయి అర్జీ ఇచ్చారు.
- తన సోదరుడి క్యాన్సర్ చికిత్స కోసం ఆర్థిక సాయం చేయాలని కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన కవలకుంట్ల ప్రవీణ్‌కుమార్ అర్జీ సమర్పించారు.
- 98 డీఎస్సీ అర్హత సాధించిన టీచర్ల ఎంపికకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని బైరవకోన శ్రీనివాసరావుతో పాటు మరో ఐదుగురు అర్జీలు ఇచ్చారు.
- కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న స్టాఫ్ నర్సుల సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అర్జీ ఇచ్చారు.
- క్యాన్సర్ బాధితుడినైన తనకు ఒక కిడ్నీ తొలగించారని, ఆర్థిక సాయం అందించాలని కోరుతూ మచిలీపట్నం వల్లెగూడెంకు చెందిన జీఎస్‌వీ చంద్రబాబు అర్జీ అందచేశారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో సోమవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	43.6	29.2
రాజమహేంద్రవరం	41.5	26.5
కడప	40.8	26.0
గుంటూరు	39.0	29.0
విజయవాడ	39.0	29.0
ఏలూరు	39.0	27.0
తిరుపతి	39.0	26.0
నెల్లూరు	38.5	29.0
అనకాపల్లి	38.5	24.9
విశాఖపట్నం	37.6	25.8
శ్రీకాకుళం	37.0	26.0

చారిత్రక విజయానికి నాలుగేళ్లు

చంద్రబాబు దుర్మార్గపు పాలనకు ముగింపు పలుకుతూ 2019, మే 23న ప్రజల చారిత్రక తీర్పు

- 50 శాతానికి పైగా ఓట్లు.. 151 అసెంబ్లీ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం
- దేశంలో ఒంటరిగా పోటీచేసిన ఒక పార్టీ ఇంత భారీ విజయం సాధించడం అదే ప్రథమం
- 98.5% హామీలను అమలుచేయడం ద్వారా మేనిఫెస్టోకు సరికొత్త నిర్వచనం ఇచ్చిన సీఎం జగన్
- విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు
- గ్రామ, వార్డు సచివాలయాలు.. జిల్లాల పునర్వ్యవస్థీకరణ ద్వారా పరిపాలన వికేంద్రీకరణ
- ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలు
- 47 నెలల్లో డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లో రూ.2.10 లక్షల కోట్లు జమ
- నామినేటెడ్ నుంచి కేబినెట్ వరకూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేయడం ద్వారా సామాజిక న్యాయం
- పంచాయతీ, మండల పరిషత్, జెడ్పీ, పురపాలక, ఉప ఎన్నికల్లోనూ రికార్డు విజయాలు
- 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఈ ప్రభుత్వానికి 1.16 కోట్ల కుటుంబాల మద్దతు
- 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికీ జన నీరాజనం
- సంక్షేమాభివృద్ధి పథకాలు.. సుపరిపాలనతో ప్రజల నమ్మకం రెట్టింపు



సాక్షి, అమరావతి: ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా? అంటూ ఎస్సీలను.. తాట తీస్తా, తోలు తీస్తా, న్యాయమూర్తులుగా పనికిరారంటూ బీసీలను.. కోడలు మగపిల్లాణ్ని కంటానంటే అత్త వద్దంటుందా అంటూ మహిళల పుట్టుకను అవహేళన చేస్తూ సాగిన చంద్రబాబు దుర్మార్గపు పాలనకు రాష్ట్ర ప్రజలు సమాధి కడుతూ సరిగ్గా నాలుగేళ్ల క్రితం ఇదే రోజు చారిత్రక తీర్పు ఇచ్చారు. టీడీపీ అరాచక పాలనలో ప్రజలకు అండగా నిలిచి.. ప్రజాసంకల్ప పాదయాత్రలో భవితపై భరోసా కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పట్టి.. నవశకాన్ని ఆవిష్కరించి నేటికి నాలుగేళ్లు. సంక్షేమ పథకాలు.. రాజ్యాధికారంలో సింహభాగం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే వాటా ఇచ్చి సామాజిక మహావిప్లవాన్ని ఆవిష్కరించి.. విప్లవాత్మక సంస్కరణల ద్వారా సుపరిపాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన జనరంజక పాలనకు పునాదిపడి కూడా నేటికి సరిగ్గా నాలుగేళ్లు. విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో టీడీపీ అధికారంలోకి వచ్చింది.

ఆ ఐదేళ్లలో అరాచకాలు అనేకం..

2014, జూన్ 8 నుంచి 2019, మే 29 వరకూ చంద్రబాబు సర్కార్ సాగించిన దాష్టీకాలు, చేసిన దోపిడీలు అన్నిఇన్నీ కావు. ఎన్నికల్లో చెప్పిన మాట ప్రకారం వ్యవసాయ రుణాలను మాఫీ చేయకుండా రైతులను.. డ్వాక్రా రుణాలను మాఫీ చేయకుండా అక్కాచెల్లెమ్మలను మోసంచేసిన చంద్రబాబు వారిని అప్పుల ఊబిలోకి నెట్టారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపికచేసే బాధ్యతను టీడీపీ కార్యకర్తలతో ఏర్పాటుచేసిన జన్మభూమి కమిటీలకు అప్పగించి.. అరాచకాలకు తెరతీశారు. జన్మభూమి కమిటీల దోపిడీలు, దౌర్జన్యాలతో ఊరువాడా అశాంతి, అసంతృప్తి పెల్లుబికింది. సాగునీటి ప్రాజెక్టుల్లో కమీషన్లు.. ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా రాజధాని భూకుంభకోణం.. పారిశ్రామిక రాయితీల దోపిడీ.. ఇలా అన్ని రంగాల్లోనూ చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రాన్ని దోచుకున్నారు. ఇలా దోచేసిన ప్రజాధనంతో వైఎస్సార్‌సీపీ తరఫున గెలుపొందిన 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, వారికి టీడీపీ తీర్థం ఇచ్చి.. అందులో నలుగురిని మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా రాజ్యాంగాన్ని అపహాస్యం

వైఎస్సార్‌సీపీకి రికార్డు విజయం

రాష్ట్రంలో సాధారణ ఎన్నికలను 2019, ఏప్రిల్ 11న ఎన్నికల సంఘం నిర్వహించింది. మే 23న ఓట్ల లెక్కింపును చేపట్టి ఫలితాలు ప్రకటించింది. ఆ ఎన్నికల్లో 50 శాతానికి పైగా ఓట్లు.. 151 అసెంబ్లీ స్థానాలు, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు అఖండ విజయాన్ని కట్టబెట్టారు. చంద్రబాబు అరాచక పాలనకు సమాధి కట్టారు. దేశ చరిత్రలో ఒంటరిగా పోటీచేసిన ఒక పార్టీ ఇంత భారీ విజయాన్ని సాధించడం అదే ప్రథమం. టీడీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీకి అత్యంత ఘోర పరాజయం కూడా అదే కావడం గమనార్హం.

నవశకానికి నాంది

ప్రజల ఆశీర్వాదంతో 2019, మే 30న సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేశారు. 98.5 శాతం హామీలను అమలుచేయడం ద్వారా ఎన్నికల మేనిఫెస్టోకు సరికొత్త నిర్వచనం ఇచ్చారు. అంతేకాక..

- అర్హతే ప్రమాణికంగా, వివక్షకు తావులేకుండా సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధిచేకూర్చారు.
- కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ.. ఆర్థిక ఇబ్బందుల్లోనూ ఏ ఒక్క పథకాన్ని ఆపలేదు.
- 47 నెలల్లో సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో రూ.2.10 లక్షల కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసిన దాఖలాలు దేశంలో మరెక్కడా లేవు.
- వ్యవసాయరంగంలో విప్లవాత్మక సంస్కరణలను తెచ్చి.. విత్తనం నుంచి విక్రయం దాకా రైతుల వెన్నంటి నిలుస్తూ వ్యవసాయాన్ని పండుగగా మార్చారు.
- నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ కంటే మిన్నగా తీర్చిదిద్ది ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టారు.
- ప్రభుత్వ ఆసుపత్రులను నాడు–నేడు ద్వారా ఆధునీకరించడంతోపాటు జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నారు.
- గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటుచేసి.. వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకెళ్లారు.
- అలాగే, జిల్లాలను పునర్వ్యవస్థీకరించి.. 26 జిల్లాలను ఏర్పాటుచేసి పరిపాలనను వికేంద్రీకరించారు.
- సంస్కరణల ద్వారా విప్లవాత్మకమైన మార్పులతో సుపరిపాలనలో రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా సీఎం వైఎస్ జగన్ నిలిపారు.

వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ఆదరణ

ఇక తొలిసారిగా ఏర్పాటుచేసిన మంత్రివర్గంలో 56 శాతం.. పునర్వ్యవస్థీకరణ ద్వారా ఏర్పాటుచేసిన కేబినెట్‌లో 70 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చి సామాజిక న్యాయంలో సీఎం జగన్ దేశానికి ఆదర్శంగా నిలిచారు. రాజ్యసభ, శాసనమండలి సభ్యుల నుంచి నామినేటెడ్ పదవుల వరకూ సింహభాగం ఆ వర్గాలకే కేటాయించి సామాజిక సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. అన్ని వర్గాల మన్ననలు పొందేలా పాలన అందిస్తూ ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఆయన రెట్టింపు చేసుకున్నారు. పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, పురపాలక, తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక.. బద్వేలు ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ రికార్డు విజయాలను సాధించడాన్ని బట్టి చూస్తే.. ప్రజల్లో సీఎం వైఎస్ జగన్‌కు ఆదరణ రెట్టింపైందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు నిర్వహించిన ప్రజా సర్వేలో 1.16 కోట్ల కుటుంబాలు అంటే 80 శాతం మంది ప్రజలు వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలకు గడప గడపలోనూ ప్రజలు బ్రహ్మరథం పడుతుండటాన్ని బట్టి చూస్తే.. వైఎస్సార్‌సీపీకి ప్రజాదరణ నానాటికీ పెరుగుతోందన్నది స్పష్టమవుతోందని రాజకీయ విశ్లేషకులు తేల్చిచెబుతున్నారు.

ట్విట్టర్‌లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా దూకుడు



గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించి నాలుగేళ్లయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు 'వైఎస్సార్‌సీపీ ఎగైన్ 2024' హ్యాష్‌టాగ్‌తో ట్విట్టర్‌లో ట్రెండింగ్ ప్రారంభించారు. పది నిమిషాల్లోనే ఈ ట్రెండింగ్ జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. తన నాలుగేళ్ల పాలనలో వైఎస్ జగన్ ప్రభుత్వం సాధించిన విజయాలతో పాటు ఆయన రాజకీయ ప్రస్థానానికి సంబంధించిన సమాచారంతో కూడిన ట్వీట్లను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ట్వీట్ చేశారు. వీటికి దేశవ్యాప్తంగా భారీగా వ్యూస్ వచ్చాయి. ఇటీవలి కాలంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం ట్విట్టర్ ట్రెండింగ్స్‌లో యమా దూకుడుగా వ్యవహరిస్తోంది. గతేడాది సీఎం వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా జరిగిన ట్రెండింగ్‌లోనూ ఇదే పరిస్థితి.

ఏసీలో హాయ్ హాయ్!

- ఏసీ బస్సుల్లో ప్రయాణానికి మొగ్గు
- 80 శాతానికి పైగా చేరిన ఆక్యుపెన్సీ
- నాన్ ఏసీ సర్వీసులకు మించిన ఓఆర్
- ఆర్టీసీకి ఊరటనిస్తున్న వేసవి తాపం



సాక్షి, విశాఖపట్నం: వేసవి తాపం తాట తీస్తోంది. ఎండ మంట పుట్టిస్తోంది. వడగాడ్పులు బేజారెత్తిస్తున్నాయి. ఇళ్లలో ఉంటేనే సెగలు కక్కుతున్నాయి. ఇక ప్రయాణాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఒకపక్క స్కూళ్లు, కాలేజీలకు సెలవులొచ్చాయి. మరోపక్క పెళ్లిళ్లు కూడా ఊపందుకున్నాయి. దీంతో ఊళ్లకు, విహార యాత్రలకు వెళ్లే వారి సంఖ్య అధికమైంది. ఇలా ఊళ్లు వెళ్లే వారు ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందడానికి ఏసీ బస్సుల్లో ప్రయాణాలకు మొగ్గు చూపుతున్నారు. మధ్య తరగతి, ఆపై స్థాయి ప్రయాణికులు నాన్-ఏసీ ప్రయాణంకంటే ఏసీ బస్సుల్లో ఎక్కువ చార్జీ అవుతున్నప్పటికీ వెనకడుగు వేయడం లేదు. ఫలితంగా ఆర్టీసీతో పాటు ప్రైవేటు ఏసీ బస్సుల్లోను సీట్లు, బెర్తులకు డిమాండ్ పెరుగుతోంది. గత నెలలో ఏపీఎస్‌ఆర్టీసీ ఏసీ సర్వీసుల్లో 50 శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ఉండగా ఇప్పుడది 80 శాతానికి పైగా చేరుకుంది. అదే సమయంలో నాన్-ఏసీ సర్వీసులకు కూడా ఓఆర్ పెరిగినా ఏసీ సర్వీసులతో పోల్చుకుంటే తక్కువగానే ఉంటోంది. గత నెలలో నాన్-ఏసీ బస్సుల్లో ఓఆర్ 60 శాతం ఉండగా ప్రస్తుతం 75 శాతం వరకు పెరిగింది.

అమలాపురం ఇంద్ర ఏసీ సర్వీసుకు 87 శాతం ఆక్యుపెన్సీ

విశాఖ జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ రోజుకు 30 ఏసీ బస్సులను నడుపుతోంది. వీటిలో హైదరాబాద్‌కు ఆరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళంలకు 16, విజయవాడ, కడప, అమలాపురంలకు ఎనిమిది చొప్పున వెళ్తున్నాయి. ఇవన్నీ 80 శాతం పైనే ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. వీటిలో అత్యధికంగా విశాఖపట్నం నుంచి అమలాపురం ఇంద్ర ఏసీ సర్వీసుకు 87 శాతం, ఆ తర్వాత స్థానంలో విశాఖ నుంచి కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళంలకు నడిచే మెట్రో లగ్జరీకి 85 శాతం ఆక్యుపెన్సీ రేషియో ఉంటోంది. అలాగే 84 శాతం ఓఆర్‌తో విజయవాడ అమరావతి సర్వీసుకు, 82 శాతం ఓఆర్ కడప ఇంద్ర ఏసీ సర్వీసుకు ఉంది. సగటున 80 శాతానికి మించి ఏసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ లభిస్తుండడం ఆర్టీసీకి ఊరటనిస్తోంది. ఈ వేసవిలో ఏసీ బస్సుల్లో ప్రయాణాలు ఆశాజనకంగా పెరిగాయని, ఇది ఆర్టీసీకి లాభదాయకమని విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు. గత నెలతో పోల్చుకుంటే వీటిలో ఓఆర్ పెరుగుదల బాగుందని తెలిపారు.

ప్రైవేటు ఆపరేటర్లకు కాసుల పంట

వేసవి తాపం ప్రైవేటు బస్సు ఆపరేటర్లకు కాసులు కురిపిస్తోంది. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న కొద్దీ ఏసీ టికెట్లకు డిమాండ్ అధికమవుతోంది. దీనిని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు 'క్యాష్' చేసుకుంటున్నాయి. ఏసీ స్లీపర్ విశాఖపట్నం నుంచి విజయవాడకు రూ.1700–2200 వరకు, హైదరాబాద్‌కు రూ.2500 నుంచి 3200 వరకు వసూలు చేస్తున్నారు. అదే సీటయితే విజయవాడకు రూ.1300–1500, హైదరాబాద్‌కు డిమాండ్‌ను బట్టి రూ.2000–2500 వరకు తీసుకుంటున్నారు.

ఆర్టీసీ ఏ రూటు బస్సుకు ఎంత ఆక్యుపెన్సీ (శాతంలో)

సర్వీసు	ఎక్కడకు	ఓఆర్
వెన్నెల	విశాఖ–హైదరాబాద్	80
డాల్ఫిన్ క్రూయిజ్	విశాఖ–హైదరాబాద్	76
నైట్ రైడర్ (స్లీపర్)	విశాఖ–హైదరాబాద్	80
అమరావతి	విశాఖ–విజయవాడ	84
ఇంద్ర	విశాఖ–కడప	82
ఇంద్ర	విశాఖ–అమలాపురం	87
మెట్రో లగ్జరీ	విశాఖ–కాకినాడ	85
మెట్రో లగ్జరీ	విశాఖ–రాజమండ్రి	85
మెట్రో లగ్జరీ	విశాఖ–శ్రీకాకుళం	85

జాతీయ జట్టులో స్థానమే లక్ష్యంగా..

క్రికెట్‌లో యువతులకు శిక్షణ.. లాంగ్‌టర్మ్ కోచింగ్
ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు.. మూడు మైదానాల్లో తర్ఫీదు


బౌలింగ్ ప్రాక్టీస్

విశాఖ స్పోర్ట్స్ : వేసవి శిక్షణ అద్భుతంగా సాగుతోంది. మహిళా క్రికెటర్లను తయారు చేయడమే లక్ష్యంగా అకుంఠిత దీక్షతో శిక్షణ ఇస్తున్నారు. విశాఖనుంచి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటుకున్న స్నేహదీప్తి, షబ్నమ్‌లు వేసవి శిక్షణను ఉపయోగించుకునే ఎదిగారు. సత్తాచాటుకున్నారు. దీంతో యువతుల్లో క్రికెట్‌పై మరింత ఆసక్తి పెరిగింది. స్నేహదీప్తి, షబ్నమ్‌లను స్ఫూర్తిగా తీసుకుని క్రికెట్‌లో ప్రతిభ చాటుకునేందుకు వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారు. జాతీయ స్థాయికి ఆడేలా క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ట్రైనర్స్ కూడా పట్టుదలతో ఉన్నారని వీడీసీఏ సంయుక్త కార్యదర్శి, వేసవి శిబిరాల సమన్వయకర్త జేకేఎం రాజు చెబుతున్నారు. బాలికలకు శిక్షణా శిబిరాలను ఏడేళ్ల క్రితం ప్రారంభించామని తెలిపారు. మరో ఐదుగురిని జాతీయజట్టుకు ఎంపికయ్యే విధంగా శిక్షణ కొనసాగిస్తున్నామని, వారంతా ప్రస్తుతం ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ప్రస్తుత వార్షిక శిక్షణా శిబిరంలో బాలుర, బాలికలతో సహా మొత్తంగా షార్ట్‌లిస్ట్‌చేసి 250 మందిని ఎంపిక చేశారు. వీరంతా శిక్షణ పొంది లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు సిద్ధం కానున్నారు.

అలుపెరుగని విధంగా..

వేసవి శిబిరాల్లో భాగంగా నాలుగు వేదికల్లో వీడీసీఏ శిక్షణ ఇస్తోంది. ఉక్కు స్టేడియం, మున్సిపల్ స్టేడియంలతో పాటు వైఎస్సార్ స్టేడియం–బి గ్రౌండ్‌లోనూ శిక్షణ ఇస్తున్నారు. ఎంపికైన 60మంది బాలికలతో పాటు ఇప్పటికే పలు స్థాయిలో ఆంధ్రకు ఆడిన 20మందితో కలిపి శిక్షణ పొందుతున్నారు. వీరిలో ఎనిమిది మంది -16 స్టేట్ ఆడగా, ఏడుగురు -19స్టేట్ ఆడారు. మరో ఐదుగురు సీనియర్ స్టేట్ ఆడారు. వీరందరితో పాటు ఇప్పుడు శిక్షణ తీసుకున్న వారినీ కలిపి శిక్షణ అనంతరం జట్లుగా మ్యాచ్‌లాడించేందుకు సిద్ధం చేస్తున్నారు.


నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న స్టేట్ క్రీడాకారిణులు

శిక్షణ ఇలా..

బాలికలకు అండర్ 12నుంచి అండర్ 16వరకు వైఎస్సార్ స్టేడియం వేదికగానే రెండు సెషన్స్‌లో సాగుతోంది. ఉదయం సెషన్‌లో ఫిట్‌నెస్, ఫీల్డింగ్ అంశాల్లోనే శిక్షణ జరుగుతుండగా సాయంత్రపు సెషన్‌లో నెట్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో తర్ఫీదు ఇస్తున్నారు. కొత్తగా శిక్షణలో చేరిన వారికి బేసిక్స్‌తో పాటు టెక్నిక్ నేర్పించిన వారి వ్యక్తిగత ప్రతిభను ఆధారంగా ఇప్పటికే స్టేట్ ఆడిన వారితో కలవనున్నారు. జట్లుగా ఏర్పాటు చేసి మ్యాచ్‌లు నిర్వహించి లాంగ్‌టర్మ్ శిక్షణకు తీసుకోనున్నారు. వేసవి శిబిరాలు ప్రారంభించిన రెండేళ్లలోనే జిల్లా జట్టుకు ఎంపికై స్టేట్ ఆడిన వారూ ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. వీరినుంచే తన్మయ్, హర్షిత, హేమరోషిణి, మహతి లాంటి వారు జాతీయ క్రికెట్ అకాడమికి వెళ్లే దిశగా అడుగులు వేస్తున్నారు.


166 నాటౌట్...



2016లో మా మామయ్య ద్వారా శిక్షణకు వచ్చాను. ఇండియాకు ఆడిన స్నేహదీప్తి నా బంధువు. అలా క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకున్నా. విజయనగరంలో జరిగిన మ్యాచ్‌లో 166పరుగులు చేశా. తొలుత కాజువల్‌గానే వేసవి శిబిరంలో పాల్గొన్నా లాంగ్‌టర్మ్‌తో జిల్లా జట్టుకు ఎంపిక కావడంతో అండర్16, సీనియర్ స్టేట్ ఆడా.. హయ్యర్ లెవెల్ క్రికెట్ ఆడాలన్నదే నా ధ్యేయం.

–హర్షిత, లెఫ్టార్మ్ బ్యాటర్

ఆడే స్థాయిని బట్టే గుర్తింపు



ఏసీఏ పరిధిలోని 13 జిల్లాల్లో ఏటా వేసవి శిబిరాలు జరుగుతున్న వారిని లాంగ్‌టర్మ్ వరకూ ప్రోత్సహించేది వీడీసీఏనే. శిబిరాల నుంచి శిక్షణ పొంది నేడు 384మంది వివిధ స్థాయి ఏజ్ గ్రూప్‌ల్లో ఆడుతున్నారు. అటు వీడీసీఏ ఉపాధ్యక్షుడిగా యాక్టివిటీస్ మానిటర్ చేస్తూనే కంపెనీ తరఫున స్పాన్సర్‌గా శిబిరం నిర్వహిస్తున్నా..వేసవి శిబిరం అనేది జిల్లా నుంచి జాతీయ జట్టు వరకు ఒక ప్లాట్‌ఫాం లాంటిది. వారి ప్రదర్శన బట్టి.. వారు ఆడే స్థాయి నిర్ణయిస్తారు.

–డీఎస్ వర్మ, వీడీసీఏ ఉపాధ్యక్షుడు

ఆంధ్రా జట్టు వైస్ కెప్టెన్‌గా..

ఐదో తరగతిలో ఉండగా నాన్నతో కలిసి శిబిరానికి వచ్చాను. అలా ఆడుతూనే ప్రొఫెషనల్‌గా మారిపోయాను. ప్రస్తుతం జట్టుకు ఓపెనింగ్ బ్యాటర్‌గా ఎదిగాను. బ్యాటింగ్ అనేది నా ఆప్షనే. చాలెంజర్ ట్రోఫీ ఆడా. నేషనల్ క్రికెట్ అకాడమిలో క్యాంప్ చేసి రెండు మ్యాచ్‌లకు కెప్టెన్‌గాను వ్యవహరించా. రాజ్‌కోట్‌లో జరగనున్న మ్యాచ్‌లకు ఆంధ్రజట్టుకు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నాను.

–మహతి, జాతీయ అకాడమిలో శిక్షణ పొందుతున్న యువతి

ఆంధ్ర -19 కెప్టెనయ్యా...

2016లో జరిగిన వేసవి శిబిరంలో శిక్షణ పొందా. 2019నుంచి లాంగ్‌టర్మ్ కోచింగ్‌తో అండర్16 స్టేట్‌కు ఆడాను. తర్వాత ఏడాది స్టేట్‌కు ఆడి అండర్ 19కి వచ్చాను. ప్రస్తుతం అండర్–19 కెప్టెన్‌గా ఆంధ్ర వుమెన్ జట్టును నడిపించనున్నాను. కెప్టెన్‌గా ఆటగాళ్లను అందరినీ సమన్వయం చేసుకుంటూనే జాతీయజట్టుకు ఆడాలన్నదే నా కల.

–సాయితన్మయి, -19 ఆంధ్ర మహిళా కెప్టెన్

విశాఖలో విద్యుత్ ఆదా భవనం

- ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) నిర్మాణానికి అనుమతులు
- రూ.10 కోట్లతో దేశంలో మూడో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు
- సగానికిపైగా విద్యుత్ ఆదా చేసేలా సూపర్ ఈసీబీసీ భవనానికి ప్రణాళికలు
- సాగర్ నగర్‌లో చురుగ్గా నిర్మాణ పనులు


సాగర్ నగర్‌లో నిర్మితమవ్వనున్న సూపర్ ఈసీబీసీ భవనం ఇదే


సాక్షి, విశాఖపట్నం : పర్యావరణ నిర్మాణాలకు విశాఖలో అంకురార్పణ జరుగుతోంది. విద్యుత్ వినియోగాన్ని సగానికిపైగా తగ్గిస్తూ.. ఇంధన వనరుల ఆదాపై దృష్టిసారించిన ప్రభుత్వం.. ఏపీలో తొలి సూపర్ ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్‌ను నిర్మిస్తోంది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) సహకారంతో విద్యుత్ ఆదా భవనం సాగర్ నగర్ వద్ద రూపుదిద్దుకుంటోంది. రూ.10 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న ఈ భవనం ద్వారా 50 శాతం వరకూ విద్యుత్ ఆదా జరగనుంది.

ఇంధన వనరుల వినియోగంలో సంయమనం పాటించకపోతే జీవరాశి మనుగడ ప్రశ్నార్థకంగా మారనుంది. భూతాపం పెరుగుదలకు విచక్షణారహితమైన విద్యుత్ వినియోగం కూడా ఒక కారణంగా మారింది. ఈ సంగతిని ముందుగానే పసిగట్టిన భారత్ కర్బన ఉద్గారాల్ని 2070 నాటికి సున్నా శాతానికి చేర్చాలన్నది లక్ష్యంగా నిర్దేశించుకోగా.. దాన్ని చేరుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా.. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సూపర్ ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్(ఈసీబీసీ) భవనాన్ని విశాఖలో నిర్మిస్తున్నారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ) ఈ ఈసీబీసీ బిల్డింగ్‌కు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చింది. దేశంలో మూడో సూపర్ ఈసీబీసీ భవనంగా చరిత్ర సృష్టించనుంది.

సాగర్ నగర్‌లో ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌గా..

సూపర్ ఈసీబీసీ–2017 నిబంధనలకు అనుగుణంగా సాగర్ నగర్‌లో ఈ నిర్మాణం ప్రారంభమైంది. జీ ప్లస్ 1 మోడల్‌తో ఈ ప్రతిపాదిత 'ఈపీడీసీఎల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్' భవనాన్ని ఎంపిక చేశారు. రూ.10 కోట్లకుపైగా ఖర్చు చేయనున్న ఈ భవన నిర్మాణ వ్యయంలో 50 శాతం నిధులు బీఈఈ మంజూరు చేస్తుండగా.. మిగిలిన మ్యాచింగ్ గ్రాంట్‌ని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది. సూపర్ ఈసీబీసీ భవనాలు.. సాధారణ ఈసీబీసీ భవనాల కంటే మరింత సమర్థవంతంగా ఉంటాయి. సాధారణ ఈసీబీసీ భవనాలు 25 శాతం తక్కువ విద్యుత్‌ని వినియోగిస్తే.. సూపర్ ఈసీబీసీ భవనాలు మాత్రం ఏకంగా 50 శాతం విద్యుత్‌ని ఆదా చేస్తాయి. భవన నిర్మాణ క్రమంలో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంపై దృష్టి సారిస్తారు. సోలార్ లేదా విండ్ పవర్‌ని జోడిస్తారు. కాబట్టి.. పూర్తిగా సున్నా విద్యుత్ వినియోగం జరిగే అవకాశాలున్నాయి. దానికనుగుణంగా భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళికల్ని ఈపీడీసీఎల్ రూపొందించుకుంది. మారుతీ ఇంజినీరింగ్ సంస్థకు ఈ భవన నిర్మాణ పనుల్ని ఈపీడీసీఎల్ అప్పగించింది. ఏడాది కాలపరిమితిలో దీన్ని పూర్తి చేసేందుకు టైమ్ లైన్ ఏర్పాటు చేసుకున్నారు.

దేశంలోనే తొలిసారిగా..



ఏపీలో తొలి సూపర్ ఈసీబీసీ భవనంగా విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ బిల్డింగ్ మొత్తం దేశానికి సమూనా ప్రదర్శనగా మారనుంది. అత్యాధునిక సాంకేతికతలతో భవన నిర్మాణం జరిగేలా ఈపీడీసీఎల్ చర్యలు తీసుకుంటోంది. ఆర్కిటెక్చరల్ డిజైన్ ఫీచర్స్ ద్వారా విద్యుత్‌వినియోగాన్ని ఆప్టిమైజేషన్ చేసిన తర్వాత సూపర్ ఈసీబీసీ బిల్డింగ్‌లో టెక్నాలజీ మిళితమై ఉంటుంది. దీంతో పాటు రెన్యూవబుల్ ఎనర్జీ వినియోగానికి కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

– ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎస్ఈసీఎం సీఈవో

"భయం వద్దు! వెనక్కి తగ్గవద్దు... దేవుడే స్వయంగా నీకోసం పోరాడుతాడు : నువ్వు నిశ్చలంగా ఉంటే చాలు.
– జుడాయిజం

సాక్షి
మంగళవారం, 23 మే 2023

హిరోషిమాలో నిష్ఠుర నిజాలు

జపాన్‌లోని హిరోషిమా వేదికగా మూడు రోజులు సాగిన జీ7 దేశాల సదస్సు రష్యాపై మరిన్ని ఆంక్షలు, చైనాపై ఘాటు విమర్శలు, ఉక్రెయిన్ అధినేత ఆశ్చర్యకర సందర్శనతో ఆదివారం ముగిసింది. అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూరోపియన్ యూనియన్ (ఈయూ)లతో కూడిన 'జీ7'లో భాగం కానప్పటికీ, ఈ 49వ సదస్సుకు ప్రత్యేక అతిథిగా ఆహ్వానం అందుకున్న భారతదేశం ప్రాధాన్యం ఈ వేదిక సాక్షిగా మరోసారి వెల్లడైంది. భారత ప్రధానికి అమెరికా, ఆస్ట్రేలియా అధినేతల ప్రశంసల నుంచి పాపువా న్యూ గినియా ప్రధాని చేసిన పాదాభివందనం దాకా అనేకం అందుకు నిదర్శనాలు. రష్యా దాడి నేపథ్యంలో యుద్ధబాధిత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన ఆయన సంక్షోభ పరిష్కారానికి వ్యక్తిగతంగానూ చొరవ చూపుతాననడం పెద్ద వార్త. అంతటితో ఆగక ఆ మర్నాడే ఐరాసపై విమర్శల బాణం ఎక్కుపెట్టి, పరిస్థితులకు తగ్గట్టుగా సంస్కరణలు చేయకుంటే ఐరాస, భద్రతా మండలి కేవలం కబుర్లకే పరిమితమైన వేదికలుగా మిగిలిపోతాయనడం సంచలనమైంది.

నిష్ఠురమైనా భారత ప్రధాని వ్యాఖ్యలు నిజమే. మూడేళ్ళక్రితం తూర్పు లద్దాఖ్ వెంట భారత్‌తో చైనా ఘర్షణ మొదలు తాజా ఉక్రెయిన్ సంక్షోభం దాకా అన్నిటినీ దృష్టిలో ఉంచుకొనే మోదీ ఈ వ్యాఖ్యలు చేశారన్నది స్పష్టం. ప్రపంచ శాంతి, సుస్థిరతలకు ఎదురయ్యే సమస్యల్ని చర్చించి, ఘర్షణల్ని నివారించాల్సిన ఐరాస ఆ పని చేయలేక ఇటీవల నామమాత్రంగా మారిన సంగతి చూస్తున్నదే. సమస్యల్ని ఐరాసలో కాక, ఇతర వేదికలపై చర్చించాల్సి రావడం వర్తమాన విషాదం. అదే సమయంలో అంతర్జాతీయ చట్టం, ఐరాస నియమావళి, ఇతర దేశాల ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాన్ని ప్రపంచ దేశాలన్నీ గౌరవించి తీరాలంటూ జీ7 వేదికగా భారత ప్రధాని కుండబద్దలు కొట్టారు. కాదని ఏకపక్షంగా వాస్తవస్థితిని మార్చే ప్రయత్నాలకు ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలి అన్న మోదీ వ్యాఖ్యలు పరోక్షంగా చైనాను ఉద్దేశించినవే. భద్రతా మండలిలో భారత సభ్యత్వానికి జరుగుతున్న సుదీర్ఘ కాలయాపన కూడా మోదీ మాటలకు ఉత్ప్రేరకమైంది.

గమ్మత్తేమిటంటే, ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సైతం 1945 నాటి ప్రపంచ దేశాల పరిస్థితులకు అనుగుణంగా ఉన్న భద్రతామండలిని వర్తమాన కాలమాన పరిస్థితులకు తగ్గట్టు సంస్కరించాల్సిన సమయం ఆసన్నమైందని మీడియా ఎదుట అంగీకరించడం. ఇక, సాధారణ అలవాటుకు భిన్నంగా ఒక రోజు ముందు శనివారమే వెలువడ్డ జీ7 విధాన ప్రకటన డజన్ల కొద్దీ పేజీలున్నా – అందులో ప్రధానంగా చైనాపై విసిరిన బాణాలే ఎక్కువ. కనీసం 20 సార్లు చైనా నామస్మరణ సాగింది. తైవాన్, అణ్వస్త్రాలు, ఆర్థిక నిర్బంధం, మానవహక్కులకు విఘాతం, అమెరికా సహా పలు దేశాలతో బీజింగ్‌కు ఉన్న ఉద్రిక్తతలు ప్రకటనలో కనిపించాయి. సహజంగానే డ్రాగన్ ఈ ప్రకటనను ఖండించింది. ఇదంతా 'పాశ్చాత్య ప్రపంచం అల్లుతున్న చైనా వ్యతిరేక వల' అని తేల్చేసింది. రష్యా సైతం ఈ సదస్సు తమపైనా, చైనాపైనా విద్వేషాన్ని పెంచి పోషించే ప్రయత్నమంది.

యాభై ఏళ్ళ క్రితం ఒక కూటమిగా ఏర్పడినప్పుడు ఏడు పారిశ్రామిక శక్తుల బృందమైన 'జీ7' దేశాలు ప్రపంచ సంపదలో దాదాపు 70 శాతానికి ప్రాతినిధ్యం వహించాయి. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వాటి వాటా 44 శాతమే. నిజానికి, 2007–08లో ప్రపంచ ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో 'జీ20' కూటమి ఏర్పాటయ్యాక అంతర్జాతీయ ఆర్థిక మేనేజర్‌గా 'జీ7' వెలుగు తగ్గింది. అయితే, ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అగ్రశ్రేణిలో నిలిచిన ఈ దేశాలు ఇప్పటికీ తామే ప్రపంచ విధాన నిర్ణేతలమని చూపాలనుకుంటున్నాయి. ఉక్రెయిన్ యుద్ధంతో ఆ ఆలోచన, ఆకాంక్ష అత్యవసరమయ్యాయి. వర్తమాన ప్రపంచ అధికార క్రమాన్ని సమర్థించే శక్తులన్నీ ఒక్కచోట చేరి ఈ సదస్సును వినియోగించుకుంటున్నాయి. ఉక్రెయిన్‌పై దాడి అంతర్జాతీయ సమాజ విధివిధానాలకే సవాలని జపాన్ ప్రధాని పదే పదే పేర్కొన్నది అందుకే! స్వదేశంలోని రాజకీయ అంశాలతో తన పర్యటనలో రెండో భాగాన్ని రద్దు చేసుకున్నా 'జీ7'కు మాత్రం అమెరికా అధ్యక్షుడు హాజరైందీ అందుకే!

అదే సమయంలో 2.66 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో, తమ సభ్యదేశాలైన ఫ్రాన్స్, ఇటలీ, కెనడాల కన్నా పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌ను అనేకానేక కారణాల వల్ల జీ7 విస్మరించే పరిస్థితి లేదు. ఉక్రెయిన్ యుద్ధంతో ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిని, సరఫరా వ్యవస్థల్లో చిక్కులతో అనేక పాశ్చాత్య దేశాలు చిక్కుల్లో పడ్డాయి. అటు రష్యాతో, ఇటు పాశ్చాత్య ప్రపంచంతో సంబంధాల్లో సమతూకం పాటిస్తుండడం భారత్‌కు కలిసొస్తోంది. భవిష్యత్తులో చర్చలు, దౌత్యంతో యుద్ధం ఆగాలంటే – ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భారత్ మధ్యవర్తిత్వం కీలకం. కిందపడ్డా తనదే పైచేయిగా ఉండేలా 'జీ7'కు భారత్ ఆ రకంగా అవసరమే.

భారత్ సైతం ఒకపక్కన చైనా దూకుడును పరోక్షంగా నిరసిస్తూనే, రష్యా సాగిస్తున్న యుద్ధంపై తటస్థంగా ఉంటూ శాంతి ప్రవచనాలు చేయక తప్పని పరిస్థితి. భారత ప్రధాని అన్నట్టు చర్చలే అన్ని సమస్యలకూ పరిష్కారం. సమస్యను రాజకీయ, ఆర్థిక కోణంలో కాక మానవీయ కోణంలో చూడాలన్న హితవు చెవికెక్కించుకోదగ్గదే. ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధిలో వెనకబడ్డ దక్షిణార్ధగోళ దేశాలకు భారత్ గొంతుక కావడమూ బాగుంది. ప్రపంచ అధికార క్రమంలో గణనీయ మార్పుల నేపథ్యంలో ఇలాంటి శిఖరాగ్ర సదస్సులు, సమాలోచనలు జరగడం ఒకరకంగా మంచిదే. సమస్యల్ని ఏకరవు పెట్టడం సరే కానీ, సత్వర పరిష్కారాలపై జీ7 దృష్టి నిలిపిందా అంటే సందేహమే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.చవితి రా.11.30 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: ఆరుద్ర ఉ.11.42 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం: రా.12.47 నుండి 2.33 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.04 నుండి 8.55 వరకు, తదుపరి రా.10.50 నుండి 12.21 వరకు, అమృతఘడియలు: లేవు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఎంత చేయాలో అంత చేశారు!


నివాళి
రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

జరుగుబాటున్న కుటుంబంలో పుట్టిన కేతు విశ్వనాథ రెడ్డి కడుపు నిండినవాళ్ళ కోసం రాయలేదు. కడుపు కాలినవాళ్ళ కోసం రాశారు. రాయలసీమను పట్టి పీడిస్తున్న రెండు సమస్యలు – కరువు, ముఠాతత్వం గురించి అత్యుత్తమ కథలు రాశారు. స్త్రీ పట్లగల మానవీయ దృష్టికి కూడా ఆయన కథలు నిదర్శనాలు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా పనిచేశారు. కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యాన్ని సంపుటాలుగా వింగడించి పెద్ద చలనం తీసుకొచ్చారు. సామాజిక శాస్త్రాల సహాయంతో సాహిత్యాన్ని అధ్యయనం చేయవలసిన తీరును అనేక వ్యాసాలలో స్పష్టం చేశారు. విరుద్ధ భావజాలం గలవారిపట్ల కూడా గౌరవంగా మాట్లాడేవారు. ఒకరు ఉపయోగకరమైన పని చేస్తే, ఆ కృషి కొనసాగింపునకు ప్రోత్సహించే సంస్కారి.

'మానవతావాదులు కాని వారెవరూ కమ్యూనిస్టులు కాలేరు' అన్నారు శ్రీశ్రీ ఒక ఇంటర్వ్యూలో. కులం, మతం, జెండర్, ప్రాంతం వంటివాటితో సంబంధం లేకుండా మనుషులను ప్రేమించడమే మానవవాదం. ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి (10 జూలై 1939– 22 మే 2023) అలాంటి మానవ వాది, మానవతావాది. లేకుంటే 'అమ్మవారి నవ్వు' అనే మంచికథ రాసేవారు కాదు. 'బోధి', 'వేర్లు' నవలికలు రాసేవారు కాదు. 'శశిశ్రీ', రహమతుల్లా, షేక్ హుస్సేన్ సత్యాగ్ని లాంటి ముస్లిం రచయితలను, హయాత్ అనే ఆచార్యుని సోదరులుగా గౌరవించేవారు కాదు. విశ్వనాథరెడ్డి వ్యవసాయక కుటుంబం నుండి వచ్చారు. బాగా జరుగుబాటున్న కుటుంబంలో పుట్టిన ఆయన కడుపు నిండిన వాళ్ళ కోసం రాయలేదు. కడుపు కాలిన వాళ్ళకోసం రాశారు. అదే ఆయన మానవత్వం.

మానవతావాది కనుకనే, రాయలసీమను పట్టి పీడిస్తున్న రెండు సమస్యలు – కరువు, ముఠాతత్వం గురించి 'జప్తు', 'విరూపం', 'సానుభూతి' లాంటి అత్యుత్తమ కథలు రాశారు. ఆయన ఆకాంక్ష, ఆయన స్వప్నం కరువు, కక్షలు లేని రాయలసీమ. ఆయన బంధువర్గం ఫ్యాక్షన్ గొడవల్లో పడి నలిగిపోవడం చూశారు. ఫ్యాక్షన్ వల్ల ఇతర ప్రాంతాల దృష్టిలో రాయలసీమ గౌరవం దెబ్బతింటున్నదని గ్రహించి 'వెనకా ముందు' కథ రాశారు. ఫ్యాక్షనిస్టులు చివరికి ఒక్కటై, వాళ్ళ కోసం పేదలు బలైపోతున్న అమానుషత్వాన్ని 'పీర్లసావిడి' కథలో చిత్రించారు.

నేను శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్న సమయం (1973–1977)లో బహుశా 1975 ప్రాంతంలో విశ్వనాథ రెడ్డి పరిచయమయ్యారు. నన్ను 'చంద్రా' అని పిలిచేవారు. వల్లంపాటి వెంకట సుబ్బయ్య ఒకసారి నన్ను తిరుపతిలో కేతు ఇంటికి పిలుచుకొని వెళ్ళారు. ఆ సమయంలో కేతును గురించి వల్లంపాటి నాతో 'ఈయన పైకి చూడడానికి నవ్వుతూ కనిపిస్తాడు కానీ, పెద్ద రౌడీ' అన్నారు. అప్పుడు కేతు నవ్వుతూనే 'చంద్రా! ఆయన మాటలు నమ్మొద్దు' అన్నారు. అలా మొదలైన మా పరిచయం నిరాఘాటంగా కొనసాగింది. కేతు మార్క్సిస్టు అయినా, మార్క్సిస్టులు కాని చెరుకుపల్లి జమదగ్ని శర్మ, పేరాల భరత శర్మ వంటి సహాధ్యాపకుల గురించి ఉన్నతమైన మాటలు చెప్పేవారు. ఒకరిని చూస్తే ఇంకొకరికి పడని కాలంలో విరుద్ధ భావజాలం గలవారిపట్ల గౌరవంగా మాట్లాడడం నేను ఆయన దగ్గర నేర్చుకున్నాను. ఒకరు ఉపయోగకరమైన పని చేస్తే, దానిని మెచ్చుకొని, ఆ కృషి కొనసాగింపునకు ప్రోత్సహించే గొప్ప సంస్కారం ఆయనది.

'నేను చాలా స్లో రైటర్ని' అని విశ్వనాథరెడ్డి చెప్పుకొన్నారు. సమాజాన్ని దహించి వేస్తున్న రుగ్మతలను సమగ్రంగా మనసులో రూపుకట్టించుకొని రాయడానికి చాలా సమయమే తీసుకొనేవారు. 'వాన కురిస్తే' కథలో రైతు పాపయ్య, ఆయన కుటుంబమంతా వానకోసం ఎదురు చూడడంలోనే జీవితాలు గడిచిపోతాయి. కరువు కాలంలో ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే గడ్డిని ఆధిపత్య వాదులు పేదలకు అందకుండా తస్కరించే వాస్తవికతను 'గడ్డి' కథలో చిత్రించారు. ఈ అమానవీయతను 'నా బట్టా! నువ్వు రైతు కొంపల్లోనే పుట్టి నావా? కాపోడివేనా?' అని ఒక పేద మహిళ నిలదీస్తుంది. ఇలాంటి మాటలు రాయాలంటే రచయిత 'అ–కులీకరణ' (డీక్యాస్ట్‌పై) అయితే తప్ప సాధ్యం కాదు. అకులీకరణ చెందాలన్నా, అవర్గీకరణ చెందాలన్నా రచయిత హృదయంలోని మానవత్వమే దారి చూపుతుంది.


కేతు విశ్వనాథరెడ్డి

పులివెందుల కాలువ వస్తువుగా ఆర్తితో రాసిన 'పొడినిజం' కథలో కరువుతో ఎండిపోయి, పంటలు పండని నేలను ఒక విద్యార్థి దృష్టికోణం నుండి 'అచ్చరాలు తుడిచేసిన పలకలాగా ఉంది' అనిపిస్తాడు. పంటలు పండించి బతికే రైతులు కరువు వల్ల సారా వ్యాపారులుగా మారి, పోటీలు పడి, ఆఖరికి ఫ్యాక్షనిస్టులుగా మారి ఒకర్నొకరు చంపుకొనే అమానుష దశకు చేరుతున్న వాస్తవమే 'కూలిన బురుజు' కథ. భారతీయ సమాజంలో వితంతువులు పీడిత వర్గం. వాళ్ళపట్ల సమాజం ఎంత క్రూరంగా ప్రవర్తిస్తుందో 'ముఖదర్శనం' కథలో చిత్రించారు. కేతు విశ్వనాథరెడ్డి రెడ్డి స్త్రీపక్షపాతి. అలా కాని రచయితలు మానవతావాదులు కారు. 'తారతమ్యం', 'మారి పోయారు' వంటికథలు ఆయనకు స్త్రీ పట్లగల మానవీయ దృష్టికి నిదర్శనాలు. 'ఎందరి దయాదాక్షిణ్యాల మీద ఆడవాళ్ళు బతకాలి?' అని 'తారతమ్యం' కథ ప్రశ్నిస్తుంది. ఈ కథ 1977 నాటిది. అప్పటికి తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం పుట్టలేదు.

డబ్బు కొంతమంది చేతుల్లో ఉండిపోవడాన్ని వేమన వంటి ప్రాచీన కవులే గుర్తించారు. ఆధునిక కాలంలో మార్క్సిజం నేర్పిన పాఠాలతో ప్రభావితమైన అభ్యుదయ రచయితలు అసమ ఆర్థిక వ్యవస్థ సృష్టించే వైరుధ్యాలను బలంగా చిత్రించారు. 'డబ్బు ఈ సంఘంలో అన్నింటినీ శాసిస్తోంది' అన్న అవగాహన విశ్వనాథరెడ్డిది. ఈ అవగాహనతో 'చీకటితప్పు', 'దాపుడుకోక', 'చెదిరిన గుండెలు' వంటి విలువైన కథలు రాశారు. 'దాపుడుకోక' కథలో చెన్నమ్మ పేదరికం మానవత్వం ఉన్నవాళ్ళను కలవరపరుస్తుంది. సంపద ఒకరి చేతిలో ఉండే వ్యవస్థలో పీడితులు కూడా సంపద తమ చేతికి వేస్తే పీడకులుగా ఎలా మారతారో 'సొతంత్రం' కథలో సాయమ్మ పాత్ర ద్వారా చూపించారు. మార్క్సిజం వ్యక్తిగత ఆస్తిని వ్యతిరేకిస్తుంది. ఆ దృష్టి ఈ కథలో కనిపిస్తుంది. ఆయన కథలు చదివితే మన సంస్కారంలో ఒక కదలిక వస్తుంది. వర్తమాన ఆర్థిక రాజకీయ సాంఘిక వ్యవస్థ మీద మనల్ని పునరాలోచింప చేస్తాయి.

ప్రజలకు సేవ చేయడానికి ప్రజాధనాన్ని జీతాలుగా ఇచ్చి ఉద్యోగులుగా ప్రభుత్వం నియమిస్తుంది. ఆ ఉద్యోగులు అదనపు ఆదాయం కోసం ప్రజలను పీడించడాన్ని సహించరు అభ్యుదయ రచయితలు. 'వక్రబంధం', 'వద్దతి' (విద్యారంగం), 'అనధికారం', 'ఆ రోజుల్లో వస్తే', 'సందాకబళం', 'అంతర్ముఖం' (పోలీసు శాఖ), 'పొరునేట' (అటవీ శాఖ), 'దప్పిక' (రెవెన్యూ), 'వైరుధ్యం' (పంచాయతీ రాజ్) వంటి కథల ద్వారా కార్యనిర్వహణ వ్యవస్థలోని అమానుషత్వాలను ప్రతిబింబించారు కేతు. ప్రాంతాల మధ్య వైరుధ్యాలను కూడా 'తేడా', 'ఒక దృశ్యం – మరొక చిత్రం' వంటి కథల్లో ఆవిష్కరించారు. 'శిలువ వేసిన మనుషులు' వంటి కథలలో దళితుల జీవితాల లోని దైన్యాన్ని ప్రతిపాదించారు. పల్లెలు, నగరాలు, భారతదేశం, విదేశాలు – వీటి మధ్య తేడాలను 'రెండు ప్రపంచాల మధ్య', 'దగ్గరైన దూరం – దూరమైన దగ్గర', 'అంత్యాక్షరి' వంటి కథలలో కంటికి కొట్టి నట్లు చిత్రించారు. ఒక్క వాక్యంలో చెప్పాలంటే, కేతు విశ్వనాథరెడ్డి కథలు పొడినిజాల పట్ల తడిగీతాలు!

కేతు శాస్త్రీయమైన సాహిత్య విమర్శకుడు, పరిశోధకుడు. 'కడప ఊర్ల పేర్లు' అంశం మీద పరిశోధించి, ఓనమాస్టిక్స్ అనే ప్రత్యేక అధ్యయన విభాగానికి పునాది వేశారు. సామాజిక శాస్త్రాల సహాయంతో సాహిత్యాన్ని అధ్యయనం చేయవలసిన తీరును అనేక వ్యాసాలలో స్పష్టం చేశారు. 'దృష్టి', 'సంగమం', 'పరిచయం' వంటి గ్రంథాలు ఆయన విమర్శన గాఢతకు నిదర్శనాలు. సార్వత్రిక విశ్వవిద్యాలయంలో తెలుగు వాచకాల్లో విప్లవం తీసుకొచ్చారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా పనిచేశారు. కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యాన్ని సంపుటాలుగా వింగడించి విలువైన సంపాదకీయాలు రాసి పెద్ద చలనం తీసుకొచ్చారు. గొప్ప విద్యావేత్త. దూరవిద్యా విధానం మీద ఆయన చేసిన కృషి 'భాషాబోధన, విద్య–మార్పులు, ప్రాసంగికత' అనే పుస్తకంగా వచ్చింది. 'రాయలసీమ రాగాలు', 'చదువుకోలేదు' వంటి పుస్తకాలకు సంపాదకుడిగా వ్యవహరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారం, అజోవిభో కందాళై పురస్కారం వంటివి ఆయనకు దక్కాయి. ఒక మధ్య తరగతి మేధావి, ఆధునిక రచయిత తన సమాజానికి ఎంత చేయాలో అంత చేశారు!

వ్యాసకర్త తెలుగు సాహిత్య విమర్శకులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాటలు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వేసుకోకూడనిది...


మహిళలూ! బొటాక్స్ (వార్ధక్యాన్ని కనిపించనీయని ఇంజెక్షన్) అనేదాన్ని ఒక జీవాయుధంగా సృష్టించారు. దాన్ని సరిగ్గా వేసుకోకపోతే బొటూలిజం జబ్బు రావొచ్చు, లేదా మరణానికి దారితీయొచ్చు. బొటాక్స్ ఉద్వేగాలను అనుభూతి చెందకుండా శరీరాన్ని మొద్దుబారుస్తుంది. అది థైరాయిడ్‌ను అస్తవ్యస్తపరిచి, ఆటో ఇమ్యూన్ సమస్యలను సృష్టించవచ్చు. అది మీ శరీరంలో ఉండవలసింది కానేకాదు.
– జాన్ కాన్‌స్టాస్, మెడికల్ యాక్టివిస్ట్


సరైన నిర్ణయం


కశ్మీర్‌లో జీ20 సమావేశాలు జరగడం పట్ల అంతర్జాతీయ మీడియా ఉద్రేకపడుతోందంటేనే అదే సరైన వేదిక అని నాకు అనిపించింది. ఎందుకంటే ఎక్కడైనా స్థిరత్వం నెలకొంటున్నదంటే వారి బిజినెస్ మోడల్ దెబ్బతింటుందిగా!
– అలీ యెమిని, జర్నలిస్ట్

సైడ్ ఎఫెక్ట్


ఊహించినట్టే చాలామంది దుకాణదారులు రెండు వేల నోటు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. పైగా మీ దగ్గర ఒక్క రెండు వేల నోటున్నా అది నల్లధనం అన్న భావనొకటి జనాల్లోకి వెళ్లిపోయింది.
– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్


అదింకా పెద్ద తప్పు


జీవితంలో రెండు పెద్ద తప్పులు: 1. మన గురించి ఇతరులు ఏం అనుకుంటారోనని ఆందోళన చెందడం. 2. ముందసలు ఇతరులు మన గురించి ఆలోచిస్తారని నమ్మడం.
– సాహిల్ బ్లూమ్, కంటెంట్ క్రియేటర్

ఏం ఫర్లేదు!


శ్రీనగర్‌లో జీ20 సమావేశాలకు చైనా హాజరు కాకపోవడంలో ఆశ్చర్యం ఏమీలేదు. వాళ్లు అరుణాచల్ ప్రదేశ్‌లో కూడా హాజరుకాలేదు. దానితో పెద్ద తేడా పడలేదు. సానుకూల కోణంలో చూస్తే, చైనా హాజరుతో కశ్మీర్ అపవిత్రం అయ్యే సమస్య తప్పింది.
– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

అనవసర శ్రమ


మెట్రో నగరాలు, ముంబయి లాంటి వాణిజ్య నగరాల్లో తమ రోజువారీ లావాదేవీల్లో భాగంగా మధ్యశ్రేణి దుకాణదారుల దగ్గర కూడా వందలాది 2000 కరెన్సీ నోట్లు ఉండొచ్చు. అదంతా నల్లధనం కాదు. ఒక మార్పిడికి విధించిన ఇరవై వేల గరిష్ఠ పరిమితి వల్ల ఈ నోట్లను మార్చుకోవడానికి వాళ్లు బ్యాంకుల్లో గంటలకొద్దీ గడపాల్సి ఉంటుంది.
– దివ్య కుమార్ సోతీ, జర్నలిస్ట్

ఇంటి రుచి


నేను చాలా తరచుగా ప్రయాణిస్తుంటాను మాషా అల్లా! నా పరిమితుల మేరకు స్థానిక ఆహారం ఎప్పుడూ ప్రయత్నిస్తాను. కానీ గత రాత్రి సమర్‌ఖండ్ (ఉజ్బెకిస్తాన్)లోని పంజాబీ రెస్టారెంటులో దాల్ చావల్ (పప్పన్నం) తినడం ఇంత సంతోషం కలిగిస్తుందని ఎప్పుడూ అనుకోలేదు.
– రానా సఫ్వీ, రచయిత్రి

ఇన్‌బాక్స్

సీమ అస్తిత్వ పథికుడు

కేతు విశ్వనాథరెడ్డి కథా రచయితగా ప్రసిద్ధి చెందినప్పటికీ ఉత్తమ ఉపాధ్యాయుడిగా, నవలా రచయితగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా గొప్ప ప్రజ్ఞాపాటవాలు కలిగిన వ్యక్తి. మార్క్సిజాన్ని ఒక ప్రాపంచిక దృక్పథంగా ఏర్పరచుకున్నారు. ఆ వెలుగు లోనే రచనలు చేశారు. కేతు విశ్వనాథరెడ్డి కమలాపురం తాలూకా, రంగ సాయిపురంలో ఒక వ్యవసాయ కుటుంబంలో 1939లో జన్మించారు. రాయలసీమ రైతు అనుభవిస్తున్న దుర్భర జీవితం, కన్నీటి గాథలను తన రచనల్లో కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఆయన ప్రతి కథలోనూ రాయలసీమ స్థానికత ఉట్టిపడుతూ ఉంటుంది. 'కేతు విశ్వనాథరెడ్డి కథలు' పేరుతో 1991లో వచ్చిన సంకలనం తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు, భారతీయ భాషా పరిషత్ (కలకత్తా) అవార్డు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను పొందింది. వీరి కథలు కొన్ని హిందీ, ఇంగ్లిష్, కన్నడం, మలయాళం, బెంగాలీ, మరాఠీ, రష్యన్ భాషల్లోకి అనూదితమయ్యాయి.



కడప జిల్లాలోని 3,403 ఊర్ల పేర్లను అకారాది క్రమంలో చేర్చి 'కడప గ్రామనామాలు' పేరుతో సిద్ధాంత గ్రంథాన్ని 1976లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఈ పరిశోధన గ్రంథాన్ని తిరిగి 'కడప ఊర్లపేర్లు' పేరుతో పుస్తక రూపంలోకి తీసుకువచ్చారు. ఇది 'స్థల నామ విజ్ఞానశాస్త్రం' అనే కొత్త అంశానికి చెందిన పరిశోధనా గ్రంథం. వీటితో పాటు 'జప్తు', 'ఇచ్ఛాగ్ని', 'కేతు విశ్వనాథరెడ్డి కథలు' (1998–2008) వంటి కథా సంపుటాలు; 'దృష్టి', 'దీపధారులు', 'పాత్రికేయం', 'పరిచయం', 'సంగమం' వంటి వ్యాస సంపుటాలు రచించారు. కుటుంబరావు సాహిత్యం 13 సంపుటాలు, 'చదువు కథలు', 'రాయల సీమ రాగాలు' వంటి పుస్తకాలకు సంపాద కత్వం వహించారు.

ఆయన ప్రతిభకు తార్కాణంగా ఎన్నో అవార్డులు, సత్కారాలు పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాన్ని పొందారు. ఆయన ఈ లోకాన్ని వదిలివెళ్ళడం సాహితీ లోకానికి తీరనిలోటు.

– డా॥ చింతకుంట శివారెడ్డి,
సి.పి. బ్రౌన్ గ్రంథాలయం, కడప


న్యూ ఇండియాలోకి 'పరకాల ప్రవేశం'!


కామెంట్
కరణ్ థాపర్

యాదృచ్ఛికాలు అన్నవి వట్టి అర్థరహిత మైన సంఘటనలేనా లేక వాటి వెనుక గొప్ప అంతరార్థం ఏదైనా ఉండి ఉంటుందా అని నేను తరచూ ఆలోచిస్తుంటాను. ఒకటేదైనా మనం అర్థం చేసుకోలేనిది, లేదా కనీసం గ్రహించలేనిది దీర్ఘకాలానంతరం దానికై అదే బహిర్గతం అవుతుంది. గతవారం జరిగింది అటువంటిదే అయివుండే అవకాశం ఉంది. చూద్దాం, ఈ మాటను మీరు ఒప్పుకుంటారేమో!

ఇటీవల నేను పరకాల ప్రభాకర్‌ను ఆయన తాజా పుస్తకం 'ది క్రూకెడ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా: ఎస్సేస్ ఆన్ ఎ రిపబ్లిక్ ఇన్ క్రైసిస్'పై ఇంటర్వ్యూ చేశాను. ప్రధానమంత్రి మీద, భారతీయ జనతాపార్టీని ఆయన రూపాంతర పరచిన వైనం మీద చురుక్కుమనిపించే విమర్శ ఆ పుస్తకం. ప్రభాకర్ ఏమిటన్నది మీరు కనుగొన్నప్పుడు ఆ చురక మరింత స్పష్టంగా దృగ్గోచరం అవుతుంది. ఇంటర్వ్యూ చేసిన మరునాడే బీజేపీకి కర్ణాటకలో పరాభవం ఎదురైంది. దక్షిణాదిన ఆ పార్టీకి ఉన్న ఏకైక రాష్ట్రం హిందుత్వ ముఖం మీదే తలుపులు వేసేసింది. పోయిన ఆదివారం 'విముక్త' బెంగళూరులో ప్రభాకర్ పుస్తకానికి ఆవిష్కరణ జరిగింది.

ప్రభాకర్ అనే వ్యక్తి ఇదీ అని చెప్పాలన్నది నా ఉద్దేశం కాదు. ఒక వ్యక్తిగా ఆయన గురించి ఆయననే మాట్లాడనివ్వడం మంచిది. మన ఆర్థిక వ్యవస్థ గురించి ఆయన ఇలా అంటారు: "దేశ ఆర్థిక యాతనలు మోదీ పాలనలోని విస్మయకరమైన అసమర్థతల వల్ల తలెత్తినవి. ఆయన పాలన చక్కటి ఆలోచనాపరత్వాన్ని, పొందిక గుణం కలిగిన ఆర్థిక తత్వాన్ని జతపరచలేకపోయింది." "ఇష్టానుసారం అధికారాన్ని అపరిమితంగా ఉపయోగించడానికి అలవాటు పడింది. ప్రజాస్వామ్యాన్ని సమస్యాత్మకం చేసింది." ఫలితంగా, "1975–77 ఎమర్జెన్సీ తర్వాతెన్నడూ లేని భయం సమాజంలో నేడొక కఠినమైన ప్రత్యక్ష వాస్తవం అయింది" అని ప్రభాకర్ ఈ పుస్తకంలో రాశారు.



పరకాల ప్రభాకర్ – కొత్తపుస్తకం

ప్రభాకర్ నిక్కచ్చిగా, నిర్దయగా విషయాన్ని తేల్చేస్తారు. "మన ప్రజాస్వామ్యం సంక్షోభంలో ఉంది. మన సామాజిక నిర్మాణం బల హీనం అయింది. మన ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో ఉంది. మనం చీకటి యుగాలకు తిరో ముఖం పడుతున్నాం" అంటారు.

కర్ణాటక ఎన్నికల ఫలితాలలో హిందుత్వ – అలాగే హిందుత్వపై ప్రతిస్పందించడంలో విపక్షాల అసమర్థత, ప్రాసంగికతను కలిసి ఉన్నాయని ఆయన చెప్పారు. "దేశ రాజకీయ అగ్రగణ్యతల దిగువన దాగి ఉన్న మూల ప్రవృత్తులు; సామాజిక, సాంస్కృతిక అభద్రతలను తారుమారు చేయగల నైపుణ్యంపై హిందుత్వ అభివృద్ధి చెందుతుందని అన్నారు. మన గుణగణాలలోని చీకటి కోణాలకు ఇది ఒక విజ్ఞప్తి అని ప్రభాకర్ ఈ పుస్తకం గురించి నాతో అన్నారు. మొన్నటి ఎన్నికల ప్రచారం ముగింపు రోజుల్లో ప్రధాని జై బజరంగబలీ అంటూ ఓటింగ్ మీటను నొక్కమని కర్ణాటక ప్రజల్ని కోరడం వెనుక ఆయన నేర్పు, సర్వగర్భత ఉన్నాయని అనేకమంది విశ్వసిస్తున్నారు.

పనితీరులోని వైఫల్యం, అవినీతిలో గడించిన ఖ్యాతి కారణంగా కర్ణాటక ఎన్నికల్లో బీజేపీకి ఎదురైన ఘోర పరాజయం మీద ప్రభాకర్ తీర్మానాలు స్పష్టతను కలిగి ఉన్నాయి. "బీజేపీ ప్రస్తుత ఓటమి, తిరిగి అధికారాన్ని సాధించుకోలేక పోవడం అన్నవి పనితీరు వల్ల కాదు. హిందుత్వ గుర్తింపునకు ఆ పార్టీ దృఢ వైఖరిని కలిగి ఉండటం వల్ల, హిందూయేతరులను వేరుగా చూడటం వల్ల" అని ఆయన అన్నారు. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీజేపీ జై బజరంగ బలీ అన్నదే తప్ప, మంచి పాలనను ఇస్తానని అనలేదు.

మనమిప్పుడు ప్రతిపక్షాల గురించి ప్రభాకర్ రాసిన చోటుకు వద్దాం. "బీజేపీయేతర రాజకీయ వర్గ వైఫల్యమే నేడు మన దేశం సూత్రరహితమైన సాధనంగా మారడానికి ప్రధాన కారణం. బీజేపీనీ, ఆ పార్టీ పరివారాన్నీ సైద్ధాంతికంగా వ్యతిరేకించే రాజకీయ పార్టీలే అత్యంత ప్రభావవంతమైన ఈ సవాలును ఎదుర్కొని ఉండాల్సింది. కానీ వారు తమ దృష్టి, వ్యూహం, శక్తికి సంబంధించిన స్థిరమైన వైఫల్యాలతో మనల్ని ఓడిపోయేలా చేశారు" అన్నారాయన.

ఆ వైఫల్యాలను ప్రతిపక్షాలు ఎలా అధిగమిస్తున్నాయనే దానికి కర్ణాటకలో మొన్నటి కాంగ్రెస్ ఎన్నికల ప్రచారమే మొదటి నిదర్శనమని నేను భావిస్తున్నాను. దృష్టిపరంగా ఆ పార్టీ... ఓటర్ల నిజమైన సమస్యలకు సంక్షేమాన్ని హామీని, సానుభూతితో కూడిన ప్రతిస్పందనను అందించింది. వ్యూహాత్మకంగా... హిందూ వ్యతిరేకి అని ఆ పార్టీపై ప్రధాని చేసిన ఆరోపణలను తిప్పికొట్టకుండా దాట వేసింది. శక్తిపరంగా అక్షరాలా ఉత్తేజాన్ని నింపింది. దీనిని ప్రభాకర్ అంగీకరిస్తారని చెప్పగలను.

ప్రచారం చరమాంకానికి చేరుకోగానే కాంగ్రెస్ గంభీరంగా, దృఢ నిశ్చయంతో చెవిని నేలకు ఆన్చి (సమగ్ర విషయ సేకరణ జరిపి), ప్రజలపై దృష్టి సారించింది. బీజేపీ ఇందుకు విరుద్ధంగా ఉత్కంఠంగా, నిరాశాపూరితంగా, కొన్నిసార్లు ఉన్మాదంగా కనిపించింది. ఇందుకు కారణం హిందుత్వ వెనకంజ వేయడమేనా? ఉనికి కోసం పోరాడుతుండటమేనా? లేదంటే, ఓటర్లకు కావలసిందేమిటో కాంగ్రెస్‌కు తెలిసి ఉండటం వల్లనా?

ఇప్పుడు నేను పేర్కొన్న సంఘటనల క్రమం, వాటి ఆసక్తికరమైన కాలానుక్రమణిక కేవలం యాదృచ్ఛికం అని అనిపిస్తున్నాయా? లేదా విధివశాత్తూ జరిగినవిగా తోస్తున్నాయా? నిజాయతీగా ఒప్పుకుంటున్నాను. నేను చెప్పలేను. అయితే ప్రధానమంత్రి, ప్రతిపక్షాలు... ప్రభాకర్ రాసిన ఈ పుస్తకాన్ని చదవాలని నేను కోరుకుంటున్నాను. వాళ్లకు ఈ పుస్తకం ఒక హెచ్చరిక... అలాగే పాఠం కూడా!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

క్లుప్తంగా...

మహా కుంభాభిషేకం వాయిదాపై పిల్

సాక్షి, అమరావతి : శ్రీశైలం దేవస్థానంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన మహా కుంభాభిషేకాన్ని వాయిదా వేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. షెడ్యూల్ ప్రకారం మహా కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలన్నింటినీ జరిపేలా దేవస్థానం అధికారులను ఆదేశించాలని కోరుతూ అఖిల భారత వీరశైవ ధార్మిక ఆగమ పరిషత్ చైర్మన్ సంగాల సాగర్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంలో దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, దేవస్థానం ఈవోలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు మంగళవారం విచారణ జరపనుంది.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

- పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో శివనందన్ కుమార్ ఆదేశం



పోలవరం పనులను పరిశీలిస్తున్న పీపీఏ సీఈవో శివనందన్‌కుమార్

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు పనులు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో శివనందన్ కుమార్ ఆదేశించారు. వరదల సమయంలో ఈసీఆర్ఎఫ్ ప్రాంతంలో పడిన గోతులను ఇసుకతో పూడ్చే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సోమవారం ఆయన ఈ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద నీటిని బయటకు మళ్లించే డీవాటరింగ్ పనులను కూడా పరిశీలించారు. హెడ్ వర్క్స్ నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న పనులను పరిశీలించి, పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో ప్రాజెక్టు ప్రాంతంలో పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఆయన వెంట సీఈ బి.సుధాకర్‌బాబు, ఎస్ఈ కె.నరసింహ మూర్తి, ఈఈ కె.మల్లికార్జునరావు, మేఘ జీఎం ఎ.గంగాధరకుమార్, డీజీఎం కె.రాజేష్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కూలిన తెలుగు కథా సాహితీ శిఖరం

రచయిత కేతు విశ్వనాథరెడ్డి కన్నుమూత

- తెలుగు సాహిత్యంలో కురువృద్ధుడు
- రాయలసీమ కథకు ఆయనే చిరునామా
- భార్యకు చికిత్స చేయించేందుకు ఒంగోలు రాక
- కుమార్తె ఇంటివద్ద ఉండగా గుండెపోటు రావడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపు
- అక్కడ చికిత్స పొందుతూ మృతి
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం
- నివాళి అర్పించిన సాహితీవేత్తలు

అభ్యుదయ కథకు అసలైన చిరునామా సీమ సాహిత్య చరిత్రకు వీలునామా నిన్నటి.. నేటి కథకు బలమైన సేతువు తెలుగు కథా కేతనం.. కడప కథా శాసనం కరుణ లేని కాలం ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి కలానికి శాశ్వత విశ్రాంతినిచ్చింది. సుదీర్ఘ కాలం తెలుగునాట రెపరెపలాడిన కథా కేతనం ఒరిగిపోయింది. తెలుగు కథ కంటతడి పెట్టుకుంది. తన కిప్పుడు పెద్దదిక్కు ఎవరంటూ బావురుమంది.

సాక్షి,అమరావతి/ఒంగోలు టౌన్/కడప (కల్చరల్): సుప్రసిద్ధ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి (84) ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సోమవారం గుండెపోటుతో మరణించారు. కడపలో నివాసం ఉంటున్న ఆయన సతీమణి పద్మావతికి ఆరోగ్యం బాగుండకపోవడంతో చికిత్స నిమిత్తం రెండు రోజుల క్రితం ఒంగోలులోని టీకే అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్న పెద్ద కూతురు మాధవీలత వద్దకు వచ్చారు. ఆదివారం భార్య పద్మావతిని సంఘమిత్ర ఆస్పత్రిలో చేర్చారు. రాత్రి 8 గంటలకు భోజనం చేసిన ఆయన అల్లుడు రమేష్‌రెడ్డి, కుమార్తె మాధవితో మాట్లాడి నిద్రపోయారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు అల్లుడు రమేష్ రెడ్డిని నిద్రలేపి తనకు గుండెల్లో నొప్పిగా ఉందని, ఊపిరాడటం లేదని చెప్పారు. వెంటనే ఆయన్ను సంఘమిత్ర ఆస్పత్రికి తీసుకెళ్లి ఎమర్జెన్సీ వార్డులో చేర్చారు. చికిత్స పొందుతూ ఆయన కొద్దిసేపటికే తుదిశ్వాస విడిచారు. విశ్వనాథ రెడ్డికి భార్య పద్మావతి, ముగ్గురు సంతానం ఉన్నారు. మాధవీలత పెద్ద కూతురు కాగా.. కుమారుడు శశాంక్, కూతురు శిరీష అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడ్డారు. ఆయన మృతదేహాన్ని మంగళవారం ఒంగోలు నుంచి కడప తరలిస్తారు. అక్కడి నుంచి స్వగ్రామమైన వైఎస్సార్ జిల్లా రంగసాయిపురంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఆయన కుమార్తె మాధవీలత తెలిపారు.

కేతు.. కథా సేతు

కేతు విశ్వనాథరెడ్డి వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం రంగసాయిపురంలో 1939 జూలై 10న జన్మించారు. ఎర్రగుంట్ల, కడప తదితర ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేశారు.



పుస్తక పఠనంలో కేతు విశ్వనాథరెడ్డి (ఫైల్)

కడప, శ్రీకాళహస్తి, కందుకూరు ప్రభుత్వ కళాశాలలు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, సార్వత్రిక విశ్వవిద్యాలయంలలో సేవలందించారు. పత్రికా రచయితగా, పాత్రికేయ పాఠశాల అధ్యాపకుడిగా పత్రికా రంగానికి సేవలందించారు. అధ్యాపకునిగా తెలుగు పాఠ్య ప్రణాళికను, పాఠ్యాంశాల రూపకల్పన చేశారు. ఉత్తమ కథా నవలా రచయితగా, మన భూమి, ఈ భూమి పత్రికల సంపాదకులుగానే కాకుండా వివిధ రంగాలలో రాణించారు. రైతు కుటుంబంలో జన్మించిన ఆయన నాటి కుల వ్యవస్థను, ఆర్థిక అసమానతలను సమీపం నుంచి చూశారు. స్నేహితులు, సహచరుల ప్రభావంతో మార్క్సిస్టు దృక్పథాన్ని అలవర్చుకున్నారు. దృష్టి కోణం మారడంతో ఈ పరిస్థితుల మూలాన్ని వెతకడం ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని కరువు, దాని ఫలితంగా ఏర్పడిన ఫ్యాక్షన్, ఆర్థిక అసమానతలు ఆయనను స్పందింపజేశాయి. రాయలసీమ స్థితిగతులు, జీవన విధానం, భౌతిక స్థితి, పారిశ్రామికీకరణ, రాజకీయాలు, అస్తిత్వ పోరాటాలు ఆయనను కలం పట్టేలా చేశాయి.

తెలుగు కథకు మట్టి పరిమళాలు అద్ది..

'అనాది వాళ్లు' పేరిట తొలి కథ రాసిన విశ్వనాథరెడ్డి కథా రచనలో తనదైన ముద్ర వేశారు. తెలుగు కథకు మట్టి పరిమళాలు అద్దారు. కేతు విశ్వనాథరెడ్డి కథలు, జప్తు, ఇచ్ఛాగ్ని కథా సంకలనాలు ప్రచురించారు. ఇందులో ఆయన కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. కొడవటిగంటి కుటుంబరావు కథలను సంపుటంగా తన సంపాదకత్వంలో ప్రచురించారు. దృష్టి, దీపధారులు, పరిచయం, సంగమం, పాత్రికేయం, మన కొడవటిగంటితోపాటు తెలుగు, ఆంగ్లంలో వ్యాస సంకలనాలు, వేర్లు, బోది తదితర నవలలు రాశారు. ఆయన రచనలు హిందీ, మలయాళం, కన్నడ తదితర ప్రాంతీయ భాషలతోపాటు ఇంగ్లిష్, రష్యన్ భాషల్లో కూడా అనువాదం అయ్యాయి. ఆయన కృషికి గుర్తింపుగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, భారతీయ భాషా పరిషత్తు అవార్డులు, తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు, రావిశాస్త్రి అవార్డుతోపాటు ఆయన ఇంకా పలు ప్రతిష్టాత్మక అవార్డులు, వేలాది సత్కారాలు పొందారు.

వైఎస్ అంటే అభిమానం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని ఎంతో ఇష్టపడే విశ్వనాథరెడ్డి గత ఏడాది వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకుని ఎంతో సంతోషపడ్డారు. తన జీవితంలో ఈ పురస్కారాన్ని మరువలేనని అప్పట్లో పేర్కొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ తదితరులు విశ్వనాథరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సీఎం వైఎస్ జగన్ సంతాపం

ప్రముఖ కథా రచయిత కేతు విశ్వనాథరెడ్డి హఠాన్మరణం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆధునిక తెలుగు సాహితీ రంగానికి విశ్వనాథరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. సామాజిక సంస్కరణల ఆవశ్యకతను చెబుతూ విశ్వనాథరెడ్డి రాసిన కథలు పలువురికి స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఆయన సేవలను గుర్తించి 2021లో వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుతో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ని సత్కరించిన విషయాన్ని సీఎం జగన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. విశ్వనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. కేతు విశ్వనాథరెడ్డి మృతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు సాహితీ రంగానికి విశ్వనాథరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని తెలియచేశారు.ప్రముఖ రచయిత, సాహితీవేత్త కేతు విశ్వనాథరెడ్డి మరణంతో ఒక సాహితీశిఖరం కూలిపోయినట్లయిందని, ఆయన మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు.

బాల్యం నుంచే కలం పట్టి..

బాల్యం నుంచే కేతు విశ్వనాథరెడ్డి మంచి చదువరి. విద్యార్థిగా ఉన్నప్పుడే సహచరులు ఆయనకు ప్రపంచ సాహిత్యాన్ని పరిశీలించే అలవాటు చేశారు. ఆ ప్రేరణతో కలం పట్టిన ఆయనకు కొడవటిగంటి కుటుంబరావు అంటే ఎంతో ఇష్టం. నల్లపాటి రామప్పనాయుడు, వకీర్ రెహ్మాన్, ఆచంట జానకిరాం, శారదాదేవి, గొల్లపూడి మారుతిరావు తదితరుల ప్రోత్సాహం లభించింది. చిత్తూరు జిల్లా రచయితలు మధురాంతకం రాజారాం, సభా తదితరుల పరిచయాలు ఆయన సాహిత్య ఒరవడికి మరింత ప్రోత్సాహం కల్పించాయి. అప్పటి నుంచి ఆయన వ్యాసాలు, కథలు రాశారు. రాచమల్లు రామచంద్రారెడ్డి ఆయనలోని ప్రతిభను గమనించి తన సవ్యసాచి పత్రిక ద్వారా ప్రోత్సహించారు. విమర్శతో ఆయన సాహిత్యానికి మెరుగులు దిద్దారు.బాల్యమిత్రుడు సొదుం జయరాంతో కలిసి కథా రచనపై చర్చలు చేసేవారు. 'కడప జిల్లా గ్రామ నామాలు' అనే అంశంపై పరిశోధనలు చేసిన ఆయన ఆ పేర్ల వెనుకగల ఎన్నో ఆసక్తికరమైన కథనాలను సమాజానికి తెలిపారు. తన రచనల్లో సగటు మనిషి ఆవేదన, ఆర్తి, సామాజిక చింతన కలగలిపి ఉండడం ఆయన ప్రత్యేకత.

సరెండర్ లీవులు విడుదల చేయడంపై ఏపీ ఎన్జీవోల సంఘం హర్షం

సాక్షి, అమరావతి: తాము కోరిన మీదట పోలీసులు, ఇతర ఉద్యోగులకు రావాల్సిన సరెండర్ లీవులను ప్రభుత్వం విడుదల చేయడం పట్ల ఏపీ ఎన్జీవోల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లుల గురించి తాము గత నెల 28, ఈ నెల 20వ తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలు ఇచ్చామని, ఆ సమయంలోనే సరెండర్ లీవుల గురించి అడిగామని తెలిపారు. అంతేకాకుండా పలు సందర్భాల్లో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్, ఆదిమూలపు సురేష్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులను కలిసి పెండింగ్ బిల్లులు, సరెండర్ లీవులు, ఇతర అంశాలను క్లియర్ చేయాలని కోరామన్నారు. తాము కోరిన మీదట పోలీసుకు సంబంధించిన రూ.554 కోట్ల సరెండర్ లీవుల నగదు విడుదల చేశారని, మిగిలిన ఉద్యోగులకు కూడా విడుదలవుతున్నాయని తెలిపారు. ఉద్యోగుల సమస్య పరిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు తాత్కాలిక సీజే



జస్టిస్ శేషసాయి, జస్టిస్ సుజాతకు అమ్మవారి చిత్రపటాలు అందజేత



జస్టిస్ జయసూర్య దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఏపీ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి సోమవారం దర్శించుకున్నారు. వీరితో పాటు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత అమ్మవారి దర్శనానికి ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన వీరికి దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలు అందజేశారు. కాగా, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య దంపతులు కూడా దుర్గమ్మను దర్శించుకున్నారు.

28న శ్రీభోగ శ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్ర కలశాభిషేకం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలోని శ్రీభోగ శ్రీనివాసమూర్తికి ఈ నెల 28వ తేదీన ప్రత్యేకంగా సహస్ర కలశాభిషేకం జరుగనుంది. ఉదయం 6 గంటల నుంచి 8.30 గంటల నడుమ శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి చెంత భోగ శ్రీనివాసమూర్తికి అర్చక స్వాములు ఏకాంతంగా సహస్రకలశాభిషేకం నిర్వహిస్తారు. ఈ ఉత్సవం రోజున శ్రీవారి ఆలయంలోని ఆర్జిత సేవలన్నీ యథావిధిగా కొనసాగుతాయి.

చంద్రబాబులో ప్రేతకళ. అందుకే చావు మాటలు

- అభివృద్ధిపై ఫ్లెక్సీ పెడితే నా పెద్ద దినం అంటావా?
- పేదలకు ఇచ్చే ఇంటి స్థలం సమాధుల కోసమా?
- రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



సాక్షి, అమరావతి: చంద్రబాబులో ప్రేత కళ స్పష్టంగా కన్పిస్తోందని, అందుకే వృద్ధాప్యంలో ఇంటిపట్టున ఉండకుండా రోడ్లపైబడి తిరుగుతూ చావు మాటలు మాట్లాడుతున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. తమ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై ఫ్లెక్సీ పెడితే.. తన పెద్ద దినం అంటూ మాట్లాడారని, పేదలకు ఇచ్చే ఇంటి స్థలాన్ని సమాధుల కోసమని అంటున్నారని, చంద్రబాబుకు మతిభ్రమించే ఇలా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మంత్రి సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి అరెస్టు అంటూ అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. నిజానికి చంద్రబాబు అవినీతి బాగోతాలు బట్టబయలయ్యాయని, స్కిల్ డెవలప్‌మెంట్, కేబుల్ నెట్‌వర్క్, అమరావతి స్కాంలో రూ.లక్షల కోట్లు దోచుకున్నారని, బాబు జైలుకు వెళ్లడం ఖాయమని, ఆ భయంతోనే పిచ్చికుక్కలా తిరుగుతున్నారని చెప్పారు. ప్రజలు త్వరలోనే ఆయన పిచ్చి కుదురుస్తారని చెప్పారు. తణుకులో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన సెంటు భూమి విలువ రూ.14 లక్షలని, అందులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టుకుంటున్నారని తెలిపారు. వాటిని చూసి జీర్ణించుకోలేకే బాబు.. బీసీ మంత్రినైన తనపై అవమానకర వ్యాఖ్యలు చేశారని అన్నారు. బీసీలను బాబు ఓట్లు వేసే యంత్రాల్లా వాడుకున్నారు తప్ప వారికి ఏనాడూ మేలు చేయలేదని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ బీసీలకు న్యాయం చేస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ నాలుగేళ్లలో నలుగురు బీసీలకు రాజ్యసభ పదవులు ఇచ్చారని, చంద్రబాబు ఒక్క బీసీకి రాజ్యసభ సీటివ్వలేదన్నారు. ఒక్క నిరుపేద కుటుంబానికీ కనీసం సెంటు భూమి ఇవ్వలేదన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇస్తే లక్ష్మీపార్వతి అందుకొంటారన్న అక్కసుతో అప్పటి పీఎంకు ఆ అవార్డు ఇవ్వొద్దని చెప్పిన నీచుడు చంద్రబాబని చెప్పారు. అనాడు ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించి, ఇప్పుడు దండలేయడానికి సిగ్గులేదా అని చంద్రబాబును నిలదీశారు. తమ ప్రాంతంలో ఒక కౌలు రైతు చనిపోతే తనే వెళ్లి, ప్రభుత్వం తరఫున రూ.7 లక్షల ఆర్థిక సాయం చేసి ఆదుకున్నామని, ఆ రైతు భార్యకు వితంతు పింఛన్ ఇస్తున్నామని చెప్పారు. ఆ రైతు కుమారుడికి గుండె ఆపరేషన్ కూడా చేయించామన్నారు. అయినా ఆ కుటుంబాన్ని ఆదుకోలేదంటూ బాబు పచ్చి అబద్ధాలు చెప్పారని ధ్వజమెత్తారు.

లైంగిక దాడి నిందితులకు 20 ఏళ్ల జైలు

- వేర్వేరు కేసుల్లో ఓ వృద్ధుడు, మరో మైనర్‌కు శిక్ష

విజయనగరం/విశాఖ లీగల్: వేర్వేరు ప్రాంతాల్లో బాలికలపై లైంగికదాడికి పాల్పడిన ఓ వృద్ధుడు, మైనర్‌లకు 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తులు సోమవారం తీర్పులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం కొండతామరాపల్లి గ్రామానికి చెందిన సారిపల్లి చిన్నారావు (65) 2019 అక్టోబర్ 10న ఎనిమిదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గంట్యాడ పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.నాలుగు వేల జరిమానా విధిస్తూ విజయనగరం జిల్లా ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి, నాల్గవ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా తీర్పు వెలువరించారు. కేసులో బాధితురాలికి రూ.2 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. జిల్లా న్యాయసేవా సంస్థ తగు విధంగా చర్యలు తీసుకోవాలని తీర్పులో సూచించారు.

విశాఖలో మైనర్‌కు..

కార్పెంటర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న అనకాపల్లి జిల్లా చోడవరం మండలం, వెన్నవోలు గ్రామానికి చెందిన నిందితుడు (17) ఎదురింట్లో ఉంటున్న ఏడేళ్ల బాలికపై కన్నేశాడు. ఆమె తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లిన అనంతరం.. బయట ఆడుకుంటున్న బాలికను తీసుకెళ్లి 2022, మే 8, 9 తేదీల్లో లైంగికదాడి చేశాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లికి బాలిక విషయం చెప్పడంతో అనకాపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఆనంది నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఆర్డర్ అందిన 30 రోజుల్లో బాధితురాలికి రూ.1,00,000 నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

అమ్మ ప్రవర్తన నచ్చక ఇళ్లు తగలెట్టింది

- తిరుపతి జిల్లా కొత్తశానంబట్లలో మంటలు రాజేసింది ఓ యువతి
- నెల రోజులుగా గ్రామ ప్రజలకు, అధికారులకు కంటిమీద కునుకు కరువు
- 12 చోట్ల మంటలు పెట్టి ఇళ్లు కాల్చిన వైనం
- మిస్టరీని ఛేదించిన పోలీసులు
- యువతి అరెస్ట్.. రూ.32,500 నగదు సీజ్



మీడియాతో మాట్లాడుతున్న ఏఎస్పీ వెంకటరావు, చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్, సీఐ ఓబులేసు

తిరుపతి రూరల్: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కొత్తశానంబట్ల గ్రామంలో రాజుకున్న మంటల మిస్టరీ వీడింది. ఎప్పుడు ఎక్కడ మంటలు అంటుకుంటాయోనన్న భయంతో నెల రోజులపాటు కంటిమీద కునుకు లేకుండా గ్రామస్తులు.. అధికారులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపిన ఈ మంటల వెనుక మిస్టరీని ఎట్టకేలకు పోలీసులు సోమవారం ఛేదించారు. నెల రోజులపాటు 9 ఇళ్లు, 3 గడ్డివాములకు అగ్గి ముట్టించి మంటలు రాజేసింది 19 ఏళ్ల యువతి అని తేల్చారు. ఆమెను అదుపులోకి తీసుకుని.. రూ.32,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

తల్లి ప్రవర్తన నచ్చకపోవడం వల్లే..

ఇంటర్ ఫెయిలై ఇంట్లో ఉన్న 19 ఏళ్ల యువతి తన తల్లి ప్రవర్తనను జీర్ణించుకోలేకపోయింది. గ్రామానికి చెందిన కొందరు తరచూ తన ఇంటికి రావడం.. తన తల్లి గంటలకొద్దీ వారితో సాన్నిహిత్యంగా మెలగడాన్ని ఆ యువతి తట్టుకోలేకపోయింది 'అమ్మా.. మారవే..' అంటూ వేడుకున్నా మార్పు కనిపించలేదు. ఈ నేపథ్యంలో తల్లి ప్రవర్తనలో మార్పు రావాలంటే.. తల్లి, తండ్రితో కలిసి ఆ ఊరి నుంచి వెళ్లిపోవాలని నిశ్చయించుకుంది. ఊరు వదిలి వచ్చేందుకు తల్లిదండ్రులు అంగీకరించే అవకాశం లేకపోవడంతో గ్రామంలో సంభవించిన ఓ అగ్ని ప్రమాదం ఆమెలో కొత్త ఆలోచన రగిల్చింది. ఆ అగ్ని ప్రమాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇంట్లోనూ.. తన తల్లి ప్రవర్తనకు కారణమైన వారి ఇళ్లల్లోనూ మంటలను రాజేసింది.

తల్లి చీరకు నిప్పంటించి..


ఆ యువతి తొలుత తన ఇంట్లోనే నిప్పంటించింది. ప్రమాద తీవ్రత మరింత ఎక్కువగా చూపేందుకు నిద్రపోతున్న అమ్మ చీరకు కూడా నిప్పు పెట్టింది. ఇంట్లోని బీరువా, పరుపుపై కూడా మంటలను అంటించింది. ఇలా ఒకటి, రెండు కాదు ఏకంగా 12 చోట్ల మంటలకు కారణమైంది. 9 ఇళ్లు, 3 గడ్డిమేట్లకు నిప్పు పెట్టి మంటలు రాజేసింది. ఇలా సుమారు నెల రోజులపాటు గ్రామంతోపాటు చుట్టుపక్కల పల్లె వాసులకు, అధికారులకు సైతం కంటిమీద కునుకులేకుండా చేసింది. ఇలా ఎందుకు జరుగుతోందో అర్థం కాక గ్రామంలో కొందరు క్షుద్రపూజలు చేశారు, గ్రామానికి అరిష్టం పట్టిందని, గంగమ్మ జాతర చేయకపోవడం వల్లే ఇదంతా అంటూ పుకార్లు బయటకువచ్చాయి. దీంతో గ్రామస్తులు వణికిపోయారు. కొందరు ఊరు వదిలి బయట ప్రాంతాలకు తాత్కాలికంగా వలసపోయారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, పలువురు అధికారులు, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు, ఎస్వీ యూనివర్సిటీ కెమిస్ట్రీ, ఫిజిక్స్, పర్యావరణ విభాగం ప్రొఫెసర్లు గ్రామాన్ని సందర్శించారు. భయపడొద్దంటూ అవగాహన కల్పించారు. అసలు కారణాన్ని గుర్తించేందుకు గ్రామంలో 16 చోట్ల సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. చివరకు ఓ యువతి ఇదంతా చేస్తున్నట్టు గుర్తించి అవాక్కయ్యారు. ఆ యువతి చెప్పిన కారణం విన్న తర్వాత మరింత ఆశ్చర్యపోయారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను తిరుపతి ఏఎస్పీ (అడ్మిన్) వెంకటరావు, డీఎస్పీ యశ్వంత్, చంద్రగిరి సీఐ ఓబులేసు మీడియాకు వెల్లడించారు.


పట్టుబడిందిలా..

ముందుగా క్షుద్రపూజలు చేసేవారిని.. ఆ తర్వాత జులాయిగా తిరిగే వారిని.. బాధిత కుటుంబాల్లోని యువతను అనుమానించిన పోలీసులు వారిని తమదైన శైలిలో విచారించడంతోపాటు వారి వ్యవహార శైలిపై గట్టి నిఘా పెట్టారు. ఊరంతా సీసీ కెమెరాలు బిగించారు. పట్టుబడిన యువతి అన్నను సైతం విచారించారు. అయినా నాలుగు రోజుల క్రితం కూడా మంటలు చెలరేగడంతో బాధిత కుటుంబాల్లోని మహిళలపై మహిళా పోలీసుల ద్వారా నిఘా పెట్టారు. ఇంటికో మహిళా పోలీసును ఉంచారు. జరిగిన ఘటనల అన్నిచోట్ల ఇందుకు కారణమైన యువతి ఆనవాళ్లు లభించడం.. నాలుగైదు చోట్ల ఒకే తరహా అగ్గిపుల్లల్ని వాడటం.. అవి ఆ యువతి ఇంట్లో ఉన్న అగ్గిపెట్టెతో సరిపోలడంతో ఆమెపై ప్రత్యేక నిఘా ఉంచారు. తన ఇంట్లో కాలిపోయినట్టు చెప్పిన రూ.32,500 నగదు ఆ యువతి వద్ద పట్టుబడటంతో అవి ఎలా వచ్చాయనే కోణంలో తమదైన శైలితో విచారించారు. దీంతో అమ్మ ప్రవర్తనలో మార్పు కోసమే గ్రామంలో మంటల్ని రాజేశానని యువతి అంగీకరించడంతో ఆమెను అరెస్ట్ చేశారు.

కారును ఢీకొన్న టిప్పర్... ముగ్గురి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- ముమ్మిడివరంలో ఘోర రోడ్డు ప్రమాదం





నాగవెంకటస్వామి(ఫైల్), గంజా కృష్ణ(ఫైల్), రమేష్‌కుమార్(ఫైల్)

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. అమలాపురం మండలం పేరూరు పంచాయతీ శివారు నారాయణపేటకు చెందిన గంజా కృష్ణ (34), దొంగ నాగ వెంకటస్వామి (31), అదే మండలం రంగాపురానికి చెందిన యనమదల రమేష్‌కుమార్ (32), కొంకాపల్లికి చెందిన అల్లు అనిల్ ఆదివారం సాయంత్రం కారులో యానాం వెళ్లారు. అక్కడ ఒక పార్టీలో పాల్గొని తిరిగి అర్ధరాత్రి వస్తుండగా... ముమ్మిడివరం నగర పంచాయతీ శివారులోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో 216వ నంబరు జాతీయ రహదారిపై వారి కారును ఎదురుగా వస్తున్న టిప్పరు ఢీకొట్టింది. అతి వేగంగా వస్తున్న టిప్పర్... వీరి కారును సుమారు 10 మీటర్ల మేర ఈడ్చుకుపోయింది. దీంతో కారు నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న గంజా కృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడుపుతున్న దొంగ నాగ వెంకటస్వామితోపాటు యనమదల రమేష్‌కుమార్, అల్లు అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంకటస్వామిని అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. యనమదల రమేష్‌కుమార్ అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. అల్లు అనిల్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుల్లో నాగ వెంకటస్వామి, గంజా కృష్ణ బావాబావమరుదులు కాగా, రమేష్‌కుమార్ వారికి సమీప బంధువు. వీరి ముగ్గురికి అనిల్ స్నేహితుడు. వెంకటస్వామి ఆర్క్ వెల్డర్‌గా, గంజా కృష్ణ తాపీ మేస్త్రీగా, రమేష్‌కుమార్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ముమ్మిడివరం సీఐ ఎస్.కొండయ్య, ఎస్ఐ కె.సురేష్‌బాబు, కాట్రేనికోన ఎస్ఐ పి.శ్రీనివాస్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆప్కో క్లియరెన్స్ సేల్

- ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని చేనేత సొసైటీల్లో ఉన్న వస్త్రాల నిల్వలను కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. అందుకోసం ప్రస్తుతం ఆప్కో వద్ద ఉన్న వస్త్రాలకు క్లియరెన్స్ సేల్ నిర్వహిస్తున్నట్టు ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తెలిపారు. ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఆప్కో షోరూమ్‌లలో మొత్తం రూ.50 కోట్ల విలువైన వస్త్రాలు ఉన్నాయని చెప్పారు. వాటిలో రూ.10 కోట్ల విలువైన వస్త్రాలకు 30, 50, 66 శాతం రిబేటుపై క్లియరెన్స్ సేల్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం 66 శాతంగా ఉన్న రిబేటును వచ్చే నెల నుంచి 75 శాతానికి పెంచుతామన్నారు. వీటిని వేగంగా విక్రయించడం ద్వారా సొసైటీల నుంచి రూ.10 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

కార్మికులకు మెరుగైన సేవలు అందించండి

- మంత్రి జయరాం



సాక్షి, అమరావతి: కార్మిక శాఖలోని అన్ని విభాగాలు సమర్థంగా పనిచేసి కార్మికులకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో కార్మికశాఖ పరిధిలోని అన్ని విభాగాల అధికారులతో సోమవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. కార్మిక శాఖ కార్యదర్శి హరి జవహర్‌లాల్, కమిషనర్ శేషగిరి రావు, ఉన్నతాధికారులు ఆంజనేయులు, చంద్రశేఖర్‌వర్మ, ఉమామహేశ్వరరావు, రాణి పాల్గొన్నారు.

ప్రధాన దేవతలకు పరమాద్భుత యాగం

- చాగంటి కోటేశ్వరరావు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఇటీవల అష్టోత్తర శతకుండాత్మక చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీమహాలక్ష్మీ యజ్ఞం నిర్వహించడాన్ని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు కొనియాడారు. ఈ మేరకు ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. 'ఇటువంటి కార్యక్రమాలు జరగడం వల్ల ప్రజల్లో భక్తివిశ్వాసాలు, ధర్మం పట్ల నిష్ఠ పెరుగుతాయి. పైగా విశేషించి వేళపట్టున వర్షాలు పడి, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందితే అంతకన్నా సంతోషించదానికి కారణం ఏముంటుంది' అని వ్యాఖ్యానించారు. 'ప్రధాన దేవతలందరికీ పరమాద్భుతమైన యాగం జరిగిందన్నారు.

పేదల ద్రోహులు బాబు అండ్ కోను అరెస్టు చేయాలి

967వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: సీఆర్డీఏ చట్టాన్ని ఉల్లంఘించి పేదలకు రాజధాని ప్రాంతంలో 5 శాతం భూమిలో ఇస్తున్న ఇళ్ల స్థలాల పంపిణీకి అడ్డుపడుతున్న బాబు అండ్ కోను అరెస్టు చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 967వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. తన హయాంలో పేదలకు జానెడు జాగా ఇవ్వని చంద్రబాబు నేడు ఆ పార్టీ నాయకులతో పత్రికా సమావేశాలు నిర్వహించి తాము అధికారంలోకి వస్తే 3 సెంట్ల స్థలం ఇస్తామనడం అమ్మకు బువ్వ పెట్టని వాడు పిన్నమ్మకు బంగారు గాజులు కొనిపెడతానన్న చందంగా ఉందన్నారు. బాబు చేస్తున్న తప్పులను సమర్థిస్తూ ఆయనకు వత్తాసు పలుకుతున్న పలు పార్టీల్లో ఉన్న కులవాదులు బహుజనులకు అండగా నిలవకుండా బాబు చేస్తున్న తప్పుడు పనులకు అండగా నిలవడం సిగ్గుచేటని విమర్శించారు. రాజధానిలో పేదలకు శాటిలైట్ సిటీ నిర్మాణం జరిగి బ్రహ్మాండమైన వసతులతో అందుబాటులోకి రానుందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుచూపుతో చేస్తున్న పనుల కారణంగా నేడు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్, బొలిమేర శ్యామ్యూల్, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాట్సాప్‌లో ఎడిట్ ఫీచర్ ప్రారంభం

న్యూఢిల్లీ: మెసేజింగ్ యాప్ వాట్సాప్‌లో కొత్తగా ఎడిట్ ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. పొరపాటున, తప్పుగా పంపిన సందేశాల్లో మార్పులు చేసుకోవచ్చు. అక్షర దోషాలు ఉంటే సరి చేసుకోవచ్చు. ఈ మేరకు ఎడిట్ బటన్ ఫీచర్‌ను ప్రారంభించినట్లు వాట్సాప్ యాజమాన్యం ప్రకటించింది. రాంగ్ మెసేజ్‌లు ఎడిట్ చేసుకోవడానికి తొలి 15 నిమిషాల సమయం మాత్రమే ఉంటుంది. సందేశం తప్పుగా వెళ్లినట్లు భావిస్తే దాన్ని మొత్తం తొలగించాల్సిన అవసరం లేదు. మార్పులు చేస్తే సరిపోతుంది. దీనివల్ల యూజర్లకు చాటింగ్‌పై మరింత కంట్రోల్ లభిస్తుందని యాజమాన్యం తెలియజేసింది.

మెసేజ్‌లు ఎలా ఎడిట్ చేయాలి?

1. వాట్సాప్ యాప్‌లో ఏదో చాట్‌లోకి వెళ్లాలి.
2. పొరపాటున పంపిన మెసేజ్‌పై వేలితో కాసేపు నొక్కి ఉంచాలి(లాంగ్ ప్రెస్).
3. ఇప్పుడు ఎడిట్ మెసేజ్ ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై నొక్కి, సందేశాన్ని ఎడిట్ చేయొచ్చు. మెసేజ్ పంపిన తర్వాత కేవలం 15 నిమిషాల లోపే ఈ వెసులుబాటు ఉంది. గడువు దాటితే ఆ మెసేజ్‌ను పూర్తిగా డిలీట్ చేయడం మినహా మరో మార్గం లేదు.

ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌కు

వైద్య పరీక్షలు




న్యూఢిల్లీ: మనీల్యాండరింగ్ కేసులో తిహార్ జైలులో ఉన్న ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ సోమవారం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వెన్నెముక సమస్యతో బాధపడుతున్న జైన్‌కు శనివారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ హాస్పిటల్‌లో పరీక్షలు చేయించామని, మరోసారి వైద్యుల అభిప్రాయం తీసుకోవాలన్న ఆయన కోరిక మేరకు సోమవారం సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తీసుకెళ్లామని జైలు అధికారులు తెలిపారు. ఆయన వెంట పోలీసులున్నారని చెప్పారు. న్యూరోసర్జరీ విభాగం వైద్యులు పరీక్షించాక ఆయన్ను తిరిగి జైలుకు తీసుకొచ్చారన్నారు. జైన్‌ను 2022 మే 31వ తేదీన ఈడీ అరెస్టు చేసింది. జైన్ త్వరగా కోలుకోవాలని ఆప్ నేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆకాంక్షించారు. 'జైన్‌ను బీజేపీ చంపాలనుకుంటోంది. ఇంతటి క్రూరత్వం పనికిరాదు, మోదీజీ' అంటూ ట్వీట్ చేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో జైన్ 35 కిలోలు తగ్గారని ఆయన లాయర్ అభిషేక్ సింఘ్వీ సుప్రీంకోర్టుకు తెలిపారు.

కెమెరా కంటికి చిక్కిన సూపర్‌నోవా

అస్ట్రో ఫొటోగ్రాఫర్ ఆండ్రూ మెక్‌కార్తీ ఘనత

సువిశాలమైన అంతరిక్షం.. ఎన్నెన్నో విశేషాలకు ఆలవాలం. అంతరిక్షంలోని కోటాను కోట్ల నక్షత్రాల్లో కొన్ని అంతరించిపోతుంటాయి. తారల జీవితకాలం ముగియగానే వాటిలోని ఇంధనం మండిపోయి, అదృశ్యమైపోతుంటాయి. చివరి దశకు వచ్చినప్పుడు ఒక నక్షత్రం ఎలా ఉంటుంది? అంతమయ్యే ముందు ఏం జరుగుతుంది? నక్షత్రాలు మృత తారలుగా మారడానికి ముందు పరిణామాలేంటి? ఇవన్నీ ప్రత్యక్షంగా చూడాలని ఆసక్తి ఉన్నప్పటికీ మన కంటికి కనిపించవు. నక్షత్రాలు మన భూమికి కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉండడమే ఇందుకు కారణం. తారల కేంద్ర భాగం(కోర్)లో అణు విచ్ఛిత్తి జరిగి పేలిపోతుంటాయి. నక్షత్రాలు పేలిపోయి, అంతం కావడాన్ని సూపర్‌నోవా అంటారు. ఇలాంటి ఒక సూపర్‌నోవాను ప్రముఖ అస్ట్రో ఫొటోగ్రాఫర్ ఆండ్రూ మెక్‌కార్తీ తన కెమెరాలో చక్కగా బంధించారు. పిన్‌వీల్ లేదా ఎం10 అనే పాలపుంత(గెలాక్సీ)ని ఆయన తన టెలిస్కోప్‌తో నిశితంగా పరిశీలించారు. ఆ పాలపుంతలో కాలం తీరిన ఒక నక్షత్రం పేలిపోయి, అంతమైపోవడాన్ని టెలిస్కోప్ ద్వారా కొన్ని ఫ్రేమ్‌లను తన కెమెరాలో బంధించి, దృశ్యబద్ధం చేశారు. దీన్ని ఒక యానిమేషన్‌గా మార్చారు. మృత నక్షత్రాన్ని చిత్రీకరించడానికి ఆ గెలాక్సీకి సంబంధించిన కలర్ డేటాను ఉపయోగించానని ఆండ్రూ మెక్‌కార్తీ చెప్పారు. నక్షత్రానికి చెందిన 10 నిమిషాల ఎక్స్‌పోజర్‌తో యానిమేషన్ రూపొందించినట్లు తెలిపారు. ఎరుపు, తెలుపు వర్ణాలతో ఈ చిత్రం ఆకట్టుకుంటోంది. మరో విశేషం ఏమిటంటే.. సూర్యుడు తన జీవితకాలమంతా వెలువరించే శక్తి కంటే ఎక్కువ శక్తి కేవలం కొన్ని సెకండ్ల వ్యవధిలో సంభవించే సూపర్‌నోవాలో వెలువడుతుందట! కాంతి, వేడి, రేడియేషన్ రూపంలో ఈ శక్తి ఉద్గారమవుతుంది. సూపర్‌నోవా గాఢమైన ప్రభావం దాని పరిసర ప్రాంతాల్లో ఉంటుంది. పిన్‌వీల్(ఎం10) పాలపుంత(మిల్కీవే) ప్రస్తుతం మనం ఉంటున్న పాలపుంత కంటే 70 శాతం పెద్దది. దాని వ్యాసం 1,70,000 కాంతి సంవత్సరాలు. మన భూమి నుంచి 21 మిలియన్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది.



\- సాక్షి, నేషనల్ డెస్క్

భారత్ విశ్వసనీయ భాగస్వామి

పసిఫిక్ ద్వీప దేశాల ప్రాధాన్యతలను గౌరవిస్తున్నాం

వాటిని భారత్ ఏనాడూ చిన్నదేశాలుగా చూడలేదు

మా శక్తియుక్తులను, అనుభవాలను పంచుకునేందుకు సదా సిద్ధం

ఎఫ్ఐపీఐసీ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ హామీ

పోర్ట్ మోరిస్‌బీ: ఆపదలో ఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. మనం ఎంతో నమ్మకం పెట్టుకున్నవారు క్లిష్ట సమయంలో ఆదుకోకపోవడం నిజంగా దారుణమని అన్నారు. తద్వారా ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా వ్యవహార శైలిని తప్పుపట్టారు. పపువా న్యూ గినియా రాజధాని పోర్ట్ మోరిస్‌బైలో సోమవారం ఫోరమ్ ఫర్ ఇండియా–పసిఫిక్ ఐలాండ్స్ కో–ఆపరేషన్(ఎఫ్ఐపీఐసీ) శిఖరాగ్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. 14 పసిఫిక్ ద్వీప దేశాల అధినేతలు ఈ సదస్సులో పాల్గొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ పసిఫిక్ ద్వీప దేశాలకు భారత్ అండగా నిలుస్తోందని మోదీ గుర్తుచేశారు. భారత్‌ను విశ్వసనీయ అభివృద్ధి భాగస్వామిగా పరిగణించవచ్చని ఆయా దేశాలకు సూచించారు. తమ శక్తి సామర్థ్యాలను, అనుభవాలను పసిఫిక్ ద్వీప దేశాలతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, ప్రతి మార్గంలోనూ తోడుగా ఉంటామని మోదీ వివరించారు. తమ దృష్టిలో ఈ దేశాలు చిన్న దేశాలు ఎంతమాత్రం కావని, భారీ సముద్ర దేశాలుగా వాటిని పరిగణిస్తున్నామని మోదీ చెప్పారు.

మూడు దేశాల అధినేతలతో భేటీ

మోదీ సోమవారం న్యూజిలాండ్ ప్రధాని క్రిస్ హిప్‌కిన్స్, రిపబ్లిక్ ఆఫ్ పాలౌ అధ్యక్షుడు సురాంగెల్ ఎస్.విప్స్ జూనియర్, పపువా న్యూగినియా ప్రధాని జేమ్స్ మరాపేతో వేర్వేరుగా సమావేశమయ్యారు. వ్యాపారం, వాణిజ్యం, విద్య, క్రీడలు, సాంకేతికత, అంతరిక్షం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించారు. హిప్‌కిన్స్‌తో భేటీ అద్భుతంగా జరిగిందని మోదీ ట్వీట్ చేశారు. పాలౌ ప్రజలు వాడే ఎబాకిల్ పరికరాన్ని మోదీకి సురాంగెల్ బహూకరించారు.

ఆస్ట్రేలియాతో సుదృఢ బంధం

న్యూఢిల్లీ: "నేనంత త్వరగా తృప్తిపడే రకం కాదు. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ కూడా అంతే. ఇద్దరమూ కలిసి ఆస్ట్రేలియా, భారత బంధాలను మరింత దృఢతరం చేసి తీరతాం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. సిడ్నీలో 'ద ఆస్ట్రేలియన్' వార్తా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై తన మనోగతాన్ని పంచుకున్నారు. వాతావరణ మార్పులు మొదలుకుని ఉగ్రవాదం, సముద్ర తీర భద్రత, పైరసీ దాకా ఇండో–పసిఫిక్ ప్రాంతం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటోందంటూ ఆందోళన వెలిబుచ్చారు.



మోదీకి పపువా న్యూ గినియా అత్యున్నత పురస్కార ప్రదానం



సిడ్నీలో ప్రధానికి ఘన స్వాగతం పలుకుతున్న స్థానిక భారతీయులు

విందులో భారతీయ రుచులు

ఎఫ్ఐపీఐసీ శిఖరాగ్రం సందర్భంగా పసిఫిక్ ద్వీప దేశాల అధినేతలకు సోమవారం మధ్యాహ్నం మోదీ ఇచ్చిన విందులో భారతీయ వంటకాలు, ముఖ్యంగా తృణధాన్యాల వెరైటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అతిథులు తృణధాన్యాల విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఖాండ్వీ, వెజిటెబుల్ సూప్, మల్లై కోఫ్తా, రాజస్తానీ రాగి గట్టా కర్రీ, దాల్ పంచ్‌మేల్, మిలెట్ బిర్యానీ, నాన్ పుల్కా, మసాలా చాస్, పాన్ కుల్ఫీ, మాల్పువా, మసాలా టీ, గ్రీన్ టీ, మింట్ టీ, పీఎస్‌జీ కాఫీ తదితరాలను రుచిచూసి బాగున్నాయంటూ మెచ్చుకున్నారు.

మోదీకి రెండు అత్యున్నత పౌర పురస్కారాలు

ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అత్యున్నత గౌరవం లభించింది. పసిఫిక్ సముద్ర ద్వీప దేశాలైన పపువా న్యూ గినియా, ఫిజి తమ అత్యున్నత పురస్కారాలను ఆయనకు ప్రదానం చేశాయి. ఆయా దేశాలు మరో దేశ ప్రధానిని ఇలాంటి పురస్కారాలతో గౌరవించడం అరుదైన సంఘటన కావడం విశేషం. సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పపువా న్యూ గినియా గవర్నర్ జనరల్ సర్ బాబ్ దాడాయి ప్రధాని మోదీకి 'గ్రాండ్ కంపానియన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ లొగోహు(జీసీఎల్)' పురస్కారాన్ని ప్రదానం చేశారు. భారత్‌లో భారతరత్న తరహాలో పపువా న్యూగినియాలో ఇదే అత్యున్నత పౌర పురస్కారం. పసిఫిక్ ద్వీప దేశాల ఐక్యతకు చేసిన కృషికి గాను మోదీకి ఈ పురస్కారం అందించినట్లు పపువా న్యూ గినియా ప్రభుత్వం వెల్లడించింది. జీసీఎల్ పురస్కారం పొందిన వారిని 'చీఫ్' అనే టైటిల్‌తో సంబోధిస్తారు. గతంలో అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్‌కు ఈ అవార్డు లభించింది.

ఫిజి ప్రధానమంత్రి సితివేని రాబుకా భారత ప్రధాని మోదీకి తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'కంపానియన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ఫిజీ'ని ప్రదానం చేశారు. మోదీ గ్లోబల్ లీడర్‌షిప్‌నకు గుర్తింపుగా ఫిజి ప్రభుత్వం ఈ పురస్కారం అందజేసినట్లు ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) తెలియజేసింది. ఇది భారత్‌కు లభించిన అరుదైన గౌరవమని వివరించింది. ఈ గౌరవాన్ని మోదీ భారతదేశ ప్రజలకు, ఫిజి–ఇండియన్ సమాజానికి అంకితం చేశారని పేర్కొంది.

దేశ ప్రజలు సాధించిన విజయాలకు గుర్తింపు

'గ్రాండ్ కంపానియన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ లొగోహు', 'కంపానియన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ఫిజీ' గౌరవాలు తనకు దక్కడం పట్ల ప్రధాని మోదీ ఆనందం వ్యక్తం చేశారు. పపువా న్యూగినియా, ఫిజి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పురస్కారాలు భారత్‌కు, భారతదేశ ప్రజలు సాధించిన విజయాలకు ఒక గొప్ప గుర్తింపు అంటూ ట్వీట్ చేశారు. సౌదీ అరేబియా, అఫ్గానిస్తాన్, పాలస్తీనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, రష్యా, మాల్దీవ్స్, బహ్రెయిన్ తదితర దేశాలు గతంలో తమ అత్యున్నత పౌర పురస్కారాలతో ప్రధాని మోదీని సత్కరించాయి.

బాలిక 32 వారాల గర్భ విచ్ఛిత్తికి కేరళ హైకోర్టు అనుమతి

కొచ్చిన్: సొంత సోదరుడి అఘాయిత్యానికి బలై గర్భం దాల్చిన బాలికకు కేరళ హైకోర్టు ఉపశమనం కలిగించింది. ఆమె 32 వారాల గర్భ విచ్ఛిత్తికి అనుమతి మంజూరు చేసింది. 'బాధిత బాలిక(15) శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నట్లు వైద్య నివేదికను బట్టి తెలుస్తోంది. గర్భం కొనసాగింపు వల్ల ఆమె సామాజిక, మానసిక ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదముంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని గర్భ విచ్ఛిత్తికి అనుమతివ్వాలని నిర్ణయిస్తున్నాం' అని జస్టిస్ జియాద్ రహ్మాన్ ఈ నెల 19న వెలువరించిన తీర్పులో పేర్కొన్నారు. తక్షణమే ఇందుకు సంబంధించిన చర్యలను అమలు చేసి, వారంలోగా పూర్తి వివరాలతో తమ ముందుకు రావాలని మలప్పురం జిల్లా వైద్యాధికారి, మంజేరి మెడికల్ కాలేజ్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌లను ఆదేశించారు.

చిన్ననాటి గురువు ఇంటికి వెళ్లిన ఉపరాష్ట్రపతి

కన్నూర్(కేరళ): ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సోమవారం కేరళలో కన్నూర్ జిల్లాలోని పన్నియన్నూర్ గ్రామానికి వెళ్లారు. చిత్తోడ్‌గఢ్ సైనిక్ స్కూల్‌లో తన గురువైన రత్న నాయర్‌ను కలుసుకున్నారు. అత్యున్నత స్థాయిలో తమ ఇంటికి వచ్చిన శిష్యుడిని చూసిన ఆమె పొంగిపోయారు. ఇంతకు మించిన గురుదక్షిణ ఇంకేముంటుందంటూ ఆనందించారు. వారిద్దరూ నాటి ఘటనలను గుర్తుతెచ్చుకుంటూ గడిపారు.



జూన్ 11న

ఆప్ మహా ర్యాలీ

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో పరిపాలనా సర్వీసులపై కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను నిరసిస్తూ జూన్ 11న మహార్యాలీ నిర్వహించనున్నట్లు ఆప్ సోమవారం ప్రకటించింది. అందులో ఢిల్లీ ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఢిల్లీలో అధికారుల బదిలీలు, వారిపై ఆరోపణలు వస్తే చర్యల కోసం కొత్తగా 'నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీస్ అథారిటీ'ని ఏర్పాటు చేస్తూ కేంద్రం ఈ నెల 19న ఆర్డినెన్స్ తేవడం తెలిసిందే. దీనిపై ఆప్ పోరాటానికి కాంగ్రెస్ కూడా మద్దతు ప్రకటించింది.

విపక్షాలకు ఇదొక అగ్ని పరీక్ష: సంజయ్

కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను బీజేపీయేతర పార్టీలన్నీ వ్యతిరేకించాలని ఆప్ రాజ్యసభ సభ్యుడు, జాతీయ అధికార ప్రతినిధి సంజయ్ సింగ్ విజ్ఞప్తి చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు కొనసాగుతున్నాయని విమర్శించారు. కేంద్ర ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ రాజ్యసభలో తాము ప్రవేశపెట్టే బిల్లుకు మద్దతు ఇవ్వాలని విపక్షాలను సంజయ్ సింగ్ కోరారు. ప్రతిపక్షాలకు ఇదొక అగ్ని పరీక్ష అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే విపక్షాలన్నీ ఒక్కతాటిపైకి రావాలని విన్నవించారు.

త్వరలో విపక్షాల కీలక భేటీ!

నేడో, రేపో ముహూర్తం ఖరారు • ఖర్గే, రాహుల్, నితీశ్ భేటీలో నిర్ణయం

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని సమైక్యంగా ఎదుర్కొనేందుకు విపక్షాలు చేస్తున్న ప్రయత్నాల్లో కీలక ముందడుగుకు రంగం సిద్ధమవుతోంది. విపక్షాల ఉమ్మడి భేటీకి ముహూర్తాన్ని, వేదికను ఒకట్రెండు రోజుల్లో నిర్ణయించనున్నారు. సోమవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత రాహుల్‌గాంధీలతో బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్‌కుమార్ జరిపిన భేటీలో ఈ అంశం చర్చకు వచ్చింది. విపక్షాల భేటీ పట్నాలోనే ఉండొచ్చని నెల క్రితం ఖర్గేతో భేటీ అనంతరం నితీశ్ పేర్కొనడం తెలిసిందే. కీలకమైన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోరు ముగిసిన నేపథ్యంలో ఐక్యతా యత్నాలను మరింత ముమ్మరం చేయాలని తాజా సమావేశంలో నేతలు నిర్ణయించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ఉమ్మడి వ్యూహరచన విపక్షాల భేటీలో ఏయే అంశాలను చర్చించాలనే దానిపై దాదాపు గంటకు పైగా చర్చించారు. ఖర్గే, రాహుల్, నితీశ్ సమావేశమవడం గత నెలన్నరలో ఇది రెండోసారి కావడం విశేషం. జేడీ(యూ) అధినేత లాలన్‌సింగ్‌తో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఇందులో పాల్గొన్నారు. బిహార్ ఉప ముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ అనారోగ్యంతో రాలేకపోయారని సమాచారం. ఇప్పుడిక దేశమంతా ఒక్కటవుతుందంటూ భేటీ అనంతరం ఖర్గే ట్వీట్ చేశారు. "ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే మా సందేశం. దేశానికి నూతన దిశానిర్దేశం చేసే ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్లాలని నితీశ్‌తో భేటీలో సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చాం" అని పేర్కొన్నారు. అతి త్వరలో విపక్షాలన్నీ భేటీ కావాలని నిర్ణయించినట్టు వేణుగోపాల్, లాలన్‌సింగ్ మీడియాకు తెలిపారు. విపక్షాల అధినేతలంతా అందులో పాల్గొంటారని చెప్పారు.

కొన్నాళ్లుగా వరుస భేటీలు

నితీశ్ కొద్ది రోజులుగా విపక్ష నేతలందరినీ వరుసబెట్టి కలుస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం కూడా ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తో నితీశ్ మరోసారి సమావేశమై పలు అంశాలపై లోతుగా చర్చించారు. ఢిల్లీ ప్రభుత్వాధికారులపై ఆజమాయిషీ విషయమై కేంద్రంతో జరుగుతున్న పోరాటంలో ఆప్ సర్కారుకు తమ సంపూర్ణ మద్దతుంటుందని హామీ ఇచ్చారు. శనివారం కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమంలో కూడా జాతీయ స్థాయిలో విపక్ష నేతలంతా వేదికపైకి వచ్చి సమైక్యతా సందేశమివ్వడం తెలిసిందే. నితీశ్‌తో పాటు ఎన్సీపీ అధినేత శరద్ పవార్, తమిళనాడు సీఎం స్టాలిన్, సీపీఎం, సీపీఐ ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, డి.రాజా తదితరులు వీరిలో ఉన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్‌లను కూడా విపక్ష కూటమిలోకి తీసుకొచ్చేందుకు నితీశ్ ప్రయత్నిస్తున్నారు.



కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, అగ్ర నేత రాహుల్‌తో బిహార్ సీఎం నితీశ్ చర్చలు

ఇవే కీలకం!

ప్రధాని మోదీకి దీటుగా విపక్షాలన్నీ ఉమ్మడి అభ్యర్థిని తమ సారథిగా నిలబెట్టాలని భావిస్తున్నాయి. అయితే పోటీదారులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దీనిపై ఏకాభిప్రాయం ఎలా కుదురుతుందన్నది ఆసక్తికరంగా మారింది. అంతేగాక లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి తమకు వీలైనన్ని ఎక్కువ స్థానాలు కేటాయించాలని ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌ను డిమాండ్ చేస్తున్నాయి. అవి కోరినట్టుగా తాను 200 సీట్లలోనే పోటీకి పరిమితమయ్యేందుకు కాంగ్రెస్ సిద్ధంగా లేదు. బలమైన విపక్ష కూటమి ఏర్పాటై లోక్‌సభ ఎన్నికల బరిలో బీజేపీని దీటుగా ఎదుర్కోవాలంటే దీనిపైనా వీలైనంత త్వరగా స్పష్టత రావాల్సి ఉంది.

బీబీసీపై రూ.10 వేల కోట్ల పరువు నష్టం కేసు

న్యూఢిల్లీ: 'ఇండియా: ది మోదీ క్వశ్చన్' పేరుతో డాక్యుమెంట్ రూపొందించిన బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(బీబీసీ)పై ఓ ప్రభుత్వేతర సంస్థ ఢిల్లీ హైకోర్టులో రూ.10 వేల కోట్ల పరువు నష్టం దావా వేసింది. ఈ డాక్యుమెంట్‌లో ప్రధాని మోదీ, భారత న్యాయవ్యవస్థపై తప్పుడు ఆరోపణలతో బీబీసీ భారత ప్రభుత్వం, గుజరాత్ ప్రభుత్వాల ప్రతిష్టను దెబ్బతీసిందని ఆరోపించింది. గుజరాత్‌కు చెందిన జస్టిస్ ఆన్ ట్రయల్ అనే సంస్థ వేసిన పిటిషన్‌పై సోమవారం ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టింది. బీబీసీ(యూకే)తోపాటు బీబీసీ(ఇండియా)కు సమన్లు ఇచ్చింది. సెప్టెంబర్ 25న తదుపరి విచారణ చేపడతామని తెలిపింది. పిటిషన్‌దారు తరఫున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. నష్ట పరిహారంతోపాటు తమ సంస్థకు ఇతర ఆదాయ మార్గాలు లేనందున కోర్టు ఫీజులు తదితరాల కోసం రూ.10 వేల కోట్లు చెల్లించాలని కోరారు.

75 ఏళ్ల తర్వాత కలుసుకున్న అక్క, తమ్ముడు

లాహోర్: 75 ఏళ్ల క్రితం దేశ విభజన సమయంలో విడిపోయిన తోబుట్టువులు మళ్లీ కలుసుకున్నారు. చిన్నతనంలో వేరుపడిన అక్క, తమ్ముడిని సామాజిక మాధ్యమాలు వృద్ధాప్యంలో కలిపాయి. ఇటీవల వీరిద్దరూ కర్తార్‌పూర్ కారిడార్ వద్ద కలుసుకుని ఉద్విగ్నభరితులయ్యారు. పంజాబ్‌కు చెందిన సర్దార్ భజన్ సింగ్ కుటుంబం 1947లో దేశ విభజన సమయంలో చెల్లాచెదురైంది. కొడుకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు చేరగా కూతురు మహేంద్ర కౌర్ భజన్ సింగ్ వెంట ఉన్నారు. ఇటీవల రెండు కుటుంబాల వారు సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం పంచుకున్నారు. పంజాబ్‌లో ఉండే మహేంద్ర కౌర్ (81), పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉండే షేక్ అబ్దుల్ అజీజ్ (78) స్వయానా అక్క, తమ్ముడని తెలుసుకున్నారు. తమ కుటుంబాలతో కలిసి కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా గురుద్వారా దర్బార్ సాహిబ్‌లో కలుసుకున్నారు. ఆలింగనాలు, ఆనంద బాష్పాలతో ఇద్దరూ ఉబ్బితబ్బిబ్బయ్యారని డాన్ పత్రిక పేర్కొంది.



చంపుతామంటూ బెదిరిస్తున్నారు

రక్షణ కల్పించాలని ముంబై పోలీసులకు సమీర్ వాంఖడే విజ్ఞప్తి

ముంబై: తనను చంపుతానంటూ బెదిరింపులు వస్తున్నాయని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) ముంబై మాజీ చీఫ్ సమీర్ వాంఖడే ముంబై పోలీసులను ఆశ్రయించారు. తనను, తన భార్యను సామాజిక మాధ్యమాల్లో దుర్భాషలాడుతూ చంపుతామంటూ గత నాలుగు రోజులుగా బెదిరింపులు వస్తున్నాయని వాంఖడే పేర్కొన్నారు. వాంఖడే తన ప్రతినిధి ద్వారా ఈ మేరకు ఒక లేఖను దక్షిణ ముంబై పోలీస్ కమిషనరేట్‌కు పంపినట్లు ఒక అధికారి తెలిపారు. 'క్రూయిజ్ డ్రగ్స్' కేసులో బాలీవుడ్ నటుడు షారూక్ ఖాన్ కొడుకు ఆర్యన్ ఖాన్‌ను ఇరికించకుండా ఉండేందుకు రూ.25 కోట్లు లంచం డిమాండ్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై సమీర్ వాంఖడేను శని, ఆదివారాల్లో సీబీఐ ప్రశ్నించింది.

కశ్మీర్లో జీ-20 సన్నాహకం షురూ

త్వరలో నూతన పర్యాటక విధానం: కిషన్‌రెడ్డి



దాల్ సరస్సులో జీ-20 ప్రతినిధుల విహారం

శ్రీనగర్: పాకిస్తాన్ పెడబొబ్బలను, చైనా అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ జమ్మూ కశ్మీర్‌లో జీ–20 సన్నాహక సదస్సు అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య సోమవారం మొదలైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో చైనా మినహా అన్ని సభ్య దేశాల ప్రతినిధులూ పాల్గొన్నారు. పర్యాటక రంగం తదితరాలపై వారంతా లోతుగా చర్చించనున్నారు. వారికి సంప్రదాయ రీతిలో ఘనస్వాగతం లభించింది. తొలి రోజు 'ఆర్థిక వృద్ధి, సాంస్కృతిక పరిరక్షణకు సినీ టూరిజం' అంశంపై చర్చ జరిగింది. అనంతరం ప్రతినిధులంతా చారిత్రక దాల్ సరస్సులో బోట్ షికారు చేస్తూ కశ్మీర్ అందాలను ఆస్వాదించారు. కేంద్రం త్వరలోనే నూతన జాతీయ పర్యాటక విధానాన్ని ప్రకటిస్తుందని కేంద్ర సాంస్కృతి పర్యాటక శాఖల మంత్రి జి.కిషన్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. గ్లోబల్ టూరిజం ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను కూడా నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఆధ్యాత్మిక పర్యాటకానికి కశ్మీర్‌లో అద్భుతమైన అవకాశాలున్నాయని మీడియాతో చెప్పారు. పర్యాటకాభివృద్ధికి వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్రం అనుమతిస్తున్నట్లు వివరించారు. ప్రైవేట్ భాగస్వామ్యం లేకుండా ప్రపంచ స్థాయికి చేరుకోలేమన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు.



దక్షిణ కొరియా రాయబారితో నాటు నాటు పాటకు స్టెప్పులేస్తున్న సినీ నటుడు రాంచరణ్

హర్తాళ్ పిలుపులు గత చరిత్ర

కశ్మీర్ ప్రజల్లో చాలా మార్పు వచ్చిందని, మునుపటి లాగా బంద్ పిలుపులకు స్పందించడం లేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. "గతంలో కశ్మీర్‌లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే పాక్ నుంచి వచ్చిన పిలుపుతో దుకాణాలు మూతబడేవి. ఇప్పుడు మాత్రం హర్తాళ్ చేపట్టాలంటూ ఎవరు పిలిపిచ్చినా పట్టించుకోవడం లేదు. ఉగ్రవాదం కారణంగా ఇప్పటికే రెండు తరాలు నష్టపోయిన విషయం ప్రజలు తెలుసుకున్నారు. అభివృద్ధి బాటన ముందుకు సాగాలనుకుంటున్నారు" అని అన్నారు. పర్యాటక రంగం ద్వారా ఉపాధికి కశ్మీర్లో ఎన్నో అవకాశాలున్నాయన్నారు.

ఎవరెస్ట్ పైకి 27 సార్లు..!

కమి రిటా షెర్పా రికార్డు సమం చేసిన పసంగ్ దవా షెర్పా



కఠ్మాండు: ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని పసంగ్ దవా షెర్పా(46) పర్వతారోహకుడు 27సార్లు అధిరోహించారు. 8,848.86 మీటర్ల ఎత్తైన ఈ హిమాలయ శిఖరాన్ని సోమవారం ఉదయం 8.25 గంటలకు ఆయన చేరుకున్నట్లు పర్వతారోహణ యాత్ర నిర్వహిస్తున్న 'ఇమాజిన్ నేపాల్ ట్రెక్స్' తెలిపింది. తద్వారా కమి రిటా షెర్పా రికార్డును ఆయన సమం చేశారు. ఎవరెస్ట్ రీజియన్‌లో జన్మించిన పసంగ్ తొలిసారి 1998లో ఎవరెస్ట్‌ను అధిరోహించారు. మరోవైపు 53 ఏళ్ల కమి రిటా షెర్పా ఈ సీజన్‌లోనే ఎవరెస్ట్‌ను 28వ సారి ఎక్కి పసంగ్‌ను అధిగమించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం.



సోమవారం తొలిసారి అసెంబ్లీలోకి అడుగు పెడుతున్న సందర్భంగా కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ ప్రణామం

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
మంగళవారం ❘ 23 ❘ మే ❘ 2023

తిరువారూర్‌లో అరుదైన గుడ్లగూబ గుర్తింపు



కొరుక్కుపేట: తిరువారూర్ జిల్లాలోఅరుదైన జాతికి చెందిన గుడ్లగూబను ఓ రైతు రక్షించాడు. వివరాలు.. తిరుత్తురైపూండి ఆటూరు–రఘునాథపురం ప్రాంతాన్ని రైతు లక్ష్మణన్. ఆదివారం ఇతడి ఇంటి వెనుక ఓ పక్షి ఆకస్మాత్తుగా పడిపోయింది. దీనిని స్థానికులు అరుదైన గుడ్లగూబగా గుర్తించారు. ఈ విషయాన్ని లక్ష్మణన్ మన్నార్గుడి అటవీ అధికారులు తెలియజేశారు. మన్నార్గుడి ఫారెస్ట్ అధికారి గోమతి ఫారెస్ట్ కన్జర్వేటర్ ధనలక్ష్మి, వనవర్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని గుడ్లగూబకు చికిత్స చేశారు. ఈ రకమైన గుడ్లగూబ ఇండోనేషియా, పసిఫిక్ సముద్రంలోని కొన్ని దీవుల్లో మాత్రమే కనిపిస్తుందని తెలిపారు. ఆ తర్వాత ఉదయమార్తండపురంలో గుడ్లగూబను అధికారులు విడిచిపెట్టారు.

న్యూస్‌రీల్

చెన్నై వేదికగా ఎలక్ట్రిక్ వాహనాల ఫెయిర్



మీడియాతో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి, చెన్నై : అంతర్జాతీయ స్థాయిలో చెన్నై వేదికగా ఎలక్ట్రిక్ వాహనాల ట్రేడ్ ఫెయిర్ ఏర్పాటు చేయాలని ఝార్ఖండ్ ప్రభుత్వం, ఫ్యూచర్స్ ట్రేడ్ ఫెయిర్ అండ్ ఈవెంట్స్ నిర్ణయించాయి. చెన్నై నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో ఈనెల 26 నుంచి మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన జరగనుంది. సోమవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఫ్యూచర్స్ ట్రేడ్ డైరెక్టర్ నమిత్ గుప్తా మాట్లాడుతూ, 2022లో 10 లక్షల యూనిట్లకు పైగా ఎలక్ట్రిక్ వాహనాలు దేశంలో విక్రయాలు జరిగినట్లు వివరించారు. దేశంలో ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమ పురోగతి, సామర్థ్యాన్ని చాటే విధంగా ఈ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. సమావేశంలో నిర్వాహకులు స్వామి ప్రేమ్ అవినాశ్, ఎం. ఇల్లాహి, సతీష్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ముఖేష్ పాల్గొన్నారు.

వండలూరు జూకు మైసూరు ఎలుగుబంట్లు

కొరుక్కుపేట: జంతుమార్పిడి కార్యక్రమంలో భాగంగా మైసూర్ నుంచి రెండు ఎలుగుబంట్లను వండలూరు జూపార్కుకు సోమవారం తీసుకొచ్చారు. రెండేళ్ల వయసున్న మగ ఎలుగుబంటి పేరు అప్పు అని, ఏడాదిన్నర వయసున్న ఆడ ఎలుగుబంటి పేరు పుష్ప అని అధికారులు తెలిపారు. వీటిని అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఇక పర్యాటకులకు అరుదైన ఎలుగుబంట్లను చూసి కొత్త అనుభూతిని పొందుతున్నారు.

మలేషియా మురుగన్‌కు చెన్నై సారె

కొరుక్కుపేట: ఇతర రాష్ట్రాలు, దేశాల్లోని దేవాలయాలతో సామరస్యపూర్వక సంబంధాలను మెరుగుపరిచేందుకు తమిళనాడు దేవదాయ శాఖ కొత్త సంస్కృతికి నాందిపలికింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సూచనతో ఆయా రాష్ట్రాలు, దేశాలల్లోని దేవాలయాలకు ఇకపై నూతన వస్త్రాలతో కూడిన సారె అందించాలని నిర్ణయించింది. ఈక్రమంలో మలేషియాలోని మురుగన్, వినాయక ఆలయాలకు వస్త్ర, మాలలు అందించినట్లు హిందూ ధార్మిక దర్మాదాయ శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే ఇప్పటి వరకు తమిళనాడులోని మదురైలోని వినాయగర్ ఆలయం, మీనాక్షి సుందరేశ్వరాలయం, అలఘర్ ఆలయం, పళని, దండాయుదపాణి స్వామి ఆలయం, చెన్నైలోని మైలాపూర్ కాపాలీశ్వదేవాలయం, తిరుత్తణి, శ్రీవిల్లిపుత్తూరు ఆలయాలకు రాష్ట్ర హిందూ ధర్మదాయ శాఖమంత్రి పీకే శేఖర్ బాబు సూచనల మేరకు గౌరవ వస్త్రాలు అందించామన్నారు. అదేక్రమంలో మలేషియాలో మురుగన్, వినాయక ఆలయం, కర్ణాటక, ఆంధ్రా తదితర రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాలకు సైతం సారె అందించనున్నట్లు పేర్కొన్నారు.

కాన్వాయ్ కోసం ట్రాఫిక్ ఆపొద్దు – పోలీసులకు సీఎం రంగన్న ఆదేశం



పుదుచ్చేరి సీఎం రంగస్వామి

సాక్షి, చెన్నై: తన కాన్వాయ్ కోసం ట్రాఫిక్‌ను ఆపొద్దని, తాను సైతం ప్రజలతో కలిసే వెళ్తానని పుదుచ్చేరి సీఎం రంగస్వామి పోలీసులను సోమవారం ఆదేశించారు. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సీఎం రంగస్వామి ప్రజలతో మమేకమైతిరిగే నాయకుడు. ఆయన తరచూ మోటారు సైకిల్‌పై సైతం చక్కర్లు కొడుతుంటారు. అయితే గత కొద్ది రోజులుగా ఆయనకు పోలీసులు భద్రతను పెంచారు. ఆయన కాన్వాయ్ వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌ను ఆపేస్తున్నారు. రోజూ గోరిమేడులోని ఇంటి నుంచి సచివాలయం వెళ్లే సమయంలో అనేక ప్రాంతాల కూడలిలో వాహనాలు నిలుపుదల చేస్తూ వస్తున్నారు. తన కారణంగా స్థానికులకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఇబ్బందులు ఎదురు అవుతుండడాన్ని సీఎం పరిగణించారు. దీంతో తన కాన్వాయ్ వెళ్లే మార్గాల్లో ఇకపై ట్రాఫిక్ ఆపాల్సిన అవసరం లేదని పోలీసులను ఆదేశించారు. ప్రజల వాహనాలతో పాటే తన వాహనం కూడా ముందుకెళ్తుందని, ఎక్కడ ఎలాంటి ట్రాఫిక్ ఆపాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇక ప్రజల వాహనాలను కూడా ఆపొద్దని పోలీసులకు ఆయన సూచించడం విశేషం.

1.5 కిలోల బంగారం స్వాధీనం

తిరువొత్తియూరు: మదురై ఎయిర్‌పోర్ట్‌లో దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుడి నుంచి 1.5 కిలోల స్మగ్లింగ్ బంగారాన్ని సెంట్రల్ కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. మదురై విమానాశ్రయం నుంచి దుబాయ్ నుంచి మదురైకి వచ్చే స్పైస్ జెట్ విమానంలో బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు కేంద్ర కస్టమ్స్ శాఖకు సమాచారం అందింది. దీంతో ఆదివారం రాత్రి దుబాయ్ నుంచి మదురై ఎయిర్ పోర్టుకు వచ్చిన ప్రయాణికులను తనిఖీ చేశారు. రామనాథపురం జిల్లా కీల్‌కరై ప్రాంతానికి చెందిన నసీమ్ వీర పాండియన్ అనే ప్రయాణికుడి వద్ద 1.5 కేజీల బంగారం ఉండడడంతో సీజ్ చేసి, నిందితుడిని అరెస్టు చేశారు.

కదం తొక్కిన 'పళణి' సేన

డీఎంకే ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలకు సంబంధించిన వివరాలను గవర్నర్ ఆర్ఎన్ రవికి అన్నాడీఎంకే వర్గాలు అందజేశాయి. అలాగే రాష్ట్రంలో రాష్ట్రంలో నెలకొన్న దుర్భర పరిస్థితులను గవర్నర్‌కు దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు సోమవారం రాజ్ భవన్ వైపుగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఫలితంగా గిండి, సైదాపేట పరిసరాల్లో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపించింది. ఈ ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో పళణి స్వామితో పాటు ముఖ్య నేతలు రాజ్‌భవన్‌లోకి వెళ్లి గవర్నర్ ఆర్ఎన్ రవికి వినతిపత్రం సమర్పించారు.

- రాజ్‌భవన్ వైపు భారీ ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులు
- సైదాపేట, గిండి పరిసరాల్లో స్తంభించిన ట్రాఫిక్
- గవర్నర్‌తో అన్నాడీఎంకే బృందం భేటీ
- డీఎంకే ప్రభుత్వ అక్రమాలపై ఆధారాలతో ఫిర్యాదు
- పరిశీలిస్తామన్న గవర్నర్ ఆర్ఎన్ రవి

సాక్షి, చెన్నై : రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించడం, కల్తీసారా, కల్తీ మద్యం మరణాలు, నిజాయితీ గల అధికారులపై దాడులు తదితర అంశాలను గవర్నర్ ఆర్ఎన్‌రవి దృష్టికి అన్నాడీఎంకే నాయకులు తీసుకెళ్లారు. ఈ మేరకు ఆ పార్టీ నేతృత్వంలో సైదాపేట నుంచి రాజ్‌భవన్ వైపుగా సోమవారం ఉదయం భారీ ర్యాలీ నిర్వహించారు. సైదాపేటలో ఏర్పాటు చేసిన వేదికపై నుంచి డీఎంకే పాలకుల అవినీతి అక్రమాలను ఎండగట్టే విధంగా పళణి స్వామి నేతృత్వంలోని పార్టీ నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా రాజ్‌భవన్ వైపు బయలు దేరారు. వేలాదిగా అన్నాడీఎంకే వర్గాలు భారీగా ర్యాలీకి తరలిరావడంతో సైదాపేట, గిండి పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీ నెలకొంది. ఈప్రభావం నగరంలోని అనేక మార్గాలపై పడింది. దీంతో వివిధ పనులు, కార్యాలయాలకు వెళ్లే వారికి అవస్థలు తప్పలేదు. దీంతో మార్గం మధ్యలో చిన్నమలై వద్ద ఈ ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులు, అన్నాడీఎంకే వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. చివరకు అన్నాడీఎంకే ముఖ్య నేతలను మాత్రం రాజ్‌భవన్ వైపుగా పోలీసులు అనుమతించారు.

పరిశీలించి చర్యలు..

గవర్నర్‌కు ఫిర్యాదు చేసినానంతరం పళణి స్వామి మీడియాతో మాట్లాడుతూ, గత రెండేళ్ల డీఎంకే పాలను జరిగిన అవినీతి, అక్రమాల గురించి ఆయా శాఖలు, విభాగాల వారీగా సమగ్ర సమాచారాన్ని, ఆధారాలను గవర్నర్‌కు అందజేశామన్నారు. ఏ రోజున డీఎంకే అధికారంలోకి వచ్చిందో ఆ రోజు నుంచే రాష్ట్రం హత్యలు, దోపిడీలతో అట్టుడుకుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అధ్వానంగా ఉన్నాయని, ఇందుకు నిదర్శనంగా రోజూ పత్రికల్లో వచ్చే నేరాల వార్తలను పరిగణించాల్సి ఉందన్నారు. అయితే, సీఎం, డీజీపీ శాంతి భద్రతలు భేష్.. రాష్ట్రం శాంతి వనంగా ఉన్నట్టు గొప్పలు చెప్పుకోవడం శోచనీయమని విమర్శించారు. కీలుబొమ్మ సీఎం స్టాలిన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలవుతోందన్నారు. కారులో వచ్చి మరీ స్నాచింగ్‌కు పాల్పడే స్థాయికి ఈ రాష్ట్రంలో దొంగలు ఎదిగారని, ఇసుక మాఫియా రూపంలో నిజాయితీ కలిగిన అధికారులకు భద్రత కొరవడిందని ధ్వజమెత్తారు.

కేంద్ర దర్యాప్తు సంస్థలతో..

ద్రవిడ మోడల్ పాలన పేరుతో చోటు చేసుకుంటున్న అవినీతి అక్రమాలపై కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా విచారణ జరిపించాలని గవర్నర్‌ను కోరినట్లు పళణిస్వామి తెలిపారు. బాధ్యత కలిగిన ప్రధాన ప్రతిపక్షంగా తాము ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుంటే, తమపై అక్రమ కేసులు పెడుతున్నారని, ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తేలేదన్నారు. కల్తీ సారా మరణాలపై కొరడా ఝుళిపించి ఉంటే, ఆదివారం మరో రెండు ప్రాణాలు గాల్లో కలిసి ఉండేది కాదని పేర్కొంటూ, తంజావూరు టాస్మాక్ బార్ మరణాల ఘటనను చోటు చేసుకుని ఉండేవి కాదన్నారు. తాము సమర్పించిన అన్ని ఆధారాలు, వివరాలు, సమాచారాలను గవర్నర్ నిశితంగా పరిశీలించారని, సమగ్ర పరిశీలనతో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో డీఎంకే వర్గాలపై వేసిన అవినీతి అక్రమాల కేసులన్నీ ప్రస్తుతం నీరుగారి పోతున్నాయని, దోషులంతా నిర్దోషులు అవుతున్నారన్నారు. ఇందుకు కారణం అవినీతి నిరోధక శాఖ అధికారులు, పోలీసు అధికారులు కోర్టుల్లో కేసులు నీరుగారే విధంగా ఆధారాలను మారేస్తున్నట్లుందని ఆరోపించారు.



అన్నాడీఎంకే ర్యాలీకి భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు

గవర్నర్‌కు ఫిర్యాదు..

అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్ అధ్యక్షతన, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడపాడి కె. పళణిస్వామి, మాజీ మంత్రులు కేపీ మునుస్వామి, దిండుగల్ శ్రీనివాసన్, సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి, తంగమణి, బెంజమిన్ , జయకుమార్ తదితరులు రాజ్ భవన్‌లోకి వెళ్లారు. గవర్నర్ ఆర్ఎన్ రవితో భేటీ అయ్యారు. ఆయనకు పలు అంశాలపై ఫిర్యాదు చేస్తూ, వినతి పత్రాలను సమర్పించారు. అలాగే, డీఎంకే రెండేళ్ల పాలనలో జరిగిన అవినీతి అక్రమాల పేరిట ఓ జాబితాను అందజేశారు. ఆధారాలతో సహా అన్ని వివరాలనూ గవర్నర్ ముందుంచారు.



గవర్నర్ ఆర్ఎన్ రవికి వినతిపత్రం సమర్పిస్తున్న పళణిస్వామి



ర్యాలీలో పాల్గొన్న అన్నాడీఎంకే నాయకులు

మద్యంలో సైనేడ్

- తంజావూరు మద్యం మరణాల కేసులో కీలక మలుపు
- విచారణ వేగవంతం
- నలుగురు టాస్మాక్ ఉద్యోగులపై వేటు

సాక్షి, చెన్నై: తంజావూరులో టాస్మాక్ బార్‌లో మద్యం సేవించడంతో మరణించిన కేసు సోమవారం కీలక మలుపు తిరిగింది. సైనేడ్ కారణంగానే వారు మరణించినట్లు పోస్టుమార్టంలో తేలింది. మద్యంలోకి ఎలా సైనెడ్ వచ్చిందో అనే కోణంలో పోలీసులు దర్యాప్తు వేగాన్ని పెంచారు. అలాగే ఆ టాస్మాక్ దుకాణంలో పనిచేస్తున్న సిబ్బంది నలుగురి సస్పెండ్ చేశారు. బార్‌లో పని చేస్తున్న ఇద్దరిని సోమవారం అరెస్టు చేశారు. వివరాలు.. తంజావూరులో కీలక వాసల్ ప్రాంతానికి చెందిన కుప్పు స్వామి, వివేక్‌లు ఆదివారం అక్కడి టాస్మాక్ బార్‌లో మద్యం సేవించిన కాసేపటికి మరణించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కల్తీ సారా, కల్తీ మద్యం మరణాల ఘటనల నేపథ్యంలో తాజా కేసు అధికారులను ఇరకాటంలో పడేసింది. కల్తీ మద్యం కారణంగానే ఈ మరణాలు సంభవించినట్లు ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోయడంతో తంజావూరు జిల్లా అధికారుల్లో కలవరం ఏర్పడింది. అయితే మృతదేహాలకు జరిపిన పోస్టుమార్టం కేసును మలుపు తిప్పింది. సోమవారం వెలువడ్డ పోస్టుమార్టం నివేదికలో ఆ ఇద్దరి మరణానికి సైనెడ్ కారణంగా తేలింది. దీంతో వీరు ఆత్మహత్య చేసుకున్నారా..? లేదా ఎవరైనా పథకం ప్రకారం హతమార్చారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మద్యంలోకి ఎలా సైనేడ్ వచ్చిందో అన్న కోణంలో దర్యాప్తు వేగాన్ని పోలీసులు పెంచారు. ఆ జిల్లా కలెక్టర్, ఎస్పీలు కేసును స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అలాగే టాస్మాక్ బార్ యజమాని సెంథిల్ పళణి వేలు, సిబ్బంది కామరాజ్‌ను అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.



మృతులు వివేక్, కుప్పు స్వామి (ఫైల్)



టాస్మాక్ దుకాణం వద్ద విచారణ చేపడుతున్న కలెక్టర్ దినేష్ పొన్ రాజ్

న్యాయం జరిగే వరకు..

న్యాయం జరిగే వరకు మృతదేహాలను తీసుకునే ప్రసక్తే లేదని కుటుంబాలు తేల్చి చెప్పాయి. దీంతో మృతదేహాలను మార్చురీకే పరిమితం చేశారు. నిర్ణీత వేళల్లో కాకుండా, ముందుగానే టాస్మాక్ మద్యం బాటిళ్లను బార్లకు అందజేసిన వ్యవహారంలో మార్కెటింగ్‌శాఖ సిబ్బంది, టాస్మాక్‌లో పనిచేస్తున్న నలుగురిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈకేసు మిస్టరీని ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఇదిలా ఉండగా ఈ మరణాలపై పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాసు పేర్కొంటూ, రాష్ట్రంలో 24 గంటలూ మద్యం విక్రయాలు జరిపే విధంగా ఆదేశాలు ఇచ్చినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్ట విరుద్ధంగా మద్యం విక్రయాలకు ఎవరో ఒకరు ఇచ్చిన అనుమతితోనే టాస్మాక్ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోందన్నారు. ఇక, కాంగ్రెస్‌రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ అళగిరి స్పందిస్తూ, ఏదో ఒక రోజు రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధాన్ని డీఎంకే అమలు చేస్తుందనే నమ్మకం తమకు ఉందన్నారు.

మాజీ మంత్రులకు.. అక్రమాస్తుల ఉచ్చు

- కోర్టులో అవినీతి నిరోధక విభాగం చార్జ్‌షీట్
- విజయ భాస్కర్‌కు రూ. 36 కోట్లు
- అన్బళగన్‌కు రూ. 45 కోట్ల అక్రమాస్తులున్నట్లు వెల్లడి

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే మాజీ మంత్రుల మెడకు అక్రమాస్తుల ఉచ్చు బిగుస్తోంది. ఇద్దరు మాజీ మంత్రులకు సంబంధించిన కోర్టులో సోమవారం చార్జ్‌షీట్ దాఖలైంది. ఇందులో ఆరోగ్య శాఖమాజీ మంత్రి విజయ భాస్కర్ రూ. 36 కోట్లు, ఉన్నత విద్యాశాఖ మాజీ మంత్రి అన్బళగన్ రూ. 45 కోట్లు అక్రమార్జనతో ఆస్తులు కూడ బెట్టినట్లు అవినీతి నిరోధక విభాగం కోర్టుకు తెలిపింది. వివరాలు.. డీఎంకే అధికారంలోకి వచ్చినానంతరం అన్నాడీఎంకే మాజీ మంత్రులను టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. తమకు గతంలో అందిన సమాచారం, ఆధారాలు, ఫిర్యాదుల మేరకు అవినీతి నిరోధక విభాగం దూకుడు పెంచింది. ఆ దిశగా మాజీ మంత్రులు ఎస్పీ వేలుమణి, తంగమణి, వీరమణి, విజయ భాస్కర్, ఎంఆర్ విజయ భాస్కర్ , కేపీ అన్బళగన్‌తో పాటు మాజీ సీఎం పళని స్వామి సన్నిహితులు, కాంట్రాక్టర్లు తదితరుల ఇళ్లు, వారికి సంబంధించిన సంస్థలు, కార్యాలయాలు, సన్నిహితులను గురి పెట్టి ఇప్పటికే సోదాలు ముగిశాయి. ఈ కేసులన్నీ ప్రస్తుతం విచారణలో ఉన్నాయి. ఈ కేసులను న్యాయ పోరాటం ద్వారా ఎదుర్కొనే పనిలో మాజీలు ఉన్నారు.



విజయ భాస్కర్, అన్బళగన్ (ఫైల్)

ఇద్దరిపై చార్జ్ షీట్..

సోమవారం ఆరోగ్య శాఖ మాజీ మంత్రి విజయ భాస్కర్, ఉన్నత విద్యా మాజీ మంత్రి అన్బళగన్ లపై ఏసీబీ అధికారులు వేర్వేరుగా చార్జ్ షీట్‌ను దాఖలు చేశారు. పుదుకోట్టై కోర్టులో విజయ భాస్కర్‌పై చార్జ్ షీట్ వేశారు. 2016–21 కాలంలో ఆయన ఆదాయానికి మించి రూ. 36 కోట్ల మేరకు అక్రమాస్తులు గడించినట్లు అందులో పేర్కొన్నారు. ఆయన సతీమణి రమ్యపై కూడా అభియోగాలు నమోదు చేశారు. మొత్తంగా 210 పేజీలతో చార్జ్ షీట్‌ను కోర్టుకు సమర్పించారు. అన్బళగన్‌కు సంబంధించిన చార్జ్‌షీట్ ధర్మపురి కోర్టులో దాఖలైంది. రూ. 45 కోట్ల మేరకు ఆయన అక్రమాస్తులు గడించినట్లు తెలియజేసే వివరాలను కోర్టుకు సమర్పించారు. ఆయన సతీమణి మల్లిక,బంధువులు రవి శంకర్, శరవణన్, శరవణ కుమార్‌తో పాటుగా 11 మందికి సంబంధించిన సమగ్ర వివరాలను ఈ కోర్టు దృష్టికి తెచ్చారు.

పండుగలా.. కరుణానిధి శత జయంతి

- అధికారులతో సమీక్షలో సీఎం స్టాలిన్ ఆదేశాలు
- కారుణ్య నియామకాల్లో భాగంగా 103 మందికి ఉద్యోగాలు
- నేటి నుంచి ముఖ్యమంత్రి విదేశీ పర్యటన

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు పండుగను తలపించే విధంగా కలైంజర్ కరుణానిధి శత జయంతి ఉత్సవాలు నిర్వహించాలని అధికారులను సీఎం స్టాలిన్ ఆదేశించారు. సచివాలయంలో తమిళనాడు ప్రభుత్వం తరఫున శత జయంతి ఉత్సవాల నిర్వహణ గురించి మంత్రులు, అధికారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఇందులో స్టాలిన్ ప్రసంగిస్తూ ఐదు సార్లు తమిళనాడు సీఎంగా, 13 సార్లు అసెంబ్లీ సభ్యుడిగా జాతీయ రాజకీయాల్లోనూ చక్రం తిప్పి, ఎందరినో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రులగా చేసిన ఘనతను కరుణానిధి దక్కించుకున్నారని గుర్తు చేశారు. అందుకే సామాజిక న్యాయం, అభివృద్ధి, సమధర్మం నినాదంతో కలైంజర్ శత జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని, వాటి నేతృత్వంలో ప్రభుత్వ తరఫున వేడుకలు మిన్నంటే విధంగా జరగాలని సూచించారు. అందరం సమష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకుందామన్నారు. సమావేశంలో మంత్రులు దురై మురుగన్, నెహ్రూ, ఉదయ నిధితో పాటు కేబినెట్ మంత్రులు, వివిధ విభాగాలకు చెందిన కార్యదర్శులు ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు.



మంత్రులు, అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

కార్మిక మరణాలపై సమీక్ష

నంతరం మురుగు నీటి కాలువలు, సెప్టిక్ ట్యాంక్‌లు, మ్యాన్ హోల్‌లో పడి మరణించిన వారి వివరాలను సీఎం స్టాలిన్ పరిశీలించారు. అభివృద్ధిలో దూసుకెళ్తున్న తమిళనాడులో ఇటువంటి మరణాలు తరచూ వెలుగు చూస్తుండడం విచారకరం అని పేర్కొన్నారు. ఈ మరణాలను కట్టడి చేయడమే ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. మురుగు నీటి కాలువలు, సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రం చేయడం కోసం ఆధునిక పద్ధతులపై దృష్టి పెట్టాలని సూచించారు. రూ. 100 కోట్ల కేటాయిందామని, తదర్వాత ఆధునిక యంత్రాలు, సాధనాలను కొనుగోలు చేయాలని, మరో నాలుగు నెలల్లో ఆధునిక విధానం అన్నది పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మంత్రులు నెహ్రూ, ఐ. పెరియ స్వామి, సీఎస్ ఇరై అన్బు తదితరులు పాల్గొన్నారు.



సీఎంతో నావల్ ఆఫీసర్ రవికుమార్, సీఎస్ ఇరై అన్బు

రూ. 5 లక్షల చెక్కు పంపిణీ

తమిళనాడు ఛాంపియన్స్ ఫౌండేషన్‌ను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీనికి తన సొంత నిధుల నుంచి రూ. 5 లక్షలు చెక్కును సీఎం స్టాలిన్ సోమవారం క్రీడల మంత్రి ఉదయ నిధి స్టాలిన్‌కు అందజేశారు. క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహించే విధంగా ఈ ఛాంపియన్స్ ఫౌండేషన్ ఏర్పాటైనందని వివరించారు. ముందుగా తమిళనాడు విద్యుత్ బోర్డులో విధుల్లో మరణించిన వారి కుటుంబాలకు చెందిన 103 మందికి సీఎం స్టాలిన్ చేతుల మీదుగా కారుణ్య నియామక ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు ఉదయ నిధి స్టాలిన్, సెంథిల్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ముందుగా సీఎం స్టాలిన్‌ను తమిళనాడు, పుదుచ్చేరి నావికాదళం అధికారి అడ్మిరల్ రవికుమార్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.

నేటి నుంచి సీఎం విదేశీ టూర్

జనవరి 2024లో నిర్వహించే పారిశ్రామిక సదస్సును దృష్టిలో ఉంచుకుని పెట్టుబడిదారులను ఆహ్వానించే విధంగా మంగళవారం నుంచి సీఎం స్టాలిన్ విదేశీ పర్యటన చేపట్టనున్నారు. ఉదయాన్నే ఆయన సింగపూర్‌కు బయలు దేరి వెళ్లనున్నారు. ఈ పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా ఇప్పటికే సింగపూర్ చేరుకున్నారు. 24వ తేదీన 350 సంస్థలతో సింగపూర్ వేదికగా సీఎం సమావేశం కానున్నారు. మరునటి రోజు నుంచి జపాన్, లండన్‌లో సీఎం పర్యటిస్తారు. ఈనెల 31వ తేదీ ఆయన తిరిగి చెన్నైకు వస్తారు.

క్లుప్తంగా

నేడు పళ్లిపట్టు జాతర

పళ్లిపట్టు: పళ్లిపట్టు గ్రామదేవత కొల్లాపురమ్మ, గంగమ్మ జాతర మంగళవారం నిర్వహించనున్నారు. జాతర సందర్భంగా ఆలయంతో పాటు పట్టణ ప్రధాన వీధులను విద్యుత్‌దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. మంగళవారం ఉదయం గ్రామదేవత కొల్లాపురమ్మకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేయనున్నారు. అమ్మవారికి అంబలి నైవేద్యం సమర్పించనున్నారు. సాయంత్రం గ్రామ దేవత మహిషాసురమర్దిని అలంకరణలో పట్టణ వీధుల్లో విహరించనున్నారు. బుధవారం నడివీధిలో కొలువుదీర్చి భక్తులు దర్శించుకుంటారు.

అవార్డు ప్రదానం



సాక్షి, చెన్నై: చెన్నైలోని తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దేవర కొండ రాజుకు ఎన్‌టీఆర్ పురస్కారం అవార్డు దక్కింది. ఆదివారం రాత్రి ఢిల్లీలో జరిగిన ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాలలో ఈ అవార్డును అతిథులు కనక మేడల రవీంద్రకుమార్, నందమూరి రామకృష్ణ చేతుల మీదుగా దేవర కొండ రాజు అందుకున్నారు.

పళ్లిపట్టులో గాలివాన

పళ్లిపట్టు: వేసవి ఎండతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్న క్రమంలో సోమవారం మధ్యాహ్నం పళ్లిపట్టు పరిసర ప్రాంతాల్లో గాలివానతో వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అగ్నినక్షత్రం తీవ్ర ప్రతాపం చూపుతున్న క్రమంలో పళ్లిపట్టు టౌన్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి గంట పాటు వర్షం కురవడంతో జనం ఉపశమనం పొందారు.

నిజాయితీ చాటుకున్న వ్యాపారి

అన్నానగర్: కన్యాకుమారి భగవతి అమ్మన్ ఆలయంలో ఆదివారం పర్యాటకురాలు పోగొట్టుకున్న 10 సవర్ల నగలను వ్యాపారి నిజాయితీగా అప్పగించారు. తిరుచ్చి జిల్లా సెంగదిర్ చోలై ప్రాంతానికి చెందిన అముద 35 మంది బృందంతో ఆదివారం కన్యాకుమారి వచ్చింది. ఉదయం సూర్యోదయాన్ని వీక్షించి భగవతి అమ్మన్‌ఆలయంలో దర్శనం చేసుకున్నారు. రద్దీ కావడంతో అముద పర్సు పోయింది. అందులో 10 తులాల బంగారు నగలు ఉన్నాయి. ఆలయ ప్రాంగణం అంతా గాలించినా కనిపించలేదు. కన్యాకుమారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆలయ ఆవరణలో ప్రసాదాల దుకాణం నిర్వహిస్తున్న రామచంద్రన్‌కు పర్సు, బంగారు ఆభరణాలు లభించగా వాటిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అముదను పిలిపించి వాటిని అప్పగించారు.

చెన్నై వేదికగా స్క్వాష్ ప్రపంచ కప్ పోటీలు




జెర్సీలను ఆవిష్కరిస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్, మేఘనాథరెడ్డి, అతుల్యామిశ్రా తదితరులు

కొరుక్కుపేట: జూన్ 13వ తేదీ నుంచి 17 వరకు జరగనున్న ఎస్‌డీఏటీ–డబ్ల్యూఎస్‌ఎఫ్ స్క్వాష్ ప్రపంచ కప్‌కు చెన్నై నగరం అతిథ్యం ఇవ్వనుంది. తమిళనాడు ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగనున్న స్క్వాష్ ప్రపంచ కప్‌లో వివిధ దేశాల అగ్రశ్రేణి స్క్వాష్ క్రీడాకారులందరూ పాల్గొననున్నారు. ఈమేరకు సోమవారం చెన్నైలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర యువజన సంక్షేమ, క్రీడల అభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ ముఖ్య అతిథిగా పాల్గొని స్క్వాష్ ప్రపంచ కప్ జెర్సీలను ఆవిష్కరించారు. అలాగే ఎస్‌డీఏటీ –డబ్ల్యూ ఎస్‌ఎఫ్ స్క్వాష్ ప్రపంచ కప్ విజయవంతంగా నిర్వహించడానికి గానూ రూ. 1.50 కోట్లు నిధులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఆ క్రమంలో ప్రపంచ స్థాయి క్రీడా పోటీలను తమిళనాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు చాంపియన్ షిప్ కమిటీ చైర్మన్ ఎస్. రామచంద్రన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని అందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. స్క్వాష్ ప్రపంచ కప్ ఇది నాలుగో ఎడిషన్ అని ఈసంవత్సరం టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లలో లింగసమానత్వం ఉంటుందని తెలిపారు. చెన్నైలోని స్క్వాష్ అకాడమీతోపాటు చెన్నై రాయపేటలోని ఎక్స్‌ప్రెస్ అవెన్యూ వేదికగా మ్యాచ్‌లు జరుగుతాయని జూన్ 17న ఎక్స్‌ప్రెస్ అవెన్యూలో ఫైనల్స్ ఉంటుందని, హెచ్‌సీఎల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రపంచ స్థాయి స్క్వాష్ క్రీడాకారులు అభయ్‌సింగ్, జోష్నా చిన్నప్ప, ఎస్‌డీఏటీ మెంబర్ సెక్రటరీ జె. మేఘనాథరెడ్డి, క్రీడాశాఖ అదనపు చీఫ్ సెక్రటరీ అతుల్యామిశ్రా పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

–సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్తులు



అధికారితో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

తిరువళ్లూరు: తరచూ విద్యుత్‌కు ఏర్పడుతున్న అంతరాయాన్ని సరి చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు అర్ధరాత్రి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు యూనియన్ అధిగత్తూరులో సుమారు వెయ్యి కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే గ్రామంలో రాత్రి సమయంలో తరచూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయంపై అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఆదివారం అర్ధరాత్రి మనవాలనగర్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన నిర్వహించారు. తమ గ్రామంలో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయాన్ని సరిచేయాలని కోరుతూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఉన్నత అధికారులు సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని వారితో చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

ప్రభుత్వాస్పత్రిలో ఇరువర్గాల దాడి

తిరువొత్తియూరు: మదురై జిల్లా మేలూర్ సమీపంలోని సెకివట్టికి చెందిన పాండియన్, పళనిసామి మధ్య కొంత కాలంగా పాతకక్షలు ఉండడంతో ఇరువర్గాలు కొద్ది రోజుల క్రితం దాడి చేసుకున్నాయి. పాండియన్ కుమారుడు కన్నన్, పళనిస్వామి గాయపడ్డారు. వీరిద్దరూ మేలూరు ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ఈ క్రమంలో పాండియన్, బాల మురుగన్, మనికంఠన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పళనిసామిపై దాడి చేశారు. సహ రోగులు భయంతో పరుగులు తీశారు. ఉద్రిక్తత పరిస్థితి నెలకొనడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. పాండియన్, బాలమురుగన్, మణికందన్‌లపై కేసు నమోదు చేశారు.

ముడిచ్చూర్‌లో ఆమ్నీ టెర్మినల్

- స్థలాన్ని పరిశీలించిన మంత్రులు



స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రులు శేఖర్‌బాబు, అన్బరసన్

సాక్షి, చెన్నై: నగర శివార్లలోని ముడిచ్చూర్‌లో ఆమ్నీ ప్రైవేటు బస్సుల కోసం బస్ టెర్మినల్ ఏర్పాటు చేయనున్నామని సీఎండీఏ చైర్మన్, దేవదాయ శాఖమంత్రి పీకే శేఖర్‌బాబు, చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి అన్బరసన్ తెలిపారు. ఈమేరకు వారు సోమవారం ఈ స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, చెన్నై ఔటర్ రింగ్ రోడ్డులో రూ.29 కోట్లతో ప్రైవేట్ ఓమ్నీ బస్సుల కోసం ప్రత్యేక టెర్మినల్ నిర్మాణానికి నిర్ణయించామని తెలిపారు. అలాగే ముడిచ్చూర్‌లోని చెరువును రూ. 2 కోట్లతో అభివృద్ధి చేయనున్నామన్నారు. తాంబరం కార్పొరేషన్ పరిధిలో రూ. 50 కోట్లతో అభివృద్ధి పనులు, క్రీడా మైదానాలు, పార్క్‌లు ఏర్పాటుకు నిర్ణయించామని తెలిపారు. అలందూరులో రూ. 10 కోట్ల అంచనా వ్యయంతో కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నామన్నారు. ఆమ్నీ బస్‌టెర్మినల్ కోసం 5 ఎకరాల స్థలాన్ని ఎంపి చేశామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డుకు అనుకుని ఉన్న ఈ స్థలంలో రూ. 29 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టనున్నామని వివరించారు. ఈ బస్టాండ్‌లో అన్ని వసతులు ఉంటాయని, ఈ నిర్మాణాలు త్వరితగతిన ముగించే విధంగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెలఖరులోపు స్థలాన్ని స్వాధీనం చేసుకుని పనులు చేపడుతామన్నారు. కిలాంబాక్కం బస్ టెర్మినల్ పనులు జూన్ నెలాఖరులోపు ముగించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. జూలైలో ఈ బస్టాండ్ నుంచి బస్సుల రాకపోకలు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

ముగిసిన హాకీ సమ్మర్ క్యాంప్



హాకీ శిక్షణ పొందిన విద్యార్థులతో కోచ్‌లు, నిర్వాహకులు

కొరుక్కుపేట: చెన్నై అన్నాసాలైలోని ప్రభుత్వ మద్రాసా ఎ ఆజం హయ్యర్ సెకండరీ స్కూల్‌లో మూడు వారాల పాటు నిర్వహించిన సమ్మర్ హాకీ శిక్షణ శిబిరం ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. ఈ క్యాంప్‌లో భారత హాకీ టీమ్ మాజీ కెప్టెన్ రియాజ్, మాజీ పోర్టు ట్రస్ట్ క్రీడాకారులు దస్తగిరి బాషా, ఇండియన్ బ్యాంక్ ప్లేయర్ షౌకాత్ బషీర్, పోర్టు ట్రస్ట్ ప్లేయర్ సుభాన్‌లు కోచ్‌లుగా వ్యవహరించి చిన్నారులకు శిక్షణ అందించారు. దాదాపు 50మందికి పైగా చిన్నారులు ఈ క్యాంప్‌లో పాల్గొని హాకీలో మెలుకువలను నేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమానికి అతిథులుగా మద్రాసా ఎ ఆజం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు ఇమ్రాన్, మిల్లత్ ఇస్మాయిల్, అమానుల్లాఖాన్లు పాల్గొని చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

తాగునీటి కోసం గ్రామస్తుల రాస్తారోకో



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అన్నానగర్: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పట్టివీరన్‌పట్టి గ్రామస్తులు ఆదివారం రాస్తారోకో చేశారు. దిండుక్కల్ జిల్లా పట్టివీరన్ పట్టి సమీపంలోని సిద్ధరేవు పంచాయతీ కె.సింగారకోట్టై గ్రామంలో సుమారు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామంలో 10 రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఖాళీ బిందెలతో ఆదివారం గుమిగూడారు. అపై కె.సింగారకోట్టై వద్ద దిండుక్కల్–వత్తలక్కుండు జాతీయ రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. ఇన్‌స్పెక్టర్ శంకరేశ్వరన్, చిట్టరేవు పంచా యతీ కార్యదర్శి శివ రాజన్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజలతో చర్చలు జరిపారు. తాగునీటికి సరఫరాకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

హోటల్‌లో భారీ అగ్ని ప్రమాదం



దగ్ధమవుతున్న వస్తువులు

అన్నానగర్: వాల్‌పారైలోని ఓ హోటల్‌లో ఆదివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సుమారు రూ.4 లక్షల విలువైన వస్తువులు కాలిపోయాయి.. కోయంబత్తూర్ జిల్లా వాల్‌పారైలోని బనానా గార్డెన్ ప్రాంతంలోని కుమరన్ రోడ్‌లో హోటల్ ఉంది. ఆదివారం రాత్రి హోటల్ యజమాని యథావిధిగా దుకాణాన్ని మూసేశాడు. కబీర్ అనే ఉద్యోగి హోటల్‌లో బస చేశాడు. అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో హోటల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు హోటల్ మొత్తం వ్యాపించాయి. కబీర్ కేకలు వేశాడు. స్వల్పంగా గాయపడిన కబీర్‌ను ఇరుగుపొరుగు వారు బయటకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న వాల్‌పారై పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ. 4 లక్షల విలువైన వస్తువులు దగ్ధమైనట్లు యజమాని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో మంటలను ఆర్పివేసి సమీపంలోని దుకాణాలకు మంటలు వ్యాపించకుండా అడ్డుకున్నారు.

ఉరుమల్ చిత్రం ప్రారంభం



తమిళ సినిమా: డబుల్ ఇంజన్ ప్రొడక్షన్స్ పతాకంపై ఆర్ రాజేష్ నిర్మిస్తున్న చిత్రం ఉరుమల్. క్రౌన్ రాజేష్ కథ, దర్శకత్వం, ఛాయాగ్రహణం, ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. గురుకాంత్, కార్తీక్ శ్రీ రామ్ రాజేష్ హీరోలుగా నటిస్తున్నారు. శివన్యా రాణి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రాజా సాహిబ్, కనవుగల్ సురేష్, ఆనందా మురళ్, శ్రీదేవి అనిల్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. క్రౌన్ జేఆర్ సంగీతాన్ని అందిస్తున్న విచిత్రం సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కేరళలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ.. ఈరోజు చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించామని చెప్పారు. ఇది ఉత్తరప్రదేశ్‌లోని తమిళులు, వారి జీవన పోరాటాన్ని ఆవిష్కరించే కథా చిత్రంగా ఉంటుందన్నారు. చిత్ర కంటెంట్ కొత్తగా ఆలోచింపజేసే విధంగా ఉంటుందన్నారు. చిత్ర షూటింగ్‌ను చెన్నై, ఉత్తరప్రదేశ్‌లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలి షెడ్యూల్ ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఘనంగా అవార్డుల వేడుక



అవార్డులు అందజేస్తున్న అతిథులు

తమిళ సినిమా: వెండితెర, బుల్లితెర తారల ప్రోత్సాహక అవార్డుల వేడుక ఆదివారం స్థానిక వడపళని, కుమరన్ కాలనీలోని శిఖరం ఆవరణలో ఘనంగా జరిగాయి. మహా ఫైన్ ఆర్ట్స్ డాక్టర్ అనురాధ జయరామన్ యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా నిర్వాహకుడు కలైమామణి నెల్‌లై సుందర్ రాజన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశ్రాంత న్యాయమూర్తి ఎస్‌కే కృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొని నటీనటులకు అవార్డులను ప్రదానం చేసి ప్రశంసించారు. ఈ వేదికపై నటి శ్రావ్యారెడ్డి, బేబీ అంజు, వైష్ణు, చిత్ర లేఖ కళాకారుడు మురళీ కృష్ణన్, నెల్‌లై సుందర్ రాజన్ తదితరులకు ప్రోత్సాహ అవార్డులను ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలు ఆనందంతో కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇదే వేదికపై చిత్రలేఖనం కళాకారుడు మురళీకృష్ణన్ అవార్డు గ్రహీతలు, ఇతర ప్రముఖులను సత్కరించి శ్రీ దక్షిణకాళీ యోగశక్తి పీఠం క్యాలెండర్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ మధుకృష్ణ, స్పోర్ట్స్ చైర్మన్ సౌందర్ రాజన్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు అహూతులను విశేషంగా అలరించాయి.

కోలీవుడ్ టాక్స్

కొత్త రంగంలోకి అజిత్

తమిళ సినిమా: తాను, తన ప్రపంచం అన్నట్టుగా జీవన విధానాన్ని మలుచుకున్న నటుడు అజిత్. ఈయన నటనతో పాటు ఫొటోగ్రఫీ, బైక్, కార్ రేసింగ్, చిన్న చిన్న డ్రోన్లు రూపొందించడం వంటి విషయాలపై ఆసక్తి కనబరుస్తుంటారన్న విషయం తెలిసిందే. ఆ మధ్య బైక్ పయనంతో దేశంలోని ప్రధాన నగరాలను చుట్టొచ్చారు. తాజాగా భూటాన్, నేపాల్ నగరాల్లో బైక్ విహార యాత్ర ముగించుకుని చెన్నైకి తిరిగొచ్చారు. కాగా అనూహ్యంగా ఆయన సోమవారం మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేశారు. అందులో తాను చాలాకాలం తనకు నచ్చిన జీవితాన్ని అనుభవిస్తున్నానన్నారు. జీవితం ఒక అందమైన ప్రయాణమని.. అందులోని మలుపులు, తెరిచిన మార్గాలను అనుభవించండి అన్ని పేర్కొన్నారు. తన స్వదేశీ, విదేశీ బైక్ రైడింగ్ విహార యాత్రను ఇప్పుడు ఒక వృత్తిగా మార్చే ప్రయత్నం చేశానన్నారు. ఏకే మోటో రైడ్ పేరుతో మోటార్ సైకిల్ విహార యాత్ర సంస్థను ప్రారంభించినట్లు తెలిపారు. దీని ద్వారా భారత దేశంలోని ప్రకృతి అందాలను, అంతర్జాతీయ రోడ్లపై ప్రయాణం చేయాలన్న ఆసక్తిని కనబరచేవారికి ఏకే మోటో రైడ్ సంస్థ విహార పయనం నేర్చుకోవడానికి సహకరిస్తుందన్నారు. అలాంటి వారికి తగిన భద్రతతో పాటు సౌకర్యవంతమైన మోటార్ బైక్‌లను సమకూర్చడం జరుగుతుందన్నారు. అదే విధంగా అనుభవం కలిగిన మోటార్ బైక్ రైడర్స్‌ను సమకూర్చడం జరుగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



నాన్న వద్దన్నారు.. లేకపోతేనా!



వరలక్ష్మి శరత్ కుమార్

తమిళ సినిమా: చాలెంజింగ్ పాత్రలకు కేరాఫ్ నటి వరలక్ష్మి శరత్ కుమార్. ఈమె సుప్రీమ్ స్టార్ శరత్ కుమార్ వారసురాలు అన్న విషయం తెలిసిందే. అయితే స్వశక్తితోనే నటిగా ఎదిగి తనకంటూ ఒక ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. ఈమె రాకింగ్ నటన ప్రేక్షకులను థ్రిల్లింగ్‌కు గురి చేస్తుంది. నాయకి, ప్రతినాయకి ఇలా ఏ తరహా పాత్రకైనా రెడీ అంటారు. కథానాయకిగా రంగ ప్రవేశం చేసినా, ప్రతినాయకిగానే ఎక్కువ గుర్తింపు తెచ్చుకున్నారు. విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో శింబుకు జంటగా పోడాపోడి చిత్రంతో కథానాయకిగా పరిచయం అయిన వరలక్ష్మి శరత్ కుమార్ ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించకపోవడంతో తదుపరి అవకాశాల కోసం కొంత కాలం ఎదురు చూడాల్సి వచ్చింది. అలా బాలా దర్శకత్వంలో నటించిన తారై తప్పట్టై చిత్రంలో నటనతో సినీ పరిశ్రమ దృష్టిని తనవైపు తిప్పుకున్నారు. ఆపై వరలక్ష్మి నటిగా వెనక్కు తిరిగి చూసుకునే అవకాశం రాలేదు. ముఖ్యంగా నటుడు విజయ్ కథానాయకుడిగా నటించిన సర్కార్, విశాల్ హీరోగా నటించిన సండై కోళి 2 వంటి చిత్రాల్లో ప్రతి నాయకిగా తనదైన శైలిలో అదరగొట్టారు. ఆ తర్వాత ఈమె ఎక్కువగా ఆ తరహా పాత్రల్లోనే నటిస్తున్నారు. మధ్య మధ్యలో కథానాయిక పాత్రలనూ చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అలా దశాబ్దం పాటుగా తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లో నటిస్తూ బహుభాషా నటిగా రాణిస్తున్నారు. ఇటీవల ఈమె ఒక భేటీలో పేర్కొంటూ శంకర్ దర్శకత్వం వహించిన బాయ్స్ చిత్రంలో జెనీలియా పాత్రలో తాను నటించాల్సి ఉందని చెప్పారు. దర్శకుడు శంకర్ నుంచి తనకు పిలుపు వచ్చిందన్నారు. ఆడిషన్, స్క్రీన్ టెస్ట్ కూడా జరిగిందన్నారు. ఆ చిత్రంలో నటించడానికి చాలా ఆసక్తిగా ఉన్న సమయంలో తాను నటించడానికి తన తండ్రి అనుమతించలేదని చెప్పారు. ఆ తర్వాత బాలాజీ శక్తి వేల్ దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రంలోనూ కథానాయికగా నటించే అవకాశం వచ్చిందని తెలిపారు. దాన్ని నాన్న వద్దన్నారని చెప్పారు. ముందు చదువు పూర్తి చెయ్యి ఆ తర్వాత నటన గురించి ఆలోచిద్దామని చెప్పారన్నారు. అలా తన తండ్రి వల్ల చాలా అవకాశాలు మిస్ అయ్యానని వరలక్ష్మి శరత్ కుమార్ పేర్కొన్నారు.

శ్రీకాంత్ దేవా 100వ చిత్రంగా ప్రియముడన్ ప్రియా

తమిళ సినిమా: నటుడు అశోక్ కథానాయకుడిగా నటించిన చిత్రం ప్రియముడన్ ప్రియా. నవ నటి నిశా నాయకిగా నటించిన ఈ చిత్రాన్ని గోల్డెన్ గ్లోరీ మూవీస్ పతాకంపై ఏజే.సుజిత్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. శ్రీకాంత్ దేవా సంగీతాన్ని అందించారు. ఇది ఆయన సంగీతాన్ని అందించిన 100 చిత్రం కావడం విశేషం. పాండిరాజన్ దర్శకత్వంలో కె.రాజన్ నిర్మించిన డబుల్స్ చిత్రం ద్వారా ఈయన సంగీత దర్శకుడిగా పరిచయమయ్యారు. తాజాగా ఈ ప్రియముడన్ ప్రియా చిత్రంతో 100 చిత్రాల మైలురాయిని టచ్ చేశారు. కాగా ఈ చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఇందులో స్థానిక మైలాపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు వేలు, దర్శకుడు పేరరసు, ఆర్వీ ఉదయకుమార్, నటుడు నిర్మాత కె. రాజన్, సంగీత దర్శకుడు గంగై అమరన్, దేవా మొదలగు పలువురు సినీ ప్రముఖులు అతిథులుగా పాల్గొన్నారు. నిర్మాత మాట్లాడుతూ ఆ చిత్రం హీరో ప్రభుదేవా పారితోషికం రూ.15 లక్షలు కాగా, హీరోయిన్ మీనా పారితోషికం రూ.10 లక్షలు అనీ, అయితే చిత్ర ఆడియో హక్కులనే రూ.42 లక్షలకు విక్రయించినట్లు గుర్తు చేశారు. అంతే రాశిగల సంగీత దర్శకుడు శ్రీకాంత్ దేవా అని ప్రశంసించారు. సంగీత దర్శకుడు దేవా మాట్లాడుతూ తన కొడుకు శ్రీకాంత్ దేవాకు సినిమా తలుపులు తెరిచింది నిర్మాత కె. రాజన్ అని తెలిపారు. తొలి అవకాశాన్ని కల్పించిన ఆయనకు కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. ఇక కొడుకు అభినందన వేడుకలో ఓ తండ్రిగా పాల్గొన్నడం దేవా అదృష్టం అని సంగీత దర్శకుడు గంగై అమరన్ పేర్కొన్నారు.



ప్రియముడన్ ప్రియా చిత్ర ఆడియో ఆవిష్కరణలో యూనిట్ సభ్యులు

క్లుప్తంగా

రైలు ఢీకొని నెమలి మృతి



నెమలి కళేబరం

అన్నానగర్: దిండుక్కల్ సమీపంలో సోమవారం ఉదయం రైలు ఢీకొని ఓ నెమలి మృతి చెందింది. వివరాలు.. చెన్నై సమీపంలోని తాంబరం నుండి నాగర్ కోయిల్ వైపు ఆదివారం రాత్రి అంత్యోదయా రైలు నడుస్తోంది. ఈ రైలు సోమవారం వేకువజామున దిండుక్కల్ రైల్వే స్టేషన్‌ని చేరుకోగానే ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌లో చనిపోయిన నెమలిని రైల్వే పోలీసులు గుర్తించారు. ఇంజిన్‌లో ఇరుక్కుపోయిన నెమలి కోబదాన్ని పోలీసులు వెంటనే వెలికితీసి దిండుక్కల్ ఫారెస్ట్ గార్డ్ బాలకృష్ణన్‌కు అప్పగించారు. ఆహారం వెతుకుంటూ ట్రాక్‌ను దాటే ప్రయత్నంలో నెమలి రైలు ఢీకొని ఉండవచ్చని రైల్వే పోలీసులు తెలిపారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు



పట్టుబడిన అబూబకర్

కొరుక్కుపేట: మోసం, అత్యాచార కేసులో నిందితుడిగా ఉన్న కేరళకు చెందిన వ్యక్తిని చెన్నై విమానాశ్రయంలో పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు..కేరళలోని మలప్పురానికు చెందిన అబీల్ విల్ అబూబకర్ (32)పై అత్యాచారం, చీటింగ్ కేసులు ఉన్నాయి. అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన అతని కోసం త్రిశూర్ పోలీసులు గాలిస్తున్నారు. త్రిశూర్ పోలీసు కమిషనర్ నిందితుడు అబూబకర్‌ను వాంటెడ్‌గా ప్రకటించారు. ఈ క్రమంలో దోహా నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్యాసింజర్ విమానం ఆదివారం రాత్రి చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. చెన్నై విమానాశ్రయానికి చెందిన పౌర హక్కుల అధికారులు ప్రయాణికుల పాస్‌పోర్టు, వస్త్రాలను తనిఖీ చేస్తుండగా అబూబకర్‌ను గుర్తించారు. దీనిపై కేరళ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు చెన్నైకు చేరుకుని అబీల్ అబూబకర్‌ను అరెస్టు చేసి కేరళకు తీసుకెళ్లారు.

ప్రసవ సమయంలో తల్లీబిడ్డ మృతి

అన్నానగర్: ప్రసవ సమయంలో తల్లీ బిడ్డా మృతిచెందిన ఘటన మన్నచనల్లూరులో జరిగింది. సునైబుకనల్లూరు వడకాలియమ్మన్ కోవిల్ వీధికి చెందిన డ్రైవర్ గోవిందరాసు, సూర్యకాంతి (38) దంపతులకు రాహుల్ (15), సాధన (09) ఉన్నారు. రెండో బిడ్డ పుట్టిన తరువాత గర్భసంచి బలహీనంగా అయిందని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో మూడోసారి గర్భం దాల్చిన సూర్యకాంతి మూడు రోజుల క్రితం ప్రసవం కోసం తిరుచ్చి ప్రభుత్వాసుపత్రిలో చేరింది. 10 నెలలు పూర్తి అయినా ప్రసవ నొప్పులు రాకపోవడంతో ఆదివారం శస్త్రచికిత్స చేయగా మగబిడ్డ మృతి చెంది పుట్టాడు. చికిత్స పొందుతున్న సూర్యకాంతి తీవ్ర రక్తస్రావానికి గురైంది. దీంతో ఆమెకి తీవ్ర చికిత్స అందించారు. శస్త్ర చికిత్స చేసి గర్భసంచిని బయటకు తీయగా ఊపిరాడక సూర్యకాంతి మృతి చెందింది. వళ్లలై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం



గంజాయిని స్వాధీనం చేసుకున్న స్పెషల్ బ్రాంచ్ పోలీసులు

వేలూరు: తిరునల్వేలి జిల్లా మత్తు పదార్థాల నిషేధ ప్రత్యేక విభాగం పోలీసులు ఆదివారం సాయంత్రం ఆంధ్ర, కాట్పాడి మీదుగా వచ్చే రైలులో తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఎస్–7 బోగీలో తరలిస్తున్న 28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అయితే తరలిస్తున్న నిందితుల వివరాలు మాత్రం వెల్లడి కాలేదు.

సొంతింట్లోనే నగలు చోరీ

తిరువొత్తియూరు: కోవైలో సొంత ఇంటిలో 27 సవర్ల నగలు చోరీ చేసిన ఐటీ ఉద్యోగిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కోయంబత్తూరులోని సాయిబాబా కాలనీ వేలండిపాళయం నివాసి సుబ్రమణి. ఇతని భార్య శాంతి (50). ఈమె వంట పనులు జీవనం సాగిస్తోంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికి వివాహమై వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. కుమారుడు విఘ్నేష్ (29) తన భార్యతో కలిసి ఆర్ ఎస్‌పురం పూల మార్కెట్‌లో నివాసం ఉంటున్నాడు. ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆస్తిని తన పేరున రిజిస్టర్ చేయమని విఘ్నేష్ తల్లితో తరచూ గొడవ పడేవాడు. ఈ నెల 9వ తేదీ శాంతి ఇంటికి తాళం వేసి కాశీ యాత్రకు వెళ్లింది. ఈ నెల 13వ తేదీ తిరిగి ఇంటికి వచ్చింది. అయితే బీరువాలో ఉంచిన రూ.11 లక్షల విలువైన 27 తులాల బంగారు ఆభరణాలు అదృశ్యమై ఉంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారించారు. విఘ్నేష్ తన భార్యతో కలిసి నగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని నగలు స్వాధీనం చేసుకున్నారు.

తూత్తుకుడి కాల్పుల ఘటనకు ఐదేళ్లు

- మృతులకు అశ్రు నివాళులు
- కొవ్వొత్తులతో ప్రార్థనలు



మృతుల చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ కనిమొళి

సాక్షి, చెన్నై: తూత్తుకుడి కాల్పుల ఘటనకు సోమవారంతో ఐదేళ్లు పూర్తయ్యింది. ఈ ఘటనలో మరణించిన వారిని స్మరిస్తూ సోమవారం పలు చోట్ల కుటుంబీకులు, ఉద్యమకారులు, ప్రజా సంఘాలు అశ్రునివాళులు అర్పించాయి. బాధిత కుటుంబాలు కొవ్వొత్తులు చేత బట్టి ప్రార్థనలు చేశారు. స్టెరిలైట్‌కు వ్యతిరేకంగా 2018 మే 22న జరిగిన ర్యాలీ చివరికి అల్లర్లకు దారి తీయడం, పోలీసులు విచక్షణ రహితంగా జరిపిన కాల్పుల్లో 13 మంది బలవడం తెలిసిందే. ఈ ఘటన అప్పట్లో పెద్ద కలకలాన్ని సృష్టించింది. ఈ ఘటనపై ప్రజా సంఘాలు, మానవ హక్కుల కమిషన్ విచారణ చేశాయి. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం నేతృత్వంలో రిటైర్డ్ న్యాయమూర్తి అరుణా జగదీశన్ నేతృత్వంలోని కమిషన్ విచారణ చేపట్టి గత ఏడాది సీఎం స్టాలిన్‌కు నివేదికను సమర్పించింది. ఈ పరిస్థితుల్లో సోమవారం ఈ విషాద ఘటనకు ఐదేళ్లు పూర్తి కావడంతో బాధిత కుటుంబాలు తమ వారికి నివాళులర్పించాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఉద్యమకారులు, బాధిత కుటుంబాలు, ప్రజా సంఘాలు శాంతియుతంగా నివాళులర్పించే కార్యక్రమాలు నిర్వహించాయి. తూత్తుకుడి నగర, శివారుల్లోని పలు ప్రాంతాల్లోని క్రైస్తవ ఆలయాల వద్ద కొవ్వొత్తులు చేత బట్టి మృతులకు నివాళులర్పిస్తూ, ప్రార్థనల్లో లీనం అయ్యారు. మరికొన్ని చోట్ల మృతి చెందిన 13 మంది ఫొటోలను ఉంచి , పుష్పాంజలి ఘటించారు. కమిషన్ విచారణలో వెలుగు చూసిన వాస్తవాల మేరకు బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఈ ఘటనకు కారకులైన ప్రతి ఒక్కరూ శిక్షించ బడాలని ఉద్యమ కారులు నినాదించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యగా తూత్తుకుడి నగరంలోని అన్ని మార్గాల్లో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

నివాళులర్పించిన కనిమొళి

డీఎంకే ఎంపీ కనిమొళి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్ర పటాలకు పుష్పాంజలి ఘటించారు. ఈసందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, సీఎం స్టాలిన్ అధికారంలోకి వచ్చినానంతరం తూత్తుకుడి కాల్పుల ఘటనను తీవ్రంగా పరిగణించి, బాధితులకు న్యాయం చేసే విధంగా దశల వారీగా ఆదేశాలు ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇక్కడి ప్రజల డిమాండ్లను ఒక్కొక్కటిగా సీఎం స్టాలిన్ అమలు చేసి తీరుతారని స్పష్టం చేశారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



నూతనంగా ఎంపికైన సర్వేయర్‌లకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న కలెక్టర్

తిరువళ్లూరు: భూసర్వే చేసే సమయంలో పొరపాటు వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో సర్వేయర్‌లు అలసత్వం వహించకుండా జాగ్రత్తగా విధులను నిర్వహించాలని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూసర్వే, సబ్‌డివిజన్ చేయడానికి అవసరమైన సర్వేయర్‌లు లేకపోవడంతో కొత్తగా 922 మందిని ఎంపిక చేశారు. తిరువళ్లూరు, చెంగల్‌పట్టు, కాంచీపురం, చెన్నై జిల్లాలకు కేటాయించిన 102 మంది నూతన సర్వేయర్‌లకు 90 రోజుల పాటు శిక్షణను తిరువళ్లూరు జిల్లా కొలుందలూరు శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఉదయం ప్రారంభించారు. కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ మాట్లాడుతూ.. నూతనంగా ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైన యువకులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ. పౌలిన్‌జయరాజ్, సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌లు కుమరవేలు(తిరువళ్లూరు), నాగరాజ్(చెంగల్‌పట్టు), సర్వే అధికారులు సెంథిల్, తాలీఫ్, ప్రదీప్ పాల్గొన్నారు.







ఘనంగా ఏర్కాడు ఉత్సవం

సేలం జిల్లా ఏర్కాడులో వేసవి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పేదల ఊటీగా ప్రసిద్ధి చెందిన ఏర్కాడులో ఏటా కోలాహలంగా పర్యాటకోత్సవం జరుగుతుంది. ఇందులో భాగంగా సోమవారం నుంచి పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఇక్కడి ఉద్యానవనాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఏర్కాడు అడవుల్లో లభించే ఫలాలను ప్రదర్శనకు ఉంచారు. ఈ ప్రదర్శనను మంత్రులు కె.ఎన్.నెహ్రూ, రామచంద్రన్ ప్రారంభించారు. - సేలం

నీట మునిగి ఇద్దరు మహిళల మృత్యువాత

అన్నానగర్: సరదాగా నీటి కుంటలో దిగిన ఇద్దరు మహిళలు ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన దిండుక్కల్ జిల్లాలో జరిగింది. పీఎస్‌కే కురుంబపట్టికి చెందిన పూంగొడి (45), విజయలక్ష్మి(48) అక్కాచెల్లెల్లు. మదురై జిల్లా ఒత్తకడై సమీపంలోని చిదంబరపట్టిలో ఉంటూ పెళ్లి వంటలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం వీరిద్దరూ కాడ నరసింగం ప్రాంతంలోని రాళ్ల క్వారీ నిల్వ కుంటలో సరదాగా దిగారు. లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగారు. కేకలు వేయడంతో స్థానికులు నీటిలో దూకి ఇద్దరినీ రక్షించడానికి ప్రయత్నించారు. అప్పటికే ఇద్దరూ నీటిలో మునిగి చనిపోయారు. సమాచారం అందుకున్న ఒత్తకడై పోలీసులు, దల్లాకుళం అగ్నిమాపక సిబ్బంది మృతదేహాలను వెలికి తీశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య

అన్నానగర్: కుటుంబ తగాదాలతో ఓ యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తేని జిల్లా కడమలైకుండు సమీపంలోని వరుసనాడు ప్రాంతానికి చెందిన అర్జునన్ కుటుంబంతో కలిసి కంబంలోని కూడలూరు రోడ్డులో నివాసం ఉంటున్నాడు. ఇతని కుమారుడు కార్తీక్ (27) కార్గో వాహనంలో క్లీనర్‌గా పనిచేసేవాడు. ఆదివారం కుటుంబ సభ్యులతో గొడవ పడి కోపంతో బయటకు వెళ్లి ఓ తోటలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కుటుంబీకులు బావిలోకి దిగి అతడిని రక్షించేందుకు ప్రయత్నించారు. అయితే రాత్రి సమయం కావడం, బావిలో మెట్లు లేకపోవడంతో రక్షించలేకపోయారు. దీంతో కంబం అగ్నిమాపక సిబ్బందికి, కంబం సౌత్ పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది బావిలోకి దిగి కార్తీక్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంబం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

వేలూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆటో డ్రైవర్లు వేలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా చెరువులు, కాలువ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. వేలూరు కార్పొరేషన్‌లో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల్లో నాణ్యమైన నిత్యవసర వస్తువులను సరఫరా చేయాలని, నిరుపేద ఆటో కార్మికులకు ప్రత్యేక ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆదుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం డీఆర్‌ఓ రామమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, మాజీ ఎమ్మెల్యే లత, మణి పాల్గొన్నారు.


బాణసంచా పేలి 9 మందికి తీవ్ర గాయాలు

తిరువొత్తియూరు: సత్యమంగళం సమీపంలోని వాడపల్లి మహామారియమ్మన్ ఆలయంలో ఏటా వైశాఖ మాసంలో అగ్నిగుండం మహోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది ఈ వేడుకలు గత వారం ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం వాడపల్లి, అమ్మను తీసుకొచ్చే కార్యక్రమానికి వెళ్లిన అనంతరం గ్రామ ప్రజలు, ఆలయ నిర్వాహకులు భవానీ నది నుంచి తీర్థాన్ని తీసుకొచ్చే కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో వాడపల్లి మఠానికి చెందిన యువకులు బాణసంచా కాలుస్తున్నారు. ఈ క్రమంలో సానూరు సమీపంలోని అమ్మన్ కోయిల్ వద్ద వస్తుండగా వ్యాన్‌లో నిల్వ ఉంచిన బాణసంచాకు ప్రమాదవశాత్తూ మంటలు అంటుకున్నాయి. వ్యాన్‌లో ఉన్న 15 మందిలో తొమ్మిది మంది గాయపడ్డారు. వీరిలో వాడపల్లి గ్రామానికి చెందిన దివాకర్, భూబాలన్‌కు తీవ్రగాయాలు కాగా, మురాన్, నరేష్, గణేష్, ముత్తుకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం సత్యమంగళం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దివాకర్, భూబాలన్ పరిస్థితి విషమంగా ఉండడంతో కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. సత్య మంగళం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై సుత్తితో దాడిచేసి ఉరివేసుకున్న భర్త

తిరువొత్తియూరు: కుటుంబ కలహాలతో భార్యపై సుత్తితో దాడి చేసి అనంతరం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కుమారి జిల్లాలో జరిగింది. ఆరుమనై సమీపంలోని కుట్టైగోడుకు చెందిన తంగపన్ (55) పాలడైరీ కార్మికుడు. ఇతని భార్య రెజినల్ (47). ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఆదివారం మధ్యాహ్నం మరోసారి ఇద్దరికి గొడవలు జరిగాయి. దీంతో కోపోద్రిక్తుడైన తంగపన్ ఇంట్లో ఉన్న సుత్తితో రెజినల్ తలపై కొట్టాడు. స్పృహ తప్పి రెజీనా కింద పడిపోయింది. అయినా కోపం పట్టలేక సుత్తితో మళ్లీ దాడి చేశాడు. అనంతరం తంగప్పన్ తన గదిలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేకలు విన్న స్థానికులు రక్తపు మడుగులో పడి ఉన్న రెజినల్, ఉరికి వేలాడుతున్న తంగప్పన్‌ను చూసి పోలీసులకు సమాచారం అందించారు. రెజినల్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు. తంగపన్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం



చెల్లాచెదురుగా పడివున్న మృతదేహాలు



దయాళన్, చార్లెస్, జాన్ (ఫైల్)

తిరువళ్లూరు: లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో సెల్ఫీకి యత్నించి బైక్ అదుపు తప్పడంతో శ్రీలంక శరణార్థుల శిబిరానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందారు. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలో శ్రీలంక శరణార్థుల శిబిరం ఉంది. ఈ శిబిరంలో దయాళన్(19), చార్లెస్(21), జాన్(20) ఉంటున్నారు. పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు బయటకు వెళ్లి 10 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారి పొన్నేరిపుట్టం వద్ద ముందు వెళుతున్న లారీని దాటడానికి యత్నించారు. లారీని దాటే క్రమంలో సెల్ఫీ తీసుకుంటూ వాహనాన్ని నడిపినట్లు తెలుస్తుంది. ఈ సమయంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి లారీని ఢీకొనడంతో కింద పడ్డారు. లారీ చక్రాలు ఎక్కి దిగడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం పొన్నేరి వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా గంగమ్మ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేలూరు: వేలూరు సత్‌వచ్చారిలో గంగమ్మ రథోత్సవం సోమవారం ఉదయం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్పాలతో అలంకరించిన రథంపై ఆశీనులను చేశారు. మేళతాళాల నడుమ పట్టణ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారి రథాన్ని లాగడానికి పోటీ పడ్డారు. రథంపై బొరుగులు, మిరియాలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. సంతానం లేని మహిళా భక్తులు తడిబట్టలతో వచ్చి అమ్మవారికి కర్పూర హారతులు సమర్పించారు. గంగమ్మ రథాన్ని ఆలయం వద్దకు తీసుకొచ్చి ఆలయంలోని విగ్రహంపై శిరస్సును ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి వివిధ వేషధారణ ధరించి అమ్మవారికి అంబలి, పట్టు వస్త్రాలు సమర్పించారు.

పాము కాటుకు బాలుడి మృతి

అన్నానగర్: పాము కాటుకు ఐదేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన ఒట్టపిడారంలో సోమవారం చోటుచేసుకుంది. తూత్తుక్కుడి జిల్లా ఒట్టపిడారం సమీపంలోని కువ్వనపురం గ్రామానికి చెందిన రాజ్‌కుమార్. ఇతని భార్య మల్లిగ. వీరికి కుమారుడు విక్రమ్ (5), కుమార్తె యాలిని (7) ఉన్నారు. బాలుడు విక్రమ్ ఆదివారం రాత్రి ఇంటి ముందు తన తల్లి మల్లిగతో కలిసి ఆడుకుంటున్నాడు. అప్పుడు అక్కడికి వచ్చిన ఓ నాగు పాము హఠాత్తుగా విక్రమ్‌ను కాటేసింది. విక్రమ్ తన కాలికి ఏదో కరిచిందని అరుస్తూ తల్లికి చెప్పాడు. దీంతో మల్లిక, బంధువులు ఆ ప్రదేశంలో నాగు పామును చూసి దిగ్భ్రాంతి చెందారు. అనంతరం రాజ్ కుమార్, మల్లిక విక్రమ్‌ను చికిత్స నిమిత్తం తూత్తుకుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న పసువందనై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తూత్తుక్కుడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంటి ముందు ఆడుకుంటున్న ఐదేళ్ల బాలుడు పాము కాటుకు మృతి చెందిన ఘటన ఆ ప్రాంతంలో శోకాన్ని నింపింది.

యువకుడి హత్య

తిరువొత్తియూరు: తాంబరంలో డీఎంకే నేత కుమారుడు హత్యకు గురయ్యాడు. పుదుపెరుంగళత్తూరు కరుమారియమ్మన్ కోవిల్ వీధిలో నివసిస్తున్న డీఎంకే నేత కుమారుడు బల్లు అలియాస్ బాలాజీ (26) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు బాలాజీ తన ఇంటి ఎదుట నిలబడి ఉండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన 8 మంది బాలాజీని చుట్టుముట్టి కత్తులతో నరికి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు క్రోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు పీర్కాంకరణై పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి హంతకుల కోసం గాలిస్తున్నారు. హత్యకు గురైన బాలాజీకి, గుండుమేడు ప్రాంతానికి చెందిన గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు యువకులకు మధ్య గతంలో శత్రుత్వం ఉన్నట్లు సమాచారం. బాలాజీపై కూడా గంజాయి కేసు పెండింగ్‌లో ఉందని పోలీసులు తెలిపారు.

ఏలగిరి కొండపై వేసవి ఉత్సవాలకు ఏర్పాట్లు



పార్కులో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ భాస్కర పాండియన్

వేలూరు: ఏలగిరి కొండపై పర్యాటకులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భాస్కర పాండియన్ అధికారులను ఆదేశించారు. తిరుపత్తూరు జిల్లా ఏలగిరి కొండపై మినీ ఊటీ తరహాలో ఏటా వేసవి ఉత్సవాలు జరుగుతున్నాయి. అయితే వేలూరు నుంచి తిరుపత్తూరు జిల్లాగా విడిపోవడంతో పాటు కరోనా కారణంగా ఐదేళ్లుగా ఉత్సవాలు జరగడంలేదు. దీంతో కొండపై పార్కు, బోటింగ్, చిన్న పిల్లల పార్కు, తాగునీటి పైపు లైన్‌లు పూర్తిగా ధ్వంసం కావడంతో ఇటీవల పర్యాటకుల సంఖ్య పూర్తిగా తగ్గింది. ఇదిలా ఉండగా మరో వారంలో కొండపై వేసవి ఉత్సవాలు నిర్వహించి అటవీ ప్రాంత వాసులు పారంపర్య కళాజాతాలు నిర్వహించనున్న నేపథ్యంలో అధికారుల బృందం కొండపై వసతులను పరిశీలించారు. అనంతరం బోటింగ్, చిన్న పిల్లల పార్కు, పారా గ్లాడింగ్ వసతి, తదితర వాటిని పరిశీలించి పనులను పూర్తి చేయాలని కలెక్టర్ భాస్కర పాండియన్ అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు పంచాయితీ రాజ్‌శాఖ డైరెక్టర్ సెల్వఅరసు, అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమారి, యూనియన్ చైర్మన్ సత్య సతీష్‌కుమార్, బీడీఓలు దురై, మనవాలన్, తహసీల్దార్ వసంతి ఉన్నారు.

క్రీడల్లో పాల్గొన్న విద్యార్థిని హఠాన్మరణం

తిరువొత్తియూరు: క్రీడల్లో పాల్గొన్న ఓ విద్యార్థిని స్పృహ తప్పి కింద పడి మృతి చెందింది. వివరాలు.. చెన్నై విల్లివాకానికి చెందిన రమేష్ కుమార్తె అభినందన (15). స్థానిక పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. బాస్కెట్‌బాల్‌పై ఆసక్తి ఉన్న ఈ విద్యార్థిని పాఠశాల బాస్కెట్‌బాల్ జట్టులో చేరి పలు టోర్నీల్లో పాల్గొంది. ఈ క్రమంలో విరుదునగర్‌లోని ఒక పాఠశాలలో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొంది. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి రావడానికి పాఠశాల క్రీడా జట్టు సభ్యులు, శిక్షకులు విరుదునగర్ నుంచి మదురై పెరియార్ బస్ స్టేషన్‌కు వచ్చారు. అనంతరం సమీపంలోని రైల్వే స్టేషన్ వద్దకు నడిచారు. ఆ సమయంలో విద్యార్థిని అభినందన తనకు కళ్లు తిరుగుతున్నాయంటూ మహిళా కోచ్ ఒడిలో వాలిపోయింది. వెంటనే 108 అంబులెన్స్‌కి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి పరిశీలించి.. అప్పటికే మరణించినట్లు ప్రకటించారు. సమాచారం అందుకున్న మదురై తిలక్ మైదానం పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేసి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పోలీసులను ఆశ్రయించిన ఎస్‌ఐ జంట

తిరువొత్తియూరు: ప్రేమ వివాహం చేసుకున్న ఇద్దరు సబ్‌ఇన్‌స్పెక్టర్లు ఇరు కుటుంబాల మధ్య ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు పోలీసులను ఆశ్రయించారు. వివరాలు.. తెన్‌కాసి జిల్లా మావూరుచత్రం సమీపంలోని ఔడయ్యనూరు వైద్యలింగాపురానికి చెందిన కుత్తా లింగం (27) రామనాథపురం జిల్లా కముది పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. అలాగే కడయనల్లూరు సమీపంలోని అచ్చంపట్టికి చెందిన ఒడియమ్మాల్(24) కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ బెటాలియన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. వీరిద్దరూ 5 ఏళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవలే పెళ్లి చేసుకున్నారు. వేర్వేరు వర్గాలకు చెందిన వారు కావడంతో ఇరు కుటుంబాల మధ్య ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు తెన్‌కాశి మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. దక్షిణ కాశీ డీఎస్పీ నాగశంకర్ ఇరు కుటుంబాలను పిలిచారు. అయితే యువతి కుటుంబ సభ్యులు రాలేదు. ఇద్దరూ మేజర్లు కావడంతో ఇష్టప్రకారం పెళ్లి చేసుకున్నారని.. ఎలాంటి సమస్యలు తీసుకురావద్దని లింగం కుటుంబ సభ్యులకు తెలిపారు.

నగల కోసం ఇద్దరు మహిళల హత్య

తిరువొత్తియూరు: పల్లిపాళయంలో ఇద్దరు వృద్ధుల హత్య కేసును పోలీసులు ఛేదించారు. నగల కోసమే హత్య చేసినట్లు గుర్తించారు. ఈ కేసులో జలగండాపురానికి చెందిన సెల్వంను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. నామక్కల్ జిల్లా ఒడపల్లి ప్రాంతంలోని వ్యవసాయ భూమిలో ఈ ఏడాది మార్చిలో మావాయి (78) హత్యకు గురైంది. అలాగే ఈ నెల 12వ తేదీ కడచనల్లూరు సమీపంలోని బిల్లుమడై అటవీ ప్రాంతంలో పళనియమ్మాళ్ (64) హత్యకు గురైంది. ఆమె చెవిపోగులు అదృశ్యమయ్యాయి. హంతకుల కోసం ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. ఈ క్రమంలో తాజ్‌నగర్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పళ్లిపాలెం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేశారు.అతడు సేలం జిల్లా జలగండాపురానికి చెందిన సెల్వం (32) అని తేలింది. కూలి పనులు చేసుకునే ఇతను ఒడపల్లి సమీపంలోని బంధువుల ఇంటికి తరచూ వెళ్తూ ఉన్న సమయంలో వ్యవసాయ భూమిలో ఒంటరిగా ఉన్న మావాయిని నగలు తీసివ్వాలని బెదిరించినట్లు.. ఆమె కేకలు వేయడంతో కత్తితో ఆమె గొంతు కోసి హత్య చేసి పారిపోయినట్లు తెలిసింది. ఇలాగే కడచనల్లూరు అటవీ ప్రాంతంలో ఒంటరిగా ఉన్న పళనియమ్మాళ్ తలపై కర్రతో, ముఖంపై దాడి చేసి హత్య చేసి రెండు కమ్మలు లాక్కుని పారిపోయినట్లు ఒప్పుకున్నాడు. అతనిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

క్లుప్తంగా...

కంబాలకొండలో అరుదైన పాము

- బార్కుడియా లింబ్‌లెస్ స్కింక్ స్నేక్‌గా గుర్తింపు
- జాతిని సంరక్షించేందుకు జిల్లా అటవీ శాఖ చర్యలు



సాక్షి, విశాఖపట్నం: అరుదైన పాము జాడలు కంబాల కొండ పరిధిలో కనిపించాయి. మడ అడవుల్లో కనిపించే బార్కుడియా లింబ్‌లెస్ స్కింక్ స్నేక్‌ని అభయారణ్యంలో గుర్తించినట్లు డీఎఫ్‌వో అనంత్‌శంకర్ సోమవారం వెల్లడించారు. 1790ల్లో తొలిసారిగా కంబాలకొండ అభయారణ్యంలో బార్కుడియా లింబ్‌లెస్ స్కింక్ స్నేక్‌లు విరివిగా కనిపించేవి. ఆ తర్వాత క్రమంగా అంతరించిపోయాయని అనుకున్నారు. 1950ల్లో మరోసారి వీటి ఉనికిని గుర్తించారు. ఆ సమయంలో కోల్‌కతాలోని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు దీన్ని పంపించారు. అనంతరం ఈ బార్కుడియాలు కంబాలకొండలో దర్శనమివ్వలేదు. దశాబ్దాల అనంతరం మళ్లీ ఈ అభయారణ్యంలో బార్కుడియా కనిపించింది. ఏపీ అటవీశాఖలో విధులు నిర్వర్తిస్తున్న ప్రాజెక్టు సైంటిస్ట్ ఆడారి యజ్ఞవతి దీన్ని గుర్తించారు. బార్కుడియా స్నేక్ జాతిని సంరక్షించేందుకు అటవీ శాఖ తక్షణ చర్యలు తీసుకుంటుంది. 16.5 సెంటీమీటర్లు పొడవు మాత్రమే ఉండే ఈ లింబ్‌లెస్ స్కింక్ జీవవైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తోంది.

సింహాద్రి ఎన్టీపీసీలో విద్యుదుత్పత్తికి అంతరాయం

పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రెండో యూనిట్ బాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం ఏర్పడడంతో సమస్య ఉత్పన్నమైంది. విభాగాలు మరమ్మతులు చేపడుతున్నారు. బుధవారం సాయంత్రానికల్లా యూనిట్ నుంచి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించే అవకాశం ఉంది. ప్రస్తుతం 1, 3, 4 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి యథావిధిగా కొనసాగుతోందని సంస్థ అధికార వర్గాలు తెలిపాయి.

ప్రధాని ఇచ్చిన నిధులతోనే అభివృద్ధి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



కావలి: ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన రూ.6 లక్షల కోట్ల నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందనే విషయాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు తెలియజేసి మిస్డ్ కాల్ ఇచ్చేలా చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. నెల్లూరు జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని సోమవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించారు. వీర్రాజు మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన రాజమండ్రిలో లేదా విశాఖపట్నంలో ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్‌ను బీసీలతో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రధానంగా మూడు అంశాలపై తమ పార్టీ దృష్టి సారించిందని చెప్పారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో చార్జిషీట్లు వేస్తామని చెప్పారు. ఈనెల 30 నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రధాని 9 ఏళ్ల పాలన కార్యక్రమాల అనంతరం ఈ కార్యక్రమాన్ని జరపనున్నామన్నారు. గవర్నర్, డీజీపీని కలిసి కావలిలో తమ పార్టీకి చెందిన బీసీ నాయకుడిపై కావలి డీఎస్పీ ప్రవర్తించిన తీరుపై ఫిర్యాదు చేస్తామని చెప్పారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందని, దీనిపై బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బీసీల సామాజిక చైతన్య సభను వచ్చే నెలలో కర్నూలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోలా ఆనంద్, వాకాటి నారాయణరెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జి.భరత్‌కుమార్ యాదవ్, కందుకూరి వెంకట సత్యనారాయణ, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

ఈ నెల 31 నాటికి ఖాళీలను పరిగణనలోకి తీసుకుని బదిలీలు

- 2025 మే 31 లేదా అంతకుముందే రిటైరయ్యే వారి అభ్యర్థన మేరకు బదిలీ
- 2022–23 నాటికి ఐదేళ్లు ఒకేచోట సర్వీస్ పూర్తిచేసిన గ్రేడ్-2 హెచ్‌ఎంలంతా బదిలీ
- ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకూ తప్పనిసరి బదిలీ
- ఏ మేనేజ్‌మెంట్ సర్వీస్‌లో ఉండే టీచర్లకు ఆ విభాగంలోనే ట్రాన్స్‌ఫర్
- మార్గదర్శకాలకు జారీ చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రీస్కూల్, హైస్కూల్, హైస్కూల్ ప్లస్ స్థాయిలో సబ్జెక్ట్ ఉపాధ్యాయులు, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పోస్టులను బదిలీలతో భర్తీ చేసేందుకు అనువుగా సోమవారం జీవో నంబర్ 47 జారీ చేసింది. ఈ నెల 31వ తేదీ నాటికి ఉన్న ఖాళీలను పరిగణనలోకి తీసుకుని బదిలీలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2025 మే 31 లేదా అంతకుముందే ఉద్యోగ విరమణ చేసేవారికి వారి అభ్యర్థన మేరకు బదిలీలు చేపట్టనుంది. వీరుకాకుండా 2022–23 విద్యా సంవత్సరం నాటికి ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న ఇతర ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కానున్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు ఏ మేనేజ్‌మెంట్ సర్వీస్‌లో కొనసాగుతున్నారో.. ఆ విభాగంలోనే బదిలీ అవుతారు.

ఎన్‌సీసీ/స్కౌట్ ఆఫీసర్లు ఆ పోస్టులు ఉన్న చోటికే..

ఎన్‌సీసీ/స్కౌట్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఆయా పోస్టులు ఉన్న పాఠశాలలకే బదిలీ చేస్తారు. లేదంటే అక్కడే కొనసాగుతారు. వారి అభ్యర్థన మేరకు బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎయిడెడ్ ఉపాధ్యాయుల సర్వీస్‌ను కూడా పరిగణనలోకి తీసుకుని, వారు ప్రభుత్వ/స్థానిక సంస్థల పాఠశాలల్లో చేరిన తేదీ నుంచి సర్వీస్‌ను లెక్కించి అవకాశం ఉన్నవారికి బదిలీ చేసే అవకాశం కల్పించారు. 40 శాతం దృష్టి లోపం ఉన్నవారు, 75 శాతం శారీరక వైకల్యం ఉన్నవారికి మినహాయింపు ఇచ్చినప్పటికీ.. వారు బదిలీ కోరుకుంటే దరఖాస్తు చేసుకోవచ్చు. పేరెంట్ మేనేజ్‌మెంట్‌లోకి వెళ్లాలనుకునేవారు వాటిలోని ఖాళీలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. వీరికి వారి మాతృ సంస్థలోని సీనియారిటీనే పరిగణనలోకి తీసుకుంటారు.

మునిసిపల్ స్కూళ్లకు ప్రత్యేక మార్గదర్శకాలు

పురపాలక శాఖ అధీనంలోని స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీకి ప్రత్యేక మార్గదర్శకాలను విద్యాశాఖ జారీ చేస్తుంది. మొత్తం బదిలీ ప్రక్రియలో పాత స్టేషన్ పాయింట్ల ఆధారంగానే ప్రక్రియ కొనసాగుతుందని, ప్రస్తుత స్టేషన్ పాయింట్లు పరిగణనలోకి తీసుకోరని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ఐటీడీఏ పాఠశాలల్లో పనిచేస్తున్న నాన్-ఐటీడీఏ ఉపాధ్యాయులు ఐటీడీయేతర పాఠశాలలకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. అయితే, వారికి బదిలీ ప్రక్రియ ముగిసిన తర్వాత మిగిలిన ఖాళీల్లో వీరికి అవకాశం కల్పిస్తారు. పాత జిల్లాలనే యూనిట్‌గా పరిగణిస్తారు. స్టేషన్, ప్రత్యేక పాయింట్లు, జాబితా ఖరారు, ఖాళీల నోటిఫికేషన్ తర్వాత బదిలీ ప్రక్రియకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ప్రాంతం ఆధారంగా స్టేషన్ పాయింట్లు

- ప్రాంతం ఆధారంగా స్టేషన్ పాయింట్లను కేటాయించారు. కేటగిరీ 4 ఉన్న ప్రాంతాల్లో పనిచేసిన వారికి ఏడాది సర్వీస్‌కు 5 పాయింట్ల చొప్పున, కేటగిరీ 1, 2, 3లో పనిచేసిన వారికి ఏడాదికి 1, 2, 3 పాయింట్ల చొప్పున కేటాయించారు.
- ప్రత్యేక కాంపిటెంట్ అథారిటీల ద్వారా ఉపాధ్యాయుల సీనియారిటీ, వెబ్ ఆప్షన్స్ ఆధారంగా బదిలీ ప్రక్రియ ఉంటుంది. బదిలీ ఉత్తర్వులు కూడా ఆ స్థాయిలోనే జారీ చేస్తారు.
- ప్రభుత్వ స్కూళ్ల ప్రధానోపాధ్యాయుల బదిలీలు జోనల్ స్థాయిలో (విశాఖపట్నం, గుంటూరు, కాకినాడ, వైఎస్సార్ జిల్లా) జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గాను, ఆర్జేడీ మెంబర్ సెక్రటరీగాను, ఆయా జిల్లాల డీఈవోలు సభ్యులుగా ఉన్న కమిటీ చేపడుతుంది.
- జిల్లా పరిషత్ పాఠశాలల్లో హెచ్‌ఎం/టీచర్ల బదిలీలను జిల్లా పరిషత్ చైర్మన్/స్పెషల్ ఆఫీసర్ చైర్మన్‌గాను, ఆర్జేడీ మెంబర్ సెక్రటరీగా, జెడ్పీ సీఈవో మెంబర్, డీఈవో సభ్యులుగా ఉన్న కమిటీ చేపడుతుంది.
- ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీ కలెక్టర్/జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గాను, డీఈవో కార్యదర్శి/మెంబర్స్‌గా ఉన్న కమిటీ ఆధ్వర్యంలో జరుగుతుంది.
- ఉపాధ్యాయుల్లో భార్య/భర్త ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నా, అవివాహిత మహిళా హెచ్‌ఎంలు, దివ్యాంగులు మొదలైన వారికి ప్రత్యేక పాయింట్లు కేటాయించింది. బదిలీ ప్రక్రియలో ఏ ఇద్దరికి సమాన పాయింట్లు వచ్చినా వారి సీనియారిటీని పరిగణనలోకి తీసుకుంటారు.

చిరుధాన్యాల సాగు విస్తరించాలి

- అందుకు కార్యాచరణ సిద్ధం చేయండి
- ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపు



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: చిరుధాన్యాల సాగు విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ కోరారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం సోమవారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కొత్త ప్రాంతాల్లో చిరుధాన్యాల సాగు విస్తరించడానికి అనుకూలమైన ప్రాంతాలను ఎంపికచేసి వాటిని అభివృద్ధి చేయాలని సూచించారు. ఇందుకోసం విశ్వవిద్యాలయ పరిశోధన విభాగాలు వ్యవసాయ శాఖ సహకారంతో కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్-2 (ఎస్‌డీజీ-2) 2030 నాటికి ఆహార భద్రతను సాధించడం, ఆకలిని అంతం చేయడం, పోషకాహారాన్ని మెరుగుపరచడం, స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. భారతదేశం మిల్లెట్ ఆధారిత ఆహారాన్ని ప్రోత్సహిస్తోందని, మిల్లెట్లు శీతోష్ణస్థితికి అనువుగా ఉండటమే కాకుండా పోషకాహారానికి గొప్ప మూలమని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చొరవతో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ (యూఎన్‌జీఏ) జాతీయ, ప్రపంచవ్యాప్తంగా చిరుధాన్యాల వినియోగాన్ని పెంచాలనే ప్రధాన నినాదంతో 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించిందని చెప్పారు. మిల్లెట్ వినియోగం పోషకాహారం, ఆహారభద్రత, రైతుల సంక్షేమాన్ని పెంచుతుందన్నారు. విశ్వవిద్యాలయం పరిశోధన కార్యక్రమాల్లో పోషకాహార భద్రతను ప్రధాన ప్రాధాన్యతలలో ఒకటిగా తీసుకోవడం అభినందనీయమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలు మొత్తం స్థూలవిలువ ఆధారిత వాటాలో 35 శాతం కలిగి ఉన్నాయని తెలిపారు. దేశంలో అన్ని రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో మన వర్సిటీ 7వ ర్యాంక్ సాధించడం ప్రశంసనీయమన్నారు. రాబోయే సంవత్సరాల్లో వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణపై మరింత దృష్టి సారించడం ద్వారా అన్ని టాప్ 5 ర్యాంకుల్లోకి చేరుకుంటుందని చెప్పారు. గ్రాడ్యుయేట్లు, మెడల్ విజేతలు, విశిష్టతలు, అవార్డులు, డిగ్రీ గ్రహీతలు, ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీతలను ఆయన అభినందించారు. తొలుత వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి యూనివర్సిటీ వార్షిక నివేదికను సమర్పించారు. ట్రస్ట్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ (టీఏఏఎస్) చైర్మన్, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజేంద్రసింగ్ పరోడా ముఖ్యఅతిథిగా పాల్గొని వర్సిటీ గౌరవ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ ఎ.ఇబ్రహిమాలి అబూబకర్ సిద్ధిక్, ఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాంట్ బయోటెక్నాలజీ ప్రొఫెసర్ నాగేంద్రకుమార్ సింగ్‌లకు వ్యవసాయ శాస్త్రాల్లో అత్యుత్తమ పరిశోధనలకు గుర్తింపుగా అవార్డులు అందజేశారు.

రెండు జాతీయ అవార్డుల ఏర్పాటు

మొదటిసారిగా విశ్వవిద్యాలయం డాక్టర్ ఎం.వి.రెడ్డి, వి.రామచంద్రరావు పేర్లతో వ్యవసాయ పరిశోధనలో ఎక్సలెన్స్ కోసం రెండు జాతీయ అవార్డులను ఏర్పాటు చేసింది. డాక్టర్ ఎం.వి.రెడ్డి, వి.రామచంద్రరావు రెండు మెగా రైస్ బీపీటీ 5204 (సాంబామసూరి), ఎంటీయూ 7029 (స్వర్ణ) రకాలను అభివృద్ధి చేశారు.

నిర్దిష్ట ప్రింటెడ్ ఫార్మాట్‌లో ఉత్తర్వులివ్వడం ఆపాలి

- నిబంధనలకు అనుగుణంగా లేని ఉత్తర్వులు చట్ట విరుద్ధమే..
- వివరణ సంతృప్తికరంగా లేదని ఒక లైన్‌లో పేర్కొంటే సరిపోదు
- నిర్దిష్ట కారణాలను తెలియజేయాల్సిందే
- ఇళ్లు, భవనాల కూల్చివేతకు సంబంధించిన మునిసిపల్ కమిషనర్లకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఇళ్లు, భవనాల కూల్చివేత విషయంలో మునిసిపల్ కమిషనర్లు నిర్దిష్ట ముద్రిత నమూనా(ప్రింటెడ్ ఫార్మాట్)ల్లో ఉత్తర్వులు జారీ చేయడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. యాంత్రికంగా సంతకాలు చేసేస్తూ ప్రింటెడ్ ఫార్మాట్‌లలో ఉత్తర్వులు జారీ చేయడం కుదరదని హైకోర్టు తేల్చి చెప్పింది. ప్రింటెడ్ ఫార్మాట్‌లో జారీ చేసే ఉత్తర్వులు చట్ట ప్రకారం చెల్లుబాటు కావని పేర్కొంది. ఇళ్లు, భవనాల కూల్చివేత నోటీసులకు బాధిత వ్యక్తి ఇచ్చిన సమాధానాన్ని పరిగణనలోకి తీసుకుని.. తగిన కారణాలతో సానుకూల లేదా వ్యతిరేక ఉత్తర్వులు జారీ చేయాలని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని మునిసిపల్ కార్పొరేషన్లకు ఆదేశాలు జారీ చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శికి స్పష్టం చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ ఇటీవల తీర్పు వెలువరించారు. వివరాలు.. కూల్చివేతకు సంబంధించి ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ జారీ చేసిన నోటీసును సవాల్ చేస్తూ చింతచెట్టు వీధికి చెందిన రత్నప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ రవినాథ్ తిల్హరీ విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది సి.వెంకయ్య వాదనలు వినిపిస్తూ.. రత్నప్రసాద్ తన భవనానికి మరమ్మతులు చేయిస్తుండగా.. అక్రమ నిర్మాణాలు చేస్తున్నామంటూ వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారని చెప్పారు. దీంతో మునిసిపల్ కమిషనర్ జనవరి 12న నోటీసు జారీ చేశారని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేస్తున్నామని వివరణ ఇచ్చినా.. కమిషనర్ తన పిటిషనర్ చేపట్టిన నిర్మాణాన్ని తొలగిస్తామంటూ ఏప్రిల్ 24న తుది ఉత్తర్వులిచ్చారని పేర్కొన్నారు. తొలగించడానికి గల కారణాలను ఉత్తర్వుల్లో కమిషనర్ పేర్కొనలేదని వివరించారు. దీంతో హైకోర్టు ఆదేశాల మేరకు కమిషనర్ వెంకటకృష్ణ కోర్టు ముందు హాజరయ్యారు. మునిసిపల్ కార్పొరేషన్ తరఫు న్యాయవాది నరేష్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. అన్ని మునిసిపల్ కార్పొరేషన్‌లలో నిర్దిష్ట ప్రింటెడ్ ఫార్మాట్ ఉంటుందని.. అందులో పేరు, ఆస్తుల వివరాలను పేర్కొంటూ.. కమిషనర్ డిజిటల్ సంతకం చేస్తారని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. చట్ట నిబంధనలకు, సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగా లేని ప్రింటెడ్ ఫార్మాట్‌లో ఉత్తర్వులివ్వడం చట్ట విరుద్ధమే అవుతుందన్నారు. బాధిత వ్యక్తి ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదని ఒక లైన్‌లో చెబితే సరిపోదన్నారు. ఉత్తర్వుల్లో కారణాలను చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. మళ్లీ ఇందుకోసం సాకులు వెతకవద్దని ఆదేశించారు. ఏలూరు కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను న్యాయమూర్తి రద్దు చేశారు. చట్ట ప్రకారం 2 నెలల్లో తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు.

అక్రమార్జనలో ‘రాజు’

- చిత్తూరు పంచాయతీరాజ్ ఈఈ రుద్రరాజు రవి నివాసాల్లో ఏసీబీ సోదాలు
- ఆదాయానికి మించి భారీగా ఆస్తులు ఉన్నట్టు గుర్తింపు
- పార్వతీపురం విజిలెన్స్ విభాగంలో ఏఈఈ నివాసాల్లోనూ సోదాలు
- లంచం తీసుకుంటుండగా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పట్టివేత



చిత్తూరు మిట్టూరులోని రుద్రరాజు రవి ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

సాక్షి, అమరావతి/చిత్తూరు (కార్పొరేషన్)/విశాఖ దక్షిణం/శ్రీకాకుళం క్రైమ్/పార్వతీపురం టౌన్: అవినీతి నిరోధక శాఖ వివిధ ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో సోమవారం ఇద్దరు ఇంజినీరింగ్ అధికారులు, మరో దేవదాయ శాఖ ఉద్యోగి పట్టుబడ్డారు. ఇందులో ఆదాయానికి మించి ఆస్తుల్ని కలిగి ఉన్న ఇద్దరితోపాటు లంచం తీసుకుంటుండగా ఒకరు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినట్టు ఏసీబీ డీజీపీ రవీంద్రనాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రుద్రరాజు రవిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఏసీబీ అధికారులు ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఇందులో ఆదాయానికి మించి భారీగా ఆస్తులను గుర్తించారు. రూ.39.40 లక్షల నగదు, 3.87 కిలోల వెండి, బంగారం, వజ్రాలతోపాటు భవనాలు, ఖరీదైన కార్లు ఉన్నట్టు తేల్చారు. వీటితోపాటు భార్య, కుమార్తె, మరో వ్యక్తి పేరుపై లాకర్లు ఉన్నాయని, ఇంకా సోదాలు జరుగుతున్నట్టు పేర్కొన్నారు.

పార్వతీపురం ఏఈఈ తక్కువ తినలేదు

పార్వతీపురం సబ్ డివిజన్ పంచాయతీరాజ్ విజిలెన్స్ విభాగంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వీరమాచినేని సుధాకర్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. విశాఖపట్నం, విజయవాడలో రెండు ఫ్లాట్లు, విజయనగరం, విజయవాడలో మూడు ఖాళీ స్థలాలు, కృష్ణా జిల్లాలో ఆరుచోట్ల 8.06 ఎకరాల వ్యవసాయ భూమి, 719.33 గ్రాముల బంగారు నగలు, 2.39 కేజీల వెండి వస్తువులు, రూ.78,392 నగదు, బ్యాంకుల్లో రూ.20,30,552 డిపాజిట్లతో పాటు అత్తగారింట్లో నాలుగు లాకర్ల తాళాలను గుర్తించారు.

పట్టుబడిన లంచగొండి

గుంటూరులో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ (సీనియర్ అసిస్టెంట్)గా విధులు నిర్వహిస్తున్న మీనా వెంకటేశ్వరరావు న్యాయస్థానంలో ఉన్న ఓ కేసు విషయంలో ఓ వ్యక్తి నుంచి రూ.10 వేల లంచం డిమాండ్ చేసి రూ.5 వేలు తీసుకున్నారు. మరో రూ.5 వేలు ఇస్తేనే కౌంటర్ దాఖలు చేస్తానని బాధితుడిని ఇబ్బంది పెట్టడంతో సదరు వ్యక్తి ఏసీబీని ఆశ్రయించాడు. సోమవారం మీనా వెంకటేశ్వరరావు బాధితుడి నుంచి మరో రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేసినట్టు డీజీపీ రవీంద్రనాథ్‌రెడ్డి వివరించారు.

సినీ నటుడు శరత్‌బాబు మృతికి మంత్రి వేణు సంతాపం

సాక్షి, అమరావతి: తెలుగు, తమిళ, కన్నడ సినీ ప్రేక్షకులను తన విలక్షణ నటనతో అలరించిన సినీ నటుడు శరత్‌బాబు మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 220కి పైగా సినిమాల్లో నటించి మెప్పించిన శరత్‌బాబు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఆమదాలవలస గ్రామానికి చెందిన శరత్‌బాబు అంచెలంచెలుగా ఎదిగారని కొనియాడారు. సేవా కార్యక్రమాల్లో కూడా ముందుండే వారని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. శరత్‌బాబు కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలియజేశారు.


చంద్రబాబు మాయలో పడొద్దు

- దళిత సంఘాల నేతలకు మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకరావు హితవు

సాక్షి, అమరావతి: వాడుకుని వదిలేయడంలో అగ్రగణ్యుడు, మేకవన్నె పులి లాంటి చంద్రబాబు మాయలో పడొద్దని దళిత సంఘాల నేతలకు ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు హితవు పలికారు. టీడీపీ దళిత విభాగం ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కనకరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఆయినవారితోను, అధికారం పోయినప్పుడు దళితులు, బీసీలతోను ఊసరవెల్లి రాజకీయాలను నడపడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో దళితులకు రక్షణ లేదని తెలిపారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని తీవ్రంగా అవమానించి తన నైజం చాటుకున్న చంద్రబాబును దళిత సంఘాలు నమ్మడం సరికాదని పేర్కొన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో దళిత సంక్షేమం, సామాజికన్యాయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌పై విమర్శలు చేయడం దారుణమని తెలిపారు. వాస్తవాలు గ్రహించి మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.

భర్తే కాలయముడు

- కారులోనే మెడకు చున్నీ బిగించి హత్య
- ఆ నెపాన్ని భార్య స్నేహితుడిపైకి నెట్టే కుట్ర
- కోట రాధ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ప్రకాశం ఎస్పీ మలికా గర్గ్



సాక్షి ప్రతినిధి, ఒంగోలు : ఒంగోలులో ఇటీవల సంచలనం సృష్టించిన హత్యకేసులో కోట రాధ(35)ను భర్తే హత్య చేశాడు. స్నేహితుడి ముసుగులో చేసిన ఈ హత్యను పోలీసులు బయటపెట్టారు. ఈ మేరకు ఎస్పీ మలికా గర్గ్ సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా జిల్లెళ్లపాడుకు చెందిన మేడం సుధాకరరెడ్డి కుమార్తె రాధకు, తెలంగాణ కోదాడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కోట మోహన్‌రెడ్డితో 2013లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. రాధ, మోహన్‌రెడ్డిల మధ్య కొంతకాలంగా ఆర్థిక పరమైన వివాదాలు పొడచూపాయి. వెలిగండ్ల మండలం గండ్లోపల్లికి చెందిన కేతిరెడ్డి కాశిరెడ్డి అలియాస్ బాలకాశయ్యకు, రాధకు మధ్య ఆర్థిక పరమైన లావాదేవీలు కొనసాగుతూ వచ్చాయి. కాశిరెడ్డి రాధకు చిన్నప్పటి క్లాస్‌మేట్. రాధ, మోహన్‌రెడ్డిలకు ఇద్దరికీ కలిపి దాదాపు రూ.1.27 కోట్ల వరకు కాశిరెడ్డి అప్పు ఉన్నాడు. దీనికి తోడు కాశిరెడ్డి ఇవ్వాల్సిన డబ్బుకు సంబంధించి రాధ, మోహన్‌రెడ్డిలకు గతంలో ఇన్‌సాల్వెన్సీ పిటిషన్(ఐపీ) నోటీసులిచ్చాడు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య గొడవలు పెరిగాయి. స్నేహితులతో రాధ సన్నిహితంగా ఉండటాన్ని కూడా మోహన్‌రెడ్డి సహించలేకపోయాడు. ఈ నేపథ్యంలో భార్యను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. చౌడేశ్వరి అమ్మవారి కొలువుల కోసం స్వగ్రామం వెళ్లిన సందర్భాన్ని అనుకూలంగా మలుచుకుని పథక రచన చేశాడు. ఉద్యోగ రీత్యా తాను నివాసం ఉంటున్న హైదరాబాద్ మల్కాజిగిరి నుంచి బయలుదేరి ఈ నెల 16న మాదాపూర్‌లోని లాంగ్ డ్రైవ్ రెంటెడ్ కార్స్ యాప్‌లో కారు బుక్ చేసుకుని సెల్ఫ్ డ్రైవ్‌తో కనిగిరి చేరుకున్నాడు. ఆ ముందు రోజు సంగారెడ్డి నుంచి పఠాన్ చెరువు వెళ్తూ రోడ్డు పక్కన చెరుకు రసం బండి దగ్గర ఆగాడు. అక్కడ తన సెల్‌ఫోన్ స్విచ్ ఆగిపోయిందని చెరుకు రసం అమ్మే ఆమె వద్ద సెల్‌ఫోన్ తీసుకుని, ఆ ఫోన్‌లోంచి ఆమెకు తెలియకుండా సిమ్ తీసేసుకున్నాడు.

కాశిరెడ్డి పేరుతో చాటింగ్..

కాశిరెడ్డి పేరుతో భార్య రాధతో చాటింగ్ మొదలెట్టాడు. తాను కొంత డబ్బు ఇస్తానని నమ్మబలికాడు. ఆ తర్వాత హైదరాబాద్ నుంచి బయలుదేరి వినుకొండ వచ్చి మరో సిమ్ కొనుగోలు చేసి చాటింగ్‌లు చేశాడు. ఈ నెల 16వ తేదీ రాత్రికి ఒంగోలు వచ్చిన మోహన్‌రెడ్డి అక్కడ ఓ లాడ్జిలో బస చేశాడు. 17న ఒంగోలు నుంచి కనిగిరి చేరుకున్నాడు. ముందు చాటింగ్‌ల ద్వారా ఇచ్చిన సమాచారం మేరకు రాధ కనిగిరిలోని పామూరు బస్టాండ్ వద్దకు వెళ్లింది. అక్కడ కారులో భర్త మోహన్‌రెడ్డి కనిపించడంతోఅసలు విషయం ఎక్కడ బయట పడుతుందోనని భయపడిన రాధ వెంటనే భర్త కారెక్కింది. అక్కడ నుంచి పామూరు రోడ్డులోని డిగ్రీ కాలేజీ వరకు కారులో వెళ్లారు. ఇద్దరి మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. ఆ వెంటనే ముందుగా వేసుకున్న పథకం ప్రకారం మోహన్‌రెడ్డి తన భార్య మెడలో ఉన్న చున్నీతో గొంతును గట్టిగా బిగించడంతో ఆమె ప్రాణాలు విడిచింది. ఆ హత్యను రోడ్డు ప్రమాదంలా చిత్రీకరించేందుకు కుయుక్తికి తెరలేపాడు. మృతదేహాన్ని రాత్రి 11 గంటల సమయంలో కనిగిరి–వెలిగండ్ల రోడ్డులోని జిల్లెళ్లపాడు అడ్డరోడ్డు వద్ద రోడ్డు మార్జిన్‌లో పడేసి మృతదేహం పైనుంచి కారును పోనిచ్చాడు. రాధ ఫోన్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. తొలుత చాటింగ్ చేశాడని భావించిన కాశిరెడ్డిని అనుమానించారు. అనంతరం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భర్త మోహన్‌రెడ్డి ఎత్తులను చిత్తు చేశారు. అసలు నిందితుడు భర్తేనని తేల్చి ఆదివారం అరెస్ట్ చేశారు. తల్లి హత్యకు గురికావడం, తండ్రి జైలు పాలవడంతో వారి పిల్లలను బాలల సంరక్షణ కమిటీ ద్వారా సంరక్షిస్తామని ఎస్పీ మలికాగర్గ్ పేర్కొన్నారు. మహిళ కేసుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో అప్రమత్తంగా ఉందని, డీజీపీ కూడా ఈ కేసు విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించారని చెప్పారు.

గుండెపోటుతో విమానంలో ప్రయాణికుడు మృతి

- షార్జా నుంచి విజయవాడ వస్తున్న విమానంలో ఘటన
- స్వగ్రామం ఏలూరు జిల్లా నిడదవోలుకు మృతదేహం తరలింపు



నూకరాజు మృతదేహం

గన్నవరం: షార్జా నుంచి విజయవాడ వస్తున్న విమానంలో ప్రయాణిస్తున్న ఓ వృద్ధుడు ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. విమానాశ్రయ వర్గాల సమాచారం మేరకు... ఏలూరు జిల్లా నిడదవోలుకు చెందిన చెక్కా నూకరాజు(85) కుటుంబ సభ్యులతో కలిసి దుబాయ్‌లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బంధువుల వివాహ కార్యక్రమం నిమిత్తం సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి షార్జా నుంచి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)కు బయలుదేరారు. విమానం మరో అరగంటలో ఎయిర్‌పోర్టుకు చేరనుందనగా నూకరాజుకు ఒక్కసారిగా తీవ్రమైన గుండెపోటు వచ్చింది. విమానంలోని సిబ్బంది ఆయనకు ఫస్ట్ ఎయిడ్ చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. పైలెట్ల సమాచారం మేరకు విమానం ల్యాండ్ అయిన వెంటనే నూకరాజును ఆస్పత్రికి తరలించేందుకు అధికారులు అంబులెన్స్‌ను సిద్ధం చేశారు. విమానాశ్రయంలో నూకరాజును పరీక్షించిన అంబులెన్స్ సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామం నిడదవోలుకు తీసుకువెళ్లారు. ఈ విమానంలో మృతుడి కుమారుడు, భార్యతో పాటు మరో ఏడుగురు బంధువులు ఉన్నారు.

కట్టుదిట్టంగా కంటి వెలుగు..

మంత్రి విడదల రజిని



సాక్షి, అమరావతి: కంటి వెలుగు ద్వారా రాష్ట్రంలోని లక్షలాది మందికి వెలుగులు నింపుతున్నామని, ఈ కార్యక్రమాన్ని మరింత కట్టుదిట్టంగా అమలు చేసేందుకు అధికార యంత్రాంగం దృష్టిపెట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఐఐసీ టవర్స్‌లో ఉన్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంపై మంత్రి రజిని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని మొత్తం ఆరు దశల్లో నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారన్నారు. తొలి, రెండు దశల్లో పాఠశాల స్థాయిలోపు విద్యార్థులకు.. ఆ తర్వాతి రెండు దశల్లో 60 ఏళ్లు దాటిన వృద్ధులకు.. చివరి రెండు దశల్లో 18–60 ఏళ్లలోపు వారందరికీ కంటి పరీక్షలు చేసి సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఇప్పటికే తొలి రెండు దశల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 66.17 లక్షల మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామన్నారు. వీరిలో 1.58 లక్షల మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించామని.. 310 మంది విద్యార్థులకు సర్జరీలు పూర్తిచేశామన్నారు. ఇక 2020 జనవరి 18 నుంచి 3–4 దశల కార్యక్రమాన్ని చేపట్టామని.. కోవిడ్ కారణంగా మధ్యలో కొంత విరామం వచ్చిందని మంత్రి వివరించారు. అంతేకాక.. రాష్ట్రంలో 60 ఏళ్లు దాటిన వృద్ధులు 56,88,424 మంది ఉన్నట్లు గుర్తించామని, వీరిలో 33,50,474 మందికి పరీక్షలు నిర్వహించామని ఆమె చెప్పారు. దాదాపు 12 లక్షల మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించగా ఇప్పటికే 8.9 లక్షల మందికి వాటిని ఉచితంగా ఇచ్చామన్నారు. అలాగే, 1.9 లక్షల మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరం కాగా.. వారిలో 88వేల మందికి చేశామని ఆమె చెప్పారు.

ఫిబ్రవరి 1 నుంచి మళ్లీ ఉధృతంగా..

తాజాగా.. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఈ కార్యక్రమాన్ని మళ్లీ ఉధృతంగా చేపట్టామని మంత్రి రజిని చెప్పారు. ఇప్పటివరకు మరో 10.14 లక్షల మందికి పరీక్షలు నిర్వహించామని, కళ్లజోళ్లు, సర్జరీలను ప్రభుత్వమే ఉచితంగా చేయిస్తోందన్నారు. మూడు, నాలుగు దశల్లో పరీక్షలు నిర్వహించాల్సిన వృద్ధులతోపాటు చివరి రెండు దశల్లో పరీక్షలు నిర్వహించాల్సిన 18–60 ఏళ్లలోపు వారికి కూడా కంటి పరీక్షలను వేగవంతం చేయనున్నామన్నారు. మరోవైపు.. ఫ్యామిలీ డాక్టర్ విధానానికి కంటివెలుగు కార్యక్రమాన్ని అనుసంధానించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు మంత్రి రజిని సూచించారు.

335 కమిటీల ద్వారా సేవలు

ఇక వైఎస్సార్ కంటి వెలుగును ఉధృతం చేసేందుకు తాజాగా 335 కమిటీలను వేసి, ముందుగానే నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నెలకు 5.32 లక్షల పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో ఏపీవీవీపీ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీహెచ్ రామిరెడ్డి, కంటివెలుగు నోడల్ ఆఫీసర్ యాస్మిన్, తదితరులు పాల్గొన్నారు.

• తెలంగాణ

‘మావో’లకు సహకరిస్తున్న పదిమంది అరెస్ట్

- భద్రాద్రి జిల్లా ఎస్పీ వినీత్ వెల్లడి

కొత్తగూడెంటౌన్: మావోయిస్టులకు భారీగా పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న ఐదుగురు మిలీషియా సభ్యులు, మరో ఐదుగురు కొరియర్లను అరెస్ట్ చేసినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. దుమ్ముగూడెం మండలం ములకనాపల్లి అటవీ ప్రాంతంలో స్థానిక పోలీసులు, 141 బెటాలియన్, సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా 10 మంది అనుమానాస్పదంగా కనిపించారని, తనిఖీ చేయగా.. పేలుడు పదార్థాలతో వారు వెళుతున్నట్లు గుర్తించి అరెస్టు చేశామని చెప్పారు. పట్టుబడిన వారిలో కొరియర్లు వరంగల్ జిల్లాకు చెందినవారు కాగా, మిలీషియా సభ్యులు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాకు చెందినవారిగా గుర్తించామన్నారు. వారినుంచి డిటోనేటర్లు, బొలేరో, ట్రాక్టర్, రెండు ద్విచక్ర వాహనాలతో పాటు ల్యాండ్‌మైన్లు, ఐఈడీలు, రాకెట్ లాంచర్లలో ఉపయోగపడే పేలుడు పదార్థాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గృహిణిగా ఇంటి బాధ్యతలు మహిళలకు ఎలాగూ తప్పదు.
ఇక ఆదాయ మార్గం గురించి ఆలోచించడం, వాటిని అమలులో పెట్టడం అంటే తగిన వనరులే కాదు ఇంటిల్లిపాదీ అందుకు సహకరించాలి.
హైదరాబాద్ బండ్లగూడ నాగోల్‌లో ఉంటున్న ఆర్.రాజేశ్వరి ని కలిసినప్పుడు 'పదేళ్లుగా చేస్తున్న పచ్చళ్లు, పొడుల వ్యాపారం... ఆదాయంతో పాటు బిజినెస్ ఉమన్‌గానూ గుర్తింపును తెచ్చిపెట్టింది' అని వివరించింది.

కాదేది ఉపాధికనర్హం!

ఇంటి పచ్చళ్లతో ఇల్లు దిద్దుకుంది


● రాజేశ్వరి



'మన ఇళ్లల్లో అన్ని కాలాల్లోనూ ఏవో ఒక పచ్చళ్లు పెట్టడం అనేది గృహిణులకు అలవాటైన పనే. ఇంట్లో నేనూ అలాగే చేస్తుండే దాన్ని. నా చేతి పచ్చళ్లు రుచికరంగా ఉంటాయని ఇంట్లోనూ, బంధుమిత్రులు, చుట్టుపక్కల వాళ్లు బాగా మెచ్చుకునేవారు. అడిగి మరీ చేయించుకునేవారు. దీనికి తోడు నాకు తెలిసిన వాళ్లు విదేశాలకు వెళ్లినప్పుడు తమకు నచ్చిన పచ్చడి, పొడులు తయారు చేసిమ్మని అడిగేవారు.

పదేళ్ల క్రితం...

నోటి మాటతోనే ఒకరొకరుగా పచ్చళ్లు చేసిమ్మని అడిగే వారి సంఖ్య పెరగడం మొదలయ్యింది. దీనినే చిన్న వ్యాపారంగా మార్చుకుంటే బాగుంటుంది కదా అనుకున్నాను. మా ఊరు గుంటూరుకు వెళ్లినప్పుడల్లా అక్కడ రైతుల దగ్గరకు వెళ్లి, కావల్సిన సరుకులను నేరుగా పొలాల నుంచే సేకరించేదాన్ని. ఒకటే నియమం పెట్టుకున్నాను. కేవలం వెజ్ పచ్చళ్లను మాత్రమే పెట్టాలి. అలాగే, రసాయనిక ఎరువు వాడకుండా పండించిన ఆర్గానిక్ పంటల నుంచే సేకరించాలనుకున్నాను. నేరుగా రైతులను కలిసి, వారి ద్వారా పంటలను కొనుగోలు చేయడం, వాటిని బాగుచేయించి, తీసుకు రావడమూ పెరిగింది. మిర్చి, పసుపు, మసాలా దినుసులు వంటివి ఏయే ప్రాంతాల్లో ఏయే ఏవి అధికంగా పండుతాయో తెలుసుకుని, ఆ దినుసులను సేకరిస్తూ ఉంటాను.

ఒక్కరిగానే...

మొదట్లో ఒక్కదాన్నే పచ్చళ్లకు అవసరమైనవన్నీ ఏర్పాటు చేసుకునే దాన్ని. అందుకు తగిన పనుల ప్లానింగ్ కూడా చేసుకున్నాను. మెల్లగా మార్కెట్ పెరుగుతుండటంతో సాయానికి మరొకరిని నియమించుకుని, పనులు చేస్తూ వచ్చాను. కామాక్షి ఫుడ్స్ పేరుతో పదేళ్ల క్రితం ఈ వ్యాపారాన్ని రిజిస్టర్ చేయించుకొని, ఇప్పుడు నాతోపాటు మరో ముగ్గురు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాను. మొదట్లో అంతగా తెలియకపోయినా మార్కెట్ గురించి నాకు నేనుగానే ఓ అంచనా వేసుకుంటూ షాప్స్, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఆర్డర్ల ద్వారానూ పచ్చళ్లు సిద్ధం చేస్తుంటాను. టొమాటో, గోంగూర, మాగాయ, నిమ్మకాయ, చింతకాయ.. వంటి పచ్చళ్లు, పొడుల తయారీ రోజూ ఉంటుంది.

రోజూ ఉదయం నాలుగు గంటల నుంచే మొదలయ్యే నా దినచర్య తిరిగి, రాత్రి పదిగంటలకే పూర్తవుతుంది. నాకు ఇద్దరు పిల్లలు. మా వారు ఉద్యోగి. ఇల్లు, పిల్లల బాధ్యతలు చూసుకుంటూనే ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాను. ఏడాదికి ఇరవై లక్షల ఆదాయంతో ఈ మార్గం నాలో ఓ కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. నా చేత్తో నలుగురికి రుచికరమైన పచ్చళ్లను అందివ్వడమే కాదు, నాతో పాటు ఇంకొందరికి ఉపాధినివ్వడం సంతోషంగా ఉంది. ఆర్డర్లను బట్టి తయారీ విధానాన్ని ఎంచుకుంటాను కాబట్టి నష్టం అనే సమస్య ఎప్పుడూ రాలేదు. చేసే పనిలో ముందుగానే అంచనా ఉంటే అది ఉద్యోగమైనా, వ్యాపారమైనా ఇంటితోపాటు సమర్థవంతంగా నిర్వర్తించే సత్తా మహిళలకెలాగూ ఉంటుంది' అని వివరిస్తుంది రాజేశ్వరి.

– నిర్మలారెడ్డి
ఫొటోలు: మోహనాచారి

న్యూస్‌మేకర్స్

నానమ్మ హ్వా.. మనవరాలు హ్వా...


● గీతా గోదరా, అస్మా

మనవరాలు కరాటే చేస్తుంటే నానమ్మ తోడుగా నిలబడి చూడటం అనవాయితీ. కాని నానమ్మ కూడా కరాటే డ్రస్సు తొడుక్కుని గోదాలో దిగితే? గుర్‌గావ్‌కు చెందిన 60 ఏళ్ల గీతా గోదరా ఆమె 13 ఏళ్ల మనవరాలు అస్మా గోదరా దుబాయ్‌లో తాజాగా జరిగిన కరాటే ఛాంపియన్ షిప్‌లో మెడల్స్ సాధించారు. ఈ కాలపు నానమ్మ–మనవరాలు ఇలాగే ఉండాలని అందరూ మెచ్చుకుంటున్నారు.

గుర్‌గావ్‌లోని సెక్టార్ 5లో రెండేళ్ల క్రితం మనవరాలికి తోడుగా కరాటే అకాడెమీకి బయలుదేరిన గీతా గోదరా ఇదంతా ఇంత వేగంగా జరుగుతుందని అనుకోలేదు. తాను కూడా కరాటే ఛాంపియన్ అవుతానని అసలు అనుకోలేదు.

'నేను పుట్టింది హర్యానాలోని పల్లెటూళ్లో. నా చదువు ఐదవ క్లాసుతో ముగిసిపోయింది. చిన్నప్పటి నుంచి సాహస కార్యాలు చేయాలని ఉండేది. ఒక వయసులో సైన్యంలో చేరాలని అనుకున్నాను. ఏవీ జరగలేదు. సంసారంలో పడ్డాను. నా మనవరాలు అస్మాకు నేను అనంపూర్తిగా వదిలేసిన కలలు నెరవేర్చుకునే వీలు ఉంది. అందుకని తను ఏం కోరినా సపోర్ట్ చేయాలనుకున్నాను. కరాటే నేర్చుకుంటానంది. నేను తోడుగా వెళ్లడం మొదలెట్టాను' అంది గీతా గోదరా.


● గీతా గోదరా

ఆమె ఇటీవల దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ (బుడోకాన్ కప్)లో 83 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ గెలుచుకుంది. 22 దేశాల నుంచి ఈ పోటీల్లో కరాటేలో పాల్గొంటే వారిలో మన దేశం నుంచి 30 మంది ఉన్నారు. ఇంత మందిలో గీతా గోదరా మెడల్ సాధించింది.

'రోజూ నా మనవరాలు చేస్తున్న సాధన చూస్తే నాక్కూడా కరాటే నేర్చుకోవాలనిపించింది. ట్రైనర్ సునీల్‌ను అడిగాను– నా వయసు వారు నేర్చుకోవచ్చా అని. ఏ వయసు వారైనా నేర్చుకోవచ్చు... ఆసక్తి ఉండటమే ప్రధానం అని చెప్పాడు. వెంటనే నేను కూడా నేర్చుకోవడం మొదలెట్టాను' అంది గీతా గోదరా.

కాని ఈ పరిస్థితి మనవరాలు అస్మాకు ఇబ్బంది తెచ్చి పెట్టింది. 'నాతో పాటుగా మా నాయనమ్మ కూడా కరాటే ప్రాక్టీసు చేస్తుంటే నా స్నేహితులు ఆట పట్టించారు. నేను కూడా మా నాయనమ్మ ఇది చేయక పోతే బాగుండు అనుకున్నాను. కాని అకాడెమీలో ఆమె అన్ని ఎక్సర్‌సైజులను చాలా బాగా చేస్తుంది. పంచ్ గట్టిగా విసురుతుంది. ఆమెలో బలం చూసి ఆశ్చర్యపోయాను. ఇప్పుడు మెడల్స్ తెస్తుండటంతో గర్వపడుతున్నాను' అంది అస్మా.

'కరాటే మనసును, శరీరాన్ని ఒక తూగులో ఉంచుతాయి. ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. ఆత్మస్థైర్యాన్ని కూడా ఇస్తాయి. ఇలాంటి ఒక వ్యాపకం ఉండటం స్త్రీలకు అవసరం' అంటోంది గీతా గోదరా.

స్త్రీలకు ఆత్మరక్షణ విద్యలు తప్పనిసరి అనిపిస్తున్న ఈ రోజుల్లో ఈ నానమ్మ, మనవరాలు ఇస్తున్న సందేశంతో స్ఫూర్తి పొందాల్సిందే.

బ్యూటిప్

జుట్టు ఆరోగ్యంగా పెరగాలంటే...



కప్పు పెసరపప్పును ఉడికించి మెత్తగా పేస్ట్ చేసి అందులో కోడిగుడ్డు సొన (పసుపు– తెలుపు మొత్తంగా), టేబుల్ స్పూన్ నిమ్మరసం, కప్పు పెరుగు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి రెండు గంటల తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. వారానికోసారి ఈ మూంగ్‌దాల్ హెయిర్ ప్యాక్ వేస్తే జుట్టు ఆరోగ్యంగా నిగనిగలాడుతూ, ఒత్తుగా పెరుగుతుంది.

గమనిక: ప్రతిరోజూ నానబెట్టి గ్రైండ్ చేయడం సాధ్యం కాకపోతే పెసలను మరపట్టించి పిండిని నిల్వ చేసుకుని రోజూ వాడుకోవచ్చు. తాజాగా నానబెట్టి గ్రైండ్ చేస్తే పెసరలోని పోషకాలు త్వరగా చర్మానికి అందుతాయి.

సాగుబడి
రోహిణీ కార్తె : మే 25 నుంచి

మిత్రపురుగుల సేద్యం

■ ఎకలాజికల్ ఇంజనీరింగ్ సాగు పద్ధతులను ప్రాచుర్యంలోకి తెస్తున్న ఎన్.ఐ.పి.హెచ్.ఎం.









తేనెటీగలు.. ఇవి 3 కోట్ల సంవత్సరాల క్రితం నుంచే భూగోళంపై జీవిస్తున్నాయి. మొక్కల/వ్యవసాయ జీవవైవిధ్యానికి, పర్యావరణ వ్యవస్థల మనుగడకు పరాగ సంపర్కం కీలకం. అడవిలో 90% మొక్కలు, చెట్లకు, 75% పంటలకు తేనెటీగలు తదితర ప్రాణుల వల్ల జరిగే పరాగ సంపర్కమే ఆధారం. 115 ప్రధాన ఆహార పంటలు ప్రపంచ ప్రజల ఆకలితీర్చుతున్నాయి. వీటిలో 87 పంటలు పుష్పించి సక్రమంగా పంట దిగుబడులు ఇస్తున్నాయంటే అందుకు 35% కారణం తేనెటీగలు తదితర చిరు మిత్ర జీవులే. రసాయనిక వ్యవసాయ పద్ధతులు, చెట్లను నరికేయటం వల్ల వీటి మనుగడ ప్రమాదంలో పడింది. తేనెటీగలు వంటి మిత్ర పురుగులను రక్షించుకోవటం మన ఆహార భద్రతకు, పర్యావరణ ఆరోగ్యానికి ప్రాణావసరమని ఐరాసకు చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) చెబుతోంది. మనం వినిపించుకోవాలి.

ప్రతి నాలుగు పంటల్లో మూడు పంటలు తేనెటీగల సేవలు అందుకుంటున్నాయి. బాదం పంట దిగుబడులైతే నూటికి నూరు శాతం వీటిపైనే ఆధారపడి ఉంటుంది. తేనెటీగలకు 5 కళ్లు, రెండు రెక్కలుంటాయి. కొన్నయితే గంటకు 20 మైళ్లు ప్రయాణిస్తూ పరాగ సంపర్కానికి తోడ్పడుతుంటాయి.

పంటల మార్పిడి, వైవిధ్యత..

పర పరాగ సంపర్కానికి తోడ్పడే ఈ చిరుప్రాణులకు హాని కలిగించని బాధ్యతాయుతమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించమని అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవం (మే 20) సందర్భంగా ఎఫ్.ఎ.ఓ. పిలుపునిచ్చింది. 'పంటల మార్పిడి, పంటల వైవిధ్యత, రసాయనిక పురుగుమందుల వాడకాన్ని తగ్గించటం, పరాగ సంపర్కానికి దోహదపడే తేనెటీగలు వంటి చిరు జీవులకు అవసరమైన ఆవాసాలను అంటే చెట్లను, పూల వనాలను పునరుద్ధరించటం, అభివృద్ధి చేయటం వంటి చర్యలు తీసుకోవాలని ఎఫ్.ఎ.ఓ. డైరెక్టర్ జనరల్ క్యు డోంగ్యు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు, రైతులు ఈ పిలుపును అందుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గిస్తే నీటిలో వీటి అవశేషాలు తగ్గుతాయి. తేనెటీగలకు మేలు జరుగుతుంది అన్నారాయన.

తేనెటీగల పరిరక్షణకు స్లోవేనియా విశేష కృషి చేస్తోంది. 2016 నుంచి మే 20వ తేదీని అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరుపుకోవడానికి స్లోవేనియా ప్రభుత్వ కృషే కారణం. ఖండాంతర దేశాల్లో 300కు పైగా తేనెటీగల పరిరక్షణ కార్యక్రమాల్లో స్లోవేనియా భాగస్వామైంది.

* * *

ఎన్.ఐ.పి.హెచ్.ఎం. అధ్యయనం

హైదరాబాద్ రాజేంద్రనగరలోని జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ (ఎన్ఐపిహెచ్ఎం) శాస్త్రవేత్తలు తేనెటీగలు సహా అనేక మిత్ర పురుగుల వల్ల ఏయే పంటల సాగులో ఏ విధంగా ప్రయోజనం ఉంటుందనే అంశంపై అధ్యయనం చేశారు. మిత్రపురుగుల సంరక్షణతో కూడిన 'ఎకలాజికల్ ఇంజనీరింగ్' పద్ధతులపై జరిగిన అధ్యయనానికి అదనపు సంచాలకులు(పిహెచ్ఎం) డాక్టర్ ఈడ్పుగంటి శ్రీలత సారథ్యం వహించారు. పొద్దుతిరుగుడు, జనుము, మొక్కజొన్న, స్వీట్‌కార్న్, వంగ, బెండ, గుమ్మడి, సొర, బీర, చెర్రీ తదితర పంటలపై ఈ అధ్యయనం జరిగింది. గట్ల మీద పూల మొక్కలు సాగు చేశారు. 9 జాతులకు చెందిన 14 రకాల ఈగలు ఈ కూరగాయ తోటల్లో పరాగసంపర్కానికి దోహదపడినట్లు గుర్తించారు. అందులో 5 రకాల తేనెటీగలు ఉన్నాయి. వంగ తోటలో 14 రకాల ఈగలు కనిపించటం విశేషం.

తేనెటీగలను మింగుతున్న రసాయన సేద్యం

● బెంగళూరు గ్రామీణ ప్రాంతాల్లో 20% తగ్గిన మిత్రపురుగులు

వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం పెరుగుతున్న కొద్దీ సహజ తేనెటీగల సంఖ్య తగ్గిపోతున్నట్లు అనేక అధ్యయనాల్లో తేలింది. బెంగళూరు ప్రాంతంలో జరిగిన ఓ అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. నగరం చుట్టూతా విస్తరించిన 40 కిలోమీటర్ల ప్రాంతంలోని 60 గ్రామాల్లో అధ్యయనం చేస్తే సహజ తేనెటీగల సంఖ్య ఏకంగా 20% తగ్గినట్లు వెల్లడైంది. జర్మనీకి చెందిన గొట్టింజెన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం పరిశోధించింది. రసాయనిక వ్యవసాయం విస్తర్ణం, సాంద్రత పెరుగుతున్నకొద్దీ తేనెటీగలు సమూహాలు తగ్గిపోతుండటాన్ని గుర్తించారు.

▶ నగరం నుంచి ప్రతి కిలోమీటరు దూరంగా వెళ్లే కొద్దీ ఆయా ప్రాంతాల్లో తేనెటీగల సంఖ్య 2.4% మేరకు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ▶ 2016 డిసెంబర్– మే 2017 మధ్య 1275 కుటుంబాలపై అధ్యయనం చేశారు. అందులో 638 రైతు కుటుంబాలు. 3 కుటుంబాలకు చెందిన 31 జాతుల తేనెటీగలు ఆ ప్రాంతాల్లో గుర్తించారు. ▶ చెట్ల మీదనే కాకుండా నేలలో బొరియలు చేసుకొని ఆవాసాలను ఏర్పాటు చేసుకునే తేనెటీగలు ఉంటాయి. కాబట్టి, రసాయనిక పురుగుమందుల వల్లనే కాకుండా రసాయనిక ఎరువులు లేదా నీటి పారుదల వల్ల కూడా తేనెటీగల సంఖ్య తగ్గుతున్నట్లు గుర్తించారు. ▶ ఒక రైతు తన పొలంలో రసాయనిక ఎరువులు వాడటం లేదా నీటి తడి పెట్టడం చేస్తే అక్కడ తేనెటీగల సంఖ్య 20% తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు.

▶ పరిసరాల్లోని ఒక్కో పొలంలో పురుగుమందులు చల్లినప్పుడల్లా ఒక్కో శాతం తేనెటీగల సంఖ్య తగ్గిపోతూ వచ్చింది. అత్యధికంగా 80% మంది రైతులు, సగటున 25% మంది రైతులు రసాయనిక పురుగుమందులు చల్లుతున్నారు. ఆ మేరకు తేనెటీగల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ▶ అనేక సంవత్సరాల నుంచి ఉధృతంగా రసాయనిక వ్యవసాయం చేస్తున్న గ్రామాల్లో తేనెటీగలు 8.1% మేరకు తగ్గింది.

▶ రోడ్డుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో తేనెటీగల సంఖ్య 17.3% తగ్గిపోయింది. అదే విధంగా, దగ్గర్లో అడవి లేదా చెరువు ఉన్న చోట్ల 30–39% పెరిగింది. ▶ వ్యవసాయంలో విషరసాయనాలు, ముఖ్యంగా నియోనికోటినాయిడ్స్ వాడుతుండటం వల్ల తేనెటీగల నాడీవ్యవస్థ దెబ్బతింటున్నది. ఈ ప్రభావం వల్ల తేనె సేకరణకు వెళ్లిన తేనెటీగలు, ఇంకా ఇతర మిత్ర పురుగులు తిరిగి గూళ్లకు చేరకుండానే చెలరాలు తున్నట్లు పరిశోధకులు గుర్తించారంటున్నారు తేనెటీగల సంరక్షకురాలు జివీ అపూర్వ.

ఎకలాజికల్ ఇంజనీరింగ్ అంటే?

'ఎకలాజికల్ ఇంజనీరింగ్' భావనను 1962లో తొలుత ప్రతిపాదించిన శాస్త్రవేత్త డా. హోవర్డ్ టి. ఒడుమ్. రసాయనిక సాంద్ర వ్యవసాయ పద్ధతుల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని గుర్తించి, పంట పొలాల్లో పర్యావరణ వ్యవస్థలను పునరుజ్జీవింపజేయటం. తద్వారా మొక్కలు, భూమి ఆరోగ్యాన్ని కాపాడటం, ఆరోగ్యదాయకమైన ఆహారాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవటం ఈ భావన ముఖ్య లక్ష్యం. భూమిని బాగు చేయడానికి ఆచ్ఛాదన పంటలు, పంటల మార్పిడి, పచ్చిరొట్ట పంటలను సాగు చేసి కలియదున్నటం, సేంద్రియ ఎరువులతో పాటు జీవన ఎరువులు, జీవ రసాయనాలు వినియోగించటం ఎకలాజికల్ ఇంజనీరింగ్‌లో ముఖ్యమైన అంశాలు.


బెండ పంటను రక్షించే మిత్ర పురుగులు

మిత్రపురుగులను ఆకర్షించడానికి ఆకర్షక పంటలు, శత్రుపురుగులను ఆకర్షించి మట్టుబెట్టడానికి ఎర పంటలు, శత్రుపురుగులను పారదోలడానికి వికర్షక పంటలు, పురుగులు తోటలోకి రాకుండా ఆపడానికి కంచె/సరిహద్దు పంటలు వేసుకోవటం చీడపీడల నియంత్రణలో కీలకం. 'పంటల తొలి 40 రోజుల్లో రసాయనిక పురుగుమందులు వాడకుండా ఉండటం ముఖ్యం. ఈ దశలోనే తేనెటీగలు సహా అనేక రకాల మిత్రపురుగులు వృద్ధి చెంది పంటకాలం అంతటా చీడపీడలను నియంత్రణలో ఉంచుతాయి..' అంటున్నారు డా. శ్రీలత . 86 పంటల 'ఎకలాజికల్ ఇంజనీరింగ్' కోసం వెబ్‌సైట్ చూడొచ్చు.. https://niphm.gov.in/



5న ప్రకృతి రైతుల మహా సమ్మేళనం

జూన్ 5(సోమవారం)న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో ప్రకృతి రైతుల మహా సమ్మేళనం నిర్వహించనున్నారు. పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ గ్రౌండ్‌లో ఉ. 10 గంటలకు సమ్మేళనం ప్రారంభమవుతుంది. పొలాన్ని అమ్మే వ్యవసాయం మానేద్దాం పొలాన్ని కొనుగోలు చేసే వ్యవసాయాన్నే చేద్దాం అనే నినాదంతో ఈ మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ నేత కుమారస్వామి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 10 వేల మంది రైతులు, వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అందరూ ఆహ్వానితులే.

సాగు మారితే జీవవైవిధ్యం భద్రం!


కర్నూలు జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో కనిపించిన పక్షి గూడు

రసాయనాల మయమైపోయిన వ్యవసాయ పద్ధతిని ప్రకృతికి అనుగుణంగా మార్చుకుంటే భూతాపాన్ని తగ్గించడానికి, వాతావరణ మార్పుల్ని పంటలు ధీటుగా తట్టుకొని మంచి దిగుబడులు ఇవ్వడానికి అవకాశం ఉందన్నది తెలిసిందే. అదే విధంగా.. ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తే పంటల్లో వైవిధ్యత పెరుగుతుంది. పక్షులు తదితర జీవరాశితోపాటు మట్టిలో సూక్ష్మ జీవరాశి వైవిధ్యత కూడా పెరుగుతుందని ఐరాసకి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య పరిరక్షణ దినోత్సవం(మే 22) సందర్భంగా మరికొన్ని విషయాలు..

● ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ క్షేత్రాల్లో భూమి పైన పంటలు, పక్షులు, తేనెటీగల్లాంటి మిత్రపురుగులతోపాటు భూమి లోపల వానపాములు, సూక్ష్మజీవరాశికి సంబంధించిన జీవవైవిధ్యం 30–50% పెరుగుతుందని అనేక అధ్యయనాల్లో వెల్లడైందని 'ఐఫోమ్ ఆర్గానిక్స్ యూరప్' తాజా నివేదిక చెబుతోంది. ఈ క్షేత్రాల్లో పంటలు, పక్షులు, మిత్రపురుగులు, సూక్ష్మజీవుల సంఖ్య 50% ఎక్కువగా ఉంటుందని, వీటి జాతుల సంఖ్య 30% అధికంగా ఉంటుందని నివేదిక పేర్కొంది.

● రసాయనాలు వాడని గడ్డిభూముల్లో కన్నా ప్రకృతి/సేంద్రియ పద్ధతుల్లో సాగయ్యే వార్షిక పంటల్లో, పండ్ల తోటల్లో జీవవైవిధ్యం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

● ప్రకృతి/సేంద్రియ సాగులో తేనెటీగలు, సాలీళ్లు, తదితర అరుదైన మిత్రపురుగుల సంఖ్య రసాయనిక క్షేత్రాలతో పోల్చితే 55% ఎక్కువగా, వీటి జాతుల వైవిధ్యం 27% ఎక్కువగా ఉందని నివేదిక తెలిపింది.

● ప్రకృతి/సేంద్రియ క్షేత్రాలు ఉన్న ప్రాంతాల్లో నాటు తేనెటీగల సంఖ్య, జాతుల వైవిధ్యంతో పాటు వాటి పునరుత్పత్తి రేటు కూడా పెరిగిందని ఐఫోమ్ ఆర్గానిక్స్ యూరప్ నివేదిక తెలిపింది.

● ఆంధ్రప్రదేశ్‌లో 50 ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు, 50 రసాయనిక వ్యవసాయ క్షేత్రాల్లో సంచరించే పక్షుల సంఖ్యపై ఏపీ ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయ విభాగం (ఏపీసీఎన్ఎఫ్) గత ఏడాది ఓ అధ్యయనం చేసింది.

● ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో రెండు తోకల పిట్ట, నేత పక్షి, గిజిగాడి గూడు పక్షి, పిగిలి పిట్టలు 2,3 రెట్లు ఎక్కువగా తరచూ తిరుగాడుతూ కనిపించాయని ఏపీసీఎన్ఎఫ్ నిపుణుడు ఈ అధ్యయనానికి సారథ్యం వహించిన ఏపీసీఎన్ఎఫ్ పరిశోధనా విభాగం హెడ్ డా. జాకిర్ హుస్సేన్ తెలిపారు. రసాయనిక క్షేత్రాల కన్నా ప్రకృతి పొలాలను ఎక్కువ పక్షులు సందర్శిస్తున్నాయన్నారు. పక్షుల రాక వల్ల శత్రుపురుగుల తీవ్రత తగ్గుతున్నదన్నారు.

● కర్నూలు జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదయ్యే చోట ప్రకృతి పొలాల్లో నేత పక్షి గూళ్లు కనిపించటం విశేషం.



అర్జున్ ఖాతాలో మూడో 'డ్రా'

షార్జా మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో 'డ్రా' నమోదు చేశాడు. పాంట్ సర్గ్‌సియాన్ (అర్మేనియా)తో సోమవారం జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను అర్జున్ 34 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. ఈ టోర్నీలో రెండు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిన అర్జున్ 3.5 పాయింట్లతో 18వ ర్యాంక్‌లో ఉన్నాడు. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, నిహాల్ సరీన్, ఆర్యన్ చోప్రా నాలుగు పాయింట్లతో ఉమ్మడిగా రెండో ర్యాంక్‌లో ఉన్నారు.

చాంపియన్ సమీర్ వర్మ

ఐదేళ్ల తర్వాత భారత బ్యాడ్మింటన్ ప్లేయర్ సమీర్ వర్మ తన కెరీర్‌లో మరో అంతర్జాతీయ టైటిల్‌ను సాధించాడు. స్లొవేనియా ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీలో సమీర్ వర్మ విజేతగా నిలిచాడు. ఫైనల్లో సమీర్ వర్మ 21-18, 21-14తో సు లి యాంగ్ (చైనీస్ తైపీ)పై నెగ్గాడు. విజేతగా నిలిచిన సమీర్‌కు 1200 డాలర్ల (రూ. 99 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది. చివరిసారి సమీర్ వర్మ 2018లో సయ్యద్ మోదీ సూపర్-300 టోర్నీలో టైటిల్ సాధించాడు.



'ఫైనల్'కు ముందెవరు?

చెన్నై, గుజరాత్‌ల మధ్య నేడు తొలి క్వాలిఫయర్

జోరు మీదున్న టైటాన్స్ • ఆల్‌రౌండ్ సత్తాతో సూపర్‌కింగ్స్

రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



చెన్నై: ఐపీఎల్‌లో రెండు దీటైన జట్ల మధ్య ఢీ అంటే ఢీ అనే మ్యాచ్‌కు నేడు రంగం సిద్ధమైంది. మంగళవారం జరిగే తొలి క్వాలిఫయర్‌లో నాలుగుసార్లు చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్‌తో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. చెన్నై వేదికగా మ్యాచ్ జరగడం ధోని సేనకు అనుకూలత అయినప్పటికీ... ఈ జట్టుపై ఓటమి ఎరుగని గుజరాత్ కొండంత ఆత్మవిశ్వాసంతో ఉంది. ఈ నేపథ్యంలో రెండు సమఉజ్జీల మధ్య ఆసక్తికర సమరం గ్యారంటీ! దీంతో ప్రేక్షకులకు టి20 మెరుపులు, ఆఖరి ఓవర్ డ్రామాకు కొదవుండదు. ఇక చెన్నైలో గెలిచినా... ఓడినా... చివరి మజిలీ మాత్రం అహ్మదాబాదే! నెగ్గితే నేరుగా ఒక జట్టు ఫైనల్‌కు చేరుతుంది. ఓడిన జట్టు మరో ప్రయత్నంగా రెండో క్వాలిఫయర్‌లో ఆడుతుంది. ఈ రెండూ నరేంద్ర మోదీ స్టేడియంలోనే జరుగనున్నాయి.

చెన్నై చెలరేగితే...

బరిలోకి దిగే రెండు జట్లు బలమైన ప్రత్యర్థులు. చెన్నై ఐపీఎల్ ఆరంభం నుంచే లీగ్ ఫేవరెట్లలో ఒకటిగా ఎదిగింది. ధోని నాయకత్వంలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఎన్నోసార్లు నిరూపించుకుంది. ఈ సీజన్‌లోనూ సూపర్‌కింగ్స్ ఆట మేటిగానే ఉంది. టాపార్డర్‌లో రుతురాజ్ గైక్వాడ్, డెవాన్ కాన్వే, అజింక్య రహానే, శివమ్ దూబే ధనాధన్ షోకు శ్రీకారం చుడితే ప్రత్యర్థికి చుక్కలే! వెటరన్ ధోని బ్యాటింగ్‌లో వెనుకబడొచ్చేమో కానీ... జట్టును నడిపించడంలో ఎప్పటికీ క్రికెట్ మేధావే. మిడిలార్డర్‌లో అంబటి రాయుడు నుంచి ఈ సీజన్‌లో చెప్పుకోదగ్గ ప్రదర్శన రాలేదు. బహుశా ఈ మ్యాచ్‌లో ఆ వెలితి తీర్చుకుంటాడేమో చూడాలి. ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, మొయిన్ అలీ... ఇక బౌలింగ్ దళంలో దీపక్ చహర్, తుషార్ దేశ్‌పాండే పవర్ ప్లేలో పరుగులిస్తున్నప్పటికీ వికెట్లను మాత్రం పడగొట్టేస్తున్నారు. తీక్షణ, పతిరణల వైవిధ్యం కూడా జట్టుకు కీలక సమయాల్లో ఉపయోగపడుతుంది.

టైటాన్స్ 'టాప్'షో

టోర్నీ మొదలైన మ్యాచ్‌లోనే చెన్నైపై గెలిచిన గుజరాత్ టైటాన్స్ లీగ్‌లో ఘనమైన ఆరంభమిచ్చింది. బెంగళూరుతో జరిగిన ఆఖరి మ్యాచ్‌లోనూ టైటాన్స్‌దే ఆధిపత్యం. సొంతగడ్డపై బెంగళూరు భారీస్కోరు చేసినా ఛేదించి మరీ నెగ్గింది. పాయింట్ల పట్టికైనా... ఆటలోనైనా... డిఫెండింగ్ చాంపియన్‌కు లీగ్ దశలో అయితే ఎదురే లేకపోయింది. ముఖ్యంగా ఇంపాక్ట్ ప్లేయర్‌ను పాండ్యా సేన సమర్థంగా సరైన దిశలో వినియోగించుకుంటుంది. శుబ్‌మన్ గిల్ లేదంటే విజయ్ శంకర్‌ల 'ఇంపాక్ట్' జట్టుకు అదనపు పరుగుల్ని కట్టబెడుతోంది. జట్టులో వీళ్లిద్దరే కాదు... సాహా నుంచి రషీద్ ఖాన్ దాకా ఇలా ఎనిమిదో వరుస బ్యాటర్ కూడా బాదేయగలడు. షనక, మిల్లర్, రాహుల్ తెవాటియాలు ధాటిగా ఆడగల సమర్థులు. దీంతో పరుగులకు, మెరుపులకు ఏ లోటు లేదు. ఇక బౌలింగ్ విషయానికొస్తే మోహిత్ శర్మ, నూర్ అహ్మద్, షమీ, రషీద్ ఖాన్ కలిసొస్తే పిచ్‌పై మ్యాచ్‌నే మలుపుతిప్పే బౌలర్లు. ఏ రకంగా చూసుకున్నా ఎవరికీ ఎవరు తీసిపోరు కాబట్టి హేమాహేమీల మధ్య వార్ వన్‌సైడ్ అయితే కానే కాదు!

తుది జట్లు (అంచనా)

గుజరాత్ టైటాన్స్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), సాహా, గిల్, విజయ్ శంకర్, షనక, మిల్లర్, తెవాటియా, రషీద్ ఖాన్, నూర్ అహ్మద్, షమీ, మోహిత్ శర్మ/యశ్ దయాళ్.

చెన్నై సూపర్ కింగ్స్: ధోని (కెప్టెన్), రుతురాజ్, కాన్వే, దూబే/పతిరణ, జడేజా, రహానే, మొయిన్, రాయుడు, దీపక్ చహర్, తుషార్, తీక్షణ.

పిచ్, వాతావరణం

ఎప్పట్లాగే చెన్నై పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉండే అవకాశముంది. అయితే రాత్రయ్యేకొద్దీ తేమ కారణంగా బౌలర్లకు కష్టాలు తప్పవు. టాస్ నెగ్గిన జట్టు ఛేజింగ్‌కే మొగ్గు చూపవచ్చు. వర్ష సూచన లేదు.

3 ఐపీఎల్ టోర్నీ చరిత్రలో ఇప్పటి వరకు గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌లు జరగ్గా... మూడింటిలోనూ గుజరాత్ జట్టే గెలిచింది. ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ చెన్నై నిర్దేశించిన లక్ష్యాలను గుజరాత్ ఛేదించింది. అయితే చెన్నై వేదికగా మాత్రం ఈ రెండు జట్లు తొలిసారి తలపడుతున్నాయి.

43 ఐపీఎల్ టోర్నీలో చెన్నై వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ జట్టు మొత్తం 61 మ్యాచ్‌లు ఆడింది. 43 మ్యాచ్‌ల్లో నెగ్గింది. 18 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

24 ఐపీఎల్ టోర్నీ ప్లే ఆఫ్స్ దశలో చెన్నై మొత్తం 24 మ్యాచ్‌లు ఆడింది. 15 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. (తొలుత బ్యాటింగ్ చేసినపుడు 7 సార్లు... ఛేజింగ్‌లో 8 సార్లు). మిగతా 9 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

నీరజ్... నంబర్‌వన్

భారత జావెలిన్ త్రోయర్ ఘనత



న్యూఢిల్లీ: అంతర్జాతీయ వేదికపై భారత అథ్లెటిక్స్ ముఖచిత్రంగా మారిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తన కెరీర్‌లో మరో గొప్ప ఘనతను సాధించాడు. సోమవారం విడుదల చేసిన వరల్డ్ అథ్లెటిక్స్ పురుషుల జావెలిన్ త్రో ర్యాంకింగ్స్‌లో నీరజ్ చోప్రా ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. తద్వారా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో వరల్డ్ నంబర్‌వన్‌గా అవతరించిన తొలి భారతీయ అథ్లెట్‌గా నీరజ్ గుర్తింపు పొందాడు. ప్రస్తుతం నీరజ్ 1455 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉండగా... ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా; 1433 పాయింట్లు) రెండో స్థానంలో, జాకుబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్; 1416 పాయింట్లు) మూడో స్థానంలో ఉన్నారు. గత ఐదేళ్లుగా నీరజ్ అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్నాడు. 2017 ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం... 2018 ఆసియా క్రీడల్లో స్వర్ణం... 2018 కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం... 2021 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం... 2022 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజతం... 2022 డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో స్వర్ణం... ఇలా నీరజ్ అంతర్జాతీయ వేదికలపై పతకాల పంట పండిస్తున్నాడు. తాజా సీజన్‌లో భాగంగా ఈనెలలో దోహాలో జరిగిన డైమండ్ లీగ్ తొలి సిరీస్‌లో నీరజ్ అగ్రస్థానంలో నిలిచాడు. తదుపరి వచ్చే నెలలో ఫిన్‌లాండ్‌లో జరిగే పావో నుర్మీ గేమ్స్‌లో నీరజ్ బరిలోకి దిగనున్నాడు.

భారత క్రికెట్ జట్టు కిట్ స్పాన్సర్‌గా అడిడాస్

చెన్నై: జర్మనీకి చెందిన ప్రముఖ క్రీడా ఉత్పాదనల సంస్థ అడిడాస్ భారత క్రికెట్ జట్టు కిట్ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. ప్రస్తుత స్పాన్సర్ 'కిల్లర్ జీన్స్'తో కాంట్రాక్టు గడువు ఈ నెలాఖరుతో ముగియనుండటంతో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త స్పాన్సర్‌షిప్ ఇచ్చింది. దీనిపై బోర్డు కార్యదర్శి జై షా మాట్లాడుతూ 'దేశంలో క్రికెట్ అభివృద్ధి అంచనాలను మించుతుంది. కాబట్టి ప్రపంచశ్రేణి సంస్థ మాతో జట్టు కట్టడంపై పెద్దగా ఆశ్చర్యమేమీ లేదు' అని అన్నారు. జర్మన్ స్పోర్ట్స్ బ్రాండ్ అయిన అడిడాస్‌తో ఒప్పందం ఎన్నేళ్లు, ఎంత మొత్తానికి స్పాన్సర్‌షిప్ పొందిందనే వివరాలేవీ ఆయన వెల్లడించలేదు. విశ్వసనీయ వర్గాల ప్రకారం రూ. 350 కోట్లతో అడిడాస్ కిట్ స్పాన్సర్‌షిప్ దక్కించుకున్నట్లు తెలిసింది. టీమిండియా వచ్చే నెల 7 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో తలపడుతుంది. ఆ జెర్సీలపై అడిడాస్ లోగో కనిపించనుంది. టీమ్ స్పాన్సర్ బైజూస్ కూడా మారుతున్నట్లు తెలిసింది. ఈ నవంబర్ వరకు గడువున్నప్పటికీ సదరు సంస్థ ముందుగానే వైదొలగనుండటంతో త్వరలోనే బిడ్లను ఆహ్వానిస్తారు.



ప్రపంచ మాజీ టాప్ ర్యాంక్ జోడీకి సాకేత్-యూకీ షాక్



పారిస్: లియోన్-250 ఏటీపీ టెన్నిస్ టోర్నమెంట్‌లో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ సంచలన విజయంతో శుభారంభం చేసింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-యూకీ ద్వయం 7-6 (7/4), 3-6, 10-8తో 'సూపర్ ట్రైబ్రేక్'లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ జోడీ సెబాస్టియన్ కబాల్-రాబర్ట్ ఫరా (కొలంబియా) జోడీపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గంటా 53 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సాకేత్, యూకీ రెండు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ ర్యాంకింగ్ ఆధారంగా వచ్చే వారం పారిస్‌లో మొదలయ్యే ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల డబుల్స్ మెయిన్ 'డ్రా'కు సాకేత్, యూకీ అర్హత పొందారు.

శ్రీజ, శరత్ కమల్ పరాజయం



డర్బన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ పోరాటం ముగిసింది. సింగిల్స్‌తోపాటు డబుల్స్ విభాగంలోనూ శ్రీజ ఇంటిదారి పట్టింది. సోమవారం జరిగిన సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 112వ ర్యాంకర్ శ్రీజ 2-11, 4-11, 2-11, 4-11తో ప్రపంచ పదో ర్యాంకర్ యింగ్ హాన్ (జర్మనీ) చేతిలో ఓడిపోయింది. డబుల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ-దియా చితాలె (భారత్) జోడీ 8-11, 8-11, 11-13తో సన్ యింగ్షా-వాంగ్ మాన్యు (చైనా) ద్వయం చేతిలో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లో భారత వెటరన్ స్టార్, 40 ఏళ్ల ఆచంట శరత్ కమల్ రెండో రౌండ్‌లో 4-11, 11-13, 8-11, 10-12తో లీ సాంగ్ సు (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్‌లో శరత్ కమల్-సత్యన్ (భారత్) జోడీ.. మిక్స్‌డ్ డబుల్స్‌లో మనిక బత్రా-సత్యన్ (భారత్) జోడీ ప్రీక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాయి.

డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం ముందుగానే...

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో వచ్చే నెల 7 నుంచి 11 వరకు లండన్‌లో జరిగే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ సన్నాహాల కోసం కోహ్లి సహా ఏడుగురితో కూడిన టీమిండియా బృందం నేడు లండన్‌కు వెళ్లనుంది. ఈ బృందంలో స్పిన్నర్లు అశ్విన్, అక్షర్ పటేల్, పేసర్లు సిరాజ్, శార్దుల్ ఠాకూర్, ఉమేశ్ యాదవ్, జైదేవ్ ఉనాద్కట్ కూడా ఉన్నారు. కౌంటీల్లో ఆడుతున్న పుజారా లండన్‌లో జట్టుతో కలుస్తాడు. మిగిలిన సభ్యులు కెప్టెన్ రోహిత్ శర్మ, జడేజా, ఇషాన్, గిల్, షమీ, శ్రీకర్ భరత్, రహానేలు ఐపీఎల్ ముగిశాక వెళ్తారు.


విలక్షణ నటుడు శరత్‌బాబు ఇక లేరు

సినిమా

కథానాయకుడు, ప్రతినాయకుడు, సహాయ నటుడు... ఇలా ఏ పాత్ర చేసినా అందులో ఒదిగిపోయిన అందాల నటుడు శరత్‌బాబు (71) ఇక లేరు. మూడు నెలల కిందట అనారోగ్యానికి గురైన ఆయన చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుని, బెంగళూరు వెళ్లారు. అయితే మళ్లీ అస్వస్థతకు గురి కావటంతో బెంగళూరులోని ఆస్పత్రిలో చేరారు. ఆ తర్వాత తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు గత నెల 20న ఆయన్ను బెంగళూరు నుంచి హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. శరత్‌బాబు శరీరంలో ఇన్‌ఫెక్షన్ (సెప్సిస్) వ్యాపించడంతో ఊపిరితిత్తులు, కాలేయం, ఇతర అవయవాలు దెబ్బతినగా, వెంటిలేటర్‌పై ఆయనకు చికిత్స అందించారు వైద్యులు. చివరికి మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్‌తో సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో కన్ను మూశారు.

పోలీస్ కావాలనుకుని...

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో 1951 జూలై 31న జన్మించారు శరత్‌బాబు. ఆయన అసలు పేరు సత్యంబాబు దీక్షిత్. శరత్‌బాబు తల్లితండ్రులకు ఎనిమిది మంది కుమారులు, ఐదుగురు కుమార్తెలు కాగా శరత్‌బాబు నాలుగో సంతానం. శరత్ తండ్రి విజయశంకర్ దీక్షితులు హోటల్ నడిపేవారు. ఆముదాలవలసలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ చదివారు శరత్‌బాబు. శ్రీకాకుళంలో ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదివారు. స్వతహాగా అందగాడైన శరత్‌బాబుని కాలేజీలో 'హీరో', 'గోల్డెన్ ఫిష్' అని స్నేహితులు పిలవడంతో పాటు 'నువ్వు హీరో అవ్వాలి' అని అనేవారట. శరత్‌బాబుకి మాత్రం పోలీస్ కావాలన్నది ఆశయం. కానీ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదివేటప్పుడే కళ్లద్దాలు రావడంతో ఆ ఉద్యోగానికి అర్హుడు కాదనుకుని, ఆ ప్రయత్నం విరమించుకున్నారు శరత్‌బాబు. ఆ తర్వాతే సినిమాలపై దృష్టి మళ్లింది. అయితే తనలాగే కుమారుడు కూడా హోటల్ రంగంలోకి రావాలన్నది శరత్ తండ్రి కోరిక. అందుకే సినిమాల్లోకి వెళతానన్న శరత్‌ని ప్రోత్సహించలేదు. కానీ, తల్లి ప్రోత్సాహంతో నటుడు కావాలనుకున్నారు.



• శరత్ బాబు

తిరిగి ఊరెళ్లలేక...

దర్శక-నిర్మాత ఆదుర్తి సుబ్బారావు కొత్తవాళ్లతో సినిమా తీసి, హిట్ సాధించారని శరత్‌కి తెలిసింది. దీంతో 'నేను సినిమాలు చూస్తానంతే.. నటన తెలియదు. కానీ సినిమాల్లో నటించాలని ఉంది.. రమ్మంటే వస్తాను' అంటూ తన ఫొటోలతో పాటు ఒక ఉత్తరం పంపారు శరత్. ఆ లెటర్‌కి స్పందించి, మద్రాసు రమ్మని ట్రైన్ చార్జీలు కూడా పంపించారు ఆదుర్తి. మద్రాస్ వెళ్లి ఆదుర్తి సుబ్బారావుని కలిస్తే, 'ఓ హిందీ సినిమా చేస్తున్నాను. ఓ ఏడెనిమిది నెలల్లో తెలుగు సినిమా చేస్తాను.. అప్పుడు వస్తే చాన్స్ ఇస్తా' అన్నారట. అయితే తిరిగి ఊరెళ్లిపోవడం ఇష్టం లేక మద్రాసులోనే ఉండి, ప్రయత్నాలు సాగిద్దామని నిర్ణయించుకున్నారు శరత్‌బాబు.

నువ్వే మా హీరో అన్నారు

రామవిజేత అని ఓ సంస్థ కొత్త వాళ్లతో సినిమాలు తీస్తోందని విని, అవకాశం కోసం వెళ్లారు శరత్‌బాబు. అక్కడ దాదాపు వెయ్యి అప్లికేషన్స్ ఉన్నాయి. వాటిల్లో ఎంపిక చేసిన ముగ్గురిలో శరత్‌బాబు ఒకరు. స్క్రీన్ టెస్ట్ చేశాక, 'నువ్వే మా హీరో' అన్నారు. ఆ సినిమాయే 'రామరాజ్యం' (1973). ఆ షూటింగ్ జరుగుతున్నప్పుడు అట్లూరి పూర్ణచంద్రరావు స్క్రీన్ టెస్ట్ చేసి, 'స్త్రీ' చిత్రంలో సపోర్టింగ్ హీరోగా చేసే అవకాశం ఇచ్చారు. హీరోగా చేస్తూనే సహాయ నటుడిగా కీలక పాత్రలు చేస్తూ వచ్చారు. 'కన్నె వయసు, నోము, పంతులమ్మ, మరో చరిత్ర, రామకృష్ణులు, సీతాకోక చిలుక, ఇది కథ కాదు, తాయారమ్మ బంగారయ్య, మూడు ముళ్ల బంధం, శరణం అయ్యప్ప, సాగర సంగమం, సితార, అన్వేషణ, స్వాతి ముత్యం, సంసారం ఒక చదరంగం, శ్రీరామదాసు, మగధీర, శిరిడి సాయి తదితర చిత్రాల్లో మంచి పాత్రలు పోషించారు. ఉత్తమ సహాయ నటుడిగా 'సీతాకోక చిలుక (1981), ఓ భార్య కథ (1988), నీరాజనం (1989)' చిత్రాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డులు అందుకున్నారాయన.



• శరత్‌బాబు భౌతికకాయం

తమిళ్ ఎంట్రీ హిట్

బాలచందర్ దర్శకత్వంలో చేసిన 'నిళల్ నిజమాగిరదు' ద్వారా తమిళ్‌కి పరిచయమయ్యారు శరత్‌బాబు. ఆ సినిమా వంద రోజులు ఆడింది. అలా తమిళ్‌లో తొలి హిట్‌తో శరత్ కెరీర్ అక్కడా ఊపందుకుంది. హీరోగా, విలన్‌గా, సహాయ నటుడిగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో దాదాపు 300 చిత్రాల్లో నటించారు.

ఇదే ఆఖరి జన్మ!

ఎప్పుడైనా కొంచెం డిస్టర్బ్ అయితే ధ్యానం చేసేవారు శరత్‌బాబు. ''దేవుడికి ఆకారం లేదు. అందుకే ధ్యానం చేసేటప్పుడు జ్యోతిని ఊహించుకుంటా. నేను దేవుణ్ణి బాగా నమ్ముతాను. ఆ నమ్మకం ఉన్నవాళ్లకి జన్మల మీద నమ్మకం ఉంటుంది. ఇదే నా ఆఖరి జన్మ అని నాకు తెలుసు'' అని ఓ సందర్భంలో శరత్ పేర్కొన్నారు.

పెళ్లి-విడాకులు

వయసులో తనకంటే నాలుగేళ్లు పెద్ద అయిన నటి రమాప్రభని 1974లో వివాహం చేసుకున్నారు శరత్‌బాబు. పద్నాలుగేళ్ల తర్వాత 1988లో వీరు విడాకులు తీసుకున్నారు. అయితే వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారనే వార్త వినిపించేది. ''నా బ్లడ్ గ్రూప్‌తో పిల్లలు లేరు. నేనెవర్నీ దత్తత చేసుకోలేదు. నాకు 25 మంది పిల్లలున్నారు. నా అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ముల పిల్లలు వాళ్లు'' అని గతంలో 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు శరత్‌బాబు. తమిళ నటుడు నంబియార్ కుమార్తె స్నేహలతని పెళ్లాడారాయన. అయితే వీరిద్దరు కూడా విడిపోయారు.

బుల్లి తెరపైనా...

బుల్లితెరపై పదికి పైగా సీరియల్స్‌లో నటించారు శరత్‌బాబు. తమిళంలో చేసిన 'సిలంది వలై' (1987) సీరియల్ ద్వారా చిన్ని తెరపై తొలిసారి కనిపించారు. తెలుగులో 1997 నుంచి 2001 వరకూ ప్రసారమైన 'అంతరంగాలు'లో నటించారు. ఇంకా 'జనని, 'అగ్ని గుండాలు' వంటి సీరియల్స్‌తో పాటు తమిళ, కన్నడంలోనూ పలు సీరియల్స్ చేశారు.

చివరి సినిమా.. 'మళ్ళీ పెళ్లి'

క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తమిళంలో శరత్‌బాబు చేసిన చివరి చిత్రం 'వసంత ముల్లై' (2023). ఈ నెల 26న విడుదలకు సిద్ధమైన 'మళ్ళీ పెళ్లి'లో శరత్‌బాబు కీలక పాత్ర చేశారు. తెలుగులో ఆయనకు ఇదే చివరి సినిమా. వ్యక్తిగతంగా హార్సిలీ హిల్స్‌లో స్థిరపడాలనేది శరత్‌బాబు కోరిక. అక్కడ ఇంటి నిర్మాణం కూడా చేపట్టారు. అయితే నిర్మాణం పూర్తి కాలేదు. చివరికి శరత్ కోరిక నెరవేరలేదు.

నేడు అంత్యక్రియలు

శరత్‌బాబు తోడబుట్టినవాళ్లల్లో అన్నయ్య ఉమా దీక్షితులు, తమ్ముళ్లు గోపాల్, గోవింద్, సంతోష్, మధు, మంజు ఉన్నారు. శరత్‌బాబు రెండో అన్నయ్య రమ దీక్షితులు మూడేళ్ల కిందట మృతి చెందారు. అక్కచెల్లెళ్లు సిరి, రాణి, బేబీ, మున్ని, రోజా ఉన్నారు. శరత్‌బాబు మృతికి రజనీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి, బాలకృష్ణ తదితర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. కాగా సోమవారం సాయంత్రం 2 గంటల పాటు హైదరాబాద్‌లోని ఫిలిం చాంబర్‌లో అభిమానుల సందర్శనార్థం శరత్‌బాబు భౌతికకాయాన్ని ఉంచి, ఆ తర్వాత చెన్నై తరలించారు. చెన్నైలో నేడు శరత్‌బాబు అంత్యక్రియలు జరుగుతాయి.

– శరత్‌బాబు సృజనాత్మకత కలిగిన వ్యక్తి, బహుముఖ ప్రజ్ఞాశాలి. సుదీర్ఘమైన చలనచిత్ర జీవితంలో ఎన్నో గుర్తుండిపోయే పాత్రలు పోషించారు. శరత్‌బాబు మరణం బాధాకరం.
– నరేంద్ర మోదీ, భారత ప్రధాని

– తెలుగు చలనచిత్ర రంగంలో కథానాయకుడిగా, ప్రతినాయకుడిగా, సహాయ నటుడిగా అన్ని రకాల పాత్రలు పోషించి ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న గొప్ప నటులు శరత్‌బాబుగారు. ఆయన ఈ లోకాన్ని విడిచి వెళ్లడం బాధాకరం.
– వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

– ఐదు దశాబ్దాలుగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 220కి పైగా చిత్రాల్లో నటించిన శరత్‌బాబు మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటు. శరత్ బాబు కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.
– కేసీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి

– శరత్‌బాబుగారు తన విలక్షణ నటనతో చెరగని ముద్ర వేశారు. అలాంటి దిగ్గజ నటుణ్ణి తెలుగు చిత్ర పరిశ్రమ కోల్పోయింది.
– తమిళిసై సౌందరరాజన్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్

నాకు.. నరేశ్‌కి ఆ అదృష్టం దక్కింది

– జయసుధ




• ఎమ్మెస్ రాజా, వీకే నరేశ్, జయసుధ, పవిత్రా లోకేశ్

''చిత్ర పరిశ్రమలో 50 ఏళ్లు పూర్తి చేసుకోవడం అందరికీ కుదరదు. కానీ నాకు, నరేశ్‌కు ఆ అదృష్టం దక్కింది. విజయనిర్మలగారు 'పండంటి కాపురం' చిత్రం ద్వారా నన్ను, నరేశ్‌లను పరిచయం చేశారు. మన వ్యక్తిగత విషయాల పరంగా ఎవరికీ భయపడక్కర్లేదు'' అని నటి జయసుధ అన్నారు. వీకే నరేశ్, పవిత్రా లోకేశ్ జంటగా ఎమ్మెస్ రాజు దర్శకత్వం వహించిన చిత్రం 'మళ్లీ పెళ్లి'. విజయ కృష్ణ మూవీస్‌పై వీకే నరేశ్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 26న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో 'ఆకాశమే..' అనే సాంగ్‌ను జయసుధ విడుదల చేశారు. నటిగా యాభై ఏళ్లు పూర్తిచేసుకున్న జయసుధను నరేశ్ సత్కరించగా, నటుడిగా యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న నరేశ్ ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో జయసుధ సత్కరించారు. వీకే నరేశ్ మాట్లాడుతూ– ''నా రీల్ లైఫ్ బాగున్నా రియల్ లైఫ్ బాగోలేదు. ఇప్పుడు 50 ఏళ్లకు మా అమ్మ (విజయ నిర్మల) తర్వాత ఇంకో అమ్మను (పవిత్ర) కలుసుకున్నాను. జీవితంలో ఫస్టాఫ్ కంటే సెకండాఫ్ బాగుండాలని చెప్పే చిత్రమే 'మళ్ళీ పెళ్లి''' అన్నారు. ''నా కొత్త జీవితం ప్రారంభమైంది. 'మళ్ళీ పెళ్లి'లో నాకు మంచి పాత్ర ఇచ్చినందుకు రాజుగారు, నరేశ్‌గారికి థ్యాంక్స్'' అన్నారు పవిత్రా లోకేశ్. ''నా 12 ఏళ్లప్పుడు విజయ కృష్ణ మూవీస్‌లో 'మీనా' సినిమా చూశాను. ఇప్పుడు వారి బేనర్‌లో సినిమా చేస్తాననుకోలేదు. 'మళ్ళీ పెళ్లి' బోల్డ్ కథ'' అన్నారు ఎమ్మెస్ రాజా.

నంది అవార్డు ప్రతి ఆర్టిస్ట్ కల

– అలీ



• ప్రతాని రామకృష్ణ గౌడ్, అలీ

''1964 నుండి నంది అవార్డ్స్ ఇస్తున్నారు. ఆ అవార్డు అందుకోవాలనేది ప్రతి ఆర్టిస్ట్ కల. 7 సంవత్సరాల క్రితం ఆగిపోయిన నంది అవార్డ్స్‌ను తిరిగి ప్రారంభిస్తున్న ప్రతాని రామకృష్ణ గౌడ్‌గారికి థ్యాంక్స్. అలాగే సీనియర్ నటుల పేరుతో స్మారక అవార్డ్స్ ఇవ్వడం హర్షించదగ్గ విషయం'' అని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, నటుడు అలీ అన్నారు. 'తెలంగాణ ఫిలిం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్' ఆధ్వర్యంలో ఆగస్టు 12న దుబాయ్‌లో 'టీఎఫ్‌సీసీ నంది అవార్డ్స్ సౌత్ ఇండియా 2023' వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ అవార్డ్స్ ఇనివ్టేషన్ బ్రోచర్‌ను అలీ, ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ విడుదల చేశారు. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ''దాదాపు ఆరేడు సంవత్సరాల తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల సహకారంతో నంది అవార్డ్స్ పంపిణీ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ వేడుకకి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, తెలుగు రాష్ట్రాల సినీ, రాజకీయ ప్రముఖులు హాజరవుతారు'' అన్నారు.

యూత్‌ఫుల్ ఐక్యూ

సాయి చరణ్, పల్లవి, ట్రాన్సీ ముఖ్య తారలుగా జి.యల్.బి. శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఐక్యూ'. 'పవర్ ఆఫ్ స్టూడెంట్' అనేది ఉపశీర్షిక. కాయగూరల రాజేశ్వరి సమర్పణలో కాయగూరల లక్ష్మీపతి నిర్మించిన ఈ చిత్రం జూన్ 2న విడుదల కానుంది. ''మేధావి అయిన ఓ విద్యార్థిని మెదడును అమ్మడానికి వాళ్ల ప్రొఫెసర్ ఏ విధంగా ప్లాన్ చేశాడు? ఆ అమ్మాయిని హీరో ఎలా కాపాడాడు? అన్న అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



• సాయి చరణ్, పల్లవి, ట్రాన్సీ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	234	61,964
నిఫ్టీ ▲	111	18,314

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,713	▲	55
డోజోన్స్	33,305	▽	122
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,771	▲	14
డాక్స్	16,224	▽	51
షాంఘై	3,296	▲	13
నికాయ్	31,087	▲	278

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.ల్లో)	ముంబై
బంగారం (24 క్యారట్)	60,829
బంగారం (22 క్యారట్)	60,585
వెండి (కేజీ)	72,521

ఎకానమీపై ప్రభావం.. చాలా స్వల్పం

రూ. 2,000 నోట్లపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

- కరెన్సీ నిర్వహణలో భాగంగానే ఉపసంహరణ ప్రక్రియ
- చలామణీలో ఉన్న కరెన్సీలో ఈ నోట్ల వాటా 11 శాతమే...
- గడువులోగా చాలా నోట్లు తిరిగి వచ్చేస్తాయని భావిస్తున్నాం
- ప్రస్తుతం నోట్లు చెల్లుబాటవుతాయి...
- సెప్టెంబర్ 30 తర్వాత తగు నిర్ణయం తీసుకుంటాం...
- డిపాజిట్లకు ప్రస్తుత కేవైసీ నిబంధనలే వర్తిస్తాయని స్పష్టీకరణ





న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థపై రూ. 2,000 నోట్ల ఉపసంహరణ ప్రభావం ''చాలా చాలా స్వల్పం''గానే ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. చలామణీలో ఉన్న కరెన్సీలో వీటి వాటా 10.8 శాతమేనని (విలువపరంగా రూ. 3.6 లక్షల కోట్లు) వెల్లడించారు. కరెన్సీ నిర్వహణ కార్యకలాపాల్లో భాగంగానే ఉపసంహరణ ప్రక్రియను చేపట్టినట్లు సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఇంతకు ముందు 2013–14లో కూడా ఈ తరహా ప్రక్రియ నిర్వహించినట్లు, అప్పట్లో 2005కు పూర్వం ముద్రించిన నోట్లను చలామణీ నుంచి ఉపసంహరించినట్లు ఆయన వివరించారు. స్వచ్ఛ నోట్ల విధానంలో భాగంగానే తాజాగా రూ. 2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్లు చెప్పారు. ''చలామణీలో ఉన్న కరెన్సీలో రూ. 2,000 నోట్ల వాటా కేవలం 10.8 శాతమే కాబట్టి ఎకానమీపై దీని ప్రభావం చాలా తక్కువగానే ఉంటుంది. పైగా ఈ నోట్లను లావాదేవీల్లో ఎక్కువగా ఉపయోగించడం లేదని మా పరిశీలనలో తేలింది. కాబట్టి ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావమేమీ ఉండదు'' అని ఆయన వివరించారు. ప్రస్తుతానికి రూ. 2,000 నోట్ల చెల్లుబాటు యథాప్రకారంగానే కొనసాగుతుందన్న దాస్.. డిపాజిట్ చేసేందుకు, మార్చుకునేందుకు నిర్దేశించిన సెప్టెంబర్ 30 తర్వాత కూడా చెల్లుబాటవడంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. దానిపై అప్పుడు తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. 10 నోట్లను మాత్రమే మార్చుకునేందుకు అవకాశం కల్పించడం వెనుక హేతుబద్ధతపై స్పందిస్తూ 2014 జనవరిలో కూడా దాదాపు ఇదే విధానం పాటించినట్లు దాస్ చెప్పారు. ఇక రూ. 1,000 నోట్లను తిరిగి ప్రవేశపెట్టడంపై బదులిస్తూ.. అది ఊహాజనిత ప్రశ్న అని, ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనేదీ లేదని స్పష్టం చేశారు.

పుష్కలంగా నిధులు..

ద్రవ్య నిర్వహణపై ఉపసంహరణ ప్రభావాన్ని ప్రస్తావిస్తూ.. ప్రజల నుంచి నిధులకు ఉండే డిమాండ్‌ను బట్టి ఇది ఉంటుందన్నారు. ''కొంత మొత్తం బ్యాంక్ ఖాతాల్లో డిపాజిట్ అవుతుంది. మరికొంత మొత్తాన్ని మార్చుకుంటారు. మార్చుకున్న కరెన్సీ అంతా తిరిగి ప్రజల చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఖాతాల్లో డిపాజిట్ అయిన మొత్తాలను మాత్రం కస్టమర్లు బ్యాంకులోనే అట్టే పెట్టుకోవడమో లేదా తమ అవసరాల కోసం వెనక్కి తీసుకోవడమో జరగొచ్చు. ఏదైనా బ్యాంకింగ్ వ్యవస్థలో పుష్కలంగా నిధులు అందుబాటులో ఉన్నాయి'' అని దాస్ చెప్పారు.

నీరు, నీడ కల్పించండి..

రూ. 2,000 నోట్లను మార్చుకునేందుకు లేదా డిపాజిట్ చేసేందుకు వచ్చే కస్టమర్లకు తగు సౌకర్యాలు కల్పించాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఎండలో పడిగాపులు కాసే పరిస్థితి రాకుండా తగు నీడ, తాగడానికి నీరు వంటి సదుపాయాలు అందించాలని పేర్కొంది. నోట్ల మార్పిడి, డిపాజిట్ల డేటాను రోజువారీ రికార్డులను నిర్వహించాలని ఒక నోటిఫికేషన్‌లో సూచించింది. 2016లో పెద్ద నోట్లను రద్దు చేసినప్పుడు నోట్లను మార్చుకునేందుకు చాంతాడంత లైన్లలో నిలబడి పలువురు మరణించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆర్‌బీఐ సూచనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

పీఎస్‌బీ చీఫ్‌లతో భేటీ..

ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) చైర్మన్లు, డైరెక్టర్లతో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం సమావేశమయ్యారు. బ్యాంకుల్లో గవర్నెన్స్, నైతిక విలువలు తదితర అంశాలపై చర్చించారు.

ప్రస్తుత నిబంధనలే కొనసాగింపు...

వ్యవస్థలోకి నల్లధనం వచ్చే అవకాశాలపై స్పందిస్తూ.. ఖాతాలో డిపాజిట్ చేయాలన్నా, నోట్లను మార్చుకోవాలన్నా ప్రస్తుతం నిర్దిష్ట ప్రక్రియ ఉందని దాస్ చెప్పారు. దాన్నే కొనసాగించాలని బ్యాంకులకు సూచించామని, అదనంగా కొత్త నిబంధనలేమీ పెట్టలేదని తెలిపారు. ప్రస్తుతమున్న నిబంధనల ప్రకారం రూ. 50,000 దాటి నగదు డిపాజిట్ చేస్తే పాన్ తప్పనిసరిగా చూపాల్సి ఉంటుందన్నారు. ఇక ఈ కసరత్తుతో కరెన్సీ నిర్వహణ వ్యవస్థపై పడే ప్రభావాలకు సంబంధించిన ప్రశ్నలకు స్పందిస్తూ.. మన వ్యవస్థ అత్యంత పటిష్టంగా ఉందని శక్తికాంత దాస్ తెలిపారు. తోటి దేశాలతో పోలిస్తే డాలరుతో భారత కరెన్సీ మారకం ఒడిదుడుకులకు లోనవడం చాలా తక్కువేనని చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధం, సంపన్న దేశాల్లో కొన్ని బ్యాంకుల మూసివేతతో అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లలో సంక్షోభాలు తలెత్తినప్పటికీ భారతీయ కరెన్సీ స్థిరంగా నిల్చిందని దాస్ తెలిపారు.

అప్పుడేం జరుగుతుందో ఇప్పుడే చెప్పలేను

ప్రస్తుతం రూ. 2,000 నోట్లు చట్టబద్ధంగా చెల్లుబాటవడం కొనసాగుతుందని దాస్ చెప్పారు. ఎన్ని నోట్లు తిరిగి వస్తాయో వేచిచూడాల్సి ఉంటుందన్నారు. ''ఇప్పటికైతే చాలా మటుకు నోట్లు తిరిగి వచ్చేస్తాయనే అనుకుంటున్నాం. ఎన్ని వస్తాయన్నది చూడాలి. సెప్టెంబర్ 30 (మార్చుకునేందుకు, డిపాజిట్ చేసేందుకు ఆఖరు తేది) దగ్గరయ్యే కొద్దీ తగిన నిర్ణయాలు తీసుకుంటాం. దాని గురించి ఇప్పుడే నేను ఊహాజనిత సమాధానాలు ఇవ్వలేను'' అని దాస్ వ్యాఖ్యానించారు. నోట్ల మార్పిడికి, బ్యాంక్ ఖాతాల్లో డిపాజిట్ చేసేందుకు బోలెడంత సమయం ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. విదేశీ పర్యటనల్లో ఉన్న వారు, వర్క్ వీసాలతో విదేశాల్లో ఉన్న వారు ఎదుర్కొనే సమస్యలను కూడా తాము పరిగణనలోకి తీసుకున్నామని, ఎవరికీ ఎటువంటి ఇబ్బందీ కలుగకుండా ఈ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడటమే తమ ప్రధాన ఉద్దేశమని దాస్ వివరించారు.

టీసీఎస్ కన్సార్షియంకు బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ కాంట్రాక్ట్

విలువ రూ. 15,000 కోట్లు



ముంబై: ప్రభుత్వ రంగ బీఎస్‌ఎన్‌ఎల్‌కు 4జీ నెట్‌వర్క్ ఏర్పాటు చేసే కాంట్రాక్టును ఐటీ దిగ్గజం టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) సారథ్యంలోని కన్సార్షియం దక్కించుకుంది. దీని విలువ రూ. 15,000 కోట్లు. దీనికి సంబంధించి బీఎస్‌ఎన్‌ఎల్ నుంచి అడ్వాన్స్ పర్చేజ్ ఆర్డర్‌ను అందుకున్నట్లు టీసీఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో కొద్ది నెలలుగా దీనిపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది. బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ నెట్‌వర్క్ కాంట్రాక్టు గురించి ప్రకటించినప్పటి నుంచి టీసీఎస్ కంపెనీయే ముందు వరుసలో ఉందంటూ వార్తలు వచ్చాయి. ముంబై, న్యూఢిల్లీ మినహా బీఎస్‌ఎన్‌ఎల్ దేశవ్యాప్తంగా ఫిక్స్‌డ్ లైన్, వైర్‌లెస్, డేటా సర్వీసులను అందిస్తోంది. మరోవైపు టెలికం పరికరాల తయారీ సంస్థ ఐటీఐకి కూడా బీఎస్‌ఎన్‌ఎల్ రూ. 3,889 కోట్ల విలువ చేసే ఆర్డరు ఇచ్చింది. దీని ప్రకారం 18–24 నెలల వ్యవధిలో 23,633 సైట్ల కోసం 4జీ పరికరాలను సరఫరా చేయాల్సి ఉంటుందని ఐటీఐ వివరించింది.

టాటా అల్ట్రోజ్ సీఎన్‌జీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ అల్ట్రోజ్ ఐసీఎన్‌జీ వెర్షన్‌ను ఆరు వేరియంట్లలో ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూంలో పరిచయ ఆఫర్ ధర రూ.7.55 లక్షల నుంచి మొదలుకుని రూ.10.55 లక్షల వరకు ఉంది. ట్విన్ సిలిండర్ సీఎన్‌జీ టెక్నాలజీతో రూపుదిద్దుకుంది. భద్రతా కారణాల దృష్ట్యా ట్విన్ సిలిండర్లను లగేజ్ ఏరియా కింద ఏర్పాటు చేసినట్టు కంపెనీ తెలిపింది. ఆల్ట్రోజ్ ఐసీఎన్‌జీ మెరుగైన భద్రతా ఫీచర్లతో తయారైంది. ఇంధనం నింపే సమయంలో ఇంజన్ ఆఫ్ అవుతుంది. నిర్దిష్ట స్థాయిని మించి ఇంజిన్ వేడెక్కితే సీఎన్‌జీ సరఫరా నిలిచిపోవడమే గాక గ్యాస్‌ను గాలిలోకి వదులుతుంది.

మార్కెట్లకు మెటల్, ఐటీ దన్ను



- రెండో రోజూ లాభాలే
- సెన్సెక్స్ 234 పాయింట్లు అప్

ముంబై: వరుసగా రెండో రోజు దేశీ మార్కెట్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 234 పాయింట్లు ఎగసి 61,964 వద్ద నిలిచింది. నిఫ్టీ 111 పాయింట్లు బలపడి 18,314 వద్ద ముగిసింది. ప్రధానంగా మెటల్, ఐటీ, హెల్త్‌కేర్ రంగాలు మార్కెట్లకు జోష్‌నిచ్చాయి.

దిగ్గజాల జోరు

ఎన్‌ఎస్‌ఈలో మెటల్ ఇండెక్స్ 3.2 శాతం జంప్‌చేయగా.. ఐటీ 2.5 శాతం, హెల్త్‌కేర్ 1.6 శాతం చొప్పున ఎగశాయి. కన్జూమర్ డ్యూరబుల్స్, ఆయిల్, రియల్టీ సైతం 0.7 శాతం చొప్పున పుంజుకున్నాయి. ఆర్‌బీఐ గవర్నర్‌తో సమావేశం నేపథ్యంలో ప్రభుత్వ బ్యాంక్స్ 0.5 శాతం బలపడ్డాయి. ఇక నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ 20 శాతం దూసుకెళ్లగా.. అదానీ పోర్ట్స్ 6.4 శాతం జంప్ చేసింది. ఇతర బ్లూచిప్స్‌లో దివీస్, అపోలో హాస్పిటల్స్, టెక్ మహీంద్రా, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, సన్ ఫార్మా, ఎల్‌అండ్‌టీ, డాక్టర్ రెడ్డీస్, జేఎస్‌డబ్ల్యూ, ఐటీసీ, సిప్లా 5–1 శాతం మధ్య లాభపడ్డాయి. మరోపక్క ఐషర్, ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ, టాటా మోటార్స్, కోల్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.5 శాతం స్థాయిలో డీలా పడ్డాయి. కాగా, డాలరుతో మారకంలో రూపాయి విలువ 17 పైసలు క్షీణించి 82.84ను తాకింది.

జోస్ ఆలుక్కాస్.. హెచ్‌యూఐడీ 'ఫెస్ట్'



హైదరాబాద్: దక్షిణ భారత్‌లో ప్రముఖ జ్యువెల్లరీ గ్రూప్‌ల్లో ఒకటైన జోస్ ఆలుక్కాస్, హెచ్‌యూఐడీ హాల్‌మార్కింగ్ అమలును వేగవంతం చేయడానికి తనవంతు సహకారాన్ని అందిస్తోంది. ఇందుకు హెచ్‌యూఐడీ ఎక్స్ఛేంజ్ ఫెస్ట్ సహా పలు కార్యక్రమాలను ప్రారంభించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. బీఐఎస్–916 హాల్‌మార్క్ కలిగిన ఆభరణాలను ప్రవేశపెట్టి, విక్రయించిన మొదటి జ్యువెల్లరీ గ్రూప్‌గా నిలిచిన సంస్థ, ఆరు అంకెల ఆల్ఫాన్యూమరిక్ యూనిక్ ఐడెంటిఫికేషన్ కోడ్ (హెచ్‌యూఐడీ)తో తన బంగారు నిల్వల్లో మొత్తం 100 శాతాన్ని హాల్‌మార్క్ చేసినట్లు పేర్కొంది.

అమూల్.. 7వ సారి..

పాలసేకరణ ధరల పెంపు



సాక్షి, అమరావతి: 'జగనన్న పాలవెల్లువ' ద్వారా పాలు పోస్తున్న పాడిరైతులకు మరింత ప్రయోజనం చేకూరుస్తూ అమూల్ సంస్థ ఏడోసారి పాలసేకరణ ధరలను పెంచింది. లీటర్‌కు గరిష్టంగా గేదె పాలపై రూ.2.20, ఆవుపాలపై రూ.1.13 చొప్పున పెంచింది. కిలో వెన్నపై రూ.20, ఘన పదార్థాలపై రూ.8 మేర పెంచింది. ఈ పెంపు సోమవారం నుంచే వర్తింపజేసింది. ఈ పెంపుతో 1.71 లక్షలమంది పాడిరైతులకు లబ్ధి కలగనుంది.

30 నెలల్లో ఏడుసార్లు పెంపు

అమూల్ తరఫున రాయలసీమలో కైరా యూనియన్, కోస్తాంధ్రలో సబర్కాంత్ యూనియన్, ఉత్తరాంధ్రలో బనస్కాంత్ యూనియన్ పాలను సేకరిస్తున్నాయి. పథకం ప్రారంభించినప్పుడు లీటర్‌కు గరిష్టంగా గేదె పాలకు రూ.71.47, ఆవుపాలకు రూ.34.20 చొప్పున చెల్లించగా తాజా పెంపుతో కలిపి గత 30 నెలల్లో ఏడుసార్లు సేకరణ ధర పెంచడంతో ప్రస్తుతం లీటరు గేదె పాల సేకరణ ధర కనిష్టంగా రూ.42.40 నుంచి రూ.43.50కి, గరిష్టంగా రూ.85.80 నుంచి రూ.88కి పెరిగింది. లీటరు ఆవుపాలకు కనిష్టంగా రూ.34.20 నుంచి రూ.35.11కి, గరిష్టంగా రూ.42.56 నుంచి రూ.43.69కి పెరిగింది. పాలల్లో ఉండే ఫ్యాట్ శాతానికి కిలోకి రూ.20, ఘనపదార్థాల (టీఎస్)కు కిలోకి రూ.8 పెంచింది. ఈ పెంపు బాపట్ల, తూర్పుగోదావరి, ఏలూరు, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో రైతులకు లబ్ధి కలిగించనుంది. 30 నెలల్లో 7.95 కోట్ల లీటర్ల సేకరణ జగనన్న పాలవెల్లువ పథకం 2020 డిసెంబర్‌లో మూడు జిల్లాలతో ప్రారంభం కాగా ప్రస్తుతం 17 జిల్లాలకు (పునర్విభజన తర్వాత) విస్తరించింది. 14,945 మంది రైతులతో మొదలైన ఈ ఉద్యమంలో 2.67 లక్షల మంది భాగస్వాములయ్యారు. వంద గ్రామాలతో మొదలైన ఈ పథకం ప్రస్తుతం 1,537 ఆర్బీకేల పరిధిలో 3,149 గ్రామాలకు విస్తరించింది. రైతుల నుంచి రోజూ సగటున 1.72 లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్నారు. 30 నెలల్లో 7.95 కోట్ల లీటర్ల పాలను సేకరించగా, పాలుపోసిన మహిళా పాడి రైతులకు రూ.351.60 కోట్లు చెల్లించారు.

ప్రైవేటు డెయిరీల కంటే 6–10 శాతం అధికంగా..

లీటర్‌పై రూ.4 అదనంగా లబ్ధికలిగేలా కృషిచేస్తామన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీకి మిన్నగా ప్రస్తుతం లీటరు గేదె పాలకు రూ.15 నుంచి రూ.20 వరకు, ఆవుపాలకు రూ.10 నుంచి 15 వరకు అదనంగా ప్రయోజనం కలుగుతోంది. గతంలో రెండేళ్లకు ఒకసారి అతికష్టం మీద.. అదీ పాడి రైతుల ఒత్తిడితో ప్రైవేటు డెయిరీలు పాలసేకరణ ధరలు పెంచేవి. కానీ అమూల్ వచ్చిరావడంతోనే ప్రైవేటు డెయిరీల కంటే అధిక ధరలకు పాలు సేకరించడమేగాక.. మూడునెలలకు ఒకసారి డిమాండ్‌కు అనుగుణంగా పాలసేకరణ ధరలు పెంచుతోంది. దీంతో విధిలేక ప్రైవేటు డెయిరీలు కూడా పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ అమూల్ పాలసేకరణ ధరలు ప్రైవేటు డెయిరీల ధరల కంటే 6–10 శాతం అధికంగా ఉంటున్నాయి. అమూల్‌తో పోటీని తట్టుకునేందుకు పెంచిన పాల ధరల ఫలితంగా ప్రైవేటు డెయిరీలకు పాలుపోసే పాడిరైతులకు గతంతో పోలిస్తే రూ.3,132.46 కోట్ల మేర అదనంగా లబ్ధి చేకూరింది.

ఒత్తిడి లేకుండానే పెంపు

జగనన్న పాలవెల్లువ కింద పాలుపోసే పాడి రైతులకు అమూల్ సంస్థ ప్రతి మూడు నెలలకు ఒకసారి పాలసేకరణ ధరలను సవరిస్తోంది. గతంలో రైతుల నుంచి ఒత్తిడి వస్తేగానీ ప్రైవేటు డెయిరీలు పెంచేవి కావు. కానీ ప్రస్తుతం రైతుల నుంచి ఎలాంటి ఒత్తిడి లేకుండానే పాలసేకరణ ధరలను పెంచుతూ వాళ్లకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. ఈ కారణంగానే గతంలో ఎన్నడూ లేని ధరను పాడి రైతులు పొందగలుగుతున్నారు.

– అహ్మద్‌బాబు, ఎండీ, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్

నాణ్యత ఆధారంగా లీటరు పాలకు పెరిగిన సేకరణ ధరలు (రూపాయల్లో)

పాలు	కొవ్వు శాతం	ఎస్‌ఎన్‌ఎఫ్ శాతం	పాతధర	కొత్త ధర	పెరిగిన ధర
గేదె పాలు	5.5	9	42.40	43.50	1.10
	11	9	85.80	88.00	2.20
ఆవు పాలు	3.2	8.7	34.20	35.11	0.91
	5.4	8.7	42.56	43.69	1.13

పెరిగిన వెన్న, ఘనపదార్థాల సేకరణ ధర (కిలోకి రూపాయల్లో)

	పాత ధర	కొత్త ధర	పెరిగిన ధర
వెన్న (ఫ్యాట్)	780	800	20
ఘనపదార్థాలు (టీఎస్)	302	310	8

రాష్ట్రంలో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జీ యూనిట్

- దేశంలోనే తొలి యూనిట్
- రూ. 2.35 లక్షల కోట్ల పెట్టుబడులు.. 77,000 మందికి ఉపాధి
- అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద ఏర్పాటు
- విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లోనే ప్రభుత్వంతో ఎన్‌టీపీసీ ఒప్పందం
- ఈ ప్లాంట్‌కు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ రంగ నవరత్న కంపెనీ నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) దేశంలోనే తొలి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తోంది. ఇప్పటివరకు బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తికే పరిమితమైన ఈ సంస్థ.. తాజాగా అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద ఏర్పాటు చేయనున్న గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. పూడిమడక వద్ద 4,000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు కేటాయించిన 1,200 ఎకరాలను గ్రీన్ హైడ్రోజన్ హబ్ కోసం వినియోగించుకోవడానికి అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులు రానున్నాయి. ఈ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లో రూ.2,35,000 కోట్ల పెట్టుబడులు పెట్టేలా మార్చి నెలలో విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో ఎన్‌టీపీసీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ యూనిట్ ద్వారా 77,000 మందికి ఉపాధి లభిస్తుంది.

2026 నాటికి తొలి దశ పూర్తి

మొత్తం 1200 ఎకరాల్లో 600 ఎకరాలను పారిశ్రామిక తయారీ రంగానికి, 600 ఎకరాలను హైడ్రోజన్ ఏరియాగా ఎన్‌టీపీసీ అభివృద్ధి చేస్తుంది. పరిశ్రమల కోసం సోలార్ రూఫ్ టాప్‌లతో కూడిన ప్రీ ఇంజనీర్డ్ బిల్డింగ్స్, ఇండస్ట్రియల్ స్పేస్, సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎన్‌టీపీసీ తెలిపింది. ఇంధన రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎలక్ట్రోలైజర్స్, ఫ్యూయల్ సెల్స్, బ్యాటరీలు, సోలార్ వేఫర్స్, సోలార్ మాడ్యూల్స్, విండ్ టర్బైన్ ఎక్విప్‌మెంట్, కార్బన్ క్యాప్చర్ సిస్టమ్స్ వంటి ఉత్పత్తుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేస్తారు. 600 ఎకరాల హైడ్రోజన్ ఏరియాలో రోజుకు 1500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్, 1300 టన్నుల గ్రీన్ అమ్మోనియా, 1200 టన్నుల గ్రీన్ మిథనాల్ యూనిట్లను ఏర్పాటు చేస్తారు. ఇక్కడ తయారు చేసే హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, మిథనాల్ దక్షిణాసియా దేశాలకు ఎగుమతి చేస్తారు. ఎన్‌టీపీసీ కొత్తగా సమర్పించిన పెట్టుబడుల ప్రతిపాదనకు ముఖ్యమంత్రి అధ్యక్షతన సమావేశమైన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు (ఎస్‌ఐపీబీ) ఈ ఏడాది ఇటీవల ఆమోద ముద్ర వేసింది. ఎన్‌టీపీసీ అభివృద్ధి చేసే గ్రీన్ హైడ్రోజన్ హబ్ తొలిదశను 2026 నాటికి, రెండో దశను 2030 నాటికి పూర్తి చేయాలంటూ రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికల్ వలవన్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే మద్దాళి గిరికి మాతృ వియోగం



గిరిధర్ తల్లి శివపార్వతి

సాక్షి, అమరావతి/గుంటూరు (పట్నం బజారు): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాతృమూర్తి శివపార్వతి(68) స్వర్గస్తులయ్యారు. సోమవారం ఉదయం ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె భౌతికకాయాన్ని మంత్రులు మేరుగు నాగార్జున, విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నేతలు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

నేడు సీఎం జగన్ గుంటూరు రాక

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గుంటూరులో పర్యటించనున్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరతారు.

సీఎం జగన్‌కు పోలీసు అధికారుల సంఘం కృతజ్ఞతలు

- ఇటీవలే పోలీసులకు రూ.554 కోట్ల బకాయిలు విడుదల
- హర్షం వ్యక్తం చేసిన పోలీసులు, వారి కుటుంబసభ్యులు



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు

సాక్షి, అమరావతి/గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు సోమవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవలే పోలీసు ఉద్యోగులకు సంబంధించిన రూ.554 కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు సోమవారం సీఎం జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. పోలీసు శాఖలోని ప్రతి అధికారి, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. దీనిపై పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సీఎంను కలిసిన వారిలో పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మస్తాన్‌ఖాన్, ట్రెజరర్ ఎం.సోమశేఖరరెడ్డి, ఉప్పు శంకర్, కె.రాముసాయుడు, బి.స్వర్ణలత, పి.శేషయ్య, సీహెచ్.వాజరత్తయ్య, డి.సురేశ్, ఆర్.నాగేశ్వరరావు, జి.అక్కిరాజు, వి.ఓంకార్, కె.నాగిని, టి.మాణిక్యాలరావు తదితరులున్నారు. అనంతరం విజయవాడలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు తదితరులు మీడియాతో మాట్లాడారు. బకాయిలు విడుదల చేయడంతో పోలీసు ఉద్యోగులు, వారి కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొందన్నారు. వైఎస్ జగన్ సీఎం కాగానే పోలీసులకు గతంలో ఎన్నడూ లేని విధంగా తక్కువ వడ్డీకి గృహ రుణాలు ఇప్పించారని, వీక్లీ ఆఫ్ తెచ్చారని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రూ.554 కోట్లు విడుదల చేసినందుకు సీఎం జగన్‌కు, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

తుది దశలో 51,392 ప్లాట్ల అభివృద్ధి పనులు

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని నిరుపేదల కోసం సీఆర్డీఏ పరిధిలో సిద్ధం చేస్తున్న 51,392 ప్లాట్ల లేఅవుట్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెల 26న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్న నేపథ్యంలో అధికారులు పనులను ముమ్మరం చేశారు. ఈ రెండు జిల్లాల్లోనూ అర్హులైన పేదలకు నిడమర్రు, కృష్ణాయపాలెం, నవులూరు, ఐనవోలు, మందడం, కురగల్లు, యర్రబాలెం, పిచ్చుకలపాలెం, బోరుపాలెం, నెక్కల్లు, అనంతవరం ప్రాంతాల్లో మొత్తం 1,402.58 ఎకరాల్లో 11 చోట్ల 25 లేఅవుట్లను సిద్ధం చేశారు. సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఎప్పటికప్పుడు రెవెన్యూ, మునిసిపల్ అధికారులు, సిబ్బందితో సమన్వయం చేస్తూ పనులను పరిశీలిస్తున్నారు.

ఎనీ వేర్ రిజిస్ట్రేషన్లలో కీలక మార్పు

- ఒకచోట రిజిస్ట్రేషన్.. మరో చోట అనుమతి విధానానికి స్వస్తి
- ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచైనా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చు

సాక్షి, అమరావతి: ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎనీ వేర్ రిజిస్ట్రేషన్ల విధానంలో ప్రభుత్వం కీలక మార్పు తీసుకువచ్చింది. ఇకపై స్థిరాస్తి ఉన్న ప్రదేశానికి సంబంధించిన(జ్యూరిడిక్షనల్) సబ్ రిజిస్ట్రార్లతో సంబంధం లేకుండానే.. ఎక్కడి నుంచైనా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకునే అవకాశం కల్పించింది. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ వి.రామకృష్ణ తాజాగా ఉత్తర్వులిచ్చారు. గతంలో స్థిరాస్తి ఉన్న పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే.. దానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేసుకునేవారు. ఆ తర్వాత తీసుకువచ్చిన ఎనీ వేర్ రిజిస్ట్రేషన్ విధానంలో స్థిరాస్తి పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే కాకుండా.. రాష్ట్రంలో ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచైనా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. కానీ, ఈ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలను వెంటనే ఆ స్థిరాస్తి పరిధిలోని సబ్ రిజిస్ట్రార్‌కు పంపి 48 గంటల్లో అనుమతి తీసుకోవాలనే నిబంధన పెట్టారు. ఆ సబ్ రిజిస్ట్రార్ అనుమతిచ్చే వరకు ఆ రిజిస్ట్రేషన్ పెండింగ్‌లోనే ఉండేది. దీనివల్ల అవకతవకలు జరుగుతున్నాయని, రిజిస్ట్రేషన్లు ఆలస్యమవుతున్నాయంటూ ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక మార్పు తీసుకువచ్చింది. ఒక చోట రిజిస్ట్రేషన్ చేసుకోవడం, దానికి మరో చోట అనుమతివ్వడం అనే విధానానికి స్వస్తి పలికింది. తాజా నిర్ణయం ప్రకారం స్థిరాస్తి ఉన్న ప్రదేశానికి సంబంధించిన(జ్యూరిడిక్షనల్) సబ్ రిజిస్ట్రార్‌తో సంబంధం లేకుండా.. వినియోగదారుడు ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అయినా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకుని వెంటనే డాక్యుమెంట్ పొందవచ్చు. స్థిరాస్తుల మార్కెట్ విలువలు, నిషేధిత ఆస్తుల జాబితాలన్నీ ఆన్‌లైన్‌లో సీఏఆర్డీలోనే అందుబాటులో ఉండడంతో ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల 1 నుంచి ఈ విధానం అమల్లోకి రానుంది. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం అమలయ్యేలా చూడాలని, సమాచారాన్ని సీఏఆర్డీ నెట్‌వర్క్‌లో అప్‌డేట్ చేయాలని డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేశారు.

క్లుప్తంగా...

25 నుంచి పాలిటెక్నిక్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియను ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. విద్యార్థులు ఆన్‌లైన్ ప్రాసెసింగ్ ఫీజును జూన్ 1వ తేదీలోగా చెల్లించాలని పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన , జూన్ ఒకటి నుంచి 6వ తేదీలోగా ఆప్షన్ల నమోదు, 7వ తేదీన మార్పులకు అవకాశం, 9వ తేదీన సీట్ల కేటాయింపులు చేస్తామని తెలిపారు. 15వ తేదీ నుంచి పాలిటెక్నిక్ క్లాసులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

రేపే ఐసెట్

49,162 మంది అభ్యర్థుల దరఖాస్తు

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ ఐసెట్)–2023ను ఈ నెల 24న బుధవారం నిర్వహిస్తున్నట్లు ఐసెట్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, కన్వీనర్ ప్రొఫెసర్ పి.మురళీకృష్ణ తెలిపారు. సోమవారం అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వివరాలను వెల్లడించారు. ఏపీ ఐసెట్‌కు మొత్తం 49,162 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈ నెల 24న రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మరో సెషన్ నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డు (పాస్‌పోర్టు, పాన్ కార్డు, ఓటరు కార్డు, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్) తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. 111 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు.

ఈఏపీ సెట్ బైపీసీ స్ట్రీమ్‌కు 90.30 శాతం హాజరు

సాక్షి, అమరావతి: ఇంజనీరింగ్, వ్యవసాయం, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఈఏపీ సెట్–2023 బైపీసీ స్ట్రీమ్ పరీక్షకు తొలి రోజు సోమవారం 90.30 శాతం మంది హాజరయ్యారు. మంగళవారం మరో రెండు సెషన్లలో పరీక్ష కొనసాగనుంది.

26, 27 తేదీల్లో ఏపీపీఎస్సీ సీపీటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ఈ నెల 26, 27 తేదీల్లో కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ (సీపీటీ) నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ విభాగంలోని పంచాయతీ సెక్రటరీ (గ్రేడ్–5), గ్రామ రెవెన్యూ అధికారి (గ్రేడ్–2), రెవెన్యూ శాఖలో వీఆర్వో (గ్రేడ్–1)లతోపాటు అన్ని హెచ్‌వోడీలు, డైరెక్టరేట్‌లు, రాష్ట్ర సెక్రటేరియట్‌లో కారుణ్య ప్రాతిపదికన నియమితులైన ఉద్యోగులకు, సీనియర్ సహాయకులకు ఈ టెస్ట్ నిర్వహించనున్నట్లు వివరించింది.

దేశానికి సేవ చేయడానికి ఇస్రోలో సైంటిస్టులుగా చేరండి

‘యువికా–2023’ విద్యార్థులతో షార్ అధికారులు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): దేశానికి సేవ చేసేందుకు విద్యార్థులు బాగా చదువుకుని ఇస్రోలో సైంటిస్టులుగా చేరాలని షార్ అధికారులు సూచించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగి ఇస్రోలో భాగస్వాములై పని చేస్తే ప్రపంచంలో మన దేశానికి తిరుగులేని గుర్తింపు వస్తుందని చెప్పారు. యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఇస్రో దేశంలోని 28 రాష్ట్రాల నుంచి తొమ్మిదో తరగతి పూర్తయి పదో తరగతికి వెళుతున్న 56 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 16వ తేదీ నుంచి ‘యువికా–2023’ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం విద్యార్థులకు శ్రీహరికోటలోని షార్‌లో రాకెట్ ప్రయోగాల గురించి అధికారులు వివరించారు. ఈ తరం విద్యార్థులు ఎంతో తెలివైనవారని, వారిలోని సృజనాత్మకతను బయటకు తీస్తే మంచి పౌరులుగా తయారవుతారని అధికారులు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు స్పేస్ టెక్నాలజీ వైపు రావాలని సూచించారు. షార్ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ, ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు.

‘మోడల్ స్కూల్స్’ దరఖాస్తుకు 25 వరకు చాన్స్

జూన్ 11న ప్రవేశ పరీక్ష

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకుగాను ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ ఎం.వి.కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 19,500 దరఖాస్తులు అందాయన్నారు. అభ్యర్థులకు జూన్ 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఇంకా దరఖాస్తు చేసుకోనివారు వెంటనే cse. ap. gov. in/ apms. ap. gov. inలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్‌లో చూడవచ్చని లేదా స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్స్, జిల్లా/ మండల విద్యాశాఖాధికారిని సంప్రదించాలని సూచించారు.

పాలిటెక్నిక్ విద్యలో నవోదయం

డిప్లొమాతోనే ఉన్నత కొలువులు



- ఈ చిత్రంలోని విద్యార్థి పేరు కె. తరుణ్. రావులపాలేనికి చెందిన ఓ రైతు కొడుకు. మూడేళ్ల క్రితం పాలిసెట్‌లో ర్యాంకు సాధించి కాకినాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్‌లో చేరాడు. ఇటీవల నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో విప్రో కంపెనీలో రూ.3.50 లక్షల వేతనంతో ఉద్యోగంతో పాటు నాలుగేళ్ల సర్వీసు అనంతరం బిట్స్ పిలానీ నుంచి బీటెక్ డిగ్రీ ఇచ్చేందుకు కంపెనీ ఆఫర్ ఇచ్చింది. కానీ, ‘పదో తరగతిలో నా స్నేహితులు 10 మంది పాలిసెట్ రాశాం. నలుగురికి ర్యాంకులు వచ్చాయి. నేను డిప్లొమాలో చేరితే మిగతా వారు ఇంటర్, తర్వాత ఇంజనీరింగ్‌లో చేరారు. వారింకా చదువుల్లో ఉంటే నేను 18 ఏళ్లకే మంచి ప్యాకేజీతో ఉద్యోగం అందుకున్నా. డిప్లొమా వదిలేసినందుకు వారిప్పుడు బాధపడుతున్నారు’.. అని తరుణ్ అంటున్నాడు.



- ఈ విద్యార్థి పేరు ప్రేమ్ సాయి. ఊరు ప్రొద్దుటూరు. అత్యంత సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఇతను విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మెకానికల్ డిప్లొమా కోర్సులో చేరాడు. ఇటీవల క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో రూ.6.25 లక్షల వేతనంతో మెట్సో ఔటోటెక్ కంపెనీలో ఉద్యోగం సాధించాడు. కానీ, ఈయన సోదరి ఇంకా బీటెక్ మూడో ఏడాది చదువుతుండగానే ప్రేమ్ సాయి ఉద్యోగం సాధించేశాడు.



- విశాఖపట్నానికి చెందిన పి. నవ్య శ్రీని ఆమె తల్లి చిరుద్యోగం చేస్తూ కుమార్తెను చదివించింది. భీమునిపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈసీఈ డిప్లొమా మూడో ఏడాది చదువుతోంది. రూ.4.06 లక్షల ప్యాకేజీతో ష్లంబర్గర్ కంపెనీలో కొలువు సంపాదించింది.



- కంచరపాలేనికి చెందిన జి. గీతాభవాని తండ్రి ఓ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. గీత విశాఖపట్నంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో పెట్రో కెమికల్స్‌లో డిప్లొమా చేసింది. ఇటీవల క్యాంపస్ ఎంపికల్లో రూ.4 లక్షల వేతనంతో అల్ట్రాటెక్ కంపెనీలో కొలువును సొంతం చేసుకుంది.

కేవలం 18 ఏళ్ల వయసులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లోని నాలుగు వేల మందికి పైగా విద్యార్థులు ఏడాదికి సగటున రూ.2.80 లక్షల వేతనంతో కొలువులతో పాటు, ఉన్నత విద్యావకాశాలు కూడా దక్కించుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రాంగణ ఎంపికల్లో మరో రెండు వేల మందికి పైగా ఉద్యోగాలు సాధిస్తారని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి. నాగరాణి గర్వంగా చెబుతున్నారు. ఇదంతా గత నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, ప్రోత్సాహంతోనే సాధ్యమైందంటున్నారు.



పాలిటెక్నిక్ విద్యార్థులు

బ్రాండ్ ఏపీ

సాక్షి, అమరావతి : పదో తరగతి తర్వాత పేద, దిగువ మధ్యతరగతి విద్యార్థుల గమ్యం మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు. చదువుతో పాటే క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో రూ.లక్షల వేతనాలతో విద్యార్థులు ఉద్యోగాలు దక్కించుకుంటున్నారు. 2022–23 బ్యాచ్‌కు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు 4,000 మందికి పైగా ఇంకా పరీక్షలు పూర్తికాకుండానే మంచి వేతనాలతో క్యాంపస్ కొలువులను సొంతం చేసుకున్నారు. గరిష్టంగా రూ.6.25 లక్షలు, సరాసరి రూ.2.80 లక్షల వార్షిక వేతనాలతో బహుళజాతి సంస్థల్లో ఆఫర్ లెటర్లు అందుకున్నారు. ఇంటర్, ఇంజనీరింగ్ కోర్సులతో ఆరేళ్లు చదివి పూర్తిచేసిన తర్వాత అందుకునే వేతనాలను మూడేళ్ల డిప్లొమాతో 18 ఏళ్ల వయసులోనే అందుకుంటున్నారు. నాలుగేళ్ల క్రితం 400 దాటని అవకాశాలు.. ఇప్పుడు వేలమందికి అందడం వెనుక రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సంస్కరణల ప్రభావం ఎంతో ఉంది. దీంతోపాటు ఏపీ సాంకేతిక విద్యాశాఖ చూపిన చొరవతో డిప్లొమా బోధనలోను మార్పులు చేశారు.

ప్రభుత్వ కాలేజీల్లోనే అధిక కొలువులు

రాష్ట్రంలో 84 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు, 175 ప్రైవేటు, ఒక ఎయిడెడ్ కాలేజీ ఉన్నాయి. వీటిల్లో గత దశాబ్ద కాలంలో ఏనాడు కొలువులు 450 దాటలేదు. 2019–20లో 575 ఉద్యోగాలు, 2020–21లో 652, 2021–22లో 780 ఉద్యోగాలు అందుకుంటే.. ఈసారి 2022–23లో ఒక్క ప్రభుత్వ కాలేజీ విద్యార్థులే 4,071 మంది ఉద్యోగాలు సాధించారు. మే చివరి వరకు కొనసాగే ఈ నియామక ప్రక్రియలో మరో రెండువేల మందికి పైగా అవకాశాలు పొందుతారని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి. నాగరాణి ‘సాక్షి’కి తెలిపారు. అలాగే, ప్రైవేటు, ఎయిడెడ్ కాలేజీల్లోని 24,667 మంది విద్యార్థుల్లో రెండువేల మంది విద్యార్థులు ఉద్యోగావకాశాలు దక్కించుకున్నారు. 31 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో రాష్ట్ర ప్రభుత్వం గతేడాది స్కిల్ హబ్‌లను ఏర్పాటుచేయడంతో శిక్షణ పొందిన విద్యార్థులు సునాయాసంగా కొలువులను దక్కించుకున్నారు. అత్యధికంగా నంద్యాలలోని ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కాలేజీ నుంచి 352 మంది, విజయవాడ పాలిటెక్నిక్ నుంచి 277 మంది, కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ నుంచి 224 మంది, అనంతపురం పాలిటెక్నిక్ నుంచి 215 మంది, విశాఖపట్నం (నేషనల్ హైవే) పాలిటెక్నిక్ నుంచి 174 మంది ఎంపికయ్యారు.

ఉద్యోగంతో పాటు ఉన్నత చదువులు

గతంలో ఒక కంపెనీలో ఉద్యోగం వచ్చిందంటే సీనియారిటీ ప్రకారం వేతనాలు పెరిగే పరిస్థితి. ఈ ఏడాది నుంచి సాంకేతిక విద్యాశాఖ చేసిన కృషితో చాలా కంపెనీలు డిప్లొమా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు ఉన్నత చదువులు చదివేందుకూ అవకాశం కల్పించాయి. వాటిల్లో ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్, విప్రో, స్మార్ట్ డీవీ టెక్నాలజీస్, ఏషియన్ పెయింట్స్, టాటా ప్రాజెక్ట్స్, షాపూర్జీ–పల్లోంజీ, జేఎస్‌డబ్ల్యూ, అల్ట్రాటెక్, మెట్సో ఔటోటెక్ వంటి అగ్రశ్రేణి సంస్థలు ఉండడం గమనార్హం. ఉద్యోగాల్లో చేరిన వారికి నాలుగేళ్లల్లో ‘వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్’ (వైల్) ద్వారా బీఎస్సీ, బీటెక్ డిగ్రీ ఇచ్చేలా ఆయా కంపెనీలు అంగీకరించాయి. వచ్చే ఏడాది నుంచి విద్యార్థులు చదువులో భాగంగా చేసే 6 నెలలు, ఏడాది ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లోనే నూరు శాతం ఉద్యోగాలు లభించేలా శిక్షణనివ్వనుంది.

గత విద్యా సంవత్సరాల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఉద్యోగాలు పొందిన వారు..

ఏడాది	పాసైన వారు	ప్లేస్‌మెంట్స్ సంఖ్య
2019-20	6,030	575
2020-21	6,266	652
2021-22	7,087	780
2022-23	11,604	4,071

(డ్రైవ్ ఇంకా కొనసాగుతోంది)

ప్రతి కాలేజీలోను ప్లేస్‌మెంట్ సెల్



ఇంజనీరింగ్ చేస్తేనే అవకాశాలు ఉంటాయన్నది అపోహ. ఈ ఏడాది ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 11,604 మంది విద్యార్థులు చివరి సంవత్సరం చదువుతుంటే వారిలో 4 వేల మందికి పైగా పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. కమిషనర్ నాగరాణి ఆయా పరిశ్రమలను స్వయంగా పరిశీలించి ఒప్పందం చేసుకున్నారు. అన్ని కాలేజీల్లోను ప్లేస్‌మెంట్ సెల్ ఏర్పాటుచేసి కేంద్ర కార్యాలయంతో అనుసంధానించారు. ఫైనలియర్‌లోనే క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నాం.

– డాక్టర్ ఎంవీవీ రామకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ (ప్లేస్‌మెంట్ సెల్)

ఇండస్ట్రియల్–అకడమిక్ సౌజన్యంతో..



ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పాలిటెక్నిక్ విద్యా బోధనలో మార్పులు చేస్తున్నాం. 31 జీపీటీల్లో స్కిల్ హబ్స్‌ను ఏర్పాటుచేశాం. రాష్ట్రానికి బహుళజాతి కంపెనీలూ వస్తున్నాయి. వాటికి అనుగుణంగా విద్యార్థులకు శిక్షణనిస్తున్నాం. ఆ కంపెనీలే క్యాంపస్‌కు వచ్చి ఉద్యోగాలిస్తున్నాయి. అలాగే, మారుతున్న సాంకేతిక, అవసరాలకు తగ్గట్టు బోధన ఉండేలా లెక్చరర్లకు అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇస్తున్నాం. ఈ ఏడాది మొదటి విడతగా 84 మంది ప్రొఫెసర్లను ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌కు పంపించాం. చాలామంది విద్యార్థులు డిప్లొమా తర్వాత బీఎస్సీ, బీటెక్ చేయాలనుకుంటున్నారు. అలాంటి వారికి కంపెనీలో ఉద్యోగం ఇస్తూనే నాలుగేళ్లల్లో గ్రాడ్యుయేషన్ డిగ్రీ ఇచ్చేలా యాజమాన్యాలు ఒప్పందం చేసుకున్నాయి. వచ్చే ఏడాది నూరుశాతం ప్లేస్‌మెంట్స్‌కు ప్రణాళిక సిద్ధంచేశాం.

– సి. నాగరాణి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్

సుప్రీంకోర్టులో నేడు అవినాశ్ పిటిషన్ విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ముందస్తు బెయిలు కోరుతూ ఎంపీ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం విచారించనుంది. అవినాశ్‌కు ముందస్తు బెయిలు ఇవ్వొద్దంటూ మాజీ ఎంపీ వివేకానంద రెడ్డి కుమార్తె సునీత దాఖలు చేసిన పిటిషన్‌తో కలిపి ఈ పిటిషన్‌ను జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహాలతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించనుంది. ఇదిలా ఉంటే, తమ పిటిషన్ విచారించాలంటూ అవినాశ్ తరఫు న్యాయవాది సోమవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహాలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. మరో వెకేషన్ బెంచ్‌కు వెళ్లాలని ధర్మాసనం సూచించడంతో జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ సంజయ్‌కరోల్‌లతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. తాను సభ్యుడిగా లేని ధర్మాసనం జాబితాలో చేర్చాలని జస్టిస్ సంజయ్ కరోల్ రిజిస్ట్రీకి సూచించారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రానుంది.

ఈ విద్యా సంవత్సరం నుంచే డిజిటల్ తరగతులు

- నాడు–నేడు తొలి దశ స్కూళ్లలో అమలు
- 6 నుంచి 10వ తరగతి వరకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లతో బోధన
- 1 నుంచి 5వ తరగతి వరకు స్మార్ట్ టీవీలతో పాఠాలు
- డీఈవోలకు విద్యాశాఖ ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యా శాఖ డిజిటల్ తరగతులను ప్రారంభించనుంది. నాడు–నేడు కింద అభివృద్ధి చేసిన తొలి దశ స్కూళ్లలో ముందుగా డిజిటల్ తరగతులు మొదలవుతాయి. అత్యున్నత స్థాయి బోధనతో విద్యార్థులను ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఆధునిక సాంకేతిక పరికరాలను ఉపయోగించడం ద్వారా బోధనలో విప్లవాత్మక చర్యలను చేపట్టింది. తరగతి గది బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి మెరుగైన ఫలితాలు వస్తాయని విద్యా శాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలో డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు సన్నాహక చర్యలను చేపట్టడంతోపాటు పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారులు (డీఈవోలు), అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీవో)లకు పాఠశాలల మౌలిక వసతుల కమిషనర్ కాటంనేని భాస్కర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. 6 నుంచి 10వ తరగతి వరకు అన్ని సెక్షన్లలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీ)తో పాఠాలు బోధించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే 1 నుంచి 5వ తరగతి వరకు స్మార్ట్ టీవీలతో పాఠాలు బోధిస్తామని వెల్లడించారు.

ప్రతి 60 మంది పిల్లలకు ఒక స్మార్ట్ టీవీ..

1 నుంచి 5వ తరగతి వరకు ప్రతి 60 మంది పిల్లలకు ఒక స్మార్ట్ టీవీని ఏర్పాటు చేస్తారు. నాడు–నేడు కింద తొలి దశలో పనులు పూర్తి చేసుకున్న అన్ని స్కూళ్లకు ఐఎఫ్‌పీలను, స్మార్ట్ టీవీలను అందిస్తారు. వీటిని ఏర్పాటు చేయడానికి అవసరమైన సాకెట్, ఆండ్రాయిడ్ బాక్సులు, రూటర్‌లను అమర్చేందుకు చర్యలు తీసుకోవాలని కాటంనేని భాస్కర్ ఆదేశించారు. లాన్ కేబుల్, బ్రాడ్ బ్యాండ్ అన్ని తరగతి గదులకు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పనులన్నింటినీ ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీల పంపిణీకి ముందే పూర్తి చేయాలని కోరారు. అలాగే ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసే తరగతి గదుల్లో రెండేసి చొప్పున 4x4 అడుగుల గ్రీన్ చాక్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వీటిని అమర్చాక ప్రస్తుతం స్కూళ్లలో ఉన్న 8x4 అడుగుల గ్రీన్ చాక్ బోర్డులను సమీపంలోని నాడు–నేడు మూడో దశ స్కూళ్లకు తరలించాలని సూచించారు. అలాగే రెండో దశ స్కూళ్లలోని అన్ని తరగతి గదులకు రెండేసి చొప్పున 4x4 అడుగుల గ్రీన్ చాక్ బోర్డుల ఏర్పాటుకు ఈ నెల 25లోగా ఇండెంట్‌ను పంపించాలని కోరారు. కాగా నాడు–నేడు తొలి దశలో స్కూళ్లలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు 30,230 తరగతి గదుల్లో ఐఎఫ్‌పీలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే 1 నుంచి 5వ తరగతి స్కూళ్లలో 10,038 స్మార్ట్ టీవీలను అమరుస్తున్నారు. కాగా డిజిటల్ పరికరాల వినియోగం, విద్యా బోధనపై ప్రభుత్వ టీచర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా

జూన్ 26 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ) నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో బాలికలు సత్తాచాటారు. ఈ ఫలితాలను ‘ఏపీఓపెన్ స్కూల్.ఏపీ.జీవోవీ.ఐఎన్’ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం సంచాలకుడు డాక్టర్ కె.వి.శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకు జరిగిన పదో తరగతి పరీక్షలకు 31,628 మంది హాజరవగా.. 15,497 మంది (48.82 శాతం) ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 69,617 మంది హాజరవగా.. 40,919 మంది (58.78 శాతం) ఉత్తీర్ణత సాధించారని వివరించారు.

టెన్త్‌లో తూ.గో., ఇంటర్‌లో తిరుపతి టాప్

పదో తరగతి పరీక్షల్లో 51.43 శాతం ఉత్తీర్ణతతో బాలికలు ముందంజలో ఉండగా బాలురు 46.30 శాతం మంది పాసయ్యారు. ఇంటర్‌లో 60.59 శాతం ఉత్తీర్ణతతో బాలికలు ముందంజలో ఉండగా బాలురు 57.68 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. టెన్త్‌లో అత్యధికంగా 89.38 శాతం ఉత్తీర్ణతతో తూర్పుగోదావరి జిల్లా మొదటిస్థానంలో ఉండగా అత్యల్పంగా రెండుశాతం ఉత్తీర్ణతతో పల్నాడు జిల్లా చివరిస్థానంలో నిలిచింది. ఇంటర్‌లో అత్యధికంగా 86.70 శాతం ఉత్తీర్ణతతో తిరుపతి జిల్లా మొదటిస్థానంలో ఉండగా అత్యల్పంగా 11.28 శాతం ఉత్తీర్ణతతో పల్నాడు జిల్లా చివరిస్థానంలో ఉంది. ఈ పరీక్షలకు సంబంధించి రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ కోసం ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించవచ్చు. రీకౌంటింగ్ కోసం సబ్జెక్టుకు రూ.200 చొప్పున, రీవెరిఫికేషన్, స్కాన్ కాపీ కోసం సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున రుసుము చెల్లించాలి. తప్పిన విద్యార్థులకు జూన్ 26 నుంచి జూలై 4వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జూలై 5 నుంచి 7వ తేదీ వరకు జరుగుతాయి. అపరాధ రుసుము లేకుండా మే 28 వరకు, అపరాధ రుసుముతో జూన్ 2వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చు. వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు చూడవచ్చు.

ఎల్లో మీడియా ఓవరాక్షన్

ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయబోతున్నారంటూ తప్పుడు కథనాలు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయబోతున్నారంటూ సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎల్లో మీడియా ఓవరాక్షన్ చేసింది. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్న తల్లి శ్రీలక్ష్మి బాగోగులు చూసుకుంటున్న అవినాశ్ పట్ల కనీస మానవత్వాన్ని కూడా మరిచి ఎల్లో మీడియా అమానుష ధోరణిని బయటపెట్టుకుంది. సీబీఐ అధికారులు సోమవారం కర్నూలుకు రావడంతో అదే అదనుగా రెచ్చిపోయింది. అవినాశ్‌ను ఎలాగైనా అరెస్టు చేయించాలన్న విపరీత ధోరణి, కర్నూలు నగరంలో ఉద్రిక్తతలు సృష్టించాలన్న వ్యూహంతో క్షణక్షణం అసత్య ప్రచారంతో హోరెత్తించింది. గంట గంటకు ఎల్లో మీడియా పిచ్చి ముదిరి, మధ్యాహ్నానికి పీక్స్‌కు చేరుకొంది. స్థానిక పోలీసులు సహకరించడంలేదని, మధ్యాహ్నానికి కర్నూలుకు కేంద్ర బలగాలు వస్తున్నాయని, ఆ వెంటనే సీబీఐ అధికారులు అవినాశ్‌ను అరెస్టు చేస్తారంటూ తప్పుడు ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఎల్లో మీడియా విపరీత ధోరణిని రాష్ట్రవ్యాప్తంగా పలువురు తప్పుపట్టారు. తల్లి ఆరోగ్యం బాగోలేక బాధలో ఉన్న వ్యక్తిపట్ల అమానవీయంగా వ్యవహరించడాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సభ్య సమాజం ఖండించాయి. ఒక ఎంపీకి ఉండే హక్కులు, ఆయన ప్రైవసీని భంగపరిచే విధంగా పచ్చ పైత్యాన్ని వెళ్లగక్కుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురదజల్లే కుట్రలో భాగంగానే వైఎస్ అవినాశ్‌రెడ్డి లక్ష్యంగా ఎల్లో మీడియా ఈ దుర్నీతికి పాల్పడుతోందని స్పష్టమవుతోంది. అందులో భాగంగానే అర్ధరాత్రి వేళ ఆస్పత్రిలోకి చొరబడుతున్నారని, ఎంపీ తల్లికి అందిస్తున్న చికిత్సపై వైద్యులు సమాచారం అందిస్తున్నా, అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినాశ్ సోమవారం సీబీఐ విచారణకు హాజరు కావల్సి ఉంది. అయితే, ఆయన తల్లి తీవ్ర అనారోగ్యంతో ఈనెల 20వ తేదీ నుంచి కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య బృందం ఆమెను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తోంది. అవినాశ్ దగ్గరుండి ఆమె బాగోగులు చూసుకుంటున్నారు. తన తల్లి ఆరోగ్యం బాగోలేనందున విచారణకు హాజరు కాలేనని, ఈ నెల 27 తర్వాత హాజరవుతానని అవినాశ్ సీబీఐ అధికారులకు లేఖ పంపారు. అయినప్పటికీ, సీబీఐ అధికారులు సోమవారం ఉదయం కర్నూలు వచ్చారు. స్టేట్ గెస్ట్‌హౌస్‌లో బస చేశారు. దీనినే అవకాశంగా తీసుకున్న ఎల్లో మీడియా వెంటనే తప్పుడు కథనాలు ప్రచారం చేయడం ప్రారంభించింది. అవినాశ్‌ను అరెస్టు చేయడానికే సీబీఐ అధికారులు వచ్చారంటూ అసత్య ప్రచారం మొదలెట్టింది. వారు పోలీసు అధికారులను కలిసినట్లు, అవినాశ్‌ను ఏ క్షణంలోనైనా అరెస్టు చేస్తారంటూ స్క్రోలింగ్‌లు, చర్చలు ప్రారంభించింది. అవినాశ్‌ను అరెస్టు చేయకపోవడంతో నిరాశ చెందిన ఈ మీడియా.. కొత్త వ్యూహాన్ని రచించింది. సీబీఐ అధికారులు పోలీసు అధికారులను సంప్రదిస్తున్నారని, ఎప్పుడైనా అరెస్టు జరగవచ్చని మరో ప్రచారం మొదలెట్టింది. ముఖ్యంగా టీవీ–5, ఏబీఎన్ తప్పుడు కథనాలు, చర్చలతో హోరెత్తించాయి.



విశ్వభారతి హాస్పిటల్ వద్ద పోలీసు బందోబస్తు

సీబీఐని కూడా ప్రభావితం చేస్తారా?

సీబీఐ బృందం కర్నూలుకు రాగానే ఎల్లో మీడియా దుష్ప్రచారం మొదలైంది. సీబీఐ అధికారులు ఆస్పత్రికి కూడా వెళ్లలేదు. నేరుగా స్టేట్ గెస్ట్‌హౌస్‌కు వెళ్లి అక్కడే బస చేశారు. అయినా, పచ్చ మీడియా సీబీఐ వెంటనే అవినాశ్‌ను అరెస్టు చేసేస్తోందంటూ ప్రచారం మొదలెట్టింది. టీవీ చర్చల్లో తమకు అనుకూలురను కూర్చోబెట్టి, అధికారులను ప్రభావితం చేసేలా చర్చలు సాగించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. మీడియా ట్రయల్ పేరిట వాస్తవాలను వక్రీకరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాన్ని చూసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఉదయం నుంచే కర్నూలుకు తరలివచ్చారు. డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, సుధాకర్, శ్రీదేవి, ఆర్థర్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఉదయాన్నే ఆస్పత్రికి చేరుకున్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కడప మేయర్ సురేశ్‌బాబు , శాప్‌ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆస్పత్రికి వచ్చారు. కర్నూలుతోపాటు పులివెందుల, కడప, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నుంచి కూడా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఒక్కసారిగా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావడంతో ఆస్పత్రి పరిసరాలు జనంతో కిక్కిరిశాయి. డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో ఆస్పత్రి వద్ద ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రానికి కార్యకర్తల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో ఆదోని, పత్తికొండ సబ్‌డివిజన్ నుంచి మరిన్ని బలగాలు సోమవారం రాత్రికి కర్నూలుకు చేరుకున్నాయి.

ఆస్పత్రి ముందు కార్యకర్తల నిరసన

ఎల్లో మీడియా అబద్ధపు ప్రచారాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆస్పత్రి ముందు బైఠాయించారు. ‘తండ్రిని అకారణంగా జైలుకు పంపారు. తల్లి అనారోగ్యంతో ఉంటే బాగోగులు చూసుకుంటున్న అవినాశ్‌ను వెంటాడి, వేధించడం ఏంటని’ నిరసనలో పాల్గొన్న కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆందోళనకరంగానే శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితి

అవినాశ్ తల్లి శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితిపై విశ్వభారతి ఆస్పత్రి హెల్త్ బులెటిన్ రిలీజ్ చేసింది. ఆమెకు నాన్ ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్ (గుండెపోటు) ఉందని పేర్కొంది. యాంజియోగ్రామ్ చేశామని, రెండు రక్తనాళాల్లో బ్లాక్‌లు గుర్తించామన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్‌లో వైద్యుల బృందం పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఆమెకు రక్తపోటు ఇప్పటికీ తక్కువగా ఉండటంతో ఐయానోట్రోపిక్ సపోర్ట్‌తో ఉన్నారని తెలిపారు. అది, సోమవారాల్లో ఆమె వాంతులు చేసుకున్నారని, అల్ట్రాసౌండ్ చేయాల్సి ఉందని తెలిపారు. మరికొద్దిరోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని వెల్లడించారు.

అర్ధరాత్రి వేళ ఆస్పత్రిలోకి చొరబాటు


వందలాది రోగులు, వారి సహాయకులు ఉండే ఆస్పత్రిలోకి మీడియా పదే పదే చొరబడటంపై సీనియర్ విలేకరులే మండిపడుతున్నారు. కేవలం చంద్రబాబుకు ఏదో మేలు చేయాలన్న తపనతోనే ఎల్లో మీడియా పత్రికా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తోందని విమర్శిస్తున్నారు. ఇదే ఉద్దేశంతో ఆస్పత్రి పరిసరాల్లో ఆదివారం అర్ధరాత్రి, ఎల్లో మీడియా హంగామా చేసింది. రాత్రి 11గంటల తర్వాత ఎల్లో మీడియా ప్రతినిధి ఒకరు తాను పనిచేస్తున్న సంస్థ పేరు కాకుండా మరో పేరు చెప్పి ఆస్పత్రిలోకి వెళ్లారు. శ్రీలక్ష్మి ఉన్న ఐసీయూ సమీపంలో ఓ కానిస్టేబుల్ అతన్ని నిలువరించారు. తప్పుడు పేరు చెప్పి రావాల్సిన అవసరం ఏముందని అక్కడున్న వారు కూడా గట్టిగా నిలదీశారు. దీంతో మీడియా ప్రతినిధి ఆస్పత్రి గేటు వద్దకు వచ్చి అవినాశ్ అనుచరులపై దురుసుగా వ్యవహరించారు. ఇదంతా మిగతా ఎల్లో మీడియా ప్రతినిధులు వీడియో తీయబోయారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఇలా ఎల్లో మీడియా అతిగా ప్రవర్తించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

శ్రీలక్ష్మిని పరామర్శించిన వైఎస్ విజయమ్మ

వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ సోమవారం సాయంత్రం విశ్వభారతి ఆస్పత్రికి వచ్చి ఐసీయూలో చికిత్స పొందుతున్న శ్రీలక్ష్మిని పరామర్శించారు. శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అవినాశ్‌ను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, అంతా మంచే జరుగుతుందని కాంక్షించారు.

నాసా ఐఏఎస్‌పీకి నిడదవోలు విద్యార్థిని ఎంపిక

- అతి చిన్న వయసులో ఎంపికైన భారతీయురాలిగా కైవల్య రెడ్డి రికార్డు
- నాసా శాస్త్రవేత్తలతో కలిసి పనిచేసే అవకాశం సొంతం



నిడదవోలు : ప్రతిష్టాత్మకమైన అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా నేతృత్వంలో నిర్వహించే అంతర్జాతీయ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాం (ఐఏఎస్‌పీ)–2023కు తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన విద్యార్థిని కుంచాల కైవల్యరెడ్డి ఎంపికయ్యింది. నాసా భాగస్వామ్య సంస్థ ఏఈఎక్స్‌ఏ ప్రపంచ వ్యాప్తంగా 15 నుంచి 25 ఏళ్లలోపు వయసున్న 50–60 మంది విద్యార్థులను ఐఏఎస్‌పీకి ఎంపిక చేస్తుంది. అన్ని దేశాల విద్యార్థుల నుంచి ప్రాజెక్ట్ నమూనాలను, దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. వాటిలో అత్యుత్తమ నమూనాలు పంపిన విద్యార్థులను ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూ చేసి తుది జాబితాను రూపొందిస్తుంది. ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరైన కైవల్య రెడ్డి ఎంపికైనట్లు ఏఈఎక్స్‌ఏ నుంచి సమాచారం అందింది. ఇదే తరహాలో ప్రపంచ వ్యాప్తంగా ఎంపిక చేసిన విద్యార్థులకు ఐఏఎస్‌పీలో భాగంగా ఆరు నెలలు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారు. నవంబర్‌లో అమెరికాలోని అలబామా రాష్ట్రంలో 15 రోజులు వ్యోమగామి శిక్షణ ఇస్తారు. అదే సమయంలో విద్యార్థులను బృందాలుగా ఎంపిక చేసి అనుభవజ్ఞులైన నాసా శాస్త్రవేత్తలతో కలిసి పని చేసే అవకాశం కూడా కల్పిస్తారు.

అతి చిన్న వయసులోనే...

నిడదవోలుకు చెందిన కుంచాల శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె కైవల్య రెడ్డి (15) ఇటీవల పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ గ్రేడ్‌లో పాసైంది. ఖగోళశాస్త్రంపై ఆసక్తి కలిగిన కైవల్యరెడ్డి అతి చిన్న వయసులోనే ఐఏఎస్‌పీకి ఎంపికైన భారతీయురాలిగా రికార్డు సృష్టించింది. గతంలో మన రాష్ట్రానికే చెందిన దంగేటి జాహ్నవి ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న సమయంలో ఈ శిక్షణ పూర్తి చేసింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkatuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd ,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No TNTEL/2008/25943